MOHAN
PUBLICATIONS
Mohanpublication.com

ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆయుర్వేద,
మంత్రశాస్త్ర, స్మార్త గ్రంథములకు
మోహన్ పబ్లికేషన్స్
కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదురుగా,
రాజమహేంద్రవరం – 533101.

grantha nidhi
THE TREASURE OF PAGES
FIRSTEVER TELUGU FREE E-BOOKS
DOWNLOADING WEB PORTAL
www.granthanidhi.com
Granthanidhi.blogspot.in

నా పెళ్ళికి డిజైనర్ క్లోత్స్ కాకుండా మా అమ్మమ్మ పెళ్ళి చీరనే
కట్టుకోవాలని కోరుకున్నా

మీ కోసం, మా సొంత తయారీ కేంద్రాలలో రూపొందించబడిన అధునాతన డిజైన్లు.

KHAZANA JEWELLERY

The bridal collection '16

హైదరాబాద్ - అబిడ్స్ రోడ్ | సోమాజిగూడ | కూకట్‌పల్లి | A.S. రావు నగర్ | దిల్‌సుఖ్‌నగర్ | చందానగర్ • కరీంనగర్ • వైజాగ్ - ద్వారకా నగర్ 1 | ద్వారకా నగర్ 2 • గాజువాక • విజయవాడ • గుంటూరు
కాకినాడ • రాజమండ్రి • భీమవరం • తిరుపతి • నెల్లూరు • వరంగల్ • శ్రీకాకుళం • ఒంగోలు • ఖమ్మం • అనంతపురం • విజయనగరం • కడప • చెన్నై - టి. నగర్ | కథీడ్రల్ రోడ్ | అన్నానగర్ | పురసైవాక్కం | మైలాపూర్
వేలచేరి • కోయంబత్తూరు • సేలం • వెల్లూర్ • కాంచీపురం • పుదుచ్చేరి • తిరునెల్వేలి • కరూర్ • తిరుచి • మదురై • తూత్తుక్కుడి • నాగర్‌కోయిల్ • బెంగళూరు - డికన్‌సన్ రోడ్ | జయనగర్ | మారతహళ్ళి
కోరమంగళ • మంగళూరు • బళ్ళారి • ఢిల్లీ - పితంపుర | రజౌరి గార్డెన్ | ప్రీత్ విహార్ • గుర్గాన్ • నోయిడా • దుబాయ్ - కరామా సెంటర్ | మీనా బజార్ | గోల్డ్ సూక్ | షార్జా | త్వరలో అబుదాబిలో ప్రారంభోత్సవం.
(అన్ని రోజులు షాపు తెరచి ఉండును.) www.khazanajewellery.com

సరదాగా

ల్యాబ్‌లో..!

ఒక మడుగులో కప్ప ఒంటరిగా జీవించేది. ఒక రోజు దానికి జీవితం మీద విసుగుపుట్టింది. తన భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలుసుకోవాలనిపించింది. ఫోన్‌లో భవిష్యవాణి చెప్పే నెంబరుకు ఫోన్ చేసింది.

"రాబోయే రోజుల్లో మీకు ఏ దిగులూ ఉండదు. మీ సమస్యలన్నీ తీరిపోతాయి. అతి త్వరలో మీరు ఒక అందమైన అమ్మాయిని కలుసుకోబోతున్నారు. ఆమె మీ గురించి అన్నీ తెలుసుకోవాలని ఆసక్తి చూపుతుంది" అని అవతలి వైపు నుంచి వినిపించింది.

కప్ప ఎంతో సంతోషపడిపోతూ "అవునా?! ఆ అమ్మాయి నన్ను ఎక్కడ కలుస్తుంది? పార్టీలోనా?" అని అడిగింది.

"ఉమెన్స్ కాలేజ్ ల్యాబ్‌లో" అవతలి వైపు నుంచి నెమ్మదిగా వినిపించింది.

ఒక ప్రశ్న?

ఫ్లాట్ నంబర్ 306లో విష్ణుమూర్తి ఒక్కడే ఉంటాడు. 86 ఏళ్ళ వయస్సు! అయినా తన పనులు తాను చేసుకోగలడు. ఇద్దరు కొడుకులు. అమెరికాలో ఉద్యోగాలు. తండ్రిని తమవద్దకు వచ్చేయమని పోరినా విష్ణుమూర్తి వినిపించుకునేవాడు కాదు. రాననేవాడు. పరాయి దేశంలో ఇమడలేనురా అనేవాడు. అన్నీ ఉన్నాయి. ఏ సమస్యలూ లేవు, ఒంటరితనం తప్ప! బయటకు రావడానికి పెద్దగా ఇష్టపడడు విష్ణుమూర్తి. ఎవరైనా అడిగితే ఏముంది బయట? కుళ్ళు రాజకీయాలు, కృత్రిమ బంధాలు, అసహజ నవ్వులు.. ఇవేగా! వాటిని వినటం, చూడటం కంటే ఇంట్లోనే గడపడం మేలు! అనేవాడు. దాంతో అతడి గురించి పట్టించుకునేవారుగాని, ఆలోచించేవారుగాని ఎవరూ లేరు. పాలప్యాకెట్, న్యూస్‌పేపర్ అన్నీ వాకిట్లోనే వాలతాయి. ఆ రోజు శుక్రవారం. విష్ణుమూర్తి పేరిట వచ్చిన ఉత్తరాలు తీసుకుని అతని ఫ్లాట్ ముందు కొచ్చాడు పోస్ట్‌మ్యాన్. ఫ్లాట్ ముందర న్యూస్‌పేపరూ, పాల ప్యాకెట్లు, ఇంకా ఇతర వస్తువులు ఏవో ఉన్నాయి. అనుమానం వచ్చి తలుపు కీహోల్‌లోంచి చూశాడు పోస్ట్‌మ్యాన్. విష్ణుమూర్తి రక్తపుమడుగులో నేలమీద పడిఉన్నాడు. పోలీసులు రంగంలోకి దిగారు. ముందు ఫ్లాట్ బయట వస్తువులు పరిశీలించాడు ఇన్‌స్పెక్టర్. వాటిలో మూడు పాలప్యాకెట్లు, మంగళవారం నాటి దినపత్రిక, ఏవో గిఫ్ట్‌ప్యాక్‌లూ ఉన్నాయి. లోపలికి వెళ్ళి అణువణువూ పరిశీలించాడు. లోపల వస్తువులన్నీ చిందరవందరగా ఉన్నాయి. బీరువా తలుపు తెరచి ఉంది. అన్నీ పరిశీలించాక హంతకుడెవరో తెలిసిపోయింది ఆ అధికారికి. వెంటనే వెళ్ళి అతన్ని అరెస్ట్ చేశారు. ఇంతకీ ఎవరా హంతకుడు? హంతకుడు అతడేనని ఇన్‌స్పెక్టర్ ఎలా కనిపెట్టాడు? ఇదీ ప్రశ్న? పరిశోధన మొదలుపెట్టండి.

సమాధానం

పేపర్‌బాయ్ హంతకుడు. అక్కడ మంగళవారం పేపర్ మాత్రమే ఉంది. అంటే విష్ణుమూర్తి చనిపోయాడని అతడికి తెలుసు కాబట్టి బుధ, గురువారాలు పేపరు వేయలేదు. కాబట్టి అతడే హంతకుడని పోలీసులు ఊహించగలిగారు.

Jayadev

అడపా దడపా నవ్వబ్బా



42

ఆహ్లాదాన్నిచ్చే ప్రకృతి నడక

నాగరికం నేర్చిన మనిషి ప్రకృతికి దూరమై ఇరుకుగదుల్లో మగ్గిపోతున్నాడు. ఆహ్లాదం కోసం ఇప్పుడు మళ్ళీ అడవిదారి పడుతున్నాడు. ఈ గడబిడలకు దూరంగా ఓ నాలుగ్గంటల సమయం మనది కాదనుకుని ఫారెస్ట్ బాతింగ్‌లో లీనమైపోమంటున్నారు పరిశోధకులు!

8

హ్యాపీలైఫ్‌కి చాక్లెట్ ట్రిక్!

చాక్లెట్ తినడానికి ఇప్పుడు భయపడాల్సిన అవసరం లేదు! అత్తాకోడలూ, ఆలుమగలూ, బాసూ కొలీగూ...ఎవరైనా హ్యాపీగా, ఆరోగ్యంగా ఉండాలంటే చాక్లెట్ తినాల్సిందేనట!

72

ఇంటర్వ్యూ

జానపద బ్రహ్మ బి.విఠలాచార్య ఆశీర్వాదంతో తెరంగేట్రం చేసిన 400 చిత్రాల బహుభాషా నటుడు పొట్టి వీరయ్య. చిత్రసీమ తననెంతో ఆదరిస్తోందని పరవశించిపోతున్న వీరయ్య ఇంటర్వ్యూ...

సీరియల్స్

మదరిండియా	16
సమంత@లవ్	30
నిండు నూరేళ్లు	44
హవేలీ	58

కథలు

మాతృత్వం ఒక చేదు జ్ఞాపకం	10
నిలబడి నీళ్ళు....	24
ప్రణయ మంజరి	38
నోబెల్ కథలు	52
ఆసరా	64

ఫీచర్స్

గేమ్ ఆఫ్ లైఫ్-14, సినీ నారాయణీయం-22
సురభి-27, రివ్యూ-28, ఆరోగ్యమే మహాభాగ్యం-35
చినుకు చింతలకు చిట్కాల ఛత్రం-36
క్రైమ్-50, గడుగ్గాయి బొమ్మలు-56
మనమీదేనట్రోయ్-61, పుస్తక సమీక్ష-63
రామాయణం-66, సౌభాగ్యచక్రం-68
నవ్యసినిమా-69, నా దారి నాదే-70
ఇవన్నీ నిజాలే!, పదగారడి-74

ముఖచిత్రం: ప్రగ్యా జైస్వాల్
ఫొటో: గోపీకృష్ణ

రచనలు, కథలు పంపవలసిన చిరునామా
నవ్య వీక్లీ, ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం.76, అశ్వనీ లేఅవుట్, హుడా హైట్స్, రోడ్ నెం.70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33. email: navyaweekly@andhrajyothy.com

జిమ్ కోచ్‌తో ఓ కుర్రాడు: మొదటిచూపులోనే అమ్మాయిని పడేయాలి సార్! ఓ అందమైన అమ్మాయిని మూడురోజుల్లో కలవబోతున్నాను. ఇక్కడ ఏ మిషన్ వాడితే బాగుంటుందంటారు?
కోచ్: ఇక్కడ అలాంటి మిషన్లు లేవు. బయట ఏటీయం మిషన్ ఉంది. దాన్ని వాడు, వెళ్ళు.

•••

ఆడుకుంటున్న ఎలుకల్ని మింగేసేటందుకు ఓ పిల్లి అక్కడికి వచ్చింది. చూసిందది తండ్రి ఎలుక. గొంతు సవరించుకుంది. 'భౌభౌ'మంది. ఆ అరుపుకి పిల్లి పారిపోయింది. పారిపోయిన పిల్లిని చూసి పిల్ల ఎలుకలు నవ్వుకున్నాయి. తండ్రిని అడిగాయి.

"ఏంటి డాడీ, నీ అరుపు ఏదోలా ఉంది?"

"ఏదోలా ఉండడం కాదు, నేనదే నెత్తి మొత్తుకుంటున్నది. సెకెండ్ లాంగ్వేజ్ నేర్చుకుని తీరాలి. లేకపోతే దెబ్బయిపోతారు." అంది తండ్రి ఎలుక.

•••

అలాక్కాదు, ఇలాగ. ఇలాక్కాదు అలాగంటూ ఇద్దరు విద్యార్థులు వాదించుకుంటున్నారు. సరిగ్గా అదే సమయానికి క్లాసులోకి వచ్చింది టీచర్.

"ఏంట్రా గోల?" అడిగింది.

"స్కూలుకి వస్తోంటే మా ఇద్దరికీ ఓ వంద నోటు దొరికింది మేడం! ఎవరైతే పెద్దగా అబద్ధం ఆడతారో వాళ్ళకి ఈ నోటు ఇద్దామనుకుంటున్నాం."

"సిగ్గుపడాల్రా! మీ గురించి మీరు సిగ్గుపడాలి." అంది టీచర్. ఆశ్చర్యంగా చూశారు విద్యార్థులు.

"అబద్ధం అంటే ఏంటో మీకు తెలుసు. అదే నేను మీ వయసులో ఉన్నప్పుడు మా తరానికి అబద్ధం అంటే ఏంటో అస్సలు తెలీదు." అంది టీచర్. ఆ మాటకి విద్యార్థులు ఇద్దరూ వందనోటు ఆమెకు ఇచ్చేశారు.

•••

అరగంటసేపు మాట్లాడి, చిరాగ్గా ఫోన్ పెట్టేసింది కూతురు. చూసి ఆశ్చర్యపోయాడు తండ్రి. అడిగాడిలా.

"ఏంటప్పుడే ఫోన్ పెట్టేశావు. ఫోన్ చేస్తే మినిమమ్ రెండు గంటలు మాట్లాడతావు కదా?"

"నిజమేకాని, ఇది రాంగ్‌నెంబర్ డాడీ." అంది కూతురు.

•••

టీచర్: ఏంట్రా స్కూలుకి లేటుగా వచ్చావు?
స్టూడెంట్: దానికి ఓ కారణం ఉంది మేడం! పాపం ఒకాయన ఓ వందనోటు పారేసుకున్నాడు.
టీచర్: వెదకడంలో అతనికి నువ్వు సాయపడ్డావా? గుడ్! అందుకే లేటైందా?
స్టూడెంట్: లేదు మేడం! ఆ నోటు మీద కాలుపెట్టి నిల్చోవడంతో లేటైంది.

-వైనతేయ

w m w w

నవ్య

సంపుటి: 13 సంచిక: 19

13-7-2016

మేనేజింగ్ డైరెక్టర్
వేమూరి రాధాకృష్ణ

ఎడిటర్
ఎ.ఎస్.జగన్నాథశర్మ

మొదటి పేజి

కుక్కకాటుకి చెప్పుదెబ్బ

డెబ్బయి అయిదేళ్ళు. ఎప్పుడు పోతావో తెలీదు. పొలాల్నీ, ఇంటినీ అంటిపెట్టుకుని ఒంటరిగా ఆ పల్లెటూరిలో ఎందుకు చెప్పు? నా మాట విను. అన్నీ అమ్మేసి, వచ్చిందాన్ని పిల్లలు ముగ్గురికీ సమానంగా పంచేసి, గుండె మీద వెచ్చగా చెయ్యి వేసుకుని పడుకో! పిల్లలు ముగ్గురూ వృద్ధిలోకి వచ్చారు, బాగా సెటిల్ అయ్యారని చెబుతావుగా, నువ్వు కూడా వాళ్ళ దగ్గరే సెటిల్ అయిపో! అని మిత్రుడు పదేపదే పోరు పెడితే అతను చెప్పినట్టుగానే చేశాడు జానకిరావు. ఇల్లూ, పొలాలూ అమ్మితే కోటి యాభైలక్షలు వచ్చింది. ఒకొక్కరికీ యాభై లక్షల చొప్పున పిల్లలు ముగ్గురికీ పంచేశాడు. పంచేసి, ఒకొక్కరింటా నాలుగు నెలల చొప్పున ఉంటానన్నాడు. అందుకు ఒప్పుకున్నారు పిల్లలు. జానకిరావు ఉండసాగాడు. తొలి ఏడాది బాగానే గడిచింది. మలి ఏడాది నుంచే ఇబ్బందులు మొదలయ్యాయి. అతన్ని భరించడం మావల్ల కాదంటే మావల్ల కాదంటూ పిల్లలు ముగ్గురూ మొండికేయడంతో, ఎక్కడ ఉండాలో తెలియక మిత్రుడు ఇంటికే వచ్చి తిష్ట వేశాడు జానకిరావు. నీ మాటే విన్నాను, నువ్వు చెప్పినట్టుగానే చేశాను, ఫలితం చూశావుగా అని మిత్రుడి ముందు ముఖం వేలాడేశాడతను.

అప్పుడు ఆలోచనలో పడ్డాడు మిత్రుడు. చేసిన తప్పు సరిదిద్దుకోవాలనుకున్నాడు. జానకిరావు పెద్దబ్బాయికి ఫోన్ చేశాడు. నాన్న ఉన్నాడయ్యా? అడిగాడు. లేడన్నాడతను. లేకపోవడమేంటి? నిన్న మా ఊరిలో బ్యాంకులో లాకర్ ఓపెన్ చేసి, నీ దగ్గరకే వెళ్తున్నానన్నాడు. రాలేదా? అడిగాడు. రాలేదన్నాడతను. అయినా అంత బంగారంతో నాన్నను ఒంటరిగా పంపించడం ఏంటయ్యా, బుద్ధిలేకపోతే సరి అన్నాడు. ఎంత బంగారం అడిగాడబ్బాయి. ఎవరికి తెలుసు? సంచిలో పెట్టుకుని వచ్చాడు. లాకర్లో భద్రంగా దాచుకున్నాడు. బయల్దేరాడు అన్నాడు మిత్రుడు. అదే విషయాన్ని జానకిరావు మిగిలిన పిల్లలిద్దరికీ కూడా వినిపించాడు. వినిపించి, రెండు తాళాల్ని మొలకి కట్టుకోమని జానకిరావుకి ఇచ్చి వెళ్ళిరమ్మన్నాడు. ఎక్కడికి? అడిగాడు జానకిరావు. మీ పిల్లల ఇళ్ళకి అన్నాడు. వాళ్ళెందుకు రానిస్తారు? అన్నాడు జానకిరావు. రానిస్తారు. వెళ్ళిరా అన్నాడు మిత్రుడు. భయం భయంగానే బయల్దేరాడు జానకిరావు. ముందుగా పెద్దాడింటికి చేరుకున్నాడు. తండ్రిని చూస్తూనే అంత ముఖం చేసుకున్నాడు కొడుకు. హారతి ఇవ్వలేదుకాని, అంతపనీ చేశాడు. జానకిరావుకి ప్రత్యేకంగా ఓ రూం కేటాయించాడు. అతను చదువుకునేందుకు వార్తాపత్రికలూ, అతను చూసేందుకు టీవీకూడా పెట్టాడక్కడ. పొద్దున ఎనిమి దింటికి టిఫిన్, మధ్యాహ్నం పన్నెండింటికి భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి రొట్టెలు, మధ్యమధ్యలో ఓ పండూ కాయా ఇస్తూ, ఆరారా కాఫీ అందించసాగాడు.

నాలుగునెలలు పూర్తి కానేలేదు, రెండోవాడొచ్చాడు. తండ్రిని తన ఇంటికి తీసుకుని వెళ్తానన్నాడు. ఎందుకులేరా? పెద్దాయనకి ఇబ్బంది. ఇక్కడే ఉండనీ అని పెద్దాడు అంటే...అబ్బబ్బే! అదేం మాట! తండ్రిని పోషించడం నా బాధ్యత. భారతపౌరుడిగా అది నా ధర్మం. కాదనకు అంటూ వద్దు వద్దంటున్నా జానకిరావుని వెంట తీసుకుని వెళ్ళాడు. తండ్రిని 'హేండిల్ విత్ కేర్'గా చూశాడు. ఏది కావాలంటే అది కొని పెట్టాడతనికి. ఏది తింటానంటే అది తినపెట్టాడు. తాళాలు జాగ్రత్తంటూ అనుక్షణం వాటిని గుర్తు చేశాడు. మూడో పిల్లాడూ అలాగే చూశాడు జానకిరావుని. మీకే కాదు నాకు కూడా ఆయన నాన్నే! నా నాలుగు నెలలూ నావే అన్నాడు. తండ్రిని కాలు కింద పెట్టనివ్వకుండా, ఆయన మొలకు వేలాడుతున్న తాళాలు జారిపోకుండా జాగ్రత్త వహించాడు.

మూడేళ్ళు అలా హాయిగా గడిచిపోయాయి. ఎనభయ్యో ఏట ఎంచక్కా కళ్ళు మూసేశాడు జానకిరావు. బంగారం కోసం తాళాలు పట్టుకుని వచ్చారు పిల్లలు. లాకర్ ఎక్కడ? ఏ బ్యాంక్‌కి వెళ్ళాలని అడిగారు తండ్రిగారి మిత్రుణ్ణి. లాకరూ లేదు, బ్యాంకూ లేదు. అవి మా పాతబీరువా తాళాలు. మూడు ఉంటే మీ నాన్నకి రెండిచ్చి అట్టిపెట్టమన్నాను అన్నాడు మిత్రుడు. పిల్లలు గొల్లుమంటే... కుక్కకాటుకి చెప్పుదెబ్బ అంటే ఇదే అన్నాడు. చేసిన తప్పు సరిదిద్దుకున్నందుకు తనని తాను మెచ్చుకున్నాడు.

నవ్య

WOW

ఊరు కోసమే ఈత!

స్కూలుకు వెళ్ళేముందు పిల్లలు తమ బ్యాగుల్లో పుస్తకాలు అన్నీ ఉన్నాయా? లేదా? అని చెక్ చేసుకుంటారు. అర్జున్ మాత్రం తన బ్యాగులో స్విమ్‌సూట్, కళ్ళద్దాలు ఉన్నాయా? లేవా? అని చూసుకుంటాడు. ఇవన్నీ ఎందుకని అడిగితే ఊరి ప్రజల ఆనందం కోసం అనే జవాబు వస్తుంది అర్జున్ నుంచి! ఊరిప్రజల కోసం స్విమ్‌సూట్ ఎందుకనుకుంటున్నారా? అయితే చదివేయండి.

అర్జున్ సంతోష్‌ది కేరళలోని అలప్పుజ జిల్లా పెరుంబాళం గ్రామం. తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఈ ఊర్లోకి వెళ్ళాలన్నా, రావాలన్నా పడవ ఉపయోగించాల్సిందే! పిల్లలు స్కూలుకి వెళ్ళడానికి కూడా పడవల్లో ప్రయాణించాల్సిందే. తమ గ్రామానికి ఓ బ్రిడ్జి నిర్మించి శాశ్వత పరిష్కారం చూపించాలని ప్రజలు 25 ఏళ్ళుగా

ప్రభుత్వానికి, అధికారులకు విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. కానీ ఫలితం లేదు. అయితే ఊరి ప్రజలకు మద్దతుగా తాను కూడా ఎలాగైనా నిరసన వ్యక్తం చేయాలనుకున్న అర్జున్ వినూత్న నిర్ణయం తీసుకున్నాడు.

తోటి విద్యార్థులందరూ స్కూలుకు పడవల్లో వెళుతుంటే తాను మాత్రం నీటిలో ఈదుకుంటూ పాఠశాలకు వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు. అందుకోసమే స్విమ్‌సూట్, కళ్ళద్దాలు తీసుకున్నాడు. స్నేహితులంతా ఎంచక్కా పడవల్లో పాఠశాలకు వెళ్తుంటే తాను మాత్రం స్విమ్ సూట్ ధరించి ఈదుకుంటూ రావడం మొదలుపెట్టాడు. అంతేకాదు, తమ ఊరికి బ్రిడ్జి నిర్మించేవరకు ఇలా నిరసన వ్యక్తం చేస్తూనే ఉంటానని చెబుతున్నాడు అర్జున్. కొద్దిరోజులు ఇలా ఈదుకుంటూ వెళ్ళేసరికి ఈ విషయాన్ని అలప్పుజ జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్ళింది. బ్రిడ్జి నిర్మాణానికి ఎలాంటి అధికారిక హామీ లభించలేదుగానీ ఆందోళన విరమించాలని కలెక్టర్ నుంచి నోటీసులు అందాయి. దీంతో ప్రస్తుతానికి ఆందోళన విరమిస్తానని చెప్పాడు. అయితే బ్రిడ్జి నిర్మించకుంటే మాత్రం ప్రమాదమైనా సరే ఈదుకుంటూనే పాఠశాలకు వెళ్తానని చెబుతున్నాడు అర్జున్.

ప్రజా సమస్య పరిష్కారం కోసం వినూత్నంగా ఆందోళన చేపట్టిన అర్జున్‌ని అందరూ అభినందిస్తున్నారు. చదువుకోవాల్సిన వయసులో ఊరి కోసం ఏదో చేయాలనే అతడి తపన అందరికీ ఆదర్శనీయం. హ్యాట్సాఫ్ టు అర్జున్ సంతోష్! నవ్య

మెయిల్ బాక్స్

కథలు బాగున్నాయ్

కథలన్నీ బాగున్నాయి. బహుమతి కథ మీల్స్ టికెట్ శిల్పం, శైలి, కథనం బాగుంది. మనసుకు హత్తుకుంది. నోబెల్ కథ 'పిలుపు' బాగుంది. కొత్త సీరియల్ హవేలి ఉత్కంఠభరితం.

-ఎ.శాంతిసమీర, వాకలపూడి. తూ.గో.జిల్లా

'అన్నపూర్ణ' సేవ ఆదర్శం

మొదటిపేజీ 'అన్నపూర్ణ' ఆలోచింపజేసింది. ఒక వృద్ధురాలు రైల్వే ప్లాట్‌ఫాం మీద అర్ధరాత్రి అపరాత్రి వచ్చే ప్రయాణికులకు ఏదోవిధంగా కొంత ఆకలి తీర్చడానికి పడిన శ్రమ, ఆదుర్దా, కష్టం చదివాక ఎవరికి వారే గుండెపై చేయివేసుకుని ఆలోచించాలి. ప్రతిమనిషిలో మౌలికంగా కరుణ, దయ ఉంటాయి. కానీ వాటిని కదిలించే శక్తి రచయితకు, ప్రవచనం చెప్పేవారికీ ఉంటాయి అని మరోసారి నిరూపించారు. అయితే మేం కూడా ఇలాంటి సేవే వేరే రూపంలో చేస్తున్నాం. నవ్య వీక్లీ నవ్యంగాఉంది.

-రంగా, నర్సరావుపేట. గుంటూరుజిల్లా

వ్యతిరేకార్థహాస్యం సూపర్

పైనుంచి కిందకి, కిందనుంచి పైకి చదివినప్పుడు వ్యతిరేకార్థాల్లో వచ్చేట్టు రాసిన రాధ, గోపిల మార్నింగ్ కాఫీపెళ్ళి బ్రహ్మాండంగా హాస్యం పండించింది. రచయిత సృజనకు జోహార్లు. ఆసక్తితో బాటు ప్రాణహాని కూడా కలిగించే ప్రదేశాల గురించి చదువుతున్నప్పుడు థ్రిల్లింగ్ కలిగింది. చీమ కార్టూన్ బాగుంది. తిండితో తంటా చదివాక సమస్యలన్నింటికీ నాలుకే కారణం అనిపిస్తోంది.

-అభిలాష, సాంబమూర్తినగర్.

బ్లేడ్‌లక్ష్మి నుంచి ఎంతో నేర్వాలి

మార్నింగ్ కాఫీలో ముచ్చటగా మూడు హాస్యపు తునకలతోపాటు మొదటిపేజీలో బ్లేడ్‌లక్ష్మిని చదివాక ఎంతో నేర్చుకోవాల్సి ఉందనిపించింది. 'మీల్స్ టికెట్' కథాకర్త ప్రభాకర్‌జైనిగారికి అభినందనలు. అమరజ్యోతిగారి 'వీధిఅరుగు' కవిత నిత్యజీవన చిత్రంలా అకట్టుకుంది. కొత్త సీరియల్ హవేలి ప్రారంభం ఆనందింపజేసింది. విజయవిలాసం శీర్షిక ఒక మహత్తర వ్యక్తిత్వ వికాసం కలిగించే రచనగా అందించిన ఎం.వెంకటేశ్వరరావుగారికి కృతజ్ఞతలు.

-నేమానసుభాష్‌చంద్రబోస్, విశాఖపట్నం

శభాష్ బ్లేడ్‌లక్ష్మి

బ్లేడ్‌లక్ష్మి పనులు అందరికీ అనుమానం కలిగించినా అతని జంతుప్రేమ, సామాజిక స్పృహ ఎన్నదగినవి. సురభిలో చెప్పిన అన్ని విషయాలు బాగున్నాయి. ప్రమోషన్ వల్ల హీరోయిన్ కాస్తా అమ్మ, ఆంటీస్థాయికి ఎదిగింది. ప్రచారం సంగతి ఎలా ఉన్నా అక్షయ్ కంటే రజనీకాంత్‌కే ఎక్కువ పారితోషికం ఉంటుందేమో!

-ఆర్.మరుదుకాశి, కరప.

నోబెల్ కథ

నోబెల్ కథ మౌనంలో కార్మికులు మౌనంగా పనిచేసుకుంటూనే యజమానిలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నించడాన్ని గొప్పగా చిత్రించారు.

-హెచ్.పవనపుత్ర, రామారావుపేట

మనసును కదిలించిన 'మీల్స్‌టికెట్' కథ

బహుమతి పొందిన ప్రభాకర్‌జైని కథ 'మీల్స్ టికెట్' నా హృదయాన్ని కదిలించింది. ప్రతి కుటుంబంలోనూ తల్లిదండ్రులు ఎన్ని ఇబ్బందులున్నా బిడ్డలకు ఏ లోటు తెలియకుండా పెంచిపెద్ద చేస్తారు. ఉన్నతస్థితికి వచ్చాక ఆ బిడ్డలకు తల్లిదండ్రులు గుర్తుకురారు. భార్య వచ్చాక తల్లిదండ్రుల పనిపూర్తయిపోతుంది. వారిని దరిచేరనివ్వరు. నిత్యజీవితంలో ఇలాంటి ఘటనలు ఎన్నో మనకు ఎదురవుతుంటాయి. మనల్ని పెంచి పెద్ద చేసి, మనమీద ఎన్నో ఆశలు పెట్టుకుంటారు తల్లిదండ్రులు. ఆ ఆశలను వమ్ముచేయకూడదు. వారిని ప్రేమతో చూసుకోవాలి. రేపటి మన భవితలో అలాంటి ఘటనలు ఎదురుకాకూడదు.



-కొరటమద్ది దక్షిణామూర్తి, రాయచోటి, కడపజిల్లా

ఆర్ద్రత నింపిన మీల్స్‌టికెట్

'మీల్స్ టికెట్ కథ మనసున ఆర్ద్రత నింపింది. వెంకటమ్మ కల కథ చదివాక అయ్యోపాపం అనిపించింది. తోడొకరుండిన..... కథ సమకాలీన సాంఘిక పరిస్థితులవల్ల తలెత్తిన సాధారణ సమస్య. తల్లిదండ్రులకు ఒంటరితనం ఒక శిక్ష. మదరిండియా సీరియల్ మానసిక సంఘర్షణల సమాహారంగా మంచి బిగువుగా మొదలైంది.

-ప్రతికంఠం మహేందర్‌రాజు, హన్మకొండ

యూ ఆర్ గ్రేట్ ఎమ్మెస్

ఎమ్మెస్ హర్ట్ అయితే ఎవరినీ వదలిపెట్టడు. ఓ డాక్టర్‌ని నువ్వో హ్యూమన్ మెకానిక్ అనడం ఎవరితరం? ఎమ్మెస్ గ్రేట్. మూగ ప్రాణులకు బ్లేడ్ లక్ష్మి సేవ ఉన్నతమైనది. కాఫీ జోక్స్, సురభి వింతలు, సినీ వార్తలు, తారలతో చాటింగ్స్ ఉత్సాహపరిచాయి. యమ డేంజర్ ప్రాంతాలు, వృద్ధులకు వ్యాయామం, మలాల, విజయవిలాసం, చిరుతిళ్ళ యావతో చిక్కులు, ఆకట్టుకున్నాయి. మీల్స్ టికెట్ సహా కథలన్నీ బాగున్నాయి. మనిషికి ప్రథమ శత్రువు బద్ధకమే అని వెరైటీగా చెప్పారు కంఠమనేని.

-తాళాబత్తుల సత్యనారాయణమూర్తి, విశాఖపట్నం-11

మాకు తోడు విజయ విలాసం

మనిషి జీవితంలో పాతికేళ్ళ వయసు కెరీర్ ప్లానింగ్‌లో టర్నింగ్ పాయింటనీ, ఆ వయసులో కెరీర్‌ని స్థిరంగా ప్లాన్ చేసుకోవాలని తెలుసుకున్నాం. మనలోని ప్రత్యేకతలను గుర్తించి రాణించడమే అసలైన విజయం. విలువైన సూచనలతో మంచి మిత్రుడిలా 26 వారాలు తోడు నిలిచిన 'విజయ విలాసం' కు కృతజ్ఞతలు.

-సరికొండ శ్రీనివాసరాజు, హైదరాబాద్

ప్రైమ్ హాస్పిటల్స్
హైదరాబాద్, 040-4959 4959

డా॥ జి. సతీష్ రెడ్డి
MS. M.Ch. Ortho (U.K)
మేనేజింగ్ డైరెక్టర్
ప్రైమ్ హాస్పిటల్స్, హైదరాబాద్
ఫోన్: 98495 63360

ఫ్రోజెన షోల్డర్ సమస్యను ముందే గుర్తిస్తే ముప్పు తక్కువ

అందుబాటులోకి మెరుగైన చికిత్సా విధానాలు

బాధ్యతంతా భుజస్కంధాలపైనే అనే మాటలు ప్రతిరోజూ వింటూనే ఉంటాం. మన శరీరంలో భుజానికి ఉన్న ప్రాధాన్యత అలాంటిది. దాదాపు మనం చేతులతో చేసే ప్రతి పనిలోనూ భుజం కీలును ఉపయోగించాల్సి వస్తుంది. అలాంటి భుజంలో ఏదైన సమస్య ఎదురైతే రోజువారీ పనులు చేసుకోవడంలో చాలా ఇబ్బందులు ఎదురవుతాయి. భుజాలకు వచ్చే సమస్యలలో ఫ్రోజెన్ షోల్డర్ ఒకటి. ఈ సమస్య పట్ల అవగాహన పెంపొందించుకుని సకాలంలో చికిత్స తీసుకుంటే దీనిని సులువుగా అధిగమించవచ్చు.

ఫ్రోజెన్ షోల్డర్ అంటే...?

ఫ్రోజెన్ షోల్డర్ అంటే భుజం బిగుసుకుపోయి ఉండడం. భుజంలో ఒక బంతి ఆకారంలోని కీలు, మూడు ఎముకలు పైచేయి ఎముక(హుమరస్), షోల్డర్ బ్లేడ్(స్కాపుల), కాలర్‌బోన్(క్లావికల్) సాకెట్‌లు ఉంటాయి. పైచేయి ఎముక, షోల్డర్ బ్లేడులోని సాకెట్‌లో ఫిట్ అయి ఉంటుంది. భుజం కీలు బలమైన కణజాలం, క్యాప్సుల్, లిగిమెంట్‌తో నిర్మితమై ఉంటుంది. ఫ్రోజెన్ షోల్డర్ సమస్యలో భుజం బిగుసుకుపోయి విపరీతంగా బాధిస్తుంది. ఈ సమస్య సరైన కారణాలు తెలియవు కానీ మధుమేహ రోగులలో ఎక్కువగా వస్తుంది. సంక్లిష్టమైన ఈ నిర్మాణంలో భుజం కీలు అంతా బాగానే ఉన్నప్పటికీ క్యాప్సూల్ భాగం బాగా మందంగా మారుతుంది. భుజం కదలికలు చాలా పరిమితంగా మారతాయి. చాలా కేసులలో కీళ్ల జాయింట్ల మధ్య ఘర్షణను తగ్గించే సైనోవియల్ ద్రావణం తక్కువగా ఉంటుంది.

లక్షణాలు

- భుజం కదలికలు చాలా పరిమితంగా మారతాయి. కొన్ని సందర్భాలలో భుజాన్ని కదలించడానికి ఇతరుల సహాయం తీసుకోవాల్సి రావడం.
- బట్టలు ధరిస్తున్న సమయంలో, తల దువ్వుకుంటున్న సమయంలో నొప్పి రావడం.
- భరించలేనంతగా భుజం నొప్పి ఉండడం.

ఫ్రోజెన్ షోల్డర్‌లో మూడు దశలు ఉంటాయి

ఫ్రీజింగ్: ఫ్రీజింగ్ దశలో భుజం నొప్పి క్రమంగా పెరుగుతూ ఉంటుంది. నొప్పి పెరిగే భుజం కదలికలు తగ్గిపోతూ ఉంటుంది. ఈ దశ ఆరు వారాల నుంచి తొమ్మిది నెలల వరకు ఉండవచ్చు.

ఫ్రోజెన్: ఈ దశలో భుజం నొప్పి లక్షణాలు బాగా బాధిస్తుంటాయి. ఈ దశలో రోజువారి కార్యకలాపాలలో తీవ్ర ఇబ్బంది కలుగుతూ ఉంటుంది. నాలుగు నుంచి ఆరు నెలలు పాటు భుజం బిగుసుకుపోయినట్లు ఉంటుంది.

తావింగ్: ఈ దశలో భుజం కదలికలు నెమ్మదిగా సాధారణ స్థితికి తిరిగి వస్తుంది. ఈ ప్రకియ ఆరు నెలల నుంచి రెండు సంవత్సరాల వరకు కొనసాగవచ్చు.

కారణాలు

ఫ్రోజెన్ షోల్డర్ సమస్యకు సరైన కారణాలు పూర్తిగా తెలియవు. కానీ మధుమేహ రోగులలో 10–20 శాతం ఈ సమస్య వచ్చే అవకాశం ఉంటుంది. దాంతోపాటు పార్కిన్‌సన్ వ్యాధి ఉన్నవారిలో, గుండెజబ్బులు, హైపోథైరాయిడిజం, హైపర్‌థైరాయిడిజం ఉన్నవారిలో ఈ సమస్య ఉత్పన్నం అయ్యేఅవకాశం ఉంటుంది. సర్జరీ, ఫ్రాక్చర్ వంటి కారణాల వల్ల భుజం కదలకుండా ఉండటం వల్ల కూడా ఫ్రోజెన్ షోల్డర్ అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.

జాగ్రత్తలు

- ఎక్కువగా బరువులు ఎత్తకూడదు.
- రెగ్యులర్ భుజాల వ్యాయామం చేయడం మంచిది.
- విరామం లేకుండా పనిచేస్తున్నప్పుడు కొంత సమయం విరామం తీసుకోవడం మంచిది.
- విపరీతమైన భుజాల కదిలికలు చేయకూడదు.

నిర్ధారణ పరీక్షలు

వైద్యుడు, రోగిని పరీక్షించిన సమయంలోనే చాలా వరకు ఈ సమస్య తెలిసిపోతుంది. కొన్ని సందర్భాలలో ఎక్స్-రే, ఎంఆర్ఐ పరీక్షలు అవసరమవుతాయి.

చికిత్స

సాధారణంగా ఫ్రోజెన్ షోల్డర్ సమస్యలో నొప్పిని తగ్గించి, భుజం కదలికలను మెగురుపరచడానికి చికిత్స అందిస్తారు. నొప్పి తీవ్రంగా ఉంటే పెయిన్ కిల్లర్స్, యాంటీ-ఇంఫ్లమేటరీ పెయిన్ కిల్లర్స్‌తో పాటు భుజానికి సంబంధించిన వ్యాయామాలు చేయించడం, ఫిజియోథెరఫీ చేయిస్తారు. అవసరాన్ని బట్టి స్టెరాయిడ్ ఇంజక్షన్ ఇస్తారు.

సర్జరీ

ఫ్రోజెన్ ఫోల్డర్ సమస్యను తగ్గించడానికి ఇతర చికిత్సలు పనిచేయని సందర్భాలలో సర్జరీ నిర్వహించవలసి ఉంటుంది. అవసరాన్నిబట్టి వివిధ పద్ధతులలో సర్జరీ నిర్వహిస్తారు.

మానిపులేషన్: ఈ విధానంలో రోగి మత్తులో ఉండగా సర్జన్ భుజాన్ని కదిలిస్తూ సర్జరీ నిర్వహిస్తారు.

ఆర్థోస్కోపిక్ క్యాప్సులర్ రిలీజ్: ఇది కీహోల్ విధానంలో చిన్న కోతతో నిర్వహించే సర్జరీ. ఈ విధానంలో భుజం కండానికి బిగుసుపోయిన క్యాప్సూల్‌ను ప్రత్యేక పద్ధతిలో తొలగిస్తారు. ఫ్రోజెన్ షోల్డర్ సర్జరీలలో మెరుగైన ఫలితాలు లభిస్తున్నాయి.

జూలై 7న వరల్డ్ చాక్లెట్ డే సందర్భంగా..

హ్యాపీలైఫ్‌కి చాక్లెట్ ట్రిక్!

ప్రతి ఉదయం అందమైనదే. ప్రతి రోజూ విలువైనదే. చిరునవ్వుతో రోజు ప్రారంభించి ఆనందంగా గడపడమే కాదు, మనచుట్టూ ఉన్నవారికి కూడా ఆనందాన్ని పంచివ్వ మంటోంది ఆధునిక సమాజం. అందుకే నేటి యువతరం అన్నింటా సింపుల్ ట్రిక్స్ ఆఫర్ చేస్తున్నారు. అలాంటి ట్రిక్స్‌లో చాక్లెట్ ఒకటి!

ఇప్పుడు చాక్లెట్‌ను చూస్తే భయపడాల్సిన అవసరం లేదు! మనోల్లాసంతో పాటు అద్భుతమైన ఆరోగ్యాన్నిస్తుందని పరిశోధనల ద్వారా తేల్చి చెప్పేశారు వైద్య నిపుణులు! అత్తా కోడళ్లైనా, ఆలూమగలైనా, ఆఫీసులో బాసూ కొలీగైనా చాక్లెట్‌వైపు మొగ్గుచూపిస్తే రోజంతా ఆరోగ్యం, ఆనందమేనట!

బుజ్జాయి ఏడుస్తోందంటే చాక్లెట్ కొనాల్సిందే. ప్రియురాలిని ప్రసన్నం చేసుకోవాలంటే చాక్లెట్ చూపించాల్సిందే. చాక్లెట్ తింటే చాలు ముఖంపై చిరునవ్వు రావాల్సిందే..కానీ చాక్లెట్ తింటే దంతాలు దెబ్బతింటాయి, పళ్లు పుచ్చిపోతాయి, బరువు పెరుగుతామని చాలామంది భయపడ తారు! జిహ్వను అణచుకుంటారు. ఇవేవీ నిజం కాదట. అందుకే కాబోలు చాక్లెట్ కి ఉన్న ఆరోగ్య ప్రయోజనాలు గుర్తించి జూలై 7న వరల్డ్ చాక్లెట్ దినోత్సవం పాటిస్తున్నారు. మరి ఆ చాక్లెట్స్ చెప్పే తీపి కబుర్లేంటో విందామా!

చాక్లెట్ తింటే సంతోషం కలుగుతుంది. ఎందుకో తెలుసా! అందులో ఉండే ట్రిప్టోఫాన్, ఫెనైల్‌టి లాలామిన్లు లాంటి పదార్థాల వల్ల పది గ్రాముల చాక్లెట్లు ప్రతిరోజూ తింటే శరీరంలో రక్తప్రస రణ మెరుగు పడుతుందని యూరప్ ఆహార భద్రతా సమాఖ్య అధికారికంగా ప్రకటించింది. అంతేకాదు వీటిని రోజూవారి డైట్‌లో భాగంగా చేసుకుంటే మరెన్నో లాభాలున్నాయట.

క్రీస్తుపూర్వం నాటి చాక్లెట్

క్రీస్తుపూర్వం 100వ శతాబ్దం నుంచి చాక్లెట్ల వాడకం ఉందట. ఆ కాలంలో దక్షిణ మెక్సికోలోని ఓలమ్‌కస్ అనే ఆటవికులు చాక్లెట్ పానీయం సేవించేవారట. మొదటిసారి మెక్సికోలో చాక్లెట్ బార్ తయారైంది. అదీ 300 ఏళ్ల క్రితం. ఆ తర్వాత చాలా కాలానికి 1840లో ప్రఖ్యాత క్యాడ్‌బరీ కంపెనీ ప్రారంభమైంది. మిల్క్ చాక్లెట్లు అంటే ప్రపంచవ్యాప్తంగా మోజు పడతారు కానీ మగ వారు ఎక్కువగా డార్క్ చాక్లెట్లు ఇష్టపడతారని ఓ సర్వేలో తేలింది.

ఏటా 10 లక్షల కోట్ల రూపాయల చాక్లెట్లు!

ప్రపంచవ్యాప్తంగా ఏటా పదిలక్షల కోట్ల రూపా యల విలువైన చాక్లెట్ ఉత్పత్తులు వినియో గిస్తున్నారు. వీటిల్లో సగం వాటా అమెరికన్లదే. ఆ దేశంలో చాక్లెట్లు తినేవారి సంఖ్య కూడా పెరుగు తోందట. 'అసోచామ్' సంస్థ పరిశోధనల ప్రకారం, గత యేడాది మన గ్రామీణ ప్రాంతాల్లో చాక్లెట్ వ్యాపారం విలువ 7,500 కోట్ల రూపాయల స్థాయికి చేరుకుంది. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశాలున్నాయట. చాక్లెట్లను అత్యధికంగా ఉత్పత్తి చేసే దేశం కోట్ డీవార్. నిప్‌షిఫ్ట్ ఫ్రిట్జ్ కంపెనీ 1999లో రూపొందించిన చాకొపొలేజి ప్రపంచంలోకెల్లా ఖరీదైనది. అరకిలో చాక్లెట్ సుమారు రెండు లక్షల రూపాయలు! 56 వేలు ఖరీదు చేసే నోకా వింటేజ్ కలెక్షన్ తర్వాతి స్థానంలో ఉంది. డెలాఫీ కంపెనీది మూడో స్థానం. నాణ్యమైన కకోవా గింజలు, 24 క్యారెట్ల బంగారు ఆకులతో ఈ కంపెనీ చాక్లెట్లు తయారు చేస్తుంది. దీని అరకిలో చాక్లెట్ ఖరీదు 33 వేల రూపాయలు. బార్ విషయానికొస్తే బంగారుపూత పూసిన క్యాడ్‌బరీస్‌లో విస్పాదే మొదటి స్థానం. దీని ఖరీదు లక్షా ఆరువేలు. ప్రపంచవ్యాప్తంగా క్యాడ్‌బరీ, మార్స్, నెస్లే, ఫెరోరీ, హెర్‌షేస్, లిండిట్, ఎజిస్ప్రాక్స్, ఇడ్జీజ్, మెర్జీ, ఆర్కార్ కంపెనీలు టాప్‌టెన్ చాక్లెట్లుగా గుర్తింపుపొందాయి.

చాక్లెట్లతో ఆరోగ్యం

వ్యాధుల నుంచి ఉపశమనం పొందాలంటే తప్పకుండా చాక్లెట్ తినాల్సిందే అంటున్నారు ఆరోగ్య నిపుణులు. అయితే చాక్లెట్లు ఏవి పడితే అవి తినడం కాకుండా ఎంపికలో జాగ్రత్త పాటిం చాలి.

కోపం, ఒత్తిడి మటుమాయం

నలుపురంగు చాక్లెట్ తింటే మనసు ప్రశాం తంగా ఉంటుందట. ఈ విషయాన్ని తాజా అధ్య యనాలు కూడా నిరూపిస్తున్నాయి. మీ కోపాన్ని అదుపులో పెట్టుకోవడానికి బ్లాక్ చాక్లెట్ ఉపకరి స్తుందట. అందులో ఉండే పాలిఫెనాల్స్ అనే

రసాయనం ప్రశాంతతను, తృప్తిని పెంచుతుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. పాలిఫెనాల్స్ రసాయనాలు ఆక్సిడేటివ్‌గా పనిచేసి ఒత్తిడి తగ్గిస్తాయి. మానసికంగా అనేక దుష్ప్రభావాలని ఇవి దూరం చేస్తాయని శాస్త్రవేత్తలు అంటున్నారు.

గుండెజబ్బులకు చెక్

రోజుకు ఒక చాక్లెట్ తింటే గుండెజబ్బులు వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. స్కాట్లాండ్‌లోని అబెర్డీన్ యూనివర్సిటీ పరిశోధకులు దాదాపు 21 వేల మందిపై గడిచిన పన్నెండేళ్ళుగా పరిశోధనలు చేసి చాక్లెట్‌లోని సుగుణాలను తేల్చి చెప్పారు. చాక్లెట్ రుచి చూడని వారితో పోలిస్తే అడపాదడపా చాక్లెట్‌ను ఆస్వాదించే వారికి గుండె జబ్బులు వచ్చే అవకాశాలు 11 శాతం తక్కువగా ఉంటాయట. క్రమం తప్పకుండా రోజూ చాక్లెట్ తినేవారికి గుండె జబ్బుల ముప్పు 25 శాతం వరకు తగ్గుతుందనీ, 45 శాతం మేరకు మరణాంతక జబ్బులు తగ్గుతాయని ఈ పరిశోధనలో వెల్లడైంది. చాక్లెట్ గుండె ఆరోగ్యాన్ని పెంచడమే కాకుండా లోబ్లడ్ ప్రెజర్‌ను తగ్గిస్తుంది. శరీరానికి అవసరమయ్యే శక్తిని వ్యాధి నిరోధకతను వెంటనే అందించే శక్తి చాక్లెట్‌కు ఉంది. ఇవి చాలావరకూ అన్ని రకాల బ్లడ్ ప్రజర్స్‌ను రెగ్యులేట్ చేస్తాయట. అందువల్ల చాక్లెట్‌ను కూడా రెగ్యులర్ డైట్‌లో చేర్చుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

మెదడు చురుకుదనం

చాక్లెట్లు తినడం వల్ల మెదడులో చురుకుదనం పెరుగుతుంది. ఆలోచనాప్రక్రియ మెరుగుపడుతుందని అమెరికా మైన్ విశ్వవిద్యాలయం - దక్షిణ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయం, లగ్జెమ్‌బర్గ్ ఆరోగ్య సంస్థల సంయుక్త పరిశోధనలో వెల్లడైంది. దీంట్లో భాగంగా 23-98 ఏళ్ల మధ్య వయస్కులైన 968 మందికి పలురకాల మెదడుకు మేత పరీక్షలు ఇచ్చి వారు సమాధానాలు ఇచ్చిన తీరును, వేగాన్ని గమనించారు. చాకెట్స్ తరచూ, అధికంగా తీసుకున్న వారు జ్ఞాపకశక్తి, పరిశీలన, విశ్లేషణా సామర్థ్యం, సమన్వయం తదితర అంశాల్లో మంచి ప్రతిభ చూపారని వెల్లడించారు.

దగ్గు నివారిణి

చాక్లెట్స్ తింటే దగ్గు పెరుగుతుంది కానీ తగ్గుతుందా! అనుకుంటున్నారా తగ్గుతుందనే అంటున్నాయి పరిశోధనలు. ముల్లును ముల్లుతోనే తీయాలన్నట్టు దగ్గును చాక్లెట్‌తోనే తగ్గించవచ్చుట. హుల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అలైన్ మొరిస్ అంతర్జాతీయ దగ్గు స్పెషలిస్ట్. దగ్గును చాక్లెట్‌తో తగ్గించవచ్చనే విషయాన్ని ఓ పరిశోధనలో ఆయన తేల్చేశాడు. 163 మంది రోగులకు 12 నెలలపాటు రోజుకో చాక్లెట్ తినిపించి చూస్తే, దగ్గుకు సంబంధించిన ఎలాంటి లక్షణాలు కనిపించలేదట. సాధారణ మందులకన్నా చాక్లెట్ సంబంధించిన ఔషధాన్ని సేవిస్తే దగ్గు తగ్గు ముఖం పడుతుందని ఆయన పరిశోధనలో తేలింది.

మహిళల సమస్యలకు

మహిళలకు వచ్చే నెలసరి సమయంలో ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ స్థాయి తగ్గుతుంది. ఈ సమయంలో కడుపునొప్పి, టెన్షన్, కోపతాపాలు అధికమవుతాయి. చికాకుగా ఉంటారు. క్షణక్షణానికి వాళ్ల మూడ్ మారుతూ ఉంటుంది. హార్మోన్లలో వచ్చే మార్పులే దీనికి కారణం. హాయిని కలిగించే పెరోటినిస్ తగ్గిపోవడం, ఎండార్ఫిన్‌లు మాయమవడం వల్ల ఇలాంటి సమస్యలు తలెత్తుతాయి. అలాంటి సమయంలో కొన్నిరకాల పోషకాహారంతో పాటు, డార్క్ చాక్లెట్లు కూడా అద్భుతంగా పనిచేస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

పొట్ట తగ్గడానికి

నేటికాలంలో చాలామందిని వేధించే సమస్య అధిక బరువు. దానికితోడు బాన పొట్ట. సన్నగా నాజూగ్గా తయారవ్వాలనేది ప్రతి వారికీ కోరికే. అందుకు కఠినమైన ఆహారనియమాలు పాటిస్తూ, వ్యాయామాలు చేయడం అందరికీ సాధ్యం కాదు. కానీ రోజుకో డార్క్ చాక్లెట్ తింటే మీ బాన పొట్ట కాస్తా తగ్గుతుందట.

ప్రత్యేకించి కోకోబీన్స్‌తో చేసిన చాక్లెట్లు లేదా వాటి పౌడర్ శరీరానికి ఎంతో మేలు చేస్తుందట. కోకో శరీరంలో కొవ్వును ఖర్చు చేస్తుంది. బరువు తగ్గేలా చేస్తుంది.

శృంగార సామర్థ్యం

చాక్లెట్లతో ఉండే కోకోబీన్స్‌కు లైంగిక సామర్థ్యానికి అతిదగ్గర సంబంధం ఉన్నట్లు కనుగొన్నారు. ఇటలీలోని మిలన్‌లో ఓ హస్పెటల్‌లో 200 మందిపై పరిశోధనలు చేసి వారికి రోజుకొక చాక్లెట్ తినిపించారట. చాక్లెట్ తిన్న వారిలో ఉండే శృంగార కోరికలు, తిననివారికంటే అధికంగా ఉన్నాయని కనిపెట్టారు. చాక్లెట్‌లో ఉండే కాల్షియం, మెగ్నీషియం ఎముకలలో దృఢత్వాన్ని కలిగిస్తాయి. రక్తంలో షుగర్ శాతం తగ్గినట్టయితే చాక్లెట్ తినడం మంచిది. రోజూ చాక్లెట్ తింటే వృద్ధులలో వచ్చే అల్జీమర్స్ వ్యాధికి చెక్‌పెట్టవచ్చు.

- సంతోషలక్ష్మి దహగాం



చాక్లెట్ మ్యూజియం

అక్కడికి వెళ్ళగానే అనేక రకాల బొమ్మలు కనిపిస్తాయి. అయితే వాటిని చూస్తే నోరూరుతుంది. అమాంతం పట్టుకుని తినేయాలనిపిస్తుంది. ఎందుకంటే అవన్నీ చాక్లెట్‌తో చేసిన బొమ్మలు. ఈ వింత బొమ్మల సంగతేంటో తెలియాలంటే 'పెలిట్ చాకోలెట్ మ్యూజియం' చూడాల్సిందే! టర్కీలోని ఇస్తాంబుల్ మ్యూజియంలోకి అడుగుపెట్టగానే చాక్లెట్ ఫౌంటెన్ స్వాగతం పలుకుతుంది. లోపలికి వెళితే కళ్ళు చెదిరే చాక్లెట్ కళాఖండాలు మనల్ని ఆశ్చర్యపరుస్తాయి. సుమారు 25,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉండే ఈ మ్యూజియంలో 20 అడుగులకు పైగా ఎత్తున్న బొమ్మలతో పాటు, బుల్లిబుల్లి బొమ్మలు కూడా కొలువుదీరి ఉంటాయి. అవన్నీ చాక్లెట్‌తో చెక్కినవే. టన్నుల కొద్దీ చాక్లెట్‌ను ఉపయోగించి వీటిని తీర్చిదిద్దారు. రంగురంగుల చాక్లెట్ మిశ్రమాలతో రంగురంగుల చాక్లెట్ బొమ్మలను తయారు చేస్తారు. ఈ మ్యూజియంలో మూడువేలమందికి పైగా కళాకారులు పనిచేస్తుంటారు. చాక్లెట్ శిల్పాలు కరిగిపోకుండా ఉష్ణోగ్రత నియంత్రణకు మ్యూజియంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

చాక్లెట్‌తో అందం

చాక్లెట్లతో అందాన్ని మరింత రెట్టింపు చేసుకోవచ్చు. చాలామంది స్కిన్‌కేర్‌లలో చాక్లెట్లు కూడా ఉపయోగిస్తారు. వాటితో చేసే ఫేసియల్‌కి డిమాండ్ ఎక్కువ.

చాక్లెట్‌లో ఉండే ఫ్లేవనాయిడ్లు అల్ట్రావయలెట్ కిరణాల నుంచి చర్మాన్ని రక్షిస్తాయి. బ్లడ్ సర్క్యులేషన్ పెరిగి ముఖకాంతి బాగుంటుంది. ముఖంపై తాజాదనం ఏర్పడి ఫ్రెష్‌గా కనిపించడానికి ఈ చాక్లెట్ ఫేసియల్స్ ఉపయోగపడతాయి.

మాతృత్వం ఒక చేదు జ్ఞాపకం

జి. యోలక్ష్మి

"నాకు ఉద్యోగం వచ్చింది" చెప్పింది సునీత.

"నాకూ ఉద్యోగం వచ్చింది. కాని ఇక్కడ కాదు, హైదరాబాద్‌లో" సంతోషంగా చెప్పాడు సుధీర్.

"ఏం ఉద్యోగం అని అడగవేం?" అని చేత్తో నెమ్మదిగా సుధీర్ చేతిమీద తట్టింది సునీత.

"ఓహ్, ఏం ఉద్యోగం?" సునీత వైపు తిరిగి అడిగాడు సుధీర్.

"కె.కె. బ్రదర్స్ బట్టల షాపులో సేల్స్‌గర్ల్ ఉద్యోగం".

"డిగ్రీ చదివి ఈ ఉద్యోగమా?"



"భలేవాడివే, పీజీలు కూడా వచ్చారు తెలుసా?"

"సర్లే. ఎంతిస్తారు?"

"పది వేలు"

"నాకు ఇరవై వేలు. అయినా సుఖం లేదు. సెలవులు, గిలవులు ఉండవు. ఒకటే తిరుగుడు. సంవత్సరం పనిచేస్తే, ఇక్కడ వైజాగ్ బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ చేస్తారు".

"అంటే మార్కెట్ జాబా?"

"అవును. అలాంటిదే".

"ఎలాగూ వచ్చే సంవత్సరం కదా మన ప్రేమ విషయం ఇంట్లో చెప్తాం" అంతదాకా ఇలా కానిచ్చేద్దాం".

"నీకేం, నువ్వు ఎలా అయినా సర్దుకుంటావు. నా పరిస్థితే".

"చాల్లే. నాన్న పోయారు. అమ్మ మంచంపట్టి ఉంది. ఆపరేషన్‌కు మూడు లక్షలు కావాలి. అందుకు ఈ ఉద్యోగం చేస్తున్నాను. ఎప్పటికి నేను ఆ డబ్బు సంపాదించి అమ్మని బ్రతికించుకుంటానో" కళ్ళ నీళ్ళు తిప్పుకుంది సునీత.

"బాధపడకు. తొందర్లో నీ కష్టాలు తీరిపోతాయి. 12 నెలలు గడిచిపోతే నేనూ ఇక్కడికి వచ్చేస్తాను. నా వైపు నుంచి నేనేం చెయ్యాలో అదీ ఆలోచిస్తాను. ఐ లవ్ యు సునీత" అన్నాడు ఉద్వేగంగా సుధీర్. ఆ మాటలకు ఎంతో ఆనందించింది సునీత.

"మంచి మాటలు చెప్పావు సుధీర్. ఐ లవ్ యు" అని అతడికి దగ్గరగా వెళ్లింది సునీత. సుధీర్ ఆమెను ప్రేమగా హగ్ చేసుకున్నాడు. ఆ మరుసటిరోజే సుధీర్ హైదరాబాద్ వెళ్లిపోయాడు. సునీత వైజాగ్‌లో కె.కె.బ్రదర్స్ షాపులో సేల్స్‌గర్ల్‌గా చేరింది.

•••

సునీతకు మనసంతా తల్లి గురించి ఆలోచనలే. ఆపరేషన్ చెయ్యకపోతే తల్లి బ్రతకదని

నవ్యవీక్లి- నాటా సంయుక్త నిర్వహణలో బహుమతి పొందిన కథ

డాక్టర్లు చెప్పారు. డబ్బు కావాలి. రోజురోజుకీ తల్లి రోగం ముదిరిపోతోంది. డబ్బు కావాలి! ఏం చెయ్యాలి? ఎలా సంపాదించాలి? ప్రతిరోజు సుధీర్‌తో ఫోన్లో మాట్లాడుతోంది. కాని సుధీర్ మాత్రం ఏం చెయ్యగలడు? ఏదో చెప్పి ఓదారుస్తున్నాడు. ఈ సమయంలో సునీతకు షాపులో తనతోబాటు పనిచేసే లక్ష్మి పరిచయమైంది. ఇద్దరూ స్నేహితులయ్యాక తన బాధలు ఆమెకు చెప్పింది.

"నీకు నేను ఒక పరిష్కారం చూపిస్తాను. డబ్బు సంపాదించుకునే మార్గం చూపిస్తాను. సరేనా" అంది లక్ష్మి.

"ఎలా?" అంది సునీత ఆశ్చర్యంగా.

"ఎలాగో నువ్వే చూస్తావు. రేపు మనం ఒక ప్లేస్‌కి వెళ్తున్నాం" అంది రహస్యంగా.

"అలాంటి సంపాదన నాకక్కరలేదు" అంది సునీత ఇబ్బందిగా.

"తప్పుగా అర్థం చేసుకోకు" అంది లక్ష్మి.

"అయితే అదేంటో చెప్పు".

"నువ్వే చూస్తావు కదా. చూస్తే నీకే తెలుస్తుంది".

"సరే" ఊపిరి పీల్చుకుంది సునీత.

"మొత్తం పని అయ్యేదాకా ఈ విషయం ఎవ్వరికీ తెలియకూడదు. నీ ఫ్రెండు సుధీర్‌కి కూడా" అని ఆంక్ష పెట్టింది లక్ష్మి.

"అలాగే. నాకు డబ్బు కావాలి. అమ్మకి ఆపరేషన్ చెయ్యాలి. అదీ సక్రమమైన మార్గంలో జరగాలి" అని తిరిగి ఆంక్ష పెట్టింది సునీత.

"అలాగే. నీకు నచ్చితేనే చెయ్యి. లేదంటే మానేద్దువుగానీ. ఓకేనా?" అంది లక్ష్మి.

"ఓ.కే." అంది సునీత. తరువాత ఎవరి పనుల్లోకి వాళ్లు వెళ్ళిపోయారు.

●●●

'సంతానం కావాలనుకునే దంపతుల అండాన్ని, శుక్రకణాన్ని తీసుకుని, బయట ప్రయోగశాలలో ఫలదీకరణ జరిపి, పిండాన్ని అద్దెగర్భం ఇచ్చే మహిళ గర్భాశయంలోకి ప్రవేశపెడతారు. ఈ విధానంలో జన్యుపరంగా అద్దెగర్భ మహిళకు ఎలాంటి సంబంధం ఉండదు. ఒకవేళ భార్యాభర్తల్లో ఇరువురిలో ఒకరికి సమస్య ఉంటే.. అవసరాన్ని బట్టి అండాన్ని గానీ, శుక్రకణాన్నీ గానీ దాతల నుంచి స్వీకరించి ఫలదీకరణ జరుపుతారు.

దీనిని సరోగసీ అంటారు. ఈ సరోగసీ ఎవరి కోసం?

- సంతాన ప్రాప్తికోసం చేయాల్సిన అన్ని ప్రయత్నాలూ చేసి, ఇక లాభం లేదని వైద్యులు నిర్ధారించిన తర్వాత... చివరకు అద్దె గర్భం విధానాన్ని ఎంచుకోవాలి.
- గర్భసంచి వృద్ధిచెందని వారు, తరచూ గర్భస్రావాలతో ఎండోమెట్రియం పొర దెబ్బతిన్నవారు.
- ఏ కారణంతోనైనా గర్భసంచి తొలగించిన వారు
- వయసు పైబడిన దంపతులు.

కృత్రిమ గర్భధారణ ద్వారా అద్దెగర్భానికి సిద్ధపడే మహిళల సంఖ్య పెరుగుతోంది. పూర్తి అంగీకారంతో, ఇష్టపూర్వకంగా సిద్ధపడేవారితోనే ఈ ప్రక్రియ ప్రారంభిస్తాం. ఇది కొనసాగినన్ని రోజులూ ఆ మహిళల్ని మా సంరక్షణలోనే ఉంచుకుంటాం. పూర్తి వ్యయాన్ని ఆసుపత్రి భరిస్తుంది. సంతానలేమితో బాధపడుతున్న దంపతులకు ఇది ఒక వరంగా భావించవచ్చు.'

సంతానలక్ష్మి సాఫల్య కేంద్రం అని రాసిఉన్న ఒక పాంప్లెట్‌ని సునీత చదివింది. తెల్లబోయింది.

"చదివావు కదా, నీకు అర్థం కాలేదా?" అంది లక్ష్మి.

"అర్థమైంది. కాని ఇది నాకెందుకు?" టక్కున అడిగింది సునీత.

"ఇది నీకే"

"నాకా?" షాక్ కొట్టినట్లయింది సునీతకు.

"నీకు డబ్బు కావాలి కదా. దానికి ఇది సరైన మార్గం"

"నాకింకా పెళ్ళికాలేదు" ఆశ్చర్యపోయింది సునీత. లక్ష్మి ఇలా చెప్తుందని అనుకోలేదు.

"అయితే ఏం? పెళ్ళికీ దీనికీ సంబంధం లేదు" చాలా ప్రొఫెషనల్‌గా చెప్పింది లక్ష్మి.

"ఈ అద్దెగర్భం ఏమిటో నాకు తెలియదు" చెప్పింది సునీత.

"నీకు తెలియదు కాబట్టే ఆ పాంప్లెట్ ఇచ్చాను. మళ్ళీ మళ్ళీ చదువు. నువ్వు ఒక బిడ్డకి తల్లిగా నీ గర్భాన్ని అద్దెకు ఇచ్చావంటే నీకు కావల్సిన డబ్బు వస్తుంది".

"అమ్మో! నాకు భయం' అని పాంప్లెట్ తిరిగి ఇవ్వబోయింది సునీత.

"ఏం భయపడకు. ఆలోచించు. నీకు చాలా పెద్దమొత్తంలో డబ్బు కావాలి. ఇదే సరైనమార్గం. రేపొచ్చి చెప్పు" అని చాలా కూల్‌గా చెప్పింది లక్ష్మి. సమాధానం చెప్పకుండా మౌనం వహించింది సునీత.

ఇద్దరూ సంతానసాఫల్య కేంద్రం నుంచి షాపుకి వెళ్లారు. సాయంత్రం సునీత ఇంటికి వెళ్లిపోయింది.

●●●

తల్లి పరిస్థితి బాగులేదు. డాక్టర్లు చెప్పిన మాటలు మళ్ళీ మళ్ళీ గుర్తుకు వస్తున్నాయి. ఆపరేషన్ చెయ్యకపోతే అమ్మ చనిపోతుంది. ఏం చెయ్యాలి? లక్ష్మి చెప్పిన ఈ పనికి ప్రిపేర్ అయితే ఎలా ఉంటుంది? అమ్మకి ఈ విషయం చెప్పకూడదు. అమ్మ ఒప్పుకోదు. అమ్మకి తెలియకుండా జరగాలి. అది సాధ్యపడుతుందా? కడుపు తెచ్చుకుంటే తల్లికి తెలియకుండా ఎలా ఉంచగలదు? ఈ కడుపు తనది కాదు. తన బిడ్డ కాదు. అద్దెగర్భాన్ని మొయ్యాలి. అమ్మ ఈ పనికి ఒప్పుకుంటుందా? ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా డబ్బుకోసం చెయ్యాలి. ఆ డబ్బుతో తల్లిని బ్రతికించుకోవాలి.

అసలు అద్దెగర్భానికి సిద్ధపడడం నైతికమా?



అనైతికమా? మానవత్వామా? దాతృత్వమా? ఇవన్నీ తనకి అవగాహనకు రాని ప్రశ్నలు. అద్దెగర్భం ద్వారా మరొకరికి సంతానాన్ని అందించటం ఒక పనిలాగా భావించాలి. ఏడాదిపాటు అద్దెగర్భానికి సహకరిస్తే డబ్బులొస్తాయి. తన కుటుంబం బాగుపడుతుంది. ముఖ్యంగా ఒక్కగానొక్క తోడు, తల్లి ప్రాణం నిలబడుతుంది. అంతే!

పుట్టేబిడ్డతో తనకి సంబంధం లేదు. ఆ బిడ్డని ఏ దంపతులకు ఇస్తారో తనకి తెలియదు. తను కళ్లు తెరవకముందే బిడ్డని చేతులు మారుస్తారు.

అయితే తనకి పెళ్లి అవలేదు. వివాహిత కాదు. ఈ అద్దెగర్భానికి సిద్ధపడటం ఒక రకంగా దారుణమైన విషయం. అయినా ఏం చెయ్యలేదు. అంత డబ్బు ఎలా వస్తుంది?

ఒక నిర్ణయానికి వచ్చింది సునీత. అయితే కొన్ని సందేహాలున్నాయి. ఆ మరుసటి రోజు మళ్ళీ లక్ష్మిని సంతాన సాఫల్య కేంద్రంలో కలిసింది.

"నీకూ ఈ ఆసుపత్రికీ ఏమిటి సంబంధం?" అని అడిగింది సునీత.

"ఇక్కడ నాకు తెలిసిన మనుషులున్నారు. వాళ్లు మా ఊరు వాళ్లే" అంది లక్ష్మి.

"మరి నువ్వే ఈ పని చెయ్యవచ్చు కదా" అంది సునీత.

"నాకు పిల్లలు పుట్టరు. ఆ అదృష్టం లేదు నాకు" అంది బాధగా లక్ష్మి.

"సరే. ఇలాగే ఇంతకుముందు ఎవరైనా చేశారా?"

"ఓ... చాలామంది"

"ఒకరిద్దరి గురించి చెప్పవా?"

"ఇద్దరేంటి, ముగ్గురి గురించి చెప్తా. విను" అంది లక్ష్మి, సునీత దార్లోకి వచ్చిందని సంతోషిస్తూ. అటూఇటూ చూసింది సునీత.

"అక్కడికి వెళ్దాం పదా" అని సునీతను తీసుకొని లక్ష్మి ఒక కార్నర్‌కి వచ్చింది. ఇద్దరూ ఆ మూల కుర్చీల్లో కూర్చున్నారు.

"ఇప్పుడు చెప్పు" అంది సునీత భయం భయంగా.

"భయపడకు. అన్నీ నేను చూసుకుంటాను. చెప్పింది విను" అంది లక్ష్మి, సునీత భుజం మీద చెయ్యి వేసి.

"సరే చెప్పు" అంది సునీత.

"నర్సీపట్నం దగ్గర రాంపురం అని ఒక ఊరుంది. అక్కడ నుంచి లలిత అనే ఒక అమ్మాయి వచ్చింది. నాలుగేళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకుంది. బి.టెక్ చదివింది. తనకి ఇద్దరు పిల్లలు. భార్యాభర్తలు ఇద్దరూ చిన్న ఉద్యోగస్థులు. ఇల్లు గడవడం కష్టంగా ఉంది. అద్దె గర్భానికి (సరోగసికి) అంగీకరిస్తే ఆకర్షణీయమైన డబ్బు అందుతుందని ఓ ప్రకటన వచ్చింది. ఒక్కఏడాది 'అద్దె గర్భం' కోసం ఆసుపత్రి చెప్పినట్లు వింటే మూడు లక్షలు చేతికి వస్తాయి. అంతే? భర్తతో మాట్లాడి, ఇంట్లో పిల్లలతోసహా మరెవరికీ చెప్పకుండా ఆసుపత్రిలో చేరింది. అద్దెగర్భాన్ని మోసింది. మూడు లక్షలు సంపాదించుకుంది. ఒక్క ఏడాదిలో ఇంత డబ్బు సాధ్యమా? ఆ డబ్బొచ్చింది, లలిత జీవితం బాగుపడింది" కళ్ళు తిప్పుతూ చెప్పింది లక్ష్మి.

"అంటే నేను సుధీర్‌తో ఈ విషయం చెప్పాలా?" సందేహంగా అడిగింది సునీత.

"నువ్వెలా చెప్తావు? నీకు పెళ్లి కాలేదు. అతడికి చెప్తే ఒప్పుకుంటాడా? పెళ్ళికాని దానివి కాబట్టి నీకు కొంచెం ఎక్కువ డబ్బు వస్తుంది."

"అవును. సుధీర్‌కి ఈ విషయం ఎట్టి పరిస్థితుల్లో తెలియకూడదు".

"ఇప్పుడు నువ్వు తెలియజెయ్యకపోయినా తరువాత తెలుస్తుంది. అప్పుడు చెప్పొచ్చు".

"ఏమంటాడో?"

"ఏదో ఒకటి అంటాడు. మీ ఇద్దరు భార్యాభర్తలు కారు. కాబట్టి తరువాత చూసుకోవచ్చు. ముందు నీకు మీ అమ్మ ముఖ్యం. తరువాత సుధీర్" అంది లక్ష్మి.

పెళ్ళికాని ప్రైవేటు ఉద్యోగి ఆ యువతి. వచ్చే జీతం ఖర్చులకే చాలడంలేదు. మంచం పట్టిన తల్లికి ఆపరేషన్ చేయించాలి. ఎలా? ఓ సులువైన ఉపాయం చెప్పిందామె కొలీగ్. సరోగసీ! అంటే గర్భాన్ని అద్దెకు ఇవ్వడం! డబ్బుకోసం గర్భాన్ని అద్దెకివ్వడం సమంజసమేనా అని మీమాంసలో పడిందామె. మరి ఆమె ఎలాంటి నిర్ణయం తీసుకుంది? సరోగసీ ద్వారా డబ్బు సంపాదించిందా? లేదా?

'అంతే. ఇప్పుడు సుధీర్ గురించి ఆలోచిస్తే, మా అమ్మ ఏమైపోతుంది? ఎలాగూ సంవత్సరం వరకు సుధీర్ ఇక్కడికి రాడు'.

"ఇంకేం, వర్రీయే లేదు. ప్రస్తుతానికి సుధీర్‌ని పక్కన పెట్టు. నేను చెప్పింది విను".

"అలాగే" అని మౌనంగా వింటోంది సునీత.

"అనకాపల్లి పక్కన ఒక ఊరు నుంచి వచ్చింది గీత. భర్తతో ఏవో గొడవలు. విడిపోయింది. చిన్న వ్యాపారం ఏదో అంది. దానిమీద వచ్చే ఆదాయం గీత కుటుంబపోషణకే సరిపోవడం లేదు. నాలుగేళ్ల పాప ఉంది. ఆపాపకి మంచి భవిష్యత్తు ఇవ్వాలి. ఏం చెయ్యాలి అని ఆలోచించింది. నాలాగే, నీకు నేను చెప్పినట్టు ఒక స్నేహితురాలి ద్వారా అద్దెగర్భం గురించి తెలుసుకుంది. ఇంట్లో వాళ్ల అమ్మని ఒప్పించింది. రెండేళ్లకిందట ఒకసారి అద్దెగర్భం ద్వారా ఒక పాపను కని అందించింది. ఇప్పుడు మరోసారి అద్దెగర్భానికి సిద్ధపడింది. గతంలో వచ్చిన డబ్బులతో అప్పులు తీర్చింది. ఇప్పుడు ఈ డబ్బు పాప భవిష్యత్తుకు ఉపయోగిస్తుంది" అంది లక్ష్మి ఊపిరి తీసుకుని.

"అంటే మా అమ్మని ఒప్పించాలి. ఒప్పుకుంటుందా?" సునీత ఆశ్చర్యంగా అడిగింది.

"ఒప్పించాలి. మీ అమ్మకు తెలియకుండా నువ్వు ఈ పని చెయ్యడం కష్టం" అంది లక్ష్మి.

"అదే ఆలోచిస్తున్నాను. అమ్మ బ్రతకాలి. ఎలాగోలా ఒప్పిస్తాను".

"అలా అను. నీ మాట కాదనరు. ఆమె కోసమే కదా నువ్వు ఈ పనికి సిద్ధపడుతున్నావు".

"చూడాలి. సరే. అంతేనా?" ఆలోచిస్తూ అంది సునీత.

"మధురవాడ నుంచి ఇంతదూరం వచ్చింది ఒక అమ్మాయి. పేరు ఎందుకులే. ఏదో ఒకపేరు. ఆవిడ భర్త అనారోగ్యంతో ఉన్నాడు. ఇద్దరు పిల్లలు. కూలీనాలీ చేసుకుని జీవిస్తోంది. భర్తకు సరైన చికిత్స చెయ్యాలి. చెయ్యడానికి డబ్బు లేదు. ఈ పరిస్థితుల్లో ఒక వ్యక్తి ఆమెను సంప్రదించాడు. ఇక్కడికి తెచ్చాడు. అద్దెగర్భానికి అంగీక

రాజోలు పిల్ల పెళ్ళికి రెడీ

రాజోలు చిన్నది అంజలి గత కొంత కాలంగా కోలీవుడ్ హీరో జైతో పీకల్లోతు ప్రేమలో మునిగిందన్న వార్తలు బాగానే హల్‌చల్ చేస్తున్నాయి. ఇప్పుడీ ప్రేమజంట ఓ ఇంటివారు కావడానికి తొందరపడుతున్నారంటున్నారు తమిళ తంబిలు. వీరిద్దరి మ్యాటరు పెద్దలకు పోస్ట్ చేయడం జరిగిందంట! వాళ్ళు గ్రీన్ సిగ్నల్ ఇస్తే పెళ్ళి పీటలెక్కడమే తరువాయి అన్నది కోలీవుడ్ జనాల మాట! 'జర్నీ' సినిమాతో మొదలైన వీరి పరిచయం పెరిగి ప్రేమగా మారి ఇప్పుడు పెళ్ళిదాకా వచ్చిందంటున్నారు. అయితే అంజలి చుట్టూ ఎప్పుడూ ఏదో ఒక వివాదం ఉండడం సహజమే కాబట్టి ఇది కూడా అలాంటిదేనేమో అన్న అనుమానం కొందరు వ్యక్తం చేస్తున్నారు. అందరి అనుమానాలు తీరాలంటే అంజలి నోరు విప్పక తప్పదంటున్నారు సినీ జనాలు.

రిస్తే మూడు లక్షలు ఇప్పిస్తానని చెప్పాడు. భర్తకి చెప్పకుండా పనికోసం వైజాగ్ వెళ్తున్నానని వచ్చింది. ఒక ఏడాదిపాటు భర్త, పిల్లలకు దూరంగా గడిపింది. గుండె నిబ్బరం చేసుకుంది. డబ్బు సంపాదించుకుంది. భర్త ఆరోగ్యం కోసం డబ్బు ఉపయోగించుకుంది. సో, నువ్వు కూడా రెడీ అవ్వు" అంది లక్ష్మి చెప్పడం ఆపి. ఆలో చనలో పడింది సునీత. కాసేపటి తర్వాత

"సరే. అమ్మని ఒప్పిస్తాను. అయితే నాకు ఇంకా పెళ్లి కాలేదు. అదే నా బాధ. అయినా తప్పదు. ఏం చేస్తాను? భగవంతుడు నాకు ఇలా రాసిపెట్టాడు" బాధగా అంది సునీత.

"డోంట్‌వర్రీ. అంతా బాగా జరుగుతుంది. పద షాపుకి వెళ్దాం" అంటూ సునీతని బయల్దేరదీసింది లక్ష్మి. ఇద్దరు షాపుకి వెళ్లిపోయారు.

•••

లక్ష్మి ఇచ్చిన కౌన్సెలింగ్‌కి అంగీకరించి, సునీత 'అద్దెగర్భం' కోసం తల్లిని ఒప్పించింది. తల్లి మొదట ఒప్పుకోలేదు. అయినా నానారకాలుగా ప్రాధేయ పడి "నిన్ను బ్రతికించుకోవాలమ్మా" అంటూ ఏడ్చి పని సాధించింది. తల్లి కన్నీరుమున్నీరు అయ్యింది.

"నువ్వు పెళ్ళి చేసుకోవాలి. నీ బ్రతుకు చూసుకోవాలి. ఈ పనిచేస్తే నీకు పెళ్ళి ఎలా అవు తుంది? ఎవరు ఒప్పుకుంటారు నిన్ను పెళ్ళి చేసు కోవడానికి" ఏడుస్తూ చెప్పింది సునీత తల్లి.

"సుధీర్ ఒప్పుకుంటాడు" నమ్మకంగా చెప్పింది సునీత.

"ఎవరూ ఒప్పుకోరమ్మా"

"ఒప్పుకుంటే సరే. లేకపోతే లేదు. నువ్వు బ్రతకాలి. నీకు ఆపరేషన్ చేయించాలి. అదే నా ముందున్నది".

"అయ్యయ్యో. నీకు నేను ఎలాచెప్పనే. అర్థం చేసుకో. నాకు ఆపరేషను చెయ్యకపోయినా ఫర వాలేదు. బ్రతికుంటే ఉంటాను. లేదంటే లేదు".

"అలా అనకమ్మా. ఒప్పుకో. అంతా బాగా జరుగుతుంది" ఏడుస్తూ ఒప్పుకుంది సునీత తల్లి. హమ్మయ్య అనుకుంది సునీత.

ఈ వార్త లక్ష్మికి చెప్పింది సునీత. చకచకా ఏర్పాట్లు జరిగిపోయాయి. ఒక మంచిరోజున సంతానలక్ష్మి సాఫల్య కేంద్రంలో జాయినయింది సునీత. డాక్టర్లు చెయ్యాల్సింది చేశారు. తన గర్భం అద్దెకు ఇచ్చింది సునీత. కేంద్రానికి వచ్చిపోతూ తొమ్మిది నెలలు గడిపింది. ఒకరోజు సునీతకు ప్రసవం అయ్యింది. చక్కటి మగబిడ్డకు జన్మని చ్చింది. ఆ బిడ్డను సునీత కళ్ళ తెరవకముందే చేతులు మార్చేశారు. బిడ్డ ముఖం చూడలేదు. సునీత ఒప్పందం ప్రకారం ఒంటరిగా మిగిలి పోయింది. అద్దెకాలం అయిపోయింది. కళ్లల్లో నీళ్ళు తిరిగి కన్నీరు కార్చింది సునీత. అడ్వాన్సు ఏభైవేలు పోగా మిగతా రెండున్నర లక్షల కోసం ఎదురు చూస్తోంది.... ఎప్పుడు ఇస్తారో?

లక్ష్మికోసం చాలాసార్లు ఫోన్లు చేసింది. లక్ష్మి అందుబాటులో లేదు. షాపులో దొరకలేదు. సునీత ఉద్యోగం తీసేశారు. ప్రతిరోజు రావాల్సిన డబ్బు కోసం సునీత సాఫల్య కేంద్రం చుట్టూ తిరుగు తోంది. అప్పుడు మాట్లాడిన వ్యక్తులు, డాక్టర్లు... ఇప్పుడు కనిపించడం లేదు. ఏం చెయ్యాలి? ఈ అన్యాయం ఎవరికి చెప్పుకోవాలి?

తనకి ప్రసవం చేసిన డాక్టరుని గట్టిగా నిల దీసి అడిగితే "నువ్వు ఎవరితో మాట్లాడుకున్నావో వాళ్ల ద్వారానే నీకు డబ్బు వస్తుంది. వెళ్ళు" అని కసిరి పంపించింది ఆమె. సునీతకు గుండె బద్ద లయ్యింది.

"లక్ష్మి ఉద్యోగం మానేసిందండి. కనిపించడం లేదు. అనుకున్న డబ్బు ఇప్పించండి. మా అమ్మకు ఆపరేషను చేయించాలి" అని రెండు చేతులు జోడించి వేడుకుంది.

"మాకు తెలియదు. లక్ష్మి ద్వారానే నువ్వు వచ్చావు. లక్ష్మినే అడుగు" అని చివరికి మరో ఏభై వేలు చేతిలో పెట్టి "ఇక ముందు ఇటువైపు రాకు. వచ్చావంటే నీ సంగతి తేలుస్తాను" అని డాక్టరు వార్నింగ్ ఇచ్చి పంపేసింది. తనకి అన్యాయం జరిగింది. మోసం చేశారు.

సునీత లక్ష్మి కోసం తిరిగి తిరిగి అలసి పోయింది. సంతానలక్ష్మి సాఫల్య కేంద్రంలో డెలి వరీలు అవుతూనే ఉన్నాయి. కాలం గడిచిపోయింది. గడువు దాటిపోయింది. సునీత తల్లికి జబ్బు ముదిరిపోయి చనిపోయింది. భోరున ఏడ్చింది సునీత. తల కొట్టుకుంది. తల్లడిల్లి సొమ్మసిల్లి పోయింది. ఎవరో ఆసుపత్రిలో చేర్పిస్తే బ్రతికింది.

ఆలోచనలతో బీచ్‌రోడ్డులో గట్టు మీద కూర్చుంది సునీత. సుధీర్‌కి ఫోన్‌చేసి జరిగిందంతా చెప్పింది. సుధీర్ అంతా విన్నాడు. ఏం మాట్లాడలేదు.

"మళ్ళీ నీకు నేను ఫోను చేస్తాను" అన్నాడు. ఫోన్ చెయ్యలేదు. సునీత ఫోన్ చేస్తుంటే మోగింది కానీ అతడు ఎత్తలేదు. ఆ తరువాత సునీతకు సుధీర్ నెంబరు దొరకలేదు. ఎదురు చూసింది. ఆరోజు... ఆ తరువాత రోజు... అలా కొన్ని రోజులు.. నెలలు... సముద్రపు ఒడ్డున కూర్చొని నిరీక్షిస్తూనే ఉంది. మరో హుద్‌హుద్ తుపానుకి సిద్ధమవుతున్నట్లుగా విశాఖపట్నంలో ఆకాశం మబ్బులతో నిండిపోయింది.

సునీత కెరటాలతో ఎగసిపడుతున్న సముద్రం వైపు వడివడిగా అడుగులు వేస్తోంది.

సెల్:93964 30043

నవ్యవీక్లి-నాటా సంయుక్త నిర్వహణలో బహుమతి పొందిన కవిత

ఆనవాలు

జీవితం, సుదూర తీరాలకు విసిరికొట్టాక
యిన్నేళ్ళకు మళ్ళీ వచ్చేను
పురాతన దేవాలయం లాంటి పాత ఇంటికి!
నా బాల్య జ్ఞాపకాలను పదిలంగా దాచుకున్న
పుట్టినింటికి పాత చుట్టంలా...!
పెంకులూడిపోయి గోడలు కూలిపోయి
దుమ్మూధూళి పట్టి
పిచ్చిపట్టిన ఒంటరి బిచ్చగత్తెలాగుంది... పాత ఇల్లు!

ఎప్పుడో కాలం చేసిన అమ్మ,
అలుకుపాతలా ఇల్లు అలుకుతూ యింకా
యిక్కడ కన్పిస్తున్నట్టే ఉంది!
నిలేసిన నాగేటికర్రలా నాయన
యింకా ఆ మూల నిలబడ్డట్టే ఉన్నాడు!
అదిగో... ఆ వరండాలో...
పసిపాదాల గజ్జెల సవ్వడి వినబడుతున్నట్టే ఉంది!
ఇదిగో... యీ మండువాలో..
తులసికోట దీపం వెలుగుతున్నట్టే ఉంది!
దొడ్లో పందిరి మీద బీరపువ్వు నవ్వుతున్నట్టే ఉంది!
కష్టాలూ కన్నీళ్ళూ సరదాలూ సందళ్ళూ నవ్వుల
జలపాతాలూ
ఎన్నెన్నో తీయని జ్ఞాపకాల దొంతరలు!

కథలూ, కార్యాలూ, పెళ్ళిళ్ళు పేరంటాళ్ళు, పండ
గలూ పబ్బాలూ
ఎన్నెన్ని సందళ్ళ సమాహారాలు!
ప్రతి గదీ చేరబిలిచి ఆత్మీయంగా ఆలింగనం
చేసుకున్నట్టే ఉంది!
పల్లె ఒడిని వీడలేని ముసలి పక్షుల్లా...
యింట్లోని ప్రతి వస్తువూ ప్రేమతో
పలకరిస్తున్నట్టే ఉంది!

కనుచూపుమేరా ఒక విధ్వంసం పరుచుకున్నాక
జీవితం భళ్ళున పగిలి శకలాలుగా చెదిరిపోయాక
అభివృద్ధి పాదాల కింద
నా పల్లెతో పాటు పాత ఇల్లూ శిథిల జ్ఞాపకమై
పోయింది!

కానీ... మునివాకిట పూలచెట్టు మాత్రం యింకా
పూస్తూనే ఉంది,
ఒకనాటి మా జీవితాలకు ఆనవాలుగా....!!

-సిరికి స్వామినాయుడు

సెల్:94940 10330

గే.మ్.ఆ.ఫ్.లై.ఫ్

-కంఠంనేని రాధాకృష్ణమూర్తి 2

మనం ఎవరికీ తీసిపోం

లోకంలో చాలామందికి తమ మీద తమకు అంతగా నమ్మకం ఉండదు. తను మిగతా వాళ్ళ కంటే తక్కువ అనో మిగతావాళ్ళు తనకంటే ఎక్కువ అనో అంతర్లీనంగా ఒక భావం, ఒక నమ్మకం ఉంటుంది. ముఖ్యంగా ఎదుగుతున్న దశలో ఉన్న కుర్రవాళ్ళకు, నిరుద్యోగంలో నలుగుతున్న వాళ్ళకు, మాటిమాటికీ అపజయం చవిచూస్తున్న వాళ్ళకు తమ మీద తమకు నమ్మకం తక్కువగా ఉంటుంది. ఆత్మన్యూనతాభావం అంటారు దీనినే. అలాంటివాళ్ళకు కావాల్సింది ఏమిటంటే, ఎవరన్నా వెన్నుతట్టి ప్రోత్సహించటం, నువ్వు ఎవరికంటే తక్కువ కాదు అనే నమ్మకాన్ని కలగచేయటం, జీవితంలో ఎలా పోరాటం చేయాలో, గెలుపు ఓటములను ఎలా స్వీకరించాలో వివరంగా తెలియజేయటమే.

ఇలాంటివాళ్ళు తెలుసుకోవాల్సింది ఏమిటంటే,

ఈ లోకంలో ప్రతి మనిషీ విలువైన వాడే. ప్రత్యేకమైన వ్యక్తే. మీరు కూడా అంతే. ఎవరి కంటేనూ మీరు తక్కువ కాదు. ఎవరికీ మీరు తీసిపోరు. కావాలంటే ఎలక్షన్ కమీషనర్‌ను అడగండి.

ఓటు వేయటానికి వెళ్ళినప్పుడు మీరు ఎన్ని ఓట్లు వేయవచ్చునో, వేయగలరో అడగండి- 'ఒక్కటి' అంటారు. ఒక సినిమా హీరో లేక ఒక ఐపీఎస్ ఆఫీసరు లేక ఐఏఎస్ ఆఫీసరు లేక ఒక చీఫ్‌మినిస్టరు ఎన్ని ఓట్లు వేస్తారో, వేయవచ్చునో అడగండి- 'ఒకొక్కటి' అంటారు.

అంతేతప్ప ప్రధానమంత్రి కాబట్టి నరేంద్ర మోదీ 150 ఓట్లు, అత్యంత కోటీశ్వరుడు కాబట్టి ముఖేష్ అంబానీ 70 ఓట్లు, సూపర్‌స్టార్ కాబట్టి మహేష్‌బాబు 40 ఓట్లు వేయలేరు.

మీరూ, వాళ్ళూ ఒకటే విలువ కలిగి ఉంటారు. మీరు వాళ్ళ కంటే ఏ మాత్రం తక్కువ కాదు. చట్టం దృష్టిలో సమాజపరంగా వాళ్ళు మీకంటే ఏ మాత్రం తక్కువకాదు.

మరో వేపు నుంచి ప్రకృతిపరంగా చూసినప్పుడు,

ప్రకృతి కూడా మీకేమీ తక్కువచేయలేదు. వాళ్ళకిచ్చిన వనరులనన్నిటినీ మీకూ ఇచ్చింది. తల, మెదడు, కాళ్ళు, చేతులు, మిగతా శరీరం, ఇవన్నీ వాళ్ళకెట్లా ఇచ్చిందో మీకూ అదే సంఖ్యలో, అదే రీతిలో ఇచ్చింది.

పుట్టినప్పుడు వాళ్ళూ మీరూ ఒకే విధంగా ఒక శరీరం, లోపల ఒక మెదడుతోనే ఉంటారు. తేడా ఎక్కడంటే కాలక్రమాన వాళ్ళు వాటిని అభివృద్ధి పరచుకున్న తీరు, ఉపయోగించిన తీరు ఫలితంగా వాళ్ళ జీవితాలకూ, మీ జీవితానికీ మధ్య తేడా వచ్చింది.

ఆ తేడా సరిచేసుకోవాలంటే మీ మెదడును, మీ శరీరాన్ని మీకున్న అవసరాన్నిబట్టి, మీకున్న అవకాశాల ఆధారంగా అభివృద్ధి పరచుకోవటానికి ప్రయత్నించాలి. సరి చేసుకోవటానికి ప్రయత్నించాలి. అందుకు మొదట మీరొక విషయం గుర్తించాలి.

మీరొక ప్రత్యేకమైన వ్యక్తి

జీవితాన్ని ఆస్వాదించటం కోసం ప్రకృతి మీకొక శరీరం ఇచ్చింది. మీకు నచ్చినా నచ్చక పోయినా జీవితాంతమూ ఆ శరీరాన్ని అంటిపెట్టుకుని ఉండాల్సిందే. మీ ఆశలు, ఆశయాలు, ఆలోచనలు, కలలు, నమ్మకాలు ఎక్స్‌పెక్టేషన్స్, అవన్నీ మీ శరీరంలోనే ఒదిగి ఉంటాయి. మీలోని 'నేను' కు సాకారాన్ని ఇస్తూ ఉంటాయి.

జీవితం అనే గేమ్‌లో ముందుకు సాగటానికి వీలుగానూ మనకు, మనచుట్టూ ఉండే ప్రపంచానికి మధ్య బఫర్‌గా - కుషన్‌లా - అనుసంధానంగా ఉండటానికి ఈ శరీరం ఉపయోగపడుతుంది.

మనకంటూ, మనదంటూ ఉన్న ఈ శరీరం జీవితాంతమూ మనతోనే ఉంటుంది. మనం దానిని ప్రేమించినా, ద్వేషించినా, అంగీకరించినా, తిరస్కరించినా జీవితకాలం మొత్తానికి లభించిన శరీరం ఇదొక్కటే.

ఈ భూమి మీద పడ్డ తొలిక్షణంలో తొలిశ్వాస నుంచీ గుండె కొట్టుకోవడం ఆగిపోయే తుది క్షణపు తుది శ్వాసదాకా మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా ఈ శరీరం మనతోటే ఉంటుంది.

శరీరం పట్ల మనకేమన్నా అసంతృప్తులుంటే ఉండవచ్చు. అది ఇంకాస్త బలంగా ఉండాలనో, ఇంకాస్త సన్నగా ఉండాలనో, ఆరోగ్యంగా ఉండాలనో మనకేమన్నా అసంతృప్తులు, కోర్కెలు ఉంటే ఉండవచ్చుగాక, అయినా తప్పదు. జీవిత పర్యంతమూ మనం దీనితో సహవాసం కొనసాగించక తప్పదు.

మిమ్మల్ని, మీ శరీరాన్ని మీరు ప్రేమించే విధానాన్ని బట్టి, మీ మనస్సుకు శరీరానికీ మధ్య

ఉండే సంబంధాన్ని బట్టి మీ జీవితానుభవాలు క్వాలిటీ ఆధారపడి ఉంటుంది.

మీ మనస్సు, శరీరం ఇప్పుడు ఇక్కడ ఈ క్షణాన మీరు జీవించటం కోసం సిద్ధంగా ఉన్నాయి. సద్వినియోగం చేసుకోండి.

జీవితాన్ని మీరు ఎంత సక్సెస్‌ఫుల్‌గా గడుపుతారు, ఈ లైఫ్ గేమ్‌లో మీరు ఎన్ని విజయాలు సాధిస్తారు అనేవన్నీ మీ చేతిలో పని. మీ ప్రయత్నాల మీద ఆధారపడి ఉంటుంది.

సంకల్పంతోనే సక్సెస్

మీ కోసం మరెవరో వచ్చి మీరు కోరుకునే సక్సెస్‌ని గాని, మీరు కోరుకునే విజయాల్నిగాని సమకూర్చుతారనుకోవటం భ్రమ. ఆ పని మీరే చూసుకోవాలి. ఆ బాధ్యత మీదే!!

మీ కోసం మరెవరో వచ్చి పుషప్‌లు, ఎక్సర్‌సైజులు చేస్తే మీకు ఎలాంటి ఉపయోగం ఉండదు కదా! జీవితం కూడా అంతే. మీ పోరాటం మీరే చేయాలి. మీ జీవితాన్ని మీరే సరిచేసుకోవాలి. మీ జీవితాన్ని మీరే సరిదిద్దుకోవాలి.

ఒక మంచి విషయం ఏమిటంటే సంకల్పం! సంకల్పించుకోవాలేగాని కావాల్సిన విజయం, కోరుకున్న సక్సెస్ ఎవరైనా సాధించగలరు. ఆ సామర్థ్యం స్వతహా ప్రతివారిలోనూ ఉంటుంది.

మీరు చేయాల్సిందల్లా ఆ సామర్థ్యాన్ని వెలికి తీయటం. ఆ సామర్థ్యం సక్రమంగా వినియోగించుకోవటం.

ఆలోచనల కర్మాగారం

జీవితాన్ని నడిపేది మనలోని కోర్కెలు, ఆలోచనలు. జీవిత పోరాటానికి మనల్ని సిద్ధం చేసేవి, కదనరంగంలో అడుగడుగునా నిర్ణయాల్ని తీసుకునేవి ఆలోచనలు.

ఆలోచనలు మన మెదడులోంచి వస్తాయి. మరోమాట చెప్పాలంటే మన జీవితాన్ని నడిపేది మన మెదడు. అది ఒక ఆలోచనల కర్మాగారం.

చాలామందిలో ఒక అపోహ ఉంటుంది. "నాకంత మెదడు లేదు. వాళ్ళకున్నన్ని తెలివితేటలు నాకు లేవు" అనుకుంటారు.

కాని అది తప్పు. అది సరికాదు.

ప్రకృతి అందరికీ ఒకేవిధమైన మెదడు ప్రసాదించింది. పుట్టినప్పుడు అందరి మెదళ్ళూ ఒకే విధంగా ఉంటాయి. పుట్టినప్పుడు ఏ ఆలోచనలు, ఏ జ్ఞానం, ఏ జ్ఞాపకాలు లేకుండా అందరికీ మెదడు స్వచ్ఛంగా తెల్లకాగితంలా ఉంటుంది.

అబ్దుల్ కలాం, రామ్‌గోపాల్‌వర్మ, బిల్‌గేట్స్, అమర్త్యసేన్ లేదా మీరు... అందరికీ మెదడు పుట్టుకతో స్క్రిప్టులేని కోరా కాగజ్ తెల్లకాగితంలా ఉంటుంది.

తర్వాత తర్వాత ఎవరికివాళ్ళు సముపార్జించుకున్న జ్ఞానం, వాళ్ళకు ఎదురైన అనుభవాలు, చేసిన కృషి కొనసాగించిన అన్వేషణలాంటి అనేకానేక కారణాలవల్ల ఆయా స్థానాలలోకి చేరుకున్నారు.

ఒకవేళ ఇవాళ్టికి ఇవాళ మీరు చాలా సాధారణ స్థితిలో కనిష్ట స్థాయిలో మిగిలిపోయి ఉంటే, మీరు వాళ్ళలా తగు ప్రయత్నాలు, నిరంతర సాధన, శోధన లాంటివేమీ చేయకపోయి ఉండవచ్చు. అందుకు మీరు ఇప్పటినుంచీ ప్రయత్నాలు ప్రారంభించవచ్చు.

శరీరం ఆలయం - మెదడు గర్భగుడి

మీరు ఏ వయస్సు వారైనా సరే.

"ఈ రోజు నా మిగతా జీవితానికి ప్రారంభ దినం!" అనుకుంటూ ఆ దృక్పథంతో అడుగు ముందుకు వేయవచ్చు. కదన రంగంలోకి అడుగిడవచ్చు.

మన మెదడు కంప్యూటర్‌కంటే శక్తిమంతమైనది. విభిన్నమైనది. జ్ఞానేంద్రియాల సహకారంతో అది ఎన్ని రకాల కలాపాలు నిర్వహిస్తుందో చూడండి.

ఫోటో కాపియర్‌గా, కెమెరాలా, వీడియో టేప్ రికార్డర్‌లా, వైడ్‌స్క్రీన్ ప్రొజెక్టర్‌లా పని చేస్తూ వెయ్యి కంప్యూటర్‌లు, పది మిలియన్ల బుల్లిబుల్లి మైక్రోఫిల్మ్ కాట్రిడ్జ్‌ల కలయికలతో కూడుకుని ఉండే ఎలక్ట్రో కెమికల్ ద్రావణంలో తేలియాడుతున్న స్టోరేజీ బ్యాటరీలాంటిది మెదడు.

శరీరం దేవాలయమైతే అందులో మెదడు గర్భగుడి!

ప్రతి మనిషి తలకాయలో ఉండే మెదడు కూడా పైన చెప్పినన్ని పనుల్ని, పైన చెప్పినంత శక్తిమంతంగా చేసుకుంటుంది.

ఇంతటి శక్తిమంతమైన మెదడును కలిగి ఉండి కూడా మనలో చాలామంది డల్‌గా, ఏ సృజనాత్మకత లేకుండా, ఏ సక్సెస్‌నీ సాధించకుండా ఎందుకు నిర్వీర్యంగా ఉండిపోతున్నారు?

మన మెదడు కంప్యూటర్ కంటే శక్తిమంతమైనది. కానీ ఆ సామర్థ్యాన్ని పూర్తిగా మనం వినియోగించుకోవట్లేదు. దీనికి రెండు కారణాలు. ఒకటి బద్ధకం, రెండు భయం. ఈ రెంటినీ అధిగమించి సంకల్పం చేసుకుంటే సక్సెస్ సాధించగలుగుతాం. కానీ దీనికంటే ముందు మనలో అంతర్లీనంగా ఉండే ఒక భావనను తొలగించుకోవాలి. దాన్ని తొలగించుకుంటే ఇక మనకు అన్నీ తిరుగులేని విజయాలే లభిస్తాయి!

ఒకటి బద్ధకం! ఏదో ఒక ఉద్యోగం చేసుకుంటూ హాయిగా తింటున్నాం. టీవీ, సినిమాలు చూసుకుంటూ ఎంజాయ్ చేస్తూ బతుకుతున్నాం. ఇంకా సాధించేదేమిటి, శ్రమించటం ఎందుకు? అనే అలసత్వ భావం.

రెండోది భయం. రిస్కు తీసుకోవడం ఎందుకు? కడుపులో చల్ల కదలకుండా బతికితే చాలదా? అనే పిరికి మనస్తత్వం.

గాలివాటంగా బతికేయటమేనా?

జీవితం అంటే ఇదేనా? జీవితంలో ఇంక సాధించాల్సినవి ఏమీలేవా? మిమ్మల్ని మీరు రుజువు చేసుకోవాల్సిన అవసరం లేదా? చాలామందికి అంతదూరం ఆలోచించాలనిపించదు. జీవితాన్ని సాఫీగా గడిపేస్తే చాలదా అనిపిస్తుంది.

కాని జీవితం అంటే అంతేనా? ఏదోలా, ఎలాగో ఒకలా గాలివాటంగా బతికేయటమేనా జీవితం? అలా అయితే సృష్టిలోని మిగతా జీవులకీ మనకూ తేడా ఉండదు. కుక్కలు, నక్కలు, పశువులు, పక్షులు, చెట్లకూ, మనకీ తేడా ఉండదు.

ఒక 'మనిషి'లా బ్రతకాలంటే మీరేమిటో, మీరెంత ప్రత్యేకమైన వ్యక్తో రుజువు పరచుకోవాలి. మీకున్న వనరుల్ని ముఖ్యంగా ప్రకృతి ప్రసాదించిన, పరిణామక్రమంలో మనకు మనం అభివృద్ధి చెందించుకున్న మెదడును, దాని పూర్తి సామర్థ్యం మేరా ఉపయోగించటం నేర్చుకోవాలి. అప్పుడు లైఫ్ గేమ్‌లో గెలవగలుగుతాం. సక్సెస్ సాధించగలుగుతాం.

పిసినారితనం పాటించాలి!

ఈ లోకంలో ఎవరి జీవితమైనా ఫలానా విధంగా ఉంటుంది, ఫలానా విధంగా ఉండాలి అని ముందుగానే నిర్ణయించబడి ఉండదు. మీరు చేసే ఆలోచనలను బట్టి, మీరు ఆచరించే చేతలను బట్టే మీకు లభించే జీవితం ఉంటుంది.

పుట్టిననాటినుంచి చనిపోయే దాకా ఈ మధ్యలో ఉండే జీవితం ఒక యాత్ర. తల్లి గర్భం నుంచి బయటపడ్డప్పుడు తొలిశ్వాసతో ప్రారంభమై తుదిశ్వాస వదిలేదాకా కొనసాగే ఈ జీవితం ఒక్కసారి మాత్రమే లభించే వరం!

గుర్తుంచుకోండి - 'ఒక్కసారి' మాత్రమే!!

అలాంటి ఒక్కసారి మాత్రమే లభించే జీవితాన్ని మీరు ఎంత అపురూపంగా చూసుకుంటారనేది మీ ఇష్టం!

ఒకరోజు గడిచిన కొద్దీ జీవితపు నిడివి తగ్గిపోతూ ఉంటుంది. అందుకని జీవితంలోని ప్రతి రోజూ విలువైనదిగా భావించాలి. జీవితంలోని ప్రతిరోజునూ ఎంతో పొదుపుగా, పిసినారి తనంతో వాడుకుంటూ దానికి ఒక 'విలువ' ఆపాదించుకోవటం ప్రతి మనిషికీ విద్యుక్తధర్మం!!



నిగమ సోఫాలో కూర్చుని వార్తలు చూస్తోంది. ఇంటిముందు కారు ఆగిన శబ్దం. సడన్ బ్రేకుతో ఆపినట్టున్నారెవరో..... తలుపుతట్టిన చప్పుడు. బెల్ నొక్కకుండా తలుపు చప్పుడు చేస్తున్నది ఎవరు? నిగమ లేచి వెళ్ళి తలుపు తెరిచింది. ఎదురుగా ఏకాంత్. కొడుకుని చూడగానే అసంకల్పితంగా చిరునవ్వు నవ్వింది నిగమ.

"ఆఫీసు నుంచి వచ్చావా? రంజన రాలేదేం?" నిగమ అడిగింది.

ఏకాంత్ మాట్లాడకుండా హాలు మధ్యకు నడిచి ఆగి అమ్మవైపు సీరియస్‌గా చూశాడు. చేతిలో ఉన్న కవర్ టీపాయ్ మీద పడేశాడు.

"ఏమిటమ్మా ఇది?"

"ఏమిటి?"

"ఆ కవర్ నువ్వే పంపించావు. చెల్లాయి ఆఫీసులో గుమస్తాకి ఇచ్చి వెళ్ళిపోయింది. అందులో ఏముందో పంపించిన నీకే తెలీదా?"

"నువ్వు నిశితకు ఇచ్చివెళ్ళిన డబ్బు".

"ఎందుకు తిప్పి పంపించావ్? ప్రతీనెలా ఇస్తున్నట్టే ఇప్పుడూ ఇచ్చాను" ఏకాంత్ కోపంగా అన్నాడు.

"నువ్విప్పుడు గోపాలం దంపతుల కొడుకువి. నీ సంపాదన నువ్వు నీ భార్యకివ్వాలి. తల్లికి ఇవ్వాలనిపిస్తే గోపాలంగారి భార్యకివ్వాలి. నాక్కాదు!"

"అమ్మా!" ఏకాంత్ అరిచాడు. "దిసీజ్ టూ మచ్! పిచ్చి పట్టిందా? నేను నీ కొడుకుని. ఆ బంధాన్ని ఎవరూ తెంచలేరు!"

"దత్తత వెళ్ళి నువ్వే తెంచేశావు. నువ్వు ఇప్పుడు నిగమా సుగుణాకర్ దంపతుల కొడుకువి కావు. గోపాలం దంపతుల కొడుకువి. నాకు సంబంధించినంతవరకూ నువ్వు నా మాజీ కొడుకువి. నన్ను పోషించాల్సిన బాధ్యత, పోషించే అధికారం నీకు లేవు!" నిగమ నిష్కర్షగా అంది. "నీ సంపాదన నువ్వు పోషించేవాళ్ళకో, నిన్ను పోషించేవాళ్ళకో, సర్వాన్నీ నీకు ధారాదత్తం చేసినవాళ్ళకో ఉపయోగపడాలి. నాకు కాదు; నిశితకు కాదు. నీ భార్యను చూసుకో. నిన్ను నమ్మిన గోపాలం దంపతులను చూసుకో. నీ సంపాదన వాళ్ళ అవసరాలకు ఉపయోగించు. అదే ధర్మం. అదే న్యాయం..."

"అమ్మా... నీ ప్రవర్తన నన్ను దోషిగా నిలబెడుతోంది, తెలుసా?"

"అది నీ భ్రమ! దత్తపుత్రుడు జన్మనిచ్చిన తల్లిదండ్రులను పోషించలేదని లోకం అనదు!"

"హూం.... నీ ప్రేమకు నేను నోచుకోలేదని అర్థమవుతోంది!" ఏకాంత్ నిస్పృహగా అన్నాడు.

"చిన్నప్పట్నుంచీ మీకు నేను చాలాసార్లు చెప్పాను. ప్రేమను డబ్బుతో కొలవవద్దు అని! అది గుర్తుంచుకో. నెలనెలా నాకు డబ్బు పంపిస్తూ - ఇలా మనస్తాపం తెచ్చుకోకు!

"ఓకే అమ్మా! నీ ఇష్టానికి వ్యతిరేకంగా కొన్ని పనులు చేశాను. అవన్నీ నా వశంలో లేని పనులు. ఇప్పుడు నీ ఇష్టానికి వ్యతిరేకంగా డబ్బు పంపలేను. పంపితే అది తిరిగి వచ్చేస్తుంది!" ఏకాంత్ బరువుగా అన్నాడు. కిందికి వంగి, కవర్ తీసుకుంటూ.

ఏకాంత్ బరువుగా నిట్టూర్చి, అసహనాన్ని అదుపులో పెట్టుకుని, అమ్మవైపు చూశాడు. "అమ్మా... నన్ను రంగారెడ్డి జిల్లా కలెక్టరుగా వేశారు. ప్రమోషన్..."

"అలాగా! చాలా సంతోషం నాయనా! ఉద్యోగంలో నేను ఆశించిన స్థాయిని అందుకున్నావు. నిన్ను కలెక్టరుగా చూడాలని మీ నాన్న కలలు కన్నారు. ఆయన ఆత్మ ఎంతో ఆనందిస్తుంది!" నిగమ ప్రసన్నంగా అంది.

ఆమె కళ్ళల్లో మెరుపుని ఏకాంత్ స్పష్టంగా చూడగలుగుతున్నాడు. కన్నతల్లిని తాను అంచనా వేయలేడు. ఉద్యోగంలో తన అభివృద్ధిని చూసి ఆనందిస్తోంది. తన సంపాదన ముట్టుకోనంటోంది. అవును! అమ్మను తను అంచనా వేయలేడు. ఏకాంత్ గుమ్మం వైపు కదిలాడు.

తనది బ్యూరోక్రాట్ బతుకు. పాలకులు చెప్పింది చేయాలి. చేసింది చెప్పకూడదు. ఆదాయానికి ఆనకట్ట వేయకూడదు. జేబులు నిండాలి, చేతులు కదలకూడదు. ఇచ్చిపుచ్చుకోవడాలు ఆదర్శాలయిపోయాయి. ఆ ఆదర్శ ప్రవాహానికి ఎదురీదడం ప్రమాదకరం. సర్దుకుపోక తప్పదు. ఇచ్చి పుచ్చుకునే ఆదర్శానికి ఎదురీదితే ఏం జరుగుతుందో తనకి తెలుసు. ఏం జరుగుతుందో నాన్న ఉదంతమే చెప్పింది!

ఈ విషయాలన్నీ కన్నతల్లికీ, కట్టుకున్న ఇల్లాలికీ, కన్న బిడ్డలకీ తెలియకూడదు. కంబళిలో వడ్డించుకుని వెంట్రుకలు ఏరడం అవివేకం! ఒకవిధంగా తాను అదృష్టవంతుడు. అదృష్టం తనకు రంజనను అర్థాంగిగా ఇచ్చింది. అదృష్టం తనకు రంజని తండ్రిని కవచంగా ఇచ్చింది! నవ్వుకుంటూ ఏకాంత్ కారు స్టార్ట్ చేశాడు.

"అయ్యా, అయ్యగారు తమర్ని ఒకసారి గార్డెన్ హౌస్‌లోకి రమ్మంటున్నారు", పోర్టికోలో కారు దిగిన ఏకాంత్ దగ్గరగా వస్తూ వినయంగా అన్నాడు నౌకరు.

ఏకాంత్ బంగళా పక్కనున్న గార్డెన్‌వైపు అడుగులు వేశాడు. గార్డెన్‌హౌస్ తన మామగారి ఏకాంత స్థావరం. ముఖ్యమైన వ్యవహారాలన్నీ అక్కణ్ణుంచే చక్కబెడతాడాయన. తలుపు తోసుకుని ఎ.సి. హాల్లోకి ప్రవేశించాడు ఏకాంత్. హాలుమధ్య ఉన్న సోఫాల్లో రాజవర్మా, ఎదురుగా మరొక పెద్దమనిషీ కూచున్నారు.

"రా, ఏకాంత్...." అల్లుడిని చూడగానే అన్నారు రాజవర్మ. ఇద్దరిముందు ఉన్న టీపాయ్‌మీద ట్రేలో విస్కీ బాటిలూ, గ్లాసులూ వగైరా సరంజామా ఉంది.

"ఈయన మన ప్రాణమిత్రుడు. కోటిలింగంగారు. డెవలపర్ అండ్ కన్‌స్ట్రక్టర్. సిటీలో నిర్మాణంలో ఉన్న హైరైజ్ బిల్డింగులన్నీ లింగం గారివే!" రాజవర్మ పరిచయం చేశాడు.

కోటిలింగం లేచి, ఏకాంత్‌తో కరచాలనం చేశాడు. ఇద్దరూ కూచున్నారు.

"రూలింగ్ పార్టీకి ఏడాదికి ఒకసారి - పార్టీ ఫండ్ కింద



మదరిండియా 4

-వక్కంతం సూర్యనారాయణరావ్, సెల్:98662 67287



బ్లాంక్ చెక్ ఇచ్చే ఏకైకవ్యక్తి మన కోటిలింగంగారు. అపాయింట్‌మెంట్ లేకుండా అత్తారింటికెళ్ళినట్టు ముఖ్యమంత్రి ఆఫీసుకు సరాసరి వెళ్ళే ఏకైక వ్యక్తి!

"ఐ సీ...." ఏకాంత్ పొడిగా అన్నాడు.

"లింగంగారికి మనతో చిన్నపని తగిలింది...." రాజవర్మ గ్లాసులోకి విస్కీపోస్తూ అన్నాడు. "మూసీ ప్రాపర్టీస్" కోసం భూసేకరణ గురించి నీకు తెలుసు..."

"తెలుసు. అది నా జిల్లా పరిధిలోదేగా!" ఏకాంత్ అన్నాడు.

"అందులో పదెకరాలు మన కోటిలింగంగారికి కావాలి..."

"అదెలా కుదురుతుంది మామగారూ?"

రాజవర్మ చిన్నగా నవ్వాడు. అల్లుడి నుంచీ ఇప్పుడు కావాల్సింది అలాంటి నెగెటివ్ రియాక్షన్. చేసేముందు కష్టమైన పని అని ఎదుటివ్యక్తి అనుకోవాలి!

"ఒక విషయం చెప్పడం మరిచిపోయాను. నీకు ఈ జిల్లాకి పోస్టింగ్ వచ్చేలా చక్రం తిప్పింది కోటి లింగంగారే. ముందుచూపుతో చేశారనుకో. ఇందులో మనం స్వయంగా తీసుకోవాల్సిన రిస్కంటూ ఏమీ ఉండదు. కోటిలింగంగారూ, మీరు ఎక్స్‌ప్లెయిన్ చేయండి!"

కోటిలింగం చిన్నగా దగ్గి గొంతు సవరించుకున్నాడు. "కలెక్టరుగా మీకన్నీ తెలుసు. ప్రొసీజర్ తహసీల్దారు లెవెల్లో ప్రారంభమవుతుంది. మ్యుటేషన్ అన్నమాట. తహసీల్దారు మనవాడే. ఫైల్ తయారుచేసి పంపిస్తాడు. దాటాల్సిన టేబుల్స్

జరిగిన కథ

భర్త మరణించినప్పటికీ అతడి స్ఫూర్తితో ముగ్గురు కొడుకుల్నీ, కూతుర్నీ నీతీ నిజాయితీలు రంగరించి పెంచి పెద్ద చేస్తుంది నిగమ. కానీ అత్యున్నత స్థానాలకు ఎదిగిన తర్వాత ఆ కొడుకులు తండ్రి స్ఫూర్తికి భిన్నంగా అక్రమార్కులుగా మారిపోతారు. దాంతో కన్న కొడుకులకు వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తుందా కన్నతల్లి. ఫ్లాష్‌బ్యాక్‌లో కెళితే, తన తండ్రిని చంపిన రాజవర్మ కూతురు రంజనను ప్రేమిస్తాడు నిగమ పెద్ద కొడుకు ఏకాంత్. తండ్రి చేసిన తప్పుకి కూతుర్ని శిక్షించడం సరికాదని తల్లిని ఒప్పించి రంజనను పెళ్ళి చేసుకుని ఇల్లరికం వెళ్ళడమే కాకుండా, ఓ డబ్బున్న మారాజుకు దత్తపుత్రుడైపోతాడు.

ఆ తర్వాత......

అన్నీ దాటి ఫైనల్‌గా మీ సంతకానికి వస్తుంది. కలెక్టరుగారి టేబుల్ మీదకి వచ్చేసరికే ప్రపోజల్ మీద రకరకాల అనుమానాలు రేకెత్తించాలనీ, నివృత్తి చేయాలనీ చెప్పేశాను. ముందుముందు ఎవ్వరికీ ఎవ్వరిమీదా అనుమానం రాకూడదు కదా! జాగ్రత్తలన్నీ తీసుకుంటున్నాన్లెండి. మీ కింది లెవెల్ దాకా అందరూ ఆ ప్రశ్న, ఈ ప్రశ్న వేసి, సమాధానాలు రికార్డు చేయించి, పర్‌ఫెక్ట్‌గా మీ సంతకానికి సబ్‌మిట్ చేస్తారు..."

"ఫైనల్‌గా ఫైలు మీద నువ్వు కళ్ళుమూసుకుని సంతకం గీకేయొచ్చు ఏకాంత్! సింపుల్. కోటిలింగంగారు ఆ పదెకరాలనీ డెవలప్ చేసి, విల్లాలు కట్టిస్తారు. లగ్జరీ విల్లాలు...." రాజవర్మ అందుకుని అన్నాడు.

"ఇప్పటిదాకా మన ట్విన్‌సిటీస్‌లో ఆ క్వాలిటీ విల్లాలు లేవు! ఒక్కో విల్లా ఒక్కో స్వర్గంలా ఉంటుంది!" కోటిలింగం అన్నారు.

"కోటిలింగంగారూ ఏదో పర్సంటేజ్ అంటున్నారు..."

"అదికాదు మామగారూ...పైవాళ్ళు......" ఏకాంత్ ఏదో చెప్పబోయాడు.

"అర్థమైంది. ముఖ్యమంత్రి ముందుగానే నోటితో అప్రూవ్ చేసేశారు!" రాజవర్మ నవ్వుతూ అన్నాడు; పైకి లేస్తూ.

"నా కోసం ఇంటికెవరో వస్తున్నారు... కోటిలింగం గారూ, ఆ పర్సంటేజ్ గురించి మీరూ, అల్లుడు గారూ మాట్లాడుకోండి!" అంటూ రాజవర్మ గుమ్మం వైపు వెళ్ళాడు.

"నేను తలపెట్టింది మల్టీక్రోర్ ప్రాజెక్టు. ఒక్కో లెవెల్‌కీ ఒక్కోస్థాయి పర్సంటేజ్ ఫిక్స్ చేసుకున్నాను. మీ కింది లెవెల్‌దాకా చిల్లరబాపతే అనుకోండి. మీకు ఇవ్వగలిగిన పర్సంటేజ్ చెప్తాను. అది ఎంతవుతుందో కూడా చెప్తాను. జాగ్రత్తగా డీల్ చేయండి!" కోటిలింగం నవ్వుతూ అన్నాడు. ఏకాంత్ మాట్లాడకుండా మౌనంగా చూశాడు. ఇలాంటి సందర్భాల్లో మౌనం పవర్‌ఫుల్‌గా పని చేస్తుందని అతనికి తెలుసు.

●●●

సాకేత్ 'ఇండమెరికన్ ఇన్‌వెస్టర్స్' సంస్థ భవంతి లోంచీ ఇవతలకి వచ్చాడు. నాలుగో అంతస్తు నుండీ కాళ్ళీడ్చుకుంటూ మెట్లన్నీ దిగాడు; లిఫ్టు వున్నా కూడా.

ఆరోగ్యకరమైన మనిషి మెదడు ఒక రోజుకు 50 వేల ఆలోచనలు చేస్తుంది. దురదృష్టం ఏమిటంటే ఎక్కువమందిలో 70 శాతం వరకూ ప్రతికూలమైన ఆలోచనలే!

ఇంటర్వ్యూలో తను ఓడిపోయాడు. తనకి తెలుసు. తనని ఇంటర్వ్యూ చేసిన వ్యక్తుల మొహాల మీద ఫలితం స్పష్టంగా కనిపించింది. వాళ్ళ తీర్పు అలా ఉంచితే, తన పర్‌ఫార్మెన్స్ తనకే తృప్తికరంగా లేదు. గాయకుడికే నచ్చని గానం శ్రోతలకు ఎలా నచ్చుతుంది? ఎందుకు నచ్చాలి? తిరుగు ప్రయాణానికి ట్రెయిన్ రిజర్వేషన్ చేసుకోలేదు. బస్సెక్కాల్సిందే..

ఓటమి సాకేత్ అడుగుల్ని పేవ్‌మెంట్ మీద బరువుగా వేయిస్తోంది. ముంబయి నగరం రోడ్ల మీద 'అగమ్యం'గా నడవాలనీ, అలసిపోవాలనీ అనిపిస్తోందతనికి. ఈసారి తనకి తప్పకుండా ఉద్యోగం దొరుకుతుందని నమ్ముతోంది అమ్మ. చదువులో అమ్మను తనెప్పుడూ డిజప్పాయింట్ చేయలేదు. ఉద్యోగప్రయత్నాల్లో అది తప్పడం లేదు. ఆలోచనలు సాకేత్‌ని హోటల్ గదివైపు నడిపించుకు వెళ్తున్నాయి.

నిగమ రెండో కొడుకు సాకేత్ ఓ కంపెనీలో ఇంటర్వ్యూకెళ్ళాడు. బిలో ఏవరేజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. ఉద్యోగం రాదని ఫిక్సయిపోయాడు. కానీ సెల్‌ఫోన్‌లో యూ ఆర్ సెలెక్టడ్ అనే మెసేజ్ చూసి ఆశ్చర్యపోయాడు. ఒక స్ట్రాంగ్ రికమెండేషన్ వల్ల నిన్ను సెలక్ట్ చేయాల్సివచ్చిందని కంపెనీ ఎండీ చెప్పడం అతన్ని మరింత ఆశ్చర్య పరిచింది. ఇంతకూ అతనికి తెలియకుండా అతన్ని రికమెండ్ చేసిందెవరు?

సాకేత్ ఇరుకుగా ఉన్న మధ్యతరగతి హోటల్ గదిలో, మంచం మీద వెల్లకిలా పడుకున్నాడు. ఓటమి ఆలోచన అతని ఆకలిని చంపేసింది. ఇంటర్వ్యూ చేసిన వ్యక్తుల పెదవి విరుపులు అతనికి ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి. పక్కనే టేబుల్ మీద ఉంచిన మొబైల్ ఎస్.ఎం.ఎస్ సిగ్నల్ అతనికి వినిపిస్తోంది. విసుగ్గా మొబైల్ అందుకుని మెసేజ్ చూశాడు సాకేత్. ఒక్కసారిగా అతని ఒళ్ళు జలదరించింది. తటాలున మంచం మీద లేచి కూచున్నాడు. గుండె దడదడ కొట్టుకుంటోంది. సాకేత్ చూపులు మొబైల్లోని సంక్షిప్త సందేశం వెంట పరుగులు తీశాయి. "కంగ్రాచ్యులేషన్స్. యూ ఆర్ సెలెక్టెడ్ ఫర్ ది పోస్ట్. ప్లీజ్ కాల్ ఆన్ ది ఎమ్.డి. అట్ 4.00 పి.ఎమ్ ఆన్ ది డాట్-ఇండమెరికన్ ఇన్‌వెస్టర్స్"

మొబైల్ పట్టుకున్న అతని చెయ్యి వణికింది. మొదటిసారిగా అందిన ప్రేమలేఖ చదువుతున్న వ్యక్తిలా సంక్షిప్త సందేశాన్ని అదేపనిగా చదువుతూ, చదువుతూ ఉండిపోయాడు. ఇంటర్వ్యూలో తన సామర్థ్యం అంతంత మాత్రమే అని తనకు రూఢీగా తెలుసు! ఎలా సెలక్టయ్యాడతను? హాజరైన అభ్యర్థులందరికంటే తానే నయమా? గుడ్డికన్నా మెల్ల మేలని తనను సెలెక్ట్ చేసుకున్నారా? అమెరికన్ల మెంటాలిటీని ఊహించలేం. మనం ఫెయిలంటే వాళ్ళు పాస్ అంటారు. మనం పాసంటే వాళ్ళు ఫెయిలంటారు!

నవ్వుకుంటూ సాకేత్ టైం చూసుకున్నాడు. ఒంటిగంట. ఇంకా మూడు గంటల వ్యవధివుంది. అమ్మకూ, అన్నయ్యకూ, తమ్ముడికీ, చెల్లికీ ఫోన్ చేసి శుభవార్త చెప్పాలనిపిస్తోందతనికి. ప్రయత్నించి ఉత్సాహాన్ని అదుపులో ఉంచుకున్నాడు. నాలుగ్గంటలకి 'ఇండమెరికన్' ఆఫీసుకెళ్ళి అంతా తెలుసుకున్నాక అందరికీ చెప్పడం మంచిది. అప్పుడైతే అన్ని వివరాలు ఉంటాయి.

తన శ్రమ ఫలించింది. ముఖ్యంగా అమ్మ తపస్సు ఫలించింది. తామందర్నీ చదివించడం కోసం అమ్మపడిన శ్రమ అంతాఇంతా కాదు. ఆమె చేసిన త్యాగం అంతా ఇంతా కాదు. వెలకట్టలేని ప్రోత్సాహాన్ని అందించింది అమ్మ. చుట్టుముడుతున్న ఆలోచనల్ని స్వాగతిస్తూ మంచం మీద వెల్లకిలా వాలాడు సాకేత్.

●●●

ఎయిర్ కండీషన్డ్ చాంబర్లో టేబుల్ వెనక కూచున్న ఇండమెరికన్ ఇన్వెస్టర్స్ ఎం.డీ. క్రేమర్ సాకేత్ వైపు చిరునవ్వుతో చూశాడు. సాకేత్ అతన్ని విష్ చేశాడు.

"కంగ్రాచ్యులేషన్స్ మిస్టర్ సాకేత్!"

"థాంక్యూ సార్"

క్రేమర్ తలపంకిస్తూ, సాకేత్‌కి కుర్చీ చూపించాడు. సాకేత్ కూచున్నాడు.

"సాకేత్ ఆశ్చర్యపడుతున్నావా?" క్రేమర్ చిరునవ్వుతో అడిగాడు. అతను 'మిస్టర్'ని వదిలేసిన విషయాన్ని గుర్తించాడు సాకేత్.

"నిజం చెప్పాలంటే, నిర్ఘాంతపోతున్నాను సర్" ఎప్పుడూ నిజమే చెప్పాలన్న అమ్మమాట గుర్తు చేసుకుంటూ అన్నాడు సాకేత్.

"నేను కూడా నిర్ఘాంతపోయాను; నిన్ను సెలెక్ట్ చేయాల్సి వచ్చినందుకు!" క్రేమర్ నవ్వుతూ అన్నాడు. "ఇంటర్వ్యూలో నీ పర్‌ఫార్మెన్స్ బిలో యావరేజ్! నీకన్నా బెటర్ కాండిడేట్స్ ఇద్దరున్నారు. వాళ్ళని పక్కనబెట్టి నీకు ఉద్యోగం ఇస్తున్నాం. ఎందుకో తెలుసా?"

'తెలియదు సార్"

"నిన్ను ఉద్యోగంలోకి తీసుకోమని ఒక వ్యక్తి స్ట్రాంగ్‌గా రికమెండ్ చేశారు. ఎమ్.డి. అయిన ఈ క్రేమర్‌ని డిక్టేట్ చేయగలిగిన ఏకైకవ్యక్తి!"

"ఎవరో తెలుసుకోవచ్చా సార్!" సాకేత్ వినయంగా అడిగాడు.

"బై ఆల్‌మీన్స్ - తెలుసుకుని తీరాలి. ఆ వ్యక్తి మిస్ నోనా!"

సాకేత్ నోనా ఎవరన్నట్టు ప్రశ్నార్థకంగా చూశాడు.

"మిస్ నోనా ఎవరో నాకు తెలియదు సార్. ఇంటర్వ్యూ కమిటీలో అందరూ పురుషులే ఉన్నారు. నోనాగారు.." సాకేత్ ఆశ్చర్యం వ్యక్తంచేస్తూ అన్నాడు.

క్రేమర్ మాట్లాడకుండా పక్కకి చూశాడు. "నోనా! కమ్ హియర్!" అన్నాడు బిగ్గరగా.

సాకేత్ అప్రయత్నంగా అటువైపు చూశాడు. సైడ్‌డోర్ తెరుచుకుని దాని ముందు ఒక పొడుగాటి యువతి ప్రత్యక్షమైంది. జీన్స్ మీద టీ షర్ట్.

బాబ్డ్‌హెయిర్. లిప్‌స్టిక్ పెదవులు. తెల్లటి శరీరం. పెద్దపెద్ద కళ్ళు.

"హాయ్ మిస్టర్ సాకేత్!" అందామె. "అయామ్ నోనా!"

సాకేత్ లేచి నిలబడ్డాడు. "హాయ్!"

నోనా వయ్యారం ఒలికే నడకతో సాకేత్‌ని సమీపించింది. చిరునవ్వుతో చూస్తూ కుడిచేతిని అతనివైపు చాచింది. సాకేత్ చెయ్యి అతని ప్రయత్నం లేకుండానే నోనా చేతిని పట్టుకుంది. నోనా చెయ్యి మెత్తగా, చల్లగా ఉంది. ఖరీదైన పెర్ఫ్యూమ్ అతని చుట్టూ వ్యాపిస్తోంది.

"థాంక్యూ వెరీమచ్ మిస్ నోనా...నన్ను సెలెక్ట్ చేసినందుకు!" సాకేత్ అన్నాడు. "నన్ను ఎందుకు సెలెక్ట్ చేశారో, ఎలా సెలెక్ట్ చేశారో నాకు అర్థం కావడం లేదు. ఐ డిడ్ నాట్ డూ వెల్!"

"నోనా మీకెవ్వరికీ కనిపించలేదు. నోనాకి మీరందరూ కనిపించారు. తన శైలిలో ఆమె అభ్యర్థులందరినీ చూపులతో ఇంటర్వ్యూ చేసింది. ఫేస్ రీడింగ్‌తో స్క్రీన్ చేయడంలో నోనా ఎక్స్‌పర్ట్. నోనా నీకు ఫుల్ మార్క్స్ వేసింది."

"థాంక్స్ ఎలాట్ మిస్ నోనా!" సాకేత్ తల వాల్చి అన్నాడు.

"యూఆర్ వెల్‌కమ్. యూ ఆర్ వెల్‌కమ్ టు ఇండమెరికన్ ఇన్వెస్టర్స్"

"సాకేత్... నోనాను నీకు పరిచయం చేయలేదు. నోనా ఈజ్ మై వోన్లీ డాటర్! మన కంపెనీలో నోనా మాట శాసనం!"

"ఓహ్...అలాగా!" సాకేత్ ఆశ్చర్యంగా అన్నాడు.

"యా! అయామ్ యువర్‌బాస్. నోనా ఈజ్ మైబాస్!" క్రేమర్ నవ్వుతూ అన్నాడు. "సాకేత్ మేనేజర్‌ని కలుసుకో. రేపు డ్యూటీలో జాయిన్‌కా! నౌ యూ కెన్ గో!"

"సార్. రేపే...జాయిన్ కావాలా!"

"యస్! రేపు కంపెనీ పుట్టినరోజు. లక్కీ డే ఫర్ అజ్!"

"ఓ. గ్రేట్ సార్! అలాగే సార్!"

"డాడీ, కెన్ ఐ టేక్ సాకేత్ ఔట్? ఐ వాంట్ టూ సెలబ్రేట్ హిస్ సక్సెస్ ఇన్‌ది ఇంటర్వ్యూ!"

"అలాగే, డియర్! గో అండ్ ఎంటర్‌టెయిన్ హిమ్!" క్రేమర్ నవ్వుతూ అన్నాడు.

"కమాన్ సాకేత్," అంటూ నోనా గుమ్మం వైపు కదిలింది. సాకేత్ మంత్రముగ్ధుడిలా ఆమె వెంట అడుగులు వేశాడు..

•••

ఇద్దరూ హోటల్ జూహులో ఎదురెదురుగా కూచున్నారు. వెయిటర్ మెనూ పెట్టాడు. నోనా మెనూను నిర్లక్ష్యంగా పక్కకు తోసింది. "కాఫీ!" అంది ఆర్డర్ చేస్తూ. 'ఐ లైక్ ఇండియన్ కాఫీ!" అంది సాకేత్‌ని చూస్తూ.

"ఇండియన్ కాఫీ కాఫీలాగే ఉంటుంది. నేటివ్ కౌమిల్క్, నేటివ్ బఫెలోమిల్క్ మంచి రుచిని ఇస్తాయి" సాకేత్ అన్నాడు. "మా అమ్మ కాచే ఫిల్టర్ కాఫీ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటుంది. ఉదయం లేవగానే కాఫీ అరోమా ఇల్లంతా వ్యాపించి ఉంటుంది!"

'ఇక్కణ్ణుంచీ మూవీకెళ్దాం..." కాఫీ చప్పరిస్తూ అంది వెయిటర్ వెళ్లగానే.

"ఏ మూవీ?" సాకేత్ అడిగాడు.

"నవ్‌రంగ్..."

సాకేత్ ఆశ్చర్యంగా చూశాడు. "నవ్‌రంగ్? చాలా ఓల్డ్ మూవీ?"

"యస్. స్టిల్ ఐ లైకిట్. మ్యూజిక్, బ్యూటిఫుల్ డాన్సెస్. రిచ్‌విత్ ఇండియన్ కల్చర్!"

"ఓ...దటీజ్ రైట్.."

"సాకేత్, ఐ లవ్ ఇండియన్ కల్చర్, యూ నో?"

"అలాగా! ఏజ్‌వోల్డ్ కల్చర్!"

"ఏజ్ వోల్డయినా, ఎవర్‌గ్రీన్ కల్చర్!" నోనా అంది. "నీకు అంతగా ఇష్టం లేదా?"

"అబ్బే అదేం లేదు. ఐలైక్ పీపుల్ హూలైక్ అవర్ ఇండియన్ కల్చర్!"

సాకేత్ నవ్వుతూ అన్నాడు.

"ఈ హోటలంటే నాకు ఇష్టం. సింపుల్ అండ్ టైడీ. ఈ కాఫీ కోసం రోజూ వస్తూంటా!" నోనా అంది.

"అలాగా!"

"నువ్వు నాకు ఎస్కార్టుగా రావాలి!" నోనా సాకేత్‌ని సీరియస్‌గా చూస్తూ అంది.

"ఆఫీసు..." సాకేత్ ఏదో చెప్పబోయాడు.

"ఫర్గెట్ యువరాఫీస్! ఫర్గెట్ మై ఫాదర్! ఇండమెరికన్లో నోనా మాటే ఫైనల్. నువ్వు ఓవర్‌టైం డ్యూటీ కూడా చేయాల్సి ఉంటుంది. ఓవర్ టైమ్ అలవెన్సులుండవ్...."

"సాకేత్ ప్రశ్నార్థకంగా చూశాడు. ఓవర్‌టైమ్ అంటే...."

"యస్! ఓవర్‌టైమ్ వర్క్ మా బంగళాలో ఉంటుంది...."

"బంగళాలో? ఆఫీసు పనేనా?" సాకేత్ ఇంగ్లీషులో అడిగాడు.

"నో ఆఫీస్ వర్క్. ట్యూషన్!"

"ట్యూషనా?! ట్యూషనేంటి?"

"లింగ్విస్టిక్ క్లాస్..." నోనా అంది. "నాకు నువ్వు తెలుగు భాష నేర్పించాలి. తెలుగు ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని విన్నాక సిస్టమ్‌లో కొన్ని తెలుగు సాంగ్స్ విన్నాను. మూవీ సాంగ్స్. క్లాసికల్ రిసైటేషన్స్. ఐ లైక్ ద సౌండ్ ఆఫ్ తెలుగు. ఇట్ సౌండ్స్ సో ఫ్లెక్సిబుల్ అండ్ పొయెటిక్. కొన్ని లెటర్స్ మీద మీరు అప్లయి చేసే స్ట్రెస్ నాకు ఎంతో నచ్చుతుంది..."

"అంటే మీకు తెలుగు నేర్పించాలా?" సాకేత్ నీరసంగా అడిగాడు.

"యస్. ఇవాళ నీతో బాటు ఇంటర్వ్యూకి అటెండైన వాళ్ళందరూ వేరియస్ స్టేట్స్ నుండి వచ్చారు. ఆంధ్రా నుంచి వచ్చింది నువ్వొక్కడివే...

"ఔను..."

"నువ్వు చేయబోయే ఆఫీసు డ్యూటీకన్నా, నాకు తెలుగు నేర్పించే డ్యూటీ మోర్ ఇంపార్టెంట్! ఇంటర్వ్యూలో నువ్వు ఫ్లాప్ అయినా నిన్ను సెలెక్ట్ చేయించింది తెలుగు లాంగ్వేజ్ కోసమే. అది ఒక రీజన్. రెండు రీజన్స్‌లో అది ఒకటి..."

అర్థమవుతోంది. ఒక రీజన్ తెలుగు ట్యూషన్. రెండో రీజన్ ఆఫీసు పని!" సాకేత్ నవ్వుతూ అన్నాడు.

నోనా తల అడ్డంగా ఊపింది. చేతిగాజుల సైజున్న బంగారు చెవి రింగులు గమ్మత్తుగా కదిలాయి. "రెండో రీజన్ అది కాదు..."

"రెండో కారణం....ఉద్యోగం కాదా?!" సాకేత్

మరదలు కావడమే పాపమా?

కోలీవుడ్‌లో స్టార్ హీరోల మధ్య పోటీ విపరీతంగా ఉంటుంది. ఆ పోటీనే షామిలి పాలిట శాపమయ్యింది అంటున్నారు తమిళ తంబీలు. షామిలి అజిత్ మరదలన్న సంగతి తెలిసిందే! షామిలీ తాజాగా ధనుష్ సినిమాలో ఎంపికయ్యింది. ఇంకా షూటింగ్ కూడా మొదలు పెట్టకముందే షామిలిని ఆ సినిమా నుంచి తప్పించారు. కారణం విజయ్ అంటున్నారు. ధనుష్‌తో ఉన్న స్నేహాన్ని ఉపయోగించుకుని విజయ్ ఈ ప్రాజెక్టు నుంచి షామిలిని తప్పించాడన్న పుకార్లు బాగానే షికారు చేస్తున్నాయి. విజయ్, అజిత్‌ల మధ్య తీవ్రమైన పోటీ ఉన్నందువలనే ఈ పరిణామం చోటుచేసుకుందన్న ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. కేవలం ఓ హీరోకి మరదలు అవడం వలనే షామిలికి అవకాశాలు కూడా బాగా తక్కువ వస్తున్నాయంటున్నారు కొందరు.

ఆశ్చర్యంగా అన్నాడు.

"కాదు. అదేమిటో నెమ్మదిగా తెలియజేయబడుతుంది!" నోనా లేస్తూ అంది. "కమాన్... మూవీటైమ్!" అంటూ టేబుల్ మీద యాభై రూపాయల నోటు పడేసింది.

సాకేత్ లేచాడు. నోనా ముందు నడుస్తోంది. సాకేత్ ఆమె వెంట నడుస్తున్నాడు. నోనా నడకలో అందం ఉంది. ఆకర్షణ ఉంది. వయ్యారం ఉంది. నిర్లక్ష్యంతో కూడిన ధైర్యం ఉంది. అన్నింటినీ పక్కకి నెట్టివేసే ఠీవి ఉంది. సాకేత్ అప్రయత్నంగా చుట్టూ చూశాడు. నోనాని చాలా కళ్ళు, మగకళ్ళు ఆశగా చూస్తున్నాయి. ఆ కళ్ళు... తనను అసూయతో చూస్తున్నాయి!

●●●

డాడీ, అయామ్ గోయింగ్ టూ లెర్నింగ్ తెలుగూ - ఇటాలియనాఫ్ ద ఈస్ట్!" సాయంత్రం హాల్లోంచే బైటికి వెళ్ళబోతున్న తండ్రి క్రేమర్‌తో అంది.

"గుడ్ ఐడియా! మోర్ లాంగ్వేజెస్; మోర్ కల్చర్! మోర్ కల్చర్ మోర్ లైఫ్! మోర్ హ్యాపీనెస్! ఐనో, డియర్....దటీజ్ ద రీజన్ ఫర్ సెలెక్టింగ్ సాకేత్ ఆఫ్ ఆంధ్రా?!"

"రోజూ ఆఫీసవగానే అతనిక్కడికి వస్తాడు. ఓకే విత్ యూ డాడీ!"



"ఓకే, డియర్. బైదిబై - టెల్గూ యాజే రిచ్ లాంగ్వేజ్. ఇటీజ్ రిచ్ ఇన్ రెటోరిక్!

"హౌ డూ యూ నో, డాడీ"

"యువర్ ఇంటెలిజెంట్ ఫాదర్ నోస్ మెనీ మెనీ థింగ్స్, నోనాడియర్! లార్డ్‌బ్రౌన్ ఫ్రమ్ గ్రేట్ బ్రిటన్ లెర్న్‌ట్ టెలుగూ అండ్ కంపైల్డ్ ఎ డిక్షనరీ! హీవాజే ఫాన్ ఆఫ్ దట్ బ్యూటిఫుల్ లాంగ్వేజ్!" క్రేమర్ గుమ్మం వైపు వెళ్తూ అన్నాడు. డోర్‌బెల్ మోగింది "కమిన్!" క్రేమర్ బిగ్గరగా అరిచాడు. తలుపుతోసుకుని సాకేత్ లోనికి వచ్చాడు.

"గుడీవినింగ్ సర్!" సాకేత్ వినయంగా అన్నాడు.

"ఈవెనింగ్! నోనా ఈజ్ వెయిటింగ్ ఫర్ యూ. మేక్ హర్ యాన్ ఎక్స్‌పర్ట్ ఇన్ యువర్ మదర్‌టంగ్!"

"అలాగే సార్!"

క్రేమర్ వెళ్ళాడు. తలుపు మూసుకుంది. సాకేత్‌ని చూడగానే నోనా సోఫామీంచి లేచి నిలుచుంది. "వెల్‌కమ్??" అంది నవ్వుతూ.

సాకేత్ చిరునవ్వు నవ్వుతూ సోఫావైపు నడిచాడు. నోనా కూచుంది. సాకేత్ ఆమె ఎదురుగా కూచున్నాడు. పేపర్ బ్యాగ్‌లో ఉన్న తెలుగు పుస్తకాలను ఇవతలకు తీసి టీపాయ్ మీద పెట్టాడు. నోనా వాటిని ఆశ్చర్యంగా చూసింది.

"అక్షరాల నుండీ పదాల దాకా - ఈ పుస్తకాలు పనికొస్తాయి..." అ..ఆ..లున్న రంగుల పుస్తకం తీస్తూ అన్నాడు సాకేత్.

నోనా తల అడ్డంగా ఊపింది. "నాకు పుస్తకాలు అవసరం లేదు..." అంది ఆంగ్లంలో.

సాకేత్ ఆశ్చర్యంగా చూశాడు. "తెలుగు నేర్చుకోవాలన్నారు?"

"అవును" నోనా అంగ్లంలోనే అంది. "నాకు చదవడం; రాయడం అవసరం లేదు. మాట్లాడడం వస్తే చాలు!"

సాకేత్ ఆశ్చర్యంగా చూశాడు. మాట్లాడ్డం వస్తే చాలు?!"

"మీ ఆంధ్రదేశంలో చదవడం, రాయడం రాని మనుషులు లేరా, సాకేత్?" నోనా నవ్వుతూ ప్రశ్నించింది.

"ఉన్నారు..."

"చదవడం, రాయడం రాకపోయినా వాళ్ళు తెలుగు మాట్లాడుతున్నారు కదా" నోనా నవ్వుతూ అంది.

"మాట్లాడుతున్నారు"

"వాళ్ళలాగే నేనూ మాట్లాడగలిగితే చాలు!"

"ఓహ్.....కానీ మీ నాన్నగారు మిమ్మల్ని తెలుగులో ఎక్స్‌పర్ట్‌గా తయారుచేయమన్నారే!" సాకేత్ సందేహిస్తూ అన్నాడు.

"నేను కమ్యూనికేషన్‌లో ఎక్స్‌పర్ట్ అయితే చాలు! విన్నదాన్ని అర్థం చేసుకోవడం, చక్కగా మాట్లాడ్డం. అర్థమైందా సాకేత్?"

"అర్థమైంది. ఆ విద్యకు పుస్తకాలు, పెన్నులు అవసరం లేదు. నోరూ, చెవులూ ఉంటే చాలు!" సాకేత్ నవ్వుతూ అన్నాడు.

"దెన్ స్టార్ట్ యువర్ కోచింగ్! నోనా నవ్వుతూ అంది. "ఫర్ ఎగ్జాంపుల్ 'ఐ లైక్ మై ఫాదర్!' అంటాను. ఆ మాటని, ఆ భావాన్ని మీ తెలుగులో ఎలా వ్యక్తం చేయాలి?"

సాకేత్ చిరునవ్వు నవ్వాడు. 'ఐ లైక్ మై ఫాదర్ -ఇంగ్లీషు.' 'మా నాన్నంటే నాకు ఇష్టం!' ఇది తెలుగు.

"మా నాన్.... నోనా ప్రారంభించింది.

"మా నాన్న అంటే నాకు ఇష్టం!" సాకేత్ విడమరిచి చెప్పాడు.

నోనా తడబడుతూ అంది. సాకేత్‌వైపు నవ్వుతూ చూసింది. "నువ్వు చెప్పిన తెలుగు వాక్యాన్ని ఇంగ్లీషులో ట్రాన్స్‌లేట్ చేసుకుంటాను-అంటే తెలుగు భాషా పదాలనే ఇంగ్లీషులో రాసుకుంటాను. ఓకే?"

"ఓకే!"

నోనా రాయడం ప్రారంభించింది. "ఐ లైక్ మై ఫాదర్-ఈజ్ ఈక్వల్ టూ మా నాన్న అంటే నాకు ఇష్టం- కమాన్ ట్రాన్స్‌లేట్ చెయ్!"

సాకేత్ చిన్నగా నవ్వి ప్రారంభించాడు. ఎమ్ డబుల్‌ఏ, ఎన్‌డబుల్‌ఏ, డబుల్‌ఎన్‌ఏఎన్‌టిఈ ఎన్‌డబుల్‌ఏకెయుఐఎస్‌హెచ్‌టిఏఎమ్"

రాయడం ముగించి అక్షరాల్ని కలిపి చదువుతూ "మా నా....న్న... అమ్‌టే నాకు ఇష్‌టం!" అంది నోనా.

"కరెక్ట్! అయితే ఇంకొంచెం వేగంగా చెప్పాలి. మిస్ నోనా...ముందుగా ఒక పనిచేద్దాం. మదర్, ఫాదర్, బ్రదర్, సిస్టర్, అంకుల్, ఆంటీ, ఫాదరిన్లా, మదరిన్లా, బ్రదరిన్లా, సిస్టరిన్లా, ఫ్రెండ్ వగైరా ఆంగ్ల సంబంధాలకు తెలుగు పదాలు తెలుసుకుందాం..."

"ఓకే! అలాగే!" నోనా హుషారుగా అంది.

"ఓకే. నేను చెప్తాను. గుర్తుంచుకోండి" సాకేత్ ఇంగ్లీషులో చెప్పి, ప్రారంభించాడు. మదర్-అమ్మ, ఫాదర్- నాన్న....."

అరగంట గడిచింది. నోనా సోఫాలో వెనక్కి వాలింది. "ఇవాల్టికి ఇది చాలు. ఇవన్నీ నేర్చుకుని రేపు అప్పజెప్తాను. రేపు కొత్త పాఠం!"

"అలాగే!" సాకేత్ చిరునవ్వుతో అన్నాడు. "ఈ విధానం బాగుంది. టీచ్ చేయడం సులువు. నేర్చుకోవడం సులువు! వస్తాను. బై!"

"కూర్చో సాకేత్, ట్యూషన్‌ఫీజు తీసుకోకుండా వెళ్ళిపోతావా?" నోనా పైకి లేస్తూ అంది.

"ఫీజా?"

"యా! జస్ట్ కాఫీ!" నోనా నవ్వుతూ అంది. "నోనా స్పెషల్!"

వంటగదివైపు వెళ్తున్న నోనాని సాకేత్ చూస్తూ ఉండిపోయాడు. స్కర్టూ బ్లౌజూ-ఆమె శరీర సౌష్ఠవాన్ని కొలతవేసి చూపిస్తున్నాయి. నోనా అందగత్తే! చీరకట్టులో ఎలా ఉంటుందో! అందమైన పిల్ల. ఏ డ్రెస్సులో అయినా అందంగానే ఉంటుంది. రుచికరమైన వంటకం ఏ ప్లేటులో వడ్డించినా రుచికరంగానే ఉన్నట్టు అందమైన పిల్ల ఏ డ్రెస్సులో కనిపించినా అందంగానే ఉంటుంది. సాకేత్ చిరునవ్వుతో అనుకున్నాడు. నోనా తన కంపెనీ బాస్ కూతురు. ఆమె అందం గురించి ఆలోచించడం, పరిశీలనగా చూడ్డం అంత మంచిది కాదు. తన జీవితం ఇప్పుడిప్పుడే ప్రారంభం అవుతోంది. ఆరంభంలోనే హంసపాదు ఉండకూడదు. ఇతరులకు అనుమానం కలిగేలా తన చూపులు ఉండకూడదు. ఆఫీసుపనికే పరిమితం అయితే ఏ ఇబ్బందీ లేదు. ట్యూషన్ 'ఎక్స్‌ట్రా' తనమీద పడింది. ఆ వృత్తి మాస్టారుకీ, స్టూడెంటుకీ మధ్య ఏకాంతాన్ని సృష్టిస్తుంది. ఆ ఏకాంతానికి ఎన్ని అర్థాలైనా తీస్తుంది లోకం. తను జాగ్రత్తగా ఉండాలి!

కాఫీ ట్రేతో వస్తున్న నోనాను చూస్తూ ఆలోచనలను అణగదొక్కేశాడు సాకేత్. నోనా ట్రే టీపాయ్ మీదపెట్టి, సాకేత్ ఎదురుగా కూర్చుంది. తీసుకోమన్నట్టు చిరునవ్వుతో చూసింది.

(ఇంకావుంది)

హోమియోకేర్ ఇంటర్‌నేషనల్‌లో 'అలర్జిక్ బ్రాంకైటిస్' సమస్యకు సరైన పరిష్కారం

డా. శ్రీకాంత్ మోర్లావర్
CMD
హోమియోకేర్ ఇంటర్‌నేషనల్

మారుతున్న ఆధునికతతో పాటు రోజురోజుకూ పెరుగుతున్న వాతావరణ కాలుష్యం వలన మన శరీరంలోని అవయవాలు దుష్ప్రభావాలకు గురి అవుతున్నాయి. అందులో ప్రధానమైనవి శ్వాసకోశ ఇబ్బందులు. అందునా బ్రాంకైటిస్ సమస్యతో చాలామంది బాధపడటం జరుగుతుంది. సాధారణంగా మనం వాతావరణంలోని గాలిని పీల్చుకున్నప్పుడు అది ముక్కు ద్వారా వెచ్చగా మారి, నీటి ఆవిరిని కూడా కలుపుకుని ట్రకియా అనే శ్వాసనాళంలోకి ప్రవేశిస్తుంది. ఈ ట్రకియా చివరి భాగం రెండు నాళాలుగా చీలి ఉంటుంది. వీటిని 'బ్రాంకై' అని అంటారు. ఇది విడివిడి చీలికలుగా ఛాతీ కుహరంలో ఇరువైపులా ఉండే ఊపిరితిత్తులలోకి ప్రవేశించి కొన్ని వేల సంఖ్యలో చిన్నని మరియు అతి సన్నని నాళాలుగా విభజింపబడతాయి. వీటిని 'బ్రాంకియోల్స్' అని అంటారు. ఈ నాళాలు మిక్కిలి తక్కువ పరిమాణం గల గుండ్రని వాయుతిత్తులుగా ఏర్పడతాయి. వీటిని ఆల్వియోలై అని అంటారు. ఈ శ్వాసనాళాల లోపలి భాగంలో శ్లేష్మపు పొర ఉంటుంది. ఏ కారణం చేతనైనా ఇది శోథమునకు గురి అయితే దానిని 'బ్రాంకైటిస్' అని అంటారు.

అలర్జిక్ బ్రాంకైటిస్ అనగా: ఏదైనా అలర్జీ కలిగించే పదార్థాలు వాయుద్వారాలను చేరినప్పుడు బ్రాంకై మరియు ఇతర దిగువ వాయుద్వారాలు శోథమునకు గురి కావడాన్ని అలర్జిక్ బ్రాంకైటిస్ అని అంటారు. ఈ సమస్య ఏ వయస్సు వారిలోనైనా కనిపిస్తుంది. నాన్ అలర్జిక్ బ్రాంకైటిస్ అనేది బ్యాక్టీరియా లేదా వైరస్‌ల వలన కలుగుతుంది.

కారణాలు: ఏదైనా అలర్జీ కలిగించే పదార్థాలు శ్వాస ద్వారా వాయు ద్వారాలలో ప్రవేశించినప్పుడు, బ్రాంకియల్స్ రోగనిరోధక వ్యవస్థ సాధారణ స్థితికి మించి ఎక్కువగా ప్రతిక్రియ జరపడంతో అలర్జీ సమస్య కలుగుతుంది. ● పొగ త్రాగటం, దుమ్ము, వాతావరణ కాలుష్యం, బూజు, కొన్ని రసాయనాలు, వృత్తిరీత్యా కొన్ని వాయు కాలుష్యాలను ఎదుర్కోవడం, జంతు చర్మపు పొరలు, శ్వాసకోశ అలర్జీని ప్రేరేపించే కొన్ని ఆహార పదార్థాలు మరియు జన్యుపరమైన అంశాలన్నీ అలర్జిక్ బ్రాంకైటిస్ సమస్యకు కారణాలుగా నిలుస్తాయి.

లక్షణాలు: ఈ సమస్యలో కనిపించే ప్రధానమైన లక్షణం దగ్గు. ఇది కఫంతో కూడి లేదా కఫం లేకుండా ఉత్పన్నమయ్యే సమస్య. ఇది రాత్రి సమయంలో ఎక్కువగా ఉంటుంది. ● ఊపిరి ఆడకపోవడం, ఈ సమస్య తీవ్రరూపం దాలిస్తే పని సమయంలోనే కాకుండా విశ్రాంతి సమయంలో కూడా ఈ లక్షణం ఏర్పడి ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది. ● పిల్లికూతలు, నీరసం, ఛాతీలో నొప్పి, గొంతు నొప్పి, తలనొప్పి, పెదాల వాపు, అప్పుడప్పుడూ చర్మం నీలం రంగులోనికి మారడం మొదలగు లక్షణాలను గమనించవచ్చు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు: రోగి లక్షణాలను బట్టి ఛాతీ ఎక్స్‌రే, కఫం పరీక్ష, రక్త పరీక్ష, కొన్ని సందర్భాలలో ఊపిరితిత్తుల ఆకారం, పనితీరు స్పష్టతకై సి.టి. స్కాన్, PFT పరీక్షలు, అలర్జీ పరీక్షలు నిర్వహించవలసి వస్తుంది.

దుష్ప్రభావాలు: ఈ వ్యాధి దీర్ఘకాలికంగా కొనసాగితే 'COPD'కి గురి అయి, శ్వాస తీసుకోవడంలో తీవ్రమైన ఇబ్బందితో శ్వాస ప్రక్రియ విఫలమై మరణానికి దారి తీయడం వంటి దుష్ప్రభావాలకు దారి తీస్తుంది.

తీసుకోవలసిన జాగ్రత్తలు: దుమ్ము, ఇతర రసాయన మరియు వృత్తిరీత్యా ఎదురయ్యే వాయు కాలుష్యం శరీరంలోకి ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవడం ● బెడ్‌లను మరియు దుప్పట్లను శుభ్రంగా ఉంచుకోవడం ● పెంపుడు జంతువులకు, ధూమపానానికి మరియు ఇతర అలర్జీ కలిగించే పదార్థాలకు దూరంగా ఉండటం ● ప్రాణాయామ వ్యాయామాలు చేయడం ద్వారా ఈ వ్యాధి నుండి కొంత వరకు ఉపశమనాన్ని పొందవచ్చును.

హోమియోకేర్ ఇంటర్‌నేషనల్ వైద్యం: 'కాన్‌స్టిట్యూషనల్ హోమియోపతి' విధానంలో భాగంగా, సూక్ష్మీకరణ పద్ధతిలో తయారైన హోమియోపతి మందులతో శరీర రోగనిరోధక కణాలకు పునరుజ్జీవం కల్పించి, ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా అలర్జిక్ బ్రాంకైటిస్ సమస్యను పూర్తిగా నయం చేయవచ్చు. కేవలం హోమియోకేర్ ఇంటర్‌నేషనల్‌లో మాత్రమే అందించబడే ఈ విశిష్ట వైద్యరీతిలో – వ్యాధి రీత్యా పరిశీలించే పలు అంశాలకు తోడుగా – రోగి శరీర నిర్మాణం, మానసిక స్థితిగతులు మరియు రోగి వ్యక్తిగత లక్షణాలను క్షుణ్ణంగా తెలుసుకున్న తదుపరి మాత్రమే అందించబడే ఈ చికిత్సతో అలర్జిక్ బ్రాంకైటిస్ వ్యాధిని ప్రేరేపించే పదార్థాలు మళ్ళీ శరీరంలోకి ప్రవేశించినా కూడా ఈ వ్యాధి తిరగబెట్టకుండా సంపూర్ణంగా నయం చేయవచ్చు.

ఉచిత కన్సల్టేషన్ **955 000 1188 / 99**

www.homeocare.in

సినీ నారాయణీయం

(ఎమ్మెస్ నారాయణ జీవితచిత్రం) 25

మహాబలేశ్వర్‌లో 'మృగరాజు' షూటింగ్ కోసం ఓ సుమోలో వెళ్తున్నాం. డోర్‌ను ఆనుకుని పడుకున్నాను. తెల్లవారు జామున డోర్ లాక్ వదిలేసింది. ఎనభై మైళ్ళ వేగంతో వెళ్తున్న వాహనం నుంచి పడిపోయాను. తలకు ఓ నల్ల కండువా చుట్టుకున్నా. పెద్ద దెబ్బలు తగలలేదుగానీ, తల దిమ్ము నాలుగు రోజులు తగ్గ లేదు. తరువాత రోజు షూటింగ్‌లో పాల్గొన్నా. విషయం తెలిసిన చిరంజీవిగారు నా పేరున అర్చన చేయించి, 'భగవంతుడు ఇచ్చిన రెండో జన్మ సద్వినియోగం చేసుకో' అని దీవించారు.

కమెడియన్ మనస్తత్వం ఎలా ఉంటుందంటే...

'రుక్మిణి' షూటింగ్ రాజోలులో జరుగుతోంది. వేణుమాధవ్, నేను, సారిక రామచంద్రరావు ఉన్నాం. నాగబాబు మెయిన్ క్యారెక్టర్. మేమందరమూ గౌతమికి వెళుతున్నాం అక్కడికి. అది ప్రొహిబిషన్ పీరియడ్. ప్రొహిబిషన్ అంటే మద్య నిషేధం. కానీ సొంత డబ్బుతో ఎలాగో కష్టపడి ఒక ఫుల్‌బాటిల్ సంపాదించి నా బ్యాగ్‌లో దాచి పెట్టాను. అప్పటికి నాకు జాబ్ ఉంది. రిజైన్ చేయలేదు. ఒక లెక్చరర్‌ని. సినిమా కథలు రాసుకుంటున్నాం. ఇంతకు ముందు చిన్నచిన్న వేషాలు చూసినోళ్ళు ఎవరైనా ఉంటే వాళ్ళకీ నాగురించి తెలుసు. పెదరాయుడు అప్పటికే రిలీజ్ అయింది. కొంతమందికి తెలుసు. మన బ్యాగ్‌లు ఎవరు చెక్ చేస్తారు అనే ధీమా.

ఆ రోజంతా జోకులూ నవ్వులే

ఈ పరిస్థితుల్లో వేణుమాధవ్‌కి నాకు ఒక ఒప్పందం. నువ్వు ఫుడ్ తేవాలి, నేను బాటిల్ తీసుకొస్తాను అని. మేం రైలు ఎక్కేశాం. నాగేంద్ర బాబు ఇంకా రాలేదు. స్టేషన్‌లోంచి బండి కదిలి పోతోంది. ఆయన మెయిన్‌గేట్‌లో కనిపించాడు. వీడు గొలుసు లాగేశాడు. గొలుసు లాగేటప్పటికి ట్రైన్ ఆగిపోయింది. వీడు దిగి జనంలో కలిసి పోయాడు. నేనేమో కంపార్ట్‌మెంట్‌లో ఉండిపోయాను. పోలీసులు వచ్చారు. వాళ్ళెక్కడం చూసి నేను కూడా కిందికి దిగిపోయి పారిపోయి జనంలో కలిసిపోయాను. వాళ్ళు వస్తారు. బ్యాగ్ చెక్ చేస్తారు. బాటిల్ దొరికిపోతుంది. నా జాబ్ పోతుంది అని నాకు చెమటలు పట్టి కారిపోతున్నాయి. వేణు మాధవ్ ఏయ్ ఏం పర్వాలేదు అన్నాడు. సరే అని ఊరుకున్నాను. బాటిల్ ఎవరూ చెక్ చేయ లేదు. వెళ్ళిపోయారు. మళ్ళా రైలెక్కాం. నాగబాబు వచ్చారు. ఫస్ట్‌క్లాసులో ఎక్కారు. వీడికి నాకూ ఫస్ట్‌క్లాస్ కూపేలో ఇచ్చారు. కిటికీ ఉంది. బండి కదిలింది. బండి కదిలిన పది నిమిషాలకి తలుపు చప్పుడైంది. ఎవరూ అన్నా. పోలీస్ అన్నాడు. టక్ మని వాడి చేతుల్లోంచి బాటిల్ లాగేసుకుని కిటికీలోంచి బయటికి విసిరేశా. నాది లెక్చరర్ జాబ్. పరువు ప్రతిష్ఠలు పోతాయి. ప్రపంచంలో అందరూ తాగుతారుగానీ, పేపర్లలో మా గురించి న్యూస్ వచ్చిందంటే ప్రిస్టేజి పోద్ది. అందుకని అన్నీ విసిరేశా. విసిరేసి తలుపు తీశా. తీస్తే నాగబాబు. అరే అవి ఏంటి రా అన్నాడు. ఏంటి నాగబాబు ఇదీ, నాగబాబునని చెప్పొచ్చు గదా. పోలీస్ అన్నావు అని అడిగా. కంఠం కూడా మార్చి అన్నాను థ్రిల్లింగ్‌గా ఉంటుందని అన్నాడాయన. ఏం థ్రిల్లింగ్ మొత్తం థ్రిల్ అంతా పోయిందిక్కడ. థ్రిల్ కోసం మేము అష్టకష్టాలు పడి 400 రూపాయలకు కొనుక్కున్నదంతా పోయింది. ఇంక థ్రిల్ ఏంటీ నా పిండాకూడూ అన్నా.

అంటే ఆయన ఒక మాట అన్నాడు. థ్రిల్ అనేది మందులోనే ఉండదు ఎమ్మెస్, మనసులో ఉంటుంది. మీరనేది కరెక్టేనండి అని మందు లేకుండా మానసికంగా ఎంత ఉల్లాసంగా ఉండొచ్చనేది ఆ రోజు నేను ప్రూఫ్ చేశాను. జోకులు స్టార్ట్ చేశాను. నాగబాబుగారు అయితే నవ్వలేక నవ్వలేక ఎమ్మెస్ నీకు దండం పెడతా. ఇంక జోకులు ఆపెయ్ నాది తప్పు అయిపోయింది. ఇంకెప్పుడూ పోలీస్ అనను. మీరు మామూలుగా ఉందురుగానీ అన్నారు. ఆ రేంజ్‌కి తీసుకుపోయా. సరే తెల్లవారుజామున 5 గంటలకి గౌతమి దిగాం. తాడేపల్లిగూడెం నుంచి రాజోలుకి కారులో వెళ్ళాలి. కారులో కూడా జోకులు మొదలెట్టా. అలాగా ఆ నవ్వులు అలా పరిమళిస్తూనే ఉన్నాయి ఆ రోజంతా.

విలేజరూ, బెంగుళూరు జోకు

రాజోలులో షూటింగ్ జరుగుతున్న సమయంలో కూడా ఇలాగే, విలేజర్ ఒకతను వచ్చాడు. నాగ బాబు అన్నాడు వీడెవడో నన్ను పీడించేస్తున్నాడు. వీడికి కొంచెం ట్రీట్‌మెంటు ఇవ్వాలి అన్నాడు. నేనిస్తాను నాగబాబు అన్నాను. వాడొచ్చాడు. కూర్చున్నాడు. కొంచెం పరిచయస్తుడే. ఒక జోక్ చెప్తానన్నాడు. నేను అన్నాను ఏమండీ చెప్పండి మీరు, అది జోకో కాదో మేము చెప్తాం. జోకైతే

నవ్వొస్తుంది. కాదనుకోండి తెలిసిపోతోంది మీకే. విషయం చెప్పండి అన్నా. ఒకసారి మేం బెంగుళూరు వెళ్ళాం అన్నాడు. అహహా...హ...అని నవ్వాం. ఏంటన్నాడు. పెద్దజోకండి బెంగుళూరుది ఇది మామూలు జోకు కాదు. అయితే నన్ను చెప్పనివ్వండి అన్నాడు. ఆ చెప్పండి అన్నా. ఒకసారి బెంగుళూరు వెళ్ళాం. అనేటప్పటికే వేణుమాధవ్ గట్టిగా నవ్వేశాడు. అయ్యబాబోయ్ ఈ జోకు ఎక్కడా వినలేదండి. బెంగుళూరు ఏంటండీ నాకసలేం అర్థం కావడంలేదు అన్నాడు. మళ్ళీ కూడగట్టుకుని మళ్ళీ చెబుతుంటే ఏయ్ ఊరుకోవాయ్ పెద్దాయన ఏదో చెప్తుంటే ఏంటీ బుద్ధి లేకుండా మీరు...చెప్పండి మీరు అంటే... ఒకసారి బెంగుళూరు వెళ్ళాం....అనేటప్పటికి నాగబాబు నవ్వేశాడు. ఏంటండీ జోకు కాదేమో అనుకున్నాను గానీ నవ్వు ఆగట్లేదండి బాబు అసలు. వీళ్ళు చెప్పింది కూడా కరెక్టే...అయ్యబాబోయ్ బెంగుళూరా... అయ్యబాబోయ్... అన్నాడు. వాడికి అర్థమైపోయింది. ఏం పర్లేదు చెప్పండి అన్నా. ఆ పర్లేదండీ మళ్ళీ ఇప్పుడే వచ్చి చెప్తాను అన్నాడు. ఏ ఊరుకోండి సార్. ఇంత గొప్ప జోకు ఎక్కడా వినలేదు అన్నా. బెంగుళూరు అసలు...అన్నాడాయన. ఒక కమెడియన్ ఎలా ఉంటాడనేదానికోసమే ఇవన్నీ చెబుతున్నా.

షార్ట్ గ్యాప్‌లో ఎంజాయ్‌మెంట్

ఆ విలేజర్ నెక్స్‌డే మళ్ళీ ప్రిపేరై వచ్చాడు. సార్ నిజంగానే వీడేదో జోకు ప్రిపేరై వచ్చాడండి ఏంటీ పరిస్థితి అన్నాడు నాగబాబు. చెప్పనీయండి అన్నాను. జోకు చెప్పాడు. ఏదో ఒకసారి ఇలా ఆర్టీసీ బస్‌లో జరిగిందండీ. అలా జరిగిందండి... అని చెబుతున్నాడు. నాగేంద్రబాబు లేచి వెళ్ళి చెట్టున ఉన్న ఓ కొమ్మ విరిచి పట్టుకొచ్చి వేణుమాధవ్‌ను, నన్నూ బాదటం మొదలెట్టాడు. ఏరా...ఎలా కనబడుతున్నానురా నా కొడుకుల్లారా మీకు నేను..అంటే ఎవరొచ్చి ఏది చెప్పినా సరే గంటలు తరబడి వినేసి అది బాగుంది అనడం అవసరమా నాకు అని మా ఇద్దరినీ కొడుతుంటే మేం ఇద్దరం వాడి దగ్గరకు వెళ్ళి, వెళ్ళవయ్యా బాబూ...చంపుకు తింటున్నావు...ఏదో పట్టుకొచ్చావు తొక్కలో జోకులు నువ్వూనూ. వెళ్ళు. నీకు దండం పెడతాం పో అన్నాం. అంటే షూటింగ్ షార్ట్ గ్యాప్‌లో మేం చేసే ఎంజాయ్‌మెంట్... అదొక అద్భుతమైన పరిమళం. ఇలాంటి ప్రాక్టికల్ ఇన్సిడెంట్స్ ఎన్నో.

బస్సు కిటికీలో చెయ్యి తగాదా

ఒకసారి ఆర్టీసీ బస్సులో వెళుతున్నాను. నా ముందు కూర్చున్న ఒకాయన కిటికీలోంచి చెయ్యి బయట పెట్టుకుని కూర్చున్నాడు. నేను అన్నా చెయ్యి లోన పెట్టుకోండి అన్నా. మాకు తెలుసు అన్నాడు. ప్రిస్టేజి ఫీలయ్యాడు. మళ్ళీ గోకా. చెయ్యి లోన పెట్టుకోండి అన్నా. నీకు చదువు వచ్చా అన్నాడు. వచ్చని అన్నా. అది చదవండి అన్నాడు. చేతులు బయటపెట్టరాదని రాసి ఉంది. అది చూడవలసింది మీరండి. నాకు చెప్తారేంటండీ అన్నా. నాకూ చదువువచ్చు. నేనూ చూశా. నాకు తెలుసుకదా. నేను పెట్టుకుంటాను. అవసరమైనప్పుడు లోన పెట్టుకుంటా. నీవు చెప్పక్కర్లేదురా అని. అనేటప్పటికి మళ్ళీ చెప్పా. చెయ్యి లోన పెట్టుకోండి అన్నా. బయట నుంచి ఏదన్నా వస్తే తగులుద్ది అన్నా. ఏదన్నా వచ్చినప్పుడు పెట్టుకుంటా నీకు అనవసరం అన్నాడు. వాడు ఇరిటేట్ అయిపోతున్నాడు. నేను గొడవ పడకుండానే, చెయ్యి లోన పెట్టుకోండి అని మళ్ళీ అన్నా. ఏంటయ్యా ఎందుకు నీకు? నా చేతికి నీకు సంబంధం ఏంటీ, మేం పెట్టం అన్నాడు. మీ చేతికి నాకు సంబంధం ఉందండి అన్నా. ఏంటన్నాడు. నీ చెయ్యి పోతే నాకెందుకయ్యా తొక్కలో చెయ్యి. పోతేపోద్ది ఉంటే ఉంటది. చేతుల్లేని వాళ్ళు కోటిమంది ఉన్నారు. నాకేమన్నా అవసరమా. నీచేత్తోటి నాకేంటి సంబంధం అంటావేంటీ? ఉందీ.. నీ చేయి పోద్ది. ఎవడో వచ్చి కొడతాడు. చెయ్యి లోపల పెట్టుకోవటం లేటవ్వద్ది. విరుగుద్ది. పట్టుకెళ్ళి ఈ డ్రైవర్ హాస్పిటల్ దగ్గర పెడతాడు. మూడు గంటలు మా టైమ్ వేస్ట్ అవుతుంది. ఎక్స్‌ప్రెస్ టికెట్ ఎందుకు తీసుకున్నాం? త్వరగా వెళ్లటానికేగా. నీ తొక్కలో చెయ్యి గురించి వీడు తీసుకెళ్ళి హాస్పిటల్ దగ్గర పెడతాడు. బస్సు వెళ్ళదు. నీవు రావు. నాకు అవసరమా? లోన పెట్టు చెయ్యి అన్నా. లోపల పెట్టేశాడు. బహుశ భీమవరం దగ్గర నుంచి తాడేపల్లిగూడెం వెళ్ళే దారిలో ఈ సంఘటన జరిగి ఉండవచ్చు. కాలక్షేపం ఒకటీనూ, పైపెచ్చు అదొక సరదా. మనం డీల్ చేయగలమా లేదా అని కూడా.

ఎమ్మెస్‌గారిది జోవియల్ మనస్తత్వం. జోకులు పేల్చడం, ప్రాక్టికల్ జోక్స్ చెయ్యడం, అందర్నీ నవ్వించగలగడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. అనేక సందర్భాల్లో తన మనస్తత్వాన్ని ఆయన ఋజువు చేసుకున్నారు. అందుకే ఆయన అంతమంచి కమెడియన్‌గా రాణించగలిగారేమో కూడా! షూటింగ్ సమయాల్లో తన చుట్టూ ఉన్న వారిని ఎంతగానో ఎంటర్‌టైన్ చేసేవారు. ఆయన జీవితంలో అలాంటి జోకులెన్నో...

'రుక్మిణి' షూటింగ్ నిమిత్తం తాటిపాక వెళ్ళాం. అదో చిన్న ఊరు. నేను, వేణుమాధవ్, ఏచూరి, సారిక రామచంద్రరావు నలుగురికి నాలుగు చిన్న రూములు ఇచ్చారు. ఈ తాటిపాక వేశ్యావాటిక ఉన్న ఊరు. ట్రంకు పెట్టెలాంటి ఊరు. సుఖ వ్యాధులకు వైద్యాలు చేసే డాక్టర్లు వచ్చి ఉంటారక్కడ. దాంట్లో పెట్టారు మమ్మల్ని. వ్యభిచారం ఉద్దేశం లేదుగాని వేశ్యావాటిక ప్రత్యేకంగా ఒక చోట ఉండటం, ఆ వాటిక చూడాలనే ఒక ఆసక్తి ఇంకోటి. బొంబాయి అనుకోండి. అక్కడ రెడ్‌లైట్ ఏరియా. అక్కడ లైసెన్స్‌డ్ అమ్మాయిలు ఉంటారు. చూడొచ్చు. తిరగొచ్చు అంతే. ఇక్కడ వీళ్ళసలు ఎలా ఉంటారు. ఎలా కనిపిస్తారు? ఎలా బిహేవ్ చేస్తారు? ఇవన్నీ చూడాలనేది ముఖ్యంగా వేణుమాధవ్‌కి ఎక్కువ ఆసక్తి. నా స్నేహితులతో కలిసి నేను ఇలాంటి పరిస్థితులను చూసి ఉన్నాను. ఎందుకంటే నాకు దగ్గర కదా!

వాడు అడిగాడు. అన్నయ్యా! ఒకసారి మనం వాళ్ళందరినీ చూడాలి అన్నయ్యా అన్నాడు. ఎవ్వడి దగ్గరా ఈడ్చి తంతే ఒక్క పైసా లేదు. ఆ వేశ్యలకు ఇవ్వడానికి కూడా ఎవ్వడి దగ్గరా డబ్బులు లేవు. అందరూ పేదవాళ్ళే. ఆ ప్రొడక్షన్ వాళ్ళు ఫుడ్ పెట్టకపోతే మాకు ఫుడ్ కూడా లేదు నాతో సహా.

(ఇంకావుంది)

-కూనపరాజు కుమార్

సెల్: 99899 99599

నిలబడి నీళ్ళు...

-లక్ష్మీరాఘవ

"రామ్మా దీప్తీ...." కారు దిగుతున్న కోడలు దీప్తిని సాదరంగా ఆహ్వానించింది సుభద్రమ్మ.

అత్తయ్య చెయ్యిని ప్రేమగా పట్టుకుంది దీప్తి. కారు కొంచెం రివర్సు చేసి ఇంటికి దగ్గరగా పార్క్‌చేసి దిగాడు శంకర్.

"రారా శంకర్, ఎలా జరిగింది ప్రయాణం?" కొడుకును ఆప్యాయంగా పలకరించాడు ఈశ్వరరావు.

"బాగా జరిగింది నాన్నా, రోడ్లు మెరుగయ్యాక డ్రైవింగ్ బాగా అనిపిస్తోంది".

"రండి, కాళ్ళు కడుక్కుని వస్తే కాఫీ పెడతాను".

"మీరు కాఫీ తాగరు కదా అత్తయ్యా".

"మేము తాగకపోయినా ఇంటికి వచ్చిన వాళ్ళకి ఇవ్వడానికి ఇంట్లో కాఫీ పొడి ఉంచుకుంటా దీప్తి" అని నవ్వుతూ వంటింట్లోకి నడిచింది సుభద్రమ్మ.

మామగారు ఆరోగ్య సూత్రాలు నిక్కచ్చిగా పాటించే వ్యక్తి అనీ, అదే వాళ్ళ చక్కటి ఆరోగ్య రహస్యం అని తెలుసు దీప్తికి. సుభద్రమ్మను అనుసరిస్తూ వంటింట్లోకి వెళ్ళిన దీప్తి కాఫీ ప్రయత్నం చేస్తున్న అత్తగారి దగ్గరగా నిలబడింది.

"ఏమ్మా?" అంటూ వెనుదిరిగిన సుభద్రమ్మ చేతిని అందుకుని ముఖానికి ఆనించుకుంది. ఆమె కన్నీళ్లు సుభద్రమ్మ చెయ్యి తడిపాయి...

"ఏమైందిరా?" ప్రేమగా దీప్తిని దగ్గరకు తీసుకుంది సుభద్రమ్మ.

"ఏమిటో అత్తగారూ, కోడళ్ళ మంతనాలు?" హఠాత్తుగా శంకర్ మాటలు వినిపించి దూరంగా జరిగింది దీప్తి.

"అమ్మా, నాన్నగారి ఆరోగ్యం బాగుంది కదా" అని అడుగుతున్న భర్త ఎంతో నార్మల్‌గా ఉన్నట్టు అనిపించి సంతోషించింది దీప్తి.

"బాగుంది నాన్నా, పోయిన నెల వైరల్‌ఫీవర్ వచ్చి నాలుగు రోజులు నలతగా ఉన్నారు. అంతే".

"హోమియోపతి తప్ప వాడరుకదా... మిమ్మల్ని మార్చలేమమ్మా"

"అలా అనకురా! ఈ చిన్న పల్లెటూళ్ళో మీ నాన్న ఇచ్చే హోమియో మందులతో ఎంతమందికి జబ్బులు నయమవుతాయో తెలుసా!"

'అందరి సేవ చేస్తారు కానీ నా దగ్గరికి వచ్చెయ్యమంటే రారు.."

"ఇప్పుడేమయింది? ఇక్కడ నలుగురికి ఉపయోగపడుతున్నాం కదా. అయినా సిటీలో మీ బిజీలైఫ్‌లో మేముండడం కంటే అప్పుడప్పుడూ మీరు ఇలా మా దగ్గరకు వచ్చేస్తే సరదాగా ఉంటుంది. ఇక పూర్తిగా పనులు చేసుకోలేని పరిస్థితి వస్తే అప్పుడే చూడచ్చులే..." నవ్వుతూ అంది సుభద్రమ్మ.

కాఫీలు అయ్యాక భోజనాలు... కాసేపు విశ్రాంతి అంటూ తండ్రీకొడుకూ పడుకున్నాక, వంటింటి వెనక ఉన్న వసారాలో చాపమీద పడుకున్న సుభద్రమ్మ పక్కన చేరింది దీప్తి. దగ్గరగా జరిగి కూర్చున్న దీప్తిని చూసి సుభద్రమ్మ "ఏమయింది దీప్తి?" అంది. జవాబుగా దీప్తి కళ్ళల్లో నీళ్ళు... వచ్చినప్పటి నుండీ ఏదో చెప్పాలన్న దీప్తి తపనను గ్రహించింది సుభద్రమ్మ.

"ఈ మధ్య ఆయన నార్మల్‌గా లేరు అత్తయ్యా..."

"అదేమిటీ?"

"ఎక్కువగా ఆలోచిస్తూ ఉంటారు. రాత్రిపూట నిద్రపోరు. నిద్రలో కూడా ఏదో కలవరింతలు... నేను కూడా ఆఫీసు పనితో బిజీగా ఉంటాను. గమనించడం ఆలస్యం అయింది. అందుకే ఈమధ్య వర్కింగ్ అవర్స్ తగ్గించుకుంటున్నాను. ఆయన ఆఫీసుకు వెళ్ళనిరోజు వర్క్ ఫ్రం హోం చేస్తున్నాను".



అది శ్రియకే చెల్లింది

35 *సంవత్సరాల వయస్సు.... 16 సంవత్సరాల సీనియార్టీ! మరో హీరోయిన్ అయితే పెళ్ళి చేసుకుని లైఫ్‌లో సెటిల్ అవ్వాలని ఆలోచించేదే! కానీ శ్రియ అలా కాదు. ఈ వయస్సులో కూడా వన్నెతరగని సొగసుతో కుర్రకారును మెస్మరైజ్ చేస్తూనే ఉంది. అడపాదడపా సినిమాల్లో కనిపిస్తున్నా, బయట ఈవెంట్ల ద్వారా శ్రియ బాగా సంపాదిస్తోందని అంటున్నారు సినీ జనాలు. వీటి ద్వారా ఏడాదికి కనీసం రెండు మూడు కోట్లు సంపాదిస్తోందట! ఏ సినిమా ఈవెంట్ అయినా, అవార్డు ఫంక్షన్ అయినా శ్రియా డ్యాన్స్ తప్పనిసరిగా ఉంటుంది. ఇక 5కె-10కె రన్ లాంటివాటికి శ్రియనే బెస్ట్ చాయిస్! ఇక రిబ్బన్ కటింగ్‌లు ఎలానూ ఉంటూనే ఉంటాయి. ఉత్తరాదిన జరిగే ర్యాంప్ వాక్‌లలో శ్రియ తప్పనిసరిగా పాల్గొంటుంది. వీటన్నిటి ద్వారా సినిమాల కన్నా ఎక్కువగా శ్రియ సంపాదిస్తోందనేది బాలీవుడ్ జనాల మాట! సినిమాలు లేకపోయినా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా డబ్బు సంపాదించడం శ్రియాకే చెల్లిందంటున్నారు.*

"కారణం ఏమిటీ?"

"మొదట ఏమీ చెప్పేవారు కాదు. అర్థం కాలేదు. ఆఫీసులో తన ఫ్రెండ్ ప్రసాద్‌ను కనుక్కుంటే కొత్త ప్రాజెక్టులు వచ్చాయనీ, దానికి కొత్తవారిని తీసుకున్నారనీ తెలిసింది. ఇంతకు మునుపు కొత్త ప్రాజెక్ట్ ఏవి వచ్చినా తనచేత చేయించుకునేవారు. ఇప్పుడు ఎందుకు తనకు వర్క్ ఇవ్వలేదు అని అడిగితే లేటెస్ట్ టెక్నాలజీ కొంచెం వేరుగా ఉంటోంది కాబట్టి దానికోసం ట్రైన్ అయిన వాళ్ళని తీసుకున్నారని చెప్పారు. నెమ్మదిగా 'ఏమైంది?' అని ఈయనను ప్రశ్నిస్తే వర్క్‌ప్రెజర్ తట్టుకోలేక పోతున్నానని అంటున్నారు. బహుశా సీనియర్ అయిన తనను నెగ్లెక్ట్ చేశారన్న ఫీలింగ్ వచ్చి ఒత్తిడికి గురవుతున్నారేమో... దానివల్ల డిప్రెషన్‌కు లోనవుతున్నారేమో అనిపిస్తుంది" అత్తగారికి అర్థం అయ్యేలా వీలైనంత సింపుల్‌గా తమ ప్రాబ్లమ్స్ చెప్పింది దీప్తి.

పనిఒత్తిడితో ఎక్కువగా ఆలోచించి ఆరోగ్యం పాడు చేసుకుంటున్నాడని అర్థమైంది సుభద్రమ్మకు.

"సమస్యలు వస్తే పరిష్కారం ఆలోచించాలి కానీ ఆరోగ్యం పాడు చేసుకోకూడదు కదా!"

"నేను చెప్పి చూశాను అత్తయ్యా! వినటం లేదు. నా ఫ్రెండ్ ఒకామె సైకియాట్రిస్ట్ ఉంది. తనతో మాట్లాడితే, తను ఒకరోజు ఇంటికి వచ్చి శంకర్‌తో మాట్లాడింది. పాజిటివ్‌గా ఆలోచించాలని, రోజూ కొద్దిసేపు మెడిటేషన్ చేసుకోవాలనీ చెప్పి చివరగా స్థలమార్పు ఉంటే మంచిదని సూచించింది. అందుకే ఇక్కడకు బయలుదేరదీశాను. మామగారు కూడా కొంచెం నచ్చచెబితే తను నార్మల్ అవుతాడని నమ్మకం అత్తయ్యా... మాకు మీరు తప్ప ఎవరు ఉన్నారు?" అంటూ అత్త ఒడిలో తలపెట్టుకుని నిశ్శబ్దంగా రోదించసాగింది. దీప్తి తలమీద చెయ్యివేసి నిమిరింది సుభద్రమ్మ.

చిన్నప్పటినుండీ క్లాసుఫస్ట్ వచ్చి అన్నింటా ముందుండే శంకర్‌కి ఇదేమి వింత సమస్య? అర్థం కాలేదు తల్లికి. రాత్రికి భర్తతో వివరంగా చెప్పాలనే నిర్ణయానికి వచ్చింది.

రెండు రోజులు గడిచాయి. శంకర్ అప్పుడప్పుడూ డల్ అవుతున్నట్టనిపిస్తే పొలం దగ్గరికో, గుడి దగ్గరికో వెళ్ళేవారు. కొడుకుని నిశితంగా గమనించడమే గానీ సమస్య ఏమిటన్న టాక్ రాలేదు తండ్రీకొడుకుల మధ్య.

ఆఫీసులో అతడే సీనియర్. కానీ ఇప్పుడు కొత్త ప్రాజెక్టులు వచ్చాయి. కొత్త స్కిల్స్ వచ్చాయి. అందుకు అనుగుణంగా కొత్తవాళ్ళు వచ్చారు. ఇక వాళ్ళతో తనను పోల్చుకోవడం ప్రారంభించాడు. రేస్‌లో వెనుకబడ్డాననీ, గుర్తింపు కోల్పోయాననీ అతడు డిప్రెషన్‌కు గురయ్యాడు. అదే సమయంలో విశ్రాంతి కోసం సొంతూరు వెళ్ళాడు. ఆ ఊళ్ళో ఏం జరిగింది? అతనికి తండ్రి ఏం చెప్పాడు? అతడిలో ఎలాంటి మార్పు వచ్చింది?

ఆరోజు పొద్దున్న పూజ సమయానికి శంకర్ కూడా స్నానం చేసి ఉన్నాడని దేవుడి గదిలోకి రమ్మన్నాడు.

"అపవిత్ర... పవిత్రోవా...' తో మొదలుపెట్టి.

"ఉత్తిష్ఠంతు... భూతపిశాచ..." అని నీటితో శుద్ధి చేసినప్పుడు తనలోని దురాలోచనలకు శుద్ధి చేసినట్టనిపించింది శంకర్‌కు.

"ఓం భూ...." అని ప్రాణాయామం చేస్తే ఉచ్ఛ్వాస నిశ్వాసలు క్రమపద్ధతిలో జరిగి ఏకాగ్రత పెరిగింది. మనసు హాయిగా అనిపించింది.

'యానకానిచ...'తో ప్రదక్షిణ పూర్తిచేస్తూ పూజ ముగించడమైనది.

"రోజూ పూజ చేస్తావా?" అని నాన్న అడిగిన ప్రశ్నకు, "టైం ఉండదు నాన్నా, కారులో భగవద్గీత వినటమే...'

"టైం మన ఇష్టాన్ని బట్టి ఉంటుంది. నీ చిన్నప్పటి నుండి నేను పూజ చేసుకోకుండా బయటకు వెళ్ళిన రోజు చూశావా?"

"అప్పుడుకాలం వేరు నాన్నా, ఇప్పుడు అన్నీ పరుగులే".

"నేను నమ్మను శంకర్. మనం చెయ్యాలనుకున్నప్పుడు దేనికైనా ఐదు నిమిషాలు టైం దొరుకుతుంది. ఎందుకు చెబుతున్నానంటే పూజ దేవుడి కోసం కాదు మనకోసం... మన ఏకాగ్రతకోసం... మన ఆలోచనాసరళి కోసం... ఒక క్రమబద్ధమైన జీవితం కోసం. ఐదు నిమిషాల ఏకాగ్రత 24 గంటల పనికి మనల్ని ప్రిపేర్ చేస్తుంది. ఫ్రెష్‌గా ఆలోచించే శక్తిని ఇస్తుంది. అలవాటు చేసుకోవాలి అంతే".

నాన్న చెప్పినదాన్లో నిజం ఉందనిపించింది. దానికి ఉదాహరణ ఆ రోజు పూజ గదిలో తనకు కలిగిన అనుభూతి!

సాయంకాలం పాత ఘంటసాల పాటలు వినడం అలవాటు ఈశ్వరరావుకు... అవి వింటూ ఉంటే... చక్కటి సంగీతం మనసులో ఇంతటి ఆనందాన్ని నింపుతుందా అనిపించక మానలేదు శంకర్‌కు...

నిత్యం ఉరుకుల పరుగుల జీవితంలో... సాయంకాలాలు టీవీ తప్ప ఇష్టమైన పాటలు వినే యోచన ఎక్కడ? విపరీతమైన శబ్దాలతో, అర్థంకాని సాహిత్యంతో ఉన్న ఈ తరం పాటలూ... డాన్సులే ఎక్కువ. టీవీ చూస్తున్నా, డైనింగ్ టేబిల్ దగ్గర కూర్చున్నా కొత్త ప్రాజెక్టు గురించో లేక ఆన్‌లైన్ ప్రెజెంటేషన్, తరువాత వచ్చే ఇంక్రిమెంట్... బోనస్ ఇవి తప్పించి హాయిగా ఆనందంగా గడిపి ఎన్ని రోజులైంది?... ఆలోచనలు క్యూ కట్టాయి శంకర్ మనసులో.

రాత్రి పడుకున్న శంకర్‌కి హఠాత్తుగా నాన్న ఉద్యోగవిరమణ ఘట్టం గుర్తుకు వచ్చింది. ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం అయినా ప్రత్యేకమైన

హోదాతో స్పెషల్ వ్యక్తిగా గుర్తింపు పొందిన నాన్నని రిటైర్ అయ్యాక మరో రెండేళ్లు పనిచెయ్యమని ఎంతగానో బతిమాలుకున్నారు కంపెనీ వాళ్ళు. ఆయన వినలేదు. చివరికి అప్పటికే ఉద్యోగంలో ఉన్న తను కూడా చెప్పాడు చెయ్యమని...

"నేను వదిలేస్తే మరొకరికి అవకాశం ఉంటుంది. ఉద్యోగమూ, జీతమూ నాకు అవసరం లేనప్పుడు మరోవ్యక్తి, అర్హత ఉన్నవాడు అది అనుభవిస్తే బాగుంటుందిరా! నేను పల్లెకు వెడతాను. ప్రశాంతంగా పల్లెలో ఉండాలని ఉంది" అని పల్లె చేరాడు.

అలా ఊరు చేరి అక్కడి ప్రజలకు ఎన్నో విషయాలలో ఉపయోగపడుతున్నాడనేది అక్షర సత్యం! అందుకే ఆయన ఎంచుకున్న జీవితం ఎంతో ప్రశాంతంగా, ఆనందంగా గడుస్తోంది. అది ప్రత్యక్షంగా కనిపిస్తోంది.

మరి తను ఎందుకు ఇంత ప్రెజర్ ఉన్న జీవితాన్ని అనుభవిస్తున్నాడు? లోపం ఎక్కడ? ఒకసారి నాన్నతో మాట్లాడాలి... అనుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు.

మరుసటిరోజు సాయంకాలం పొలం దగ్గరికి వాకింగ్‌కి వెళ్ళినప్పుడు... కానుగ చెట్ల కింద చల్లగాలికి కూర్చున్నారు.



"నాన్నా, నాకు వర్క్‌ప్రెజర్ ఎక్కువగా ఉంది. కోరుకున్నట్టుగా ముందుకు వెళ్ళలేక పోతున్నాను అనిపిస్తుంది. ఈసారి కొత్త ప్రాజెక్ట్‌కి కొత్తవాళ్ళని తీసుకున్నారు. నేనెక్కడ ఫెయిల్ అయ్యానో తెలియటం లేదు. ఒకోసారి చాలా అశాంతిగా ఉంటోంది. భవిష్యత్తులో నేను ఎదగలేనేమో అని భయంగా ఉంటోంది..' అన్నాడు.

భార్య ద్వారా సమస్య కొద్దిగా తెలిసివున్నా కొడుకు స్వయంగా అడగటంతో డైరెక్ట్‌గా మాట్లాడవచ్చు అన్న ఆనందం కలిగింది ఈశ్వరరావుకి.

"మన జీవితం ఎప్పుడూ మన ఆలోచనల బట్టి ఉంటుంది శంకర్. కొత్త ప్రాజెక్టులకు కొత్త స్కిల్ ఉన్నవాళ్ళను ఎంపిక చేసుకుని ఉండవచ్చు. నీ క్వాలిఫికేషన్ బట్టి నీ టెక్నిక్స్ బట్టి ఇన్ని రోజులూ ప్రాజెక్టులు చేశావు కదా! ఇతరులతో పోల్చుకుని జీవితం దుఃఖమయం చేసుకోవడం ఎందుకు? రేపు పొద్దున్న నీకు తగ్గ ప్రాజెక్ట్ వచ్చినప్పుడు నీ దగ్గరికే వస్తారు కదా! నిన్ను ఎలా ఉపయోగించుకోవాలో కంపెనీకి తెలిసి ఉంటుంది".

"ఇప్పటికాలంలో ప్రతిసారీ ముందుకే వెడుతూ ఉండాలి నాన్నా. కొంచెం వెనకపడ్డామంటే గుర్తింపే ఉండదు. గుర్తింపు లేకపోతే జాబ్ ఉండదు. డబ్బు ఉండదు. నలుగురిలో ఎంత అవమానం..'

"మంచి జాబ్ వలన డబ్బూ, హోదా... సుఖానికి వసతులూ, నలుగురిలో మెప్పూ వస్తుందనేగా.."

"అవును మరి"

"కొంచెం ఆలోచనలు వేరుగా చేస్తే బాగుంటుందేమో".

శంకర్ మాట్లాడకుండా లేచి నిలబడితే ఈశ్వరరావు అనుసరించాడు. ఇద్దరూ ఆలోచనలో పడి మౌనంగానే ఇల్లు చేరారు. ఇంటికి వచ్చినా వాళ్ళిద్దరూ ఎక్కువ మాట్లాడక పోవడం గమనించిన దీప్తి 'ఏమయింది' అని ఆలోచనలో పడింది. తరువాత రెండు రోజులూ శంకర్ పొద్దుటిపూట పూజగదిలో కొంచెంసేపు కూర్చోవటం చూసి అత్తా కోడలూ సంతోషపడ్డారు.

మూడోరోజు శంకర్‌తో ఈశ్వరరావు, "శంకర్, నీ వర్క్ గురించి నాకు అంతగా అవగాహన లేదు అయినా ఒకటి ఆలోచించావా కొత్త ప్రాజెక్టుకు వచ్చినవాళ్ళు కేవలం స్కిల్ ద్వారానే వచ్చినప్పుడు... సీనియర్స్ అయిన మీకు ట్రైనింగ్ ఇచ్చే సమయం లేక టెంపరరీగా వాళ్ళని తీసుకుని ఉండవచ్చు. ఇది మీ సీనియర్స్‌కు తక్కువ ఇంపార్టెన్స్ ఇచ్చినట్టుగా ఎందుకు అనుకోవాలి? 'ప్రతి ఒక్కరికీ అవకాశాలు వస్తాయి' అని మనం ఆలోచిస్తే ఇంత టెన్షన్ పడాల్సిన అవసరం లేదేమో...'

"నేను అదే ఆలోచిస్తున్నాను నాన్నా! ఈ రెండు రోజుల మెడిటేషన్ వల్ల నా ఆలోచనాతీరు మారిందని అనిపిస్తోంది".

"నేను చెప్పదల్చుకున్నదీ అదే శంకర్. ఎప్పుడూ అందరికంటే ఎక్కువ స్థితిలో ఉండాలనే కోరుకుంటూ మనకంటే పైమెట్టు మీద ఎవరూ ఉండకూడదనే భావనతో బాధ పడుతూ ఉండటం కంటే.. 'మనలాగే ప్రతి ఒక్కరూ' అని ఆలోచిస్తే ఎలా ఉంటుంది? చెప్పు'.

'మీరు చెప్పేది బాగుంది కానీ ఇది కాంపిటీషన్ యుగం నాన్నా".

"ఏ యుగం అయినా మన జీవితం మనది కదా! మన సంతోషం కోసం మనం, మన జీవితాన్ని నిశ్చింతగా ఆనందంగా గడిపే సంతృప్తి కోసం బతుకుదాం అనుకుంటే.."

"మీరలా అడిగితే కష్టం నాన్నా".

"అడిగితేనే చేసే ఆలోచన కాదు శంకర్. నీకు గుర్తింపు లేదనుకుంటే ఇంకో ఉద్యోగం చూసుకోవచ్చు. కానీ నీలాగే ప్రతిఒక్కరూ ఆలోచిస్తారని మరచిపోకు. హోదా, డబ్బూ మాత్రమే ముఖ్యం కాదు. మనశ్శాంతి ముఖ్యం. డబ్బున్న ఎందరో అశాంతితో ఉంటున్నారు. మన జీవితం శాంతిమయంగా చేసుకోవటం మన ఆలోచనాధోరణి బట్టి ఉంటుంది. ఎందరికో దొరకని జీవితం నీకు ఉంది. ఇతరులతో పోల్చుకోకుండా జీవితాన్ని హాయిగా ఎలా గడపటం అన్న మరో ఆలోచన చేయటం వల్ల నీకు ఎంత సంతృప్తి కలుగుతుందో చూడు. శాంతిగా బతికే విధానాలు చాలా ఉన్నాయి శంకర్... ఎప్పుడూ కాంపిటీషన్ గురించే కాక 'చారిటీ' గురించి కూడా ఆలోచన చెయ్యి. ఒకసారి రుచి తెలిస్తే అది ఎంత ఆనందాన్నిస్తుందో తెలుస్తుంది. 'పరిగెత్తి పాలు తాగటం కన్నా నిలబడి నీళ్ళు తాగడం చేస్తే' నీళ్ళు కూడా ఎంత రుచిగా ఉంటాయో తెలుస్తుంది. ఆ నిలబడ్డంలోనే చుట్టూ అందమైన దృశ్యాలు కూడా ఆస్వాదించగలం!".

ఆరోజు శంకర్‌కు నాన్న చెప్పిన మాటలు కొంచెం బాగా అనిపించింది. ఇంటికి వచ్చాక ఎంతో ఉల్లాసంగా కనిపిస్తున్న అతన్ని చూసి చాలా సంతోషపడింది దీప్తి.

తరువాత రెండు రోజుల్లోనే ఆఫీసు నుండి ఫోను వచ్చింది. 'కొత్త ప్రాజెక్ట్ వచ్చాయనీ కొత్త రిక్రూట్‌మెంట్స్ కూడా ఉంటాయనీ, దానికి సీనియర్‌గా తన అవసరం ఉందని వెంటనే జాయిన్ అవ్వాలని! సడన్‌గా వచ్చిన ఈ డెవలప్‌మెంట్‌లో మళ్ళీ 'కొత్త ప్రాజెక్ట్‌కి కొత్తవారు' అన్న దానికి శంకర్ ఎలా రియాక్ట్ అవుతాడో అని భయపడింది దీప్తి. కానీ శంకర్ వాళ్ళ నాన్నతో, "అర్జంట్‌గా వెళ్ళాలి నాన్నా, కొత్త ప్రాజెక్ట్ వచ్చాయట! కొత్తవారిని అపాయింట్ చెయ్యాలి..." అంటూంటే ఈశ్వరరావు కొడుకు వైపు చూశాడు.

"నేనేమీ ఫీల్ అయిపోవడం లేదు నాన్నా... కొత్త ప్రాజెక్ట్‌లో నేను లేకపోయినా స్కిల్ ఉన్న వాళ్ళని తీసుకొని కంపెనీ సక్సెస్‌కు సాయపడాలి. నా ఆలోచనాధోరణి మారింది. జీవితం ప్రతి ఒక్కరిదీ... ఇక సుఖంగా ఎలా ఉండగలను అన్నదే కాంపిటీషన్..." నవ్వుతూ అన్నాడు. దీప్తి ఆనందంగా చూసింది భర్తను...

బయలుదేరుతూ అమ్మనాన్నలకు కాళ్ళకు మొక్కి ఈశ్వరరావు చేతిని ఆప్యాయంగా నొక్కుతూ "థాంక్ యూ నాన్నా" అన్నాడు.

అనుకోకుండా కంపెనీ అతని సీనియారిటీ గుర్తు చేసుకోవటం యాదృచ్ఛికమే అయినా, జీవితం పట్ల శంకర్‌కు పెరిగిన అవగాహన ఆనందాన్ని ఇచ్చింది ఈశ్వరరావుకు.

ఫోన్: 08571-280673

సురభి

కొత్త రూలు

పిల్లల చేతుల్లో స్మార్ట్‌ఫోన్లు...చకచకా కదిలే వేళ్ళు...టెంపుల్‌రన్, క్యాండీక్రష్, సబ్‌వే సర్ఫర్స్... లేదంటే ఫేస్‌బుక్, ట్విట్టర్...కలికాలం కాస్తా స్మార్ట్‌ఫోన్‌కాలంగా మారింది. సోషల్ మీడియాలో లైక్‌లు, కామెంట్స్ లోకంగా కాలం గడిపేస్తున్నారు. దీనివల్ల పిల్లల ఆలోచనాతీరులో చెప్పలేనన్ని మార్పులు. స్మార్ట్‌ఫోన్ల ప్రభావం వాళ్ల చదువులపై కూడా పడుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే చెన్నైలోని ఓ విద్యాలయంలో పిల్లలకు ఓ కొత్త రూల్ పెట్టింది.

చెన్నైలోని శ్రీమతి సుందరవల్లి మెమోరియల్ ట్రస్ట్ కింద నాలుగు స్కూళ్ళు పని చేస్తున్నాయి. అయితే ఇటీవల తమ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఫేస్‌బుక్, ట్విట్టర్ అకౌంట్లు ఉండకూడదని కొత్త రూల్ పాస్‌చేసింది. తమ పిల్లలకు సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో అకౌంట్లు లేవని డిక్లరేషన్ ఇవ్వాల్సిందిగా తల్లిదండ్రులను కోరింది. ఈ విషయాన్ని ట్రస్ట్ వెబ్‌సైట్‌లో కూడా ఉంచింది. ఈ స్కూల్లోనే చదివే విద్యార్థి పేరెంట్ ఒకరు దీన్ని ట్విట్టర్‌లో పోస్ట్ చేయడంతో, ఈ వార్త సోషల్‌మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. అయితే స్కూళ్ళలో ఈ రకమైన రూలు విధించడాన్ని చాలామంది సమర్థిస్తున్నారు. కానీ పిల్లలను టెక్నాలజీకి దూరం చేస్తున్నారని మరికొంత మంది విమర్శిస్తున్నారు. మరి మీ అభిప్రాయమేంటి!

అండర్ వాటర్ మ్యూజిక్

హోరెత్తిపోయే సంగీతం, ఉర్రూతలూగే కుర్రకారు, విద్యుత్ కాంతుల మెరుపులు ఇవన్నీ ఉంటేనే మ్యూజిక్ బ్యాండ్. కానీ ఈ మ్యూజిక్ బ్యాండ్ మాత్రం మిగతా వాటికి భిన్నం.

బిట్వీన్ మ్యూజిక్ బ్యాండ్ వాళ్ళు మిగతా వాళ్ళలా స్టేజ్ ఎక్కి పాటలు పాడరు. వీళ్ళదంతా డిఫరెంట్ స్టైల్. పూర్తిగా నీటిలో మునిగి బ్యాండ్ బాజా మోగిస్తారు. లైలా స్కోవ్‌మండ్ నేతృత్వంలోని ఈ మ్యూజిక్ బ్యాండ్ ప్రపంచంలోనే మొట్టమొదటి అండర్‌వాటర్ మ్యూజిక్ బ్యాండ్. అనుకోకుండా జరిగిన ఓ సంఘటన వాళ్ళని ఈవిధంగా ప్రేరేపించింది.

ఒకరోజు లైలా ముఖం కడుక్కుంటుండగా ఆమెకు నీళ్ళలో ఉండి పాట పాడలేనా? అన్న ఆలోచన వచ్చిందట! అంతే తన సహచరులందరూ కలిసి మూడేళ్ళు కష్టపడి తమ ఆలోచనకు ఒక రూపునిచ్చారు.

ప్రస్తుతం ఈ బ్యాండ్ ప్రదర్శనంతా నీటిలోనే. సింగర్ లైలా శ్వాస తీసుకోకుండా నోట్లోంచి గాలిబుడగలు బయటికి వెళ్ళకుండా పాడుతుంది. మిగతా సభ్యులు క్రిస్టలోఫోన్, డ్రమ్స్, వయోలిన్ తదితర పరికరాలతో హుషారెత్తించే సంగీతం పుట్టిస్తారు. మైక్‌ల ద్వారా ఆ శబ్దం బయట ఉన్న స్పీకర్లకు అనుసంధానిస్తారు. ఐదుగురు ప్రత్యేకంగా తయారుచేసిన ఐదు నీటి తొట్టెల్లో ఉండి తమ ప్రతిభ ప్రదర్శిస్తారు. ప్రదర్శన మధ్యలో వాళ్ళకి వచ్చే బ్రేక్‌లోనే నీటిలోంచి బయటికొచ్చి గాలి పీల్చుకుంటారు బృందం సభ్యులు. ఈ బ్యాండ్ సంగీత సాధన వీడియో ఆన్‌లైన్‌లో వైరల్ అయింది.

సన్నబడాలా? ఐతే మోసేయ్!

ఊబకాయం నేడు అతిపెద్ద సమస్య. దీని కోసం నియతాహారం, జిమ్, వాకింగ్, జాగింగ్ వంటి ప్రయత్నాలు చేస్తుంటారు. కొవ్వు తగ్గించుకోడానికి ఎన్నో మార్గాల్లో శ్రమిస్తుంటారు మరికొంతమంది. కానీ కాంగ్‌యాన్ మాత్రం ఇలాంటివాళ్ళందరికీ భిన్నం. బరువు తగ్గడానికి కొత్తమార్గం ఎంచుకుని సక్సెస్ అయ్యాడు. దాంతో వార్తల్లో వ్యక్తిగా నిలిచాడు.

చైనా జిలిన్ రాష్ట్రానికి చెందిన కాంగ్‌యాన్ మూడేళ్ళ క్రితం వరకు దాదాపు 230 పౌండ్లు (110 కేజీలు) బరువుతో ఇబ్బందిపడేవాడు. ఎలాగైనా సన్నబడాల్సిందే అనుకున్నాడు. కానీ వ్యాయామం, జిమ్ ఇవన్నీ చేయటం ఎలర్జీ కాంగ్‌యాన్‌కి. ఎలా తగ్గాలి? కొత్తగా ట్రై చేస్తేపోలా? అని ఆలోచించాడు. తన ఒంటి బరువు తగ్గించుకోవాలంటే నెత్తిన బరువు మోయాల్సిందే అని నిర్ణయించుకున్నాడు. రోజూ పొద్దున్నే వాకింగ్‌కి వెళ్ళేవాడు. అది ఆషామాషీ వాకింగ్ కాదు. రోజూ బండరాయి నెత్తినపెట్టుకుని మోసుకెళ్లేవాడు. మొదట తక్కువ బరువు రాయితో ప్రారంభించి, క్రమంగా ఆ బరువును 40 కేజీలకు పెంచుకుంటూ వెళ్ళాడు. దాన్ని నెత్తిన పెట్టుకుని దాదాపు రెండు మైళ్ళ వరకు నడుస్తూ కసరత్తులు చేసేవాడట. అలా బరువు మోసీ, మోసీ అతగాడు సన్నబడిపోయాడు. ఆ విధంగా 40 కిలోలు బరువు తగ్గించుకున్నాడు.

'తినేకొద్దీ బరువు పెరుగుతావ్, మోసేకొద్దీ 'బరువు' తగ్గుతావ్' అంటూ కాంగ్‌యాన్ చేసి చూపించిన ఈ కాన్సెప్ట్ ప్రస్తుతం చైనా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇదిప్పుడు చాలామందిని ఆకర్షిస్తోందట. భలే ఉందికదా!

పిల్లికి స్పెషల్ వైన్

ఇంట్లోకి పిల్లి అలవాటైందంటే పాలగిన్నె దాచుకోవాల్సిందే! కానీ ఇప్పుడాభయం లేదని చెబుతోంది అపోలో పీక్ సంస్థ. ఎందుకంటే పిల్లుల కోసం ప్రత్యేకంగా వైన్ తయారుచేసిందట ఆ సంస్థ! ఈ వైన్‌ని కూడా పూర్తిగా ఆల్కహాల్‌రహితమైనదట.

అమెరికాలోని కొలరాడోకి చెందిన అపోలోపీక్ సంస్థ పుదీనా, బీట్‌రూట్, సముద్రపు నీటిని ఉపయోగించి ఈ వైన్ తయారుచేసింది. ప్రస్తుతం ఇది కొలరాడోలో మాత్రమే అందుబాటులో ఉంది. అంతేకాదండోయ్, 'పీనట్ మియావ్', 'మోస్‌క్యాట్‌వో' వంటి వివిధ ఫ్లేవర్లలో ఈ వైన్ లభిస్తుందట. ఈ వైన్ తాగటం వల్ల పిల్లులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు రావని చెబుతోందీ సంస్థ. ఇంకేం, ఇంట్లో పాలు లేకపోతే ఎంచక్కా ఈ వైన్‌తో పెంపుడు పిల్లుల కడుపు నింపేయచ్చు.

-నర్మద వాసిరెడ్డి

అధికారం ఆమడదూరం

ఒక పక్క అధికార పక్షం, మరో పక్క చిన్నా చితకా పార్టీల కూటమి, ఇంకో పక్క స్వపక్షంలోని ప్రత్యర్థులు స్టాలిన్‌కు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఆయన ఈ వర్గాలతో అభిమన్యుడిలా పోరాడాల్సి వస్తోంది.

తమిళనాడులో డీఎంకే నాయకుడు ఎంకే స్టాలిన్ ప్రస్తుతం బాలచంద్ర, అభిమన్యుల్లాగా అనేక మంది శత్రువులతో ఒంటరి పోరాటం సాగిస్తున్నారు. ఒకపక్క అన్నాడీఎంకే, మరోపక్క రాష్ట్రంలో క్రమంగా బలం పుంజుకుంటున్న ద్రావిడేతర పార్టీలు, ఇంకొక పక్క సొంత పార్టీలోని శత్రువర్గాలు ఆయనకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే వీల్ చెయిర్‌కి అంకితమైన వయోవృద్ధ తండ్రి కరుణానిధి కూడా ఆయనకు ఇప్పుడు ఓ శత్రువుగానే కనిపిస్తున్నారు. నిజానికి, ఆయన సారథ్యం కారణంగానే పార్టీ గత శాసనసభ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు సంపాదించగలిగింది. పరాజయం పాలయినప్పటికీ, ఎక్కువ సీట్లు తెచ్చుకోవడం ఆయన ఘనతే. అయినప్పటికీ స్టాలిన్ పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది.

ఎన్నికలకు ముందు ప్రారంభమైన యుద్ధం ఇప్పటికీ కొనసాగుతోంది. అన్ని దిక్కులకూ నిర్విరామంగా అస్త్రశస్త్రాలు సంధించాల్సి వస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లో డీఎంకే ప్రాధాన్యం కొనసాగాలన్నా, డీఎంకేలో తన వ్యక్తిగత ప్రాధాన్యం, ప్రాభవం ఏమాత్రం తగ్గకుండా ఉండాలన్నా ఆయన ఇలా సవ్యసాచిలా పోరాడక తప్పదు. అయితే, ఆయన ఇలా ఎంత కాలం పోరాటం సాగిస్తారన్నది మాత్రం వేచిచూడాల్సిన విషయమే. డీఎంకే అధినేత కుటుంబం నుంచే ఆయనకు ప్రతిపక్షం ఎదురవుతోంది. అయితే, ఈ రకమైన ప్రతిపక్షం దాడిని తిప్పికొట్టడం, ఎదురుదాడి సాగించడం ఆయనకేమీ కొత్తకాదు. పైగా అది ఆయన తండ్రి నుంచి వారసత్వంగా కూడా వచ్చింది. అనేక సంవత్సరాల నుంచి కరుణానిధి దేశ, రాష్ట్ర రాజకీయాల్లో దాడులను తిప్పికొట్టడంలోనూ, ఎదురు దాడులు సాగించడంలోనూ దిట్ట.

దివంగత ఎంజీ రామచంద్రన్ రాష్ట్రాన్ని పాలిస్తున్న రోజుల్లో, అంటే 1977 నుంచి 1987 వరకూ పదేళ్ల పాటు డీఎంకే, కరుణానిధి వనవాసం చేయాల్సి వచ్చింది. ఎంజీఆర్ పాలనకు ముందు, ఎంజీఆర్ పాలన తరువాత రెండు సార్లు రాష్ట్రపతి పాలనను కూడా అనుభవించాల్సి వచ్చింది. మొత్తం మీద పాండవులు 13 ఏళ్ల వనవాసాన్ని, ఒక ఏడాది అజ్ఞాత వాసాన్ని అనుభవించినట్టు కరుణానిధి కూడా అనుభవించాల్సి వచ్చింది. అనేక పర్యాయాలు కరుణానిధే తన వనవాస, అజ్ఞాత వాసాల గురించి ప్రజలకు, కార్యకర్తలకు చెబుతుంటారు. వాస్తవానికి ఆయన ఇటువంటి పురాణాలను నమ్మరు. అయినప్పటికీ, పాండవులు ఈ వనవాస, అజ్ఞాత వాసాలను అనుభవించింది ఒక కారణం మీద అయితే, కరుణానిధి అనుభవించింది మాత్రం మరో కారణంగా.

అసలు సారథి

అప్పట్లో కూడా పార్టీని ముందుకు నడిపించిన వ్యక్తి స్టాలినే. కరుణానిధి అవినీతి, సమర్థ పాలన, శాంతి భద్రతలు వంటి అంశాలపై దృష్టి పెట్టి పాలన సాగిస్తున్న కాలంలో స్టాలిన్ పార్టీని పరిపుష్టం చేయడానికి తన సమయం, సామర్థ్యాన్నంతా కేంద్రీకరించారు. ఈ ఇద్దరు ఇలా పార్టీని, ప్రభుత్వాన్ని వేర్వేరుగా ఏలుతున్న కాలంలోనే, అంటే 40 ఏళ్ల క్రితం నుంచే, కుటుంబ పాలన అనే పాట వ్యాప్తిలోకి వచ్చింది. స్టాలిన్ బంధువు మురసోలి మారన్‌ను, స్టాలిన్‌ను ఇదే కారణం మీద ప్రత్యర్థులు ఘాటు విమర్శలు చేస్తుండేవారు. అయితే, ఆ ఇద్దరూ పెద్దగా వెలుగులో ఉండేవారు కాదు. పైగా ఇప్పటిలా సోషల్ మీడియా కూడా లేనందు వల్ల, వారిద్దరి పేర్లు పెద్దగా వెలుగులోకి రాలేదు. కానీ, ఇప్పుడలా కాదు. విమర్శకులు ఆయన అన్న ఎంకే అళగిరి, సవతి చెల్లెలు కనిమొళి పేర్లను కూడా చేర్చి డీఎంకేను చీల్చి చెండాడుతున్నారు. వీరు చాలదన్నట్టు మురసోలి మారన్ కుమారుల పేర్లు కూడా ఈ జాబితాకు చేరి మరింత సమస్య సృష్టిస్తున్నాయి.

విచిత్రమేమిటంటే, తండ్రి తరపు బంధువుల నుంచే కాక, స్టాలిన్ తరపు బంధువుల నుంచి కూడా తరచూ సమస్యలు ఎదురవుతున్నాయి. స్టాలిన్ భార్య దుర్గ, వారి అల్లుడు శబరీశన్‌లు ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించారు. స్టాలిన్ ఎన్నికల ప్రచార నిర్వహణ బృందంలో వారిద్దరూ కీలక వ్యక్తులుగా వ్యవహరించారు. కరుణానిధితో ఆగకుండా, ఇప్పుడు వారసత్వం స్టాలిన్‌కు కూడా పాకిందని ఎన్నికల్లో ప్రత్యర్థులు ఆయనను దుయ్యబట్టడం మొదలు పెట్టారు. ప్రత్యర్థులు ఎన్ని రకాలుగా విమర్శలు సాగించినా డీఎంకే అభిమానులు మాత్రం వారి ప్రచారాన్ని మెచ్చుకుని వారిని ఆదరించారు. స్టాలిన్ నాయకత్వంలోని డీఎంకే ఈ మాత్రమైనా సీట్లు సంపాదించుకోగలిగిందంటే ఇది కూడా ఎంతో కొంత దోహదం చేసిందనే చెప్పాలి. నిజానికి ఇటువంటి ఘనత కరుణానిధి వల్ల కూడా సాధ్యమయ్యేది కాదు. పార్టీ అభ్యర్థుల్ని శబరీశన్ కాకుండా స్టాలినే స్వయంగా ఎంపిక చేసి ఉంటే అధికారం చేజిక్కేదనే అభిప్రాయం మాత్రం పార్టీలో వ్యక్తమయింది. ఇంతకూ ఇటువంటి విమర్శలూ, ఆరోపణలను స్టాలిన్ ముమ్ముందు ఎలా ఎదుర్కుంటారనేది వేచి చూడాల్సిన విషయమే.

పార్టీలో మరో ఇరకాట పరిస్థితి కూడా కనిపిస్తోంది. తన రాజకీయ వారసుడు స్టాలినేనని పార్టీ వ్యవస్థాపకుడు కరుణానిధి చాలా ఏళ్ల

రివ్యూ

- రాజశుక

> **తమిళనాడులో డిఎంకే పరాజయం పాలైనప్పటికీ ఆ పార్టీ ఎక్కువ సీట్లు సంపాదించింది. అది స్టాలిన్ ఘనతే. అయినప్పటికీ ఆయన పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. ఈ పరిస్థితుల్లో పార్టీ ప్రాభవం పెరగాలంటే స్టాలిన్ ఇంటా బయటా సవ్యసాచిలా పోరాటం కొనసాగించాల్సిందే. కానీ ఎన్నికల ప్రచారంలో స్టాలిన్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించివుంటే ఆ పార్టీ గెలిచివుండేదా?**

క్రితమే ప్రకటించినప్పటికీ, కార్యకర్తల దృష్టి ఇంకా కరుణానిధి మీదే కేంద్రీకృతమై ఉంది తప్ప, స్టాలిన్ మీదకు మళ్లడం లేదు. నవతరం తమిళనాడు ఓటరు మార్పు కోరుకుంటున్నాడు. సైద్ధాంతికంగానే కాక, రాజకీయ, పాలనాపరంగా కూడా పెద్దయెత్తున మార్పు జరగాలని ఓటరు ఆశించినట్టు గత ఎన్నికలు తేటతెల్లం చేశాయి. ఓటరు అంచనాలకు స్టాలిన్ సరిగ్గా సరిపోతారు. దీన్ని అర్థం చేసుకోవడంలో కరుణానిధి తప్పటడుగు వేసినట్టు కనిపిస్తోంది. స్టాలిన్ ముఖ్యమంత్రి అభ్యర్థి అని ఆయన ధైర్యంగా, నిర్ణయాత్మకంగా ప్రకటించి ఉంటే పార్టీకి విజయావకాశాలు మెరుగు పడి ఉండేవేమో! తటస్థ ఓటర్లు కూడా స్టాలిన్ వైపు మొగ్గు చూపేవారేమో? కానీ, కరుణానిధి ఈ తొంభయ్యేళ్ల వయసులో కూడా తానే ముఖ్యమంత్రి అభ్యర్థినని ప్రకటించడంతో పార్టీ విజయావకాశాలు వికటించినట్టు కనిపిస్తోంది. పైగా మరో రెండు రోజుల్లో ఎన్నికలు జరగబోతున్నాయనగా ఆయన ఈ ప్రకటన చేశారు.

మారిన పరిస్థితి

పార్టీ విజయావకాశాలు దెబ్బతినడానికి మరో కారణం...ఎన్నికల ప్రచారంలో కరుణానిధి తన బంధువు దయానిధి మారన్‌ను పక్కన ఉంచుకోవడం కూడానని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దయానిధి మారన్ 2జి, ఎయిర్‌సెల్-మ్యాక్సీ కేసుల్లో ఉన్న విషయం తెలిసిందే. 2జి కేసులో ఉన్న ఆయన కుమార్తె కనిమొళి కూడా ప్రచారంలో విస్తృతంగా పాల్గొనడం మరో మైనస్ పాయింట్. ఆమె అప్పటికి బెయిల్ మీద తీహార్ జైలు నుంచి బయటికి వచ్చి కొద్ది కాలమే అయింది. కొన్ని నియోజకవర్గాల్లో ఆమె ఎంపిక చేసిన అభ్యర్థులకే సీటు ఇవ్వడం కూడా ఓటర్లకు నచ్చని విషయం. ఓ ప్రతిపక్ష నాయకుడుగా స్టాలిన్ పరిణతి చెందిన నాయకుడి మాదిరిగా వ్యవహరించారు. "ఇది అన్నాడీఎంకేకి గొప్ప విజయమూ కాదు, డీఎంకేకి అవమానకర అపజయమూ కాదు" అని ఆయన ఎన్నికల ఫలితాల అనంతరం వ్యాఖ్యానించారు.

మొత్తం 234 సీట్ల శాసనసభలో డీఎంకే-కాంగ్రెస్ కూటమికి 98 సీట్లు దక్కడం చిన్న విషయమేమీ కాదు. అన్నాడీఎంకే నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా 'మారిన పరిస్థితి'ని గుర్తించినట్టే కనిపిస్తోంది. ఎన్నికల తరువాత నుంచి కరుణానిధి ఒక్కరోజు కూడా గ్యాప్ లేకుండా జయలలిత ప్రభుత్వం మీదా, జయలలిత మీదా అస్త్రశస్త్రాలు సంధిస్తూనే ఉన్నారు. జయలలిత సహా అన్నాడీఎంకే మంత్రులంతా ఆయన ప్రశ్నలకు, ప్రకటనలకు సమాధానం చెప్పడానికే తమ సమయమంతా వినియోగించాల్సి వస్తోంది. ఎన్నికల ప్రచారంలో మద్య నిషేధంతో సహా అనేక అలవికాని వాగ్దానాలు చేసిన అన్నాడీఎంకే నాయకులు, జయలలిత ఇపుడు కరుణానిధిని, స్టాలిన్‌ను ఎదుర్కోలేక అవస్థలు పడుతున్నారు. కరుణానిధి వెలుపలా, స్టాలిన్ అసెంబ్లీ లోపలా జయలలితను ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేయడం గమనించాల్సిన విశేషమే.

నిజానికి స్టాలిన్ తన సోదరుడు అళగిరి నుంచి ఇబ్బందులు ఊహించారు. ఎక్కడికక్కడ అళగిరికి చెక్ పెట్టడానికి ఆయన వ్యూహరచన చేయాల్సి వచ్చింది. పార్టీ అభ్యర్థులను ఓడించడానికి అళగిరి కుట్ర చేస్తున్నారంటూ ఆయన తండ్రికి చెప్పి నమ్మించడంలో కృతకృత్యులయ్యారు. చివరికి అళగిరి కుతంత్రాల వల్ల పార్టీకి జరిగిన నష్టమేమీ లేదు. ఎన్నికల ప్రచార సమయంలో అళగిరి తన తమ్ముడు స్టాలిన్‌కు అవరోధాలు సృష్టించడమే పనిగా పెట్టుకున్నారు. పలువురు పార్టీ అభ్యర్థుల పరాజయంలో ఆయన హస్తం ఉంది. ఎన్నికలు ప్రకటించిన తరువాత తన తండ్రిని కలుసుకుని ఆయన మనసు తెలుసుకున్న అళగిరి తన తండ్రి స్టాలిన్‌కే అనుకూలంగా ఉన్నాడని గ్రహించకపోలేదు. దాన్ని మనసులో పెట్టుకునే ఆయన పార్టీ విజయానికి కాకుండా పరాజయానికి విశేషంగా కృషి చేశాడని పార్టీ వర్గాలు బహిరంగంగానే చెబుతున్నాయి.

ఆవిరైన అళగిరి

అయితే, అళగిరి పేరును ఇప్పుడు పార్టీలో గానీ, ప్రజల్లో గానీ ఎవరూ స్మరించడం లేదు. ఒకప్పుడు పార్టీలో ఆయనకు ఓ వర్గమంటూ ఉండేది. దక్షిణ తమిళనాడులో ఆయన ప్రాబల్యానికి, ప్రాభవానికి కొరత ఉండేది కాదు. ఈ ఎన్నికల దెబ్బతో ఆయన ప్రాభవం బాగా తగ్గిపోయినట్టు కనిపిస్తోంది. స్టాలిన్, కరుణానిధిలపై వ్యక్తిగత కక్షతో ఆయన పార్టీ పరాజయానికి కూడా వెనుకాడకపోవడం పార్టీ నాయకులకు ఆగ్రహం తెప్పించింది. అధికారంలోకి రావడానికి పార్టీ మరో అయిదేళ్లు ఆగాల్సి రావడమన్నది వారు జీర్ణించుకోలేకపోతున్నారు.

పార్టీ పరాజయానికి మరో ముఖ్యమైన కారణం, చక్రాల కుర్చీకే పరిమితమైన కరుణానిధి తన కుమారుడు స్టాలిన్‌కు ఎన్నికల ప్రచారంలో తగినంత ప్రాధాన్యం ఇవ్వకపోవడం. ఆయన చక్రాల కుర్చీకి అంకితం కావడం అన్నాడీఎంకే అభ్యర్థులకు ఓ అవకాశంగా పరిణమించింది. ఆయన బాగా వృద్ధులైపోయారనీ, ఆయన ఇక నాయకత్వం వహించడం గానీ, పాలన సాగించడం కానీ చేయలేరనే అభిప్రాయాన్ని ఓటర్లలో కలిగించడానికి అన్నాడీఎంకే విశ్వప్రయత్నం చేసింది. అటువంటి సమయంలో డీఎంకే స్టాలిన్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించి ఉంటే ఫలితాలు మరోలా ఉండేవి. పార్టీ ఆ విషయంలో వ్యూహాత్మకంగా విఫలం అయినట్లు కనిపిస్తోంది. చాలా ఏళ్లుగా పార్టీ వ్యవహారాలు స్టాలిన్ చుట్టూ తిరుగుతున్నాయన్నది కాదనలేని సత్యం. యువ ఓటర్లు కూడా స్టాలిన్ వైపే మొగ్గు చూపుతున్నారన్నది కూడా తిరుగులేని వాస్తవం. అపర చాణక్యుడుగా పేరున్న కరుణానిధి మొదటిసారిగా తప్పటడుగు వేసినట్టు కనిపిస్తోంది. ఇప్పటికైనా ఆయన తన కుమారుడికి మార్గం సుగమం చేయడం ఆవశ్యం అని చెప్పక తప్పదు.

నవ్య

ఇద్దరూ భోంచేసి బయలుదేరేసరికి మరో గంట పట్టింది. సమంత భోంచేయలేదు. తనకు ఆకలిగా లేదు అంది. సమీర మజ్జిగ కలిపి ఇచ్చింది.

వచ్చేప్పుడు సమంత గురించి చెప్పాడు శ్రీకర్.

"సమీరా...సమంత ఎందుకో బాగా అప్‌సెట్ అయి ఉంది. కొంచెం జాగ్రత్త తీసుకోండి" చెప్పాడు.

"తప్పకుండా" చెప్పింది సమీర.

రాత్రంతా నిద్రపోలేదు సమంత.

తల్లి మాటలు ఆమెని తీవ్రంగా వేధించాయి. క్షణకాలం తండ్రి గుర్తొచ్చాడామెకు. ఆయన ప్రేమగా ముద్దాడిన క్షణాలు గుర్తుకు రాలేదు. తనని కన్న ఒకే ఒక్క నేరానికి జీవిత కాలం అమ్మ శిక్ష అను భవించింది. అది ఇంకా పూర్తి కాలేదు.

కూతురు ఎదిగొస్తే తల్లిగా తను సంతోషించాలి కానీ, తనెందుకు బాధ పడుతుంది? తను నిరక్ష రాస్యురాలు కాదు. నిరుద్యోగి అంతకన్నా కాదు. కేవలం ఆడది అన్న కారణంగా భర్త అనే పేరుతో తనకొక తోడు కావాలని తల్లి కోరుతోంది. ఏ కాలంలో ఉంది అమ్మ?

భర్త అనే పేరుతో మగతోడు లేకుండా స్త్రీలు జీవించలేరా? పెళ్ళి చేసుకుంటే తప్ప స్త్రీ జాతికి విముక్తి లేదా? మగవాడి దౌర్జన్యాన్ని జీవితకాలం భరించడం కంటే మరో దారి లేదా?

సమాజం ఎందుకిలా తయారైంది?

తన తల్లి లాంటి వాళ్ళకి ఏం చెప్పాలి?

ఆహారం లేకుండా మనిషి బ్రతకలేడు. నిద్ర లేకుండా బ్రతకలేడు. ఈ రెండు అనుభవంలోకి రావడానికి మగవాడి అవసరం ఏముంది?

ఆర్థిక స్థిరత్వముంటే ఆహార భద్రత ఉంటుంది. చట్టాలు అందరికీ సమానంగానే ఉంటాయి.

మరి మగవాడు ఎందుకు?

సెక్సుకోసమా? మగవాడిపై ద్వేషం తన వయసుతో పాటు పెరిగినకొద్దీ సెక్స్‌పైన కూడా తనకి అయి ష్టత పెరిగిపోయింది. దీని పేరు ఫ్రిజిడిటీయా?

అయితే కావచ్చు.

తను సెక్సు కోసం వెంపర్లాడడం లేదు.

మరి అమ్మెందుకు నా వెంట పడుతోంది?

తనకి పెళ్ళికావాలి. తద్వారా బిడ్డ పుట్టాలి. ఆ బిడ్డ ద్వారా పున్నామ నరకం నుండి రక్షించ బడాలి. ఇవన్నీ అవసరమా?

అసలు స్వర్గం నరకమనేవి ఉన్నాయా?

పెళ్ళి కాకపోతే తను నరకానికి పోతుందా?

పోనివ్వు, చనిపోయిన తర్వాత ఏమయితే నేమి?

క్షణకాలం శ్రీకర్ వైపు ఆలోచనలు పోయాయి.

ఎందుకతను తనని ఇంతలా వాంఛిస్తున్నాడు?

ఇదంతా ప్రేమా? వ్యామోహమా?

తనకంటే ఎందరో అందగత్తెలుండగా తన వెంట పడడమేమిటి?

'ఇగో!' అదే మేల్ ఇగో! ఆ ఇగోని సంతృప్తి పరచుకోవడానికి దానికి ప్రేమనే ముసుగును వేస్తున్నాడు.

తన దగ్గర్నుంచి ఏమి ఆశిస్తున్నాడు అతను.

సెక్స్...వాంఛ?

అది తీరిపోతే అతడికి అవతల లభించేది ఏమిటి?

భార్య అనే పేరుతో అతడికొక బానిస కావాలి.

అతడి స్నానానికి నీళ్ళు రెడీ చేయడం దగ్గ ర్నుంచీ భోజనం...మధ్యాహ్నం క్యారేజీ..రాత్రికి భోజనం...మళ్ళీ ఉదయం టిఫిను..గానుగెద్దు జీవితం.

రొటీన్..ఎక్కడికెళ్ళేది చెప్పడానికి కూడా అతడికి అహం అడ్డుగా వస్తుంది.

ఎక్కడికెళ్ళేది చెప్పకపోతే తనకి కోపం వస్తుంది.

పిల్లలు పుడితే ప్రధాన బాధ్యత తనదే అవుతుంది.

పిల్లలు ప్రయోజకులైతే క్రెడిట్ క్లెయిమ్ చేసుకుంటారు. చెడిపోతే తల్లిపైనే నెడతారు.

జారిపోయిన స్తనాలు... చెదిరిన జుట్టు.. నలిగిపోయిన నడుం... అతన్ని ఆకర్షించక పోతే... అతడి కళ్ళు చుట్టుపక్కల ప్రదక్షిణం చేస్తుంటాయి. అది ఆఫీసు కావచ్చు. గుడి కూడా కావచ్చు. ఆ చూపులు పరాయి స్త్రీల అందాల్ని వేటాడుతుంటాయి.

'మా ఆయన రొమాంటిక్' అని తాను పొంగి పోవాలా? లేదా ఇదేం పైత్యమని నిలదీయాలా?

అప్పుడు వచ్చే సమాధానమేంటి?

'నా ఇష్టం. ఇష్టముంటే ఉండు, కష్టమైతే

వెళ్ళిపో'

ఈ మాత్రం దానికి వివాహమెందుకు?

దానికంత పవిత్రత ఎందుకు?

సృష్టి మొదలైనప్పట్నించీ వివాహవ్యవస్థ లేదు కదా? నాగరికత అనే ముసుగులో స్వీయ బానిసత్వమా? దీనికి సమాజం ఆమోదమా?

ప్రపంచమంతా తనకి తోచిన రీతిలో సహజంగానో, అసహజంగానో సాగిపోతోంది కదా. తానొక్కతి మాత్రమే పెళ్ళికి దూరమైతే సమాజం స్తంభించిపోతుందా?

తనని స్వతంత్రంగా బ్రతకనివ్వరేం?

అమ్మ హోదాలో ఆమె ఆగ్రహం, ప్రేమ పేరుతో ఇతడి హూంకరింపు!

వీళ్ళనెలా అర్థం చేసుకోవాలి. తల తిరిగి పోయింది సమంతకు.

చాలా ప్రశ్నలు. తనే సమాధానాలు చెప్పుకుంది.

ఎక్కడికెళ్ళినా ఆఖరికి అమ్మ దగ్గరకు వచ్చి ఆగిపోతుంది.

ప్రపంచం సర్వనాశనమైనా తాను అంతగా చలించదేమో!

అమ్మ కన్నీళ్ళు మాత్రం ఆమెని అతలా కుతలం చేశాయి.

●●●

వారం గడిచింది. ఈ వారం రోజుల్లో అమ్మ తనతో సరిగ్గా మాట్లాడడం లేదని ఆమెకి అర్థమైంది. గుండెల్లో మెలితిరిగిన బాధ. తాను పెళ్ళిని రిజెక్ట్ చేస్తున్నాననన్నదే తల్లి నిరసన.

తన దిగులుతో అమ్మ ఆరోగ్యం మరింత శుష్కించే ప్రమాదముంది.

అది తను సహించలేదు.

ఆ రోజు సాయంత్రం సమీర ఒక బాంబు పేల్చింది.

"సమూ, నేను మ్యారేజ్ చేసుకోవాలనుకుంటున్నాను" అంది.

సమంత ఒక నిమిషం విస్తుపోయింది.

"అవునా? ఎవర్నే?" అంది.

"శ్రీకర్‌గారి స్నేహితుడు రమణను" చెప్పింది.

"రమణనా..." అంది పాలిపోయిన ముఖంతో.

"అవును. నిన్ను శ్రీకర్ వైపు డైవర్ట్ చేయమని కోరుతూ అతను నా వెంట పడ్డాడు. నువ్వు శ్రీకర్ వైపు డైవర్ట్ కాలేదు కానీ, నేను మాత్రం అతడి వైపు డైవర్ట్ అయ్యాను. మండే మా మ్యారేజీ. నువ్వు, శ్రీకర్ సాక్షి సంతకాలు పెట్టాలి" అంది సమీర.

కొద్ది నిమిషాల తర్వాత తేరుకుని "బెస్టాఫ్ లక్" చెప్పింది సమంత.

"నాకు మా ఇంట్లోవాళ్ళ అనుమతి అవసరం లేదు. రమణ ఆన్సర్ చేయాల్సిన వాళ్ళు కూడా ఎవరూ లేరు. అందుకే ఆర్యసమాజంలో మ్యారేజ్ చేసుకోవాలనుకుంటున్నాం" చెప్పింది సమీర.

మళ్ళీ ఆలోచనల్లో పడింది సమంత.



జరిగిన కథ

బాల్యంలో తల్లి పడిన కష్టాలు ప్రత్యక్షంగా చూసిన సమంత పెళ్ళి, తాళి వ్యవస్థపై నమ్మకం కోల్పోతుంది. శ్రీకర్ ప్రతిపాదనను తిరస్కరిస్తుంది. మరొకర్ని చూసుకోమని సమంత నిష్కర్షగా చెప్పడంతో మంచం పడతాడు శ్రీకర్. వారిద్దరినీ కలిపేందుకు శ్రీకర్ తమ్ముడు, మరదలు, సమంత స్నేహితురాలు, ఆమె ప్రియుడు నడుం కడతారు. చికిత్స నిమిత్తం సమంత తల్లిని వారం రోజులు హాస్పిటల్‌లో ఉంచినప్పుడు శ్రీకర్, సమంతల మధ్య కొంత సాన్నిహిత్యం ఏర్పడుతుంది. ఆ తర్వాత....

సమీర వెళ్ళిపోతే తను ఒంటరి. ఇందుకేనా పెళ్ళి? ఆలోచనల్లో పడింది సమంత.

మధ్యరాత్రి దాహమై నిద్రలేచిన సమీర నిద్రపోకుండా కూర్చుని ఉన్న సమంతను చూసింది.

"ఏంటే, నిద్ర పోలేదా?" అడిగింది.

"నిద్ర రావట్లేదే. పెళ్ళి చేసుకొని నువ్వు వెళ్ళిపోతే నేను ఒంటరిని కదా? అని ఆలోచిస్తున్నా" అంది.

సమీరకు క్షణకాలం కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"సమూ, నేనెక్కడికి పోతానే. ఇదే అపార్ట్‌మెంటులోనో, దగ్గర్లోనే వేరే ఫ్లాట్ తీసుకుంటాం అంతే కదా, ఎప్పుడైనా నువ్వు రావచ్చు" అంది ఓదార్పుగా.

"పర్వాలేదులేవే. అమ్మని రమ్మని అడుగుతాను" అంది సమంత.

"మొన్ననే అడిగావు కదా? అమ్మ రానంది కదా" గుర్తు చేసింది సమీర.

"బ్రతిమాలుకుంటానే" అంది సమంత.

●●●●

అలా అన్నదే కానీ అమ్మ మొండితనం తనకి తెలుసు.

తను స్వతంత్రంగా బ్రతకాలనే స్వభావం గలది.

తన ఊరు, అక్కడి పరిసరాలు విడిచి ఆమె రాదు.

వంద ఆలోచనల మదింపు తర్వాత ఒక నిర్ణయానికి వచ్చి, శ్రీకర్‌కి ఎసెమ్మెస్ ఇచ్చింది "వెంటనే కలవాలని."

ఉదయాన్నే ఎసెమ్మెస్ చూసి "ఎక్కడ?" అడిగాడు.

"ఇంట్లోనే. మీరూ, రమణ రండి..." చెప్పింది.

శ్రీకర్ నుదురు ముడిపడింది. రమణను ఎందుకు పిలుస్తోందో అర్థం కాలేదు.

ఉదయాన్నే ఆఫీసుకు రెడీ అవుతున్న సమీరక్కూడా "మీరా, ఈ రోజు నువ్వు కూడా లీవు పెడుతున్నావ్..." చెప్పింది.

"లీవా? ఎందుకు?" ఆశ్చర్యంతో తెల్ల ముఖం వేసింది సమీర.

"శ్రీకర్, రమణ ఇద్దరూ వస్తున్నారు. ఇంపార్టెంట్ డిస్కషన్ ఉంది" చెప్పింది.

"రమణ కూడానా?" ఆశ్చర్యపోతూ అడిగింది.

యామీ గౌతమ్ సీక్రెట్ కాపురం?

యామీ గౌతమ్ తెలుగులో పెద్దగా క్లిక్ కాలేదు కానీ, బాలీవుడ్‌లో అడపాతడపా సినిమాలు చేస్తూ ఫాంలోనే ఉంది. ఈ చిన్నది ఇటీవల బాలీవుడ్ హీరోతో సీక్రెట్‌గా కాపురం పెట్టేసిందన్న ప్రచారం జరుగుతోంది. 'సనమ్ రే'లో పుల్కిత్ సామ్రాట్, యామీ జంటగా నటించారు. సినిమాల్లో ప్రేమ సన్నివేశాల్లో నటించే సమయంలోనే వీరిద్దరి మధ్య రియల్ ప్రేమ మొదలైందట! ప్రేమించుకోవడంతోనే ఆగిపోకుండా ముంబాయిలో ఓ ఫ్లాట్‌లో కొత్త కాపురం పెట్టారంటున్నారు. హీరోగారు ఈ వార్తలను ఖండించినా యామీ నోరు విప్పకపోవడంతో సీక్రెట్ కాపురం నిజమేనేమో? అన్న అనుమానాలు బాలీవుడ్‌లో వ్యక్తం అవుతున్నాయి.

"అవును" చెప్పింది.

"దేనికి?" అడిగింది.

"సస్పెన్స్" అంటూ ఫ్రెషప్ కావడానికి బాత్‌రూంలోకి దూరింది సమంత.

పది గంటలకల్లా బాగా ముస్తాబై శ్రీకర్, రమణ కోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు.

సమంత స్వయంగా తనే ఫోన్ చేసి ప్రాజెక్ట్ ఇంచార్జి కర్కరేకి చెప్పింది. "సర్...ఇవాళ నేనూ, సమీరా రావడం లేదు."

"అవునా? ఏంటి విశేషం! ఇద్దరూ ఒకేసారి లీవు పెట్టారు" ఉత్సుకతతో అడిగాడు కర్కరే.

"ఈరోజు సమీర బర్త్‌డే సర్" చెప్పింది.

"ఓ వండర్‌ఫుల్! మరి నాకు ట్రీట్ ఇవ్వరా" అడిగాడు సరదాగా.

సమంత కాస్త ఇబ్బంది పడింది.

"ఓకే" అంటే వెంటనే వచ్చేసినా ఆశ్చర్యం లేదు.

"పెద్దగా సెలబ్రేట్ చేసుకోవడం లేదు సర్. గుడిలో పూజ చేయిస్తున్నా" సమంత మరో అబద్ధాన్ని ఆశ్రయించింది.

"ఓకే... వెల్.. గో.. ఎ.. హెడ్" చెప్పాడు.

సమీర నోరు వెళ్ళబెట్టి "సడన్‌గా నన్ను బర్త్‌డే బేబీని చేశావు కదే. కర్కరేసర్ అసాధ్యుడు. నిజంగానే నా బర్త్‌డే ఉందో లేదోనని నా రెజ్యూమ్ చెక్ చేస్తే బావుండదుకదా" అంది.

"నో ప్రాబ్లమ్. అప్పుడు ఇంకో అబద్ధం ఆడదాం" అంది.

మరు నిమిషంలోనే కర్కరే సమీరకు నేరుగా ఫోన్ చేసి గ్రీట్ చేశాడు.

సమీర ఇబ్బందిగా ముఖం పెట్టి "థాంక్స్ సర్" అంది.

"ఓకేరా... నువ్వు ఓకే అంటే... నీ తరపున మన వాళ్ళందరికీ తాజ్ బంజారాలో ఈవెనింగ్ ట్రీట్ ఇస్తా" చెప్పాడు.

సమీర ఇబ్బంది పడుతూ...

"థాంక్స్ సర్... మీకు ఖర్చు ఎందుకు సర్" అంది.

"వాట్ సమీరా! నువ్వు సమంతకి గ్రేట్ ఫ్రెండువి. సమంత నాకు హాట్ ఫేవరేట్ కదా" అన్నాడు.

సమంత వింటూ నవ్వుతోంది.

'నన్ను ఇరికించావు గదే' అన్నట్టు చూసింది సమీర.

"బై సర్...మళ్ళీ కాల్ చేస్తా" అని ఫోన్ పెట్టేసింది.

సమంతను చూస్తూ "ఎందుకే నన్ను ఇబ్బందులకు గురి చేస్తావ్" అంది చిరుకోపంగా.

"ఆ... ఎంత కాలం, ఇంక నాలుగురోజులేగా నాతో ఉంటావు. నా కోసం ఆ మాత్రం ఇబ్బంది పడకపోతే ఎలా?" అంది.

"ఏమంటున్నాడు... మన షారూఖ్ ఖాన్..." అడిగింది మళ్ళీ సమంత.

"అనడమేంటే తల్లీ... మన కొలీగ్స్‌కి నా బర్త్‌డే సందర్భంగా ట్రీట్ ఇస్తానంటున్నాడు. అయినా ఇంత అందం పోగేసుకున్న తర్వాత కర్కరే లాంటి నడివయస్సు వాడు కూడా నీకు సైట్ కొట్టకుండా ఎలా ఉంటాడు" అంది.

"అయితే నా అందం అడవిగాచిన వెన్నెల కాకూడదని షారూఖ్ ఖాన్ కూడా బలంగా అనుకుంటున్నాడన్న మాట" అంది నవ్వుతూ సమంత.

"నీకంతా వేళాకోళమేనే..." అని సమంత తలపై మొత్తింది. కర్కరేని బట్టతల వచ్చిన షారూఖ్ ఖాన్‌గా అల్లరి చేస్తూ ఉంటుంది సమంత.

అంతలో బయట కాలింగ్ బెల్ చప్పుడు కావడంతో ఒక్క ఉరుకున వెళ్ళి సమంత తలుపు తీసింది. ఎదురుగా శ్రీకర్, రమణ ఉన్నారు. "రండి" పిల్చింది.

"ఇంత సడన్ ఇన్విటేషన్ ఏంటో.." అడిగాడు శ్రీకర్ ఆశ్చర్యంగా.

"చెబుతాను, ముందు టిఫిన్ చేయండి..." అంది.

"సారీ, చేసే వచ్చాం" చెప్పాడు శ్రీకర్.

"అయితే కాఫీ తాగండి" అంటూ తనే స్వయంగా ఫ్లాస్క్‌లో కాఫీ కప్పులో వంచి ఇచ్చింది.

రమణ కళ్ళతోనే 'ఏంటీ ఇన్విటేషన్' అన్నట్టు చూశాడు సమీరను.

సమీర తెలీదన్నట్టు సైగ చేసింది.

కాఫీ తాగిన తర్వాత ఎదురెదురుగా కూర్చున్నారు.

"రమణగారూ... కంగ్రాట్స్! మీరు మా సమీరకు హబ్బీ అవుతున్నారట గదా" అడిగింది.

రమణ సిగ్గుపడ్డాడు.

"ముందుగా మీకు చెప్పనందుకు సారీ. మీ ఇద్దరినీ కలపబోయి మేమిద్దరం ఒకటయ్యాం" అన్నాడు కాస్త గిల్టీగా రమణ.

"అంతా భగవత్ సంకల్పం కదా" అంది సమంత.

సమీర ఆశ్చర్యంగా నోరు వెళ్ళబెట్టి 'ఏంటో భగవంతుడి మీద చాలా కాన్ఫిడెన్స్ చూపిస్తోంది' అనుకుంది.

వాస్తవానికి సమీర బలవంతం మీద నాలుగైదు సార్లు టెంపుల్‌కి వచ్చింది తప్ప స్వతహాగా సమంత భక్తురాలు కాదు. కాసేపు కబుర్లు తర్వాత పెదవి కదిపింది సమంత.

"నేనో నిర్ణయానికి వచ్చాను. అది మీతో షేర్ చేసుకోవాలనే పిలిచాను" చెప్పింది శ్రీకర్‌ని చూస్తూ. శ్రీకర్‌లో ఉత్కంఠ పెరిగింది.

బహుశా తనను పెళ్ళి చేసుకునేందుకు అంగీకరిస్తుందా? అంతకంటే శుభవార్త తనకేముంది? కాసేపు ఊహాల్లో విహరించాడు.

అతడి ఊహలకు అడ్డుకట్ట వేస్తూ..."మా అమ్మని సంతోష పెట్టాలనుకుంటున్నాను. ఈ వృద్ధాప్యంలో ఆమె ఒక్కరోజు బాధపడడం కూడా నాకిష్టం లేదు" అంది.

సమీర ఉత్కంఠతతో చూస్తూ "దానికి ఏం చేయదలుచుకున్నావ్" అడిగింది.

"శ్రీకర్‌గారు అంగీకరిస్తే అతడితో సహజీవనానికి నేను సిద్ధం" అంది.

శ్రీకర్ ముఖంలో వెలుతురు గుప్పున ఆరిపోయింది.

"నాకు అర్థం కావట్లేదే" అంది సమీర ఆదుర్దాగా.

"అర్థంకాకపోవడానికి నేను లాటిన్ మాట్లాడడం లేదు. అమ్మ దృష్టిలో పెళ్ళి. నా దృష్టిలో సహజీవనం" చెప్పింది.

"సమంతగారూ కాస్త స్పష్టంగా చెప్పండి" అడిగాడు రమణ కన్ఫ్యూజన్ ఎక్కువై.

"శ్రీకర్‌గారు నన్ను ప్రేమించానన్నారు. నన్ను పెళ్ళి చేసుకుంటానన్నారు. పెళ్ళి ద్వారా అతడికి

నాతో లభించేది శారీరక సాహచర్యం. అందుకు సిద్ధమేనని నేను అంటున్నాను. పార్టనర్‌గా నాపై అతడికి ఎలాంటి హక్కులూ ఉండవు. నా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలని వేటినీ నేను వదులుకోను. అందుకు నేను ఒక అగ్రిమెంట్ తయారు చేశాను. ఇష్టమైతే సంతకం పెట్టి నాతో జీవించవచ్చు" చెప్పింది సమంత.

శ్రీకర్ ముఖం పాలిపోయింది.

కేన్సర్‌తో బాధపడుతున్న తల్లిని సంతృప్తి పరచాలి. ఆమె సంతృప్తి పడాలంటే తన పెళ్ళి ఒక్కటే పరిష్కారం అని భావించింది ఆమె. కానీ పెళ్ళి అంటే సదభిప్రాయం లేదు. మరోవైపు అతడామెను గాఢంగా ప్రేమిస్తున్నాడు. వీళ్ళిద్దరితో పాటు తనకీ న్యాయం జరగాలంటే ఒక మధ్యేమార్గం ఆలోచించాలి అనుకుంది. బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది. ఆమె ఎలాంటి నిర్ణయం తీసుకుంది? ఆ నిర్ణయం సమాజం హర్షించదగ్గదేనా?

సమీర కూడా అయోమయంగా చూసింది. రమణలో కన్ఫ్యూజన్ మరింత పెరిగింది.

సమీర బలవంతంగా గొంతు పెగుల్చుకొని అడిగింది.

"సమంతా, నువ్వెందుకిలా ఆలోచిస్తున్నావ్? మ్యారేజ్‌కి అగ్రిమెంట్ ఏమిటి?" అడిగింది.

"మ్యారేజ్ కాదు సహజీవనం. మా అమ్మ దృష్టిలో మ్యారేజ్‌గానే చలామణి కావాలి. శ్రీకర్ క్రిస్టియన్ కాబట్టి తాళి కట్టలేదని చెబుతాను.." చెప్పింది సమంత.

చాలాసేపటి తర్వాత శ్రీకర్ అన్నాడు.

"సమంతా, నువ్వు కావాలని కోరుకున్నాను కాబట్టి నీ మనోభావాలు వేటినైనా గౌరవిస్తాను. కానీ అగ్రిమెంట్ వంటివి పెట్టి నా ప్రేమను పల చన చేయకు" అర్థిస్తున్నట్టుగా అన్నాడు.

"సారీ శ్రీకర్! నేను నీతో జీవించాలనుకుంటున్నది నీ మీద ప్రేమతో కాదు. కేవలం మా అమ్మ కోసమే! మీరు కాదంటే చెప్పండి... మా ప్రాజెక్టు మేనేజర్ కర్కరే సిద్ధంగా ఉన్నాడు. ఎంతోకొంత మీపైన సానుభూతి, సాఫ్ట్ కార్నర్ ఉంది కాబట్టే... మీకు ముందుగా ప్రయారిటీ ఇస్తున్నాను" కాస్త నిర్లక్ష్యంగా చెప్పింది సమంత.

శ్రీకర్‌కి ఒకింత కోపం వచ్చింది.

కర్కరేతో తనని పోల్చడం అతడికే మాత్రం రుచించలేదు. అన్నింటికన్నా తనపై ఏ మాత్రం ప్రేమ లేదని కేవలం సానుభూతి ఉందని చెప్పడం అతడి హృదయాన్ని ఇంకా గాయపరిచింది. "సారీ సమంతా! నేను వెంటనే ఏమీ చెప్పలేను" చెప్పి "వస్తాను" అంటూ బయలుదేరుతుంటే,

"మీరు వెంటనే సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. ఓ వారం రోజులు సమయం తీసుకోండి. అగ్రిమెంటులోని నిబంధనలను మీకు మెయిల్ చేశాను. ఒకసారి చెక్ చేసుకోండి" అంది సమంత.

శ్రీకర్ సమాధానం చెప్పకుండా బయలుదేరాడు.

రమణ అనుసరించాడు.

సమీర నిస్సహాయంగా రమణను చూసింది. శ్రీకర్, రమణ ఇద్దరూ వెళ్ళిపోయిన తర్వాత సమీర సమంతపైన విరుచుకుపడింది.

"ఏంటే నీ ఉద్దేశం... సలక్షణంగా శ్రీకర్‌ని పెళ్ళి చేసుకోక అగ్రిమెంట్‌తో సహజీవనమేంటి? నీకేమైనా పిచ్చెక్కిందా?"

"నాకేమీ ఎక్కలేదే... మీరే అంతా మతి భ్రమించి భ్రమల్లో బ్రతుకుతున్నారు. స్త్రీ పురుషలను ఇద్దర్నీ కట్టి పడేయడానికి మీరేం కోరుతున్నారు? చట్టపరమైన సంరక్షణ. అంటే మీరు పెళ్ళి చేసుకోబోయే వ్యక్తిని చట్టబద్ధంగా ఫిక్స్ చేస్తున్నారు. దాని అర్థమేంటి? నువ్వెప్పుడైనా నాతో విడిపోతావ్ అనే అభద్రతా భావమే కదా. ఒక వేళ విడిపోతే లీగల్ రైట్స్‌గా మగవాడి ఆస్తిలో వాటానో, భరణాన్నో కోరుతున్నారు. ఇదేకదా మీరు కోరుకునే పవిత్ర బంధం.

నేను కోరుకునేది చట్టపరమైన సంరక్షణ కాదు. నా వ్యక్తిత్వానికి సంరక్షణ. ఎవరు... ఎవరికి నచ్చకపోయినా విడిపోవచ్చు. కోర్టులూ, చట్టాలూ అవసరం లేదు. బాధ అంతకన్నా లేదు. ఇదే స్త్రీగా నేను కోరుకునే స్వేచ్ఛ. ఈ స్వేచ్ఛ ప్రసాదించమనే నువ్వు నమ్ముకునే భగవంతుడ్ని ప్రార్థిస్తున్నా" సూటిగా చెప్పింది సమంత.

సమీర కన్విన్స్ కాలేకపోతోంది. ఆమె వాదనలో ఎంత నిజాయితీ ఉన్నా ఆమె మనసు అంగీకరించడం లేదు. గంటసేపు ఒకరితో ఒకరు మాట్లాడుకోకుండా మౌనంగా కూర్చుండిపోయారు.

•••

ప్రింట్ తీసి రమణకు కూడా ఒక కాపీ ఇచ్చాడు శ్రీకర్.

సమంత పంపిన అగ్రిమెంట్ తాలూకు ఈ-మెయిల్ అది.

"రమణా, తనకి వెర్రా" బాధగా అడిగాడు శ్రీకర్.

"శ్రీ, ఇది వెర్రి కాదురా. తను సమాజాన్ని ప్రశ్నిస్తోంది" చెప్పాడు రమణ.

"నీక్కూడా సగం పైత్యం అంటినట్టుంది" అన్నాడు శ్రీకర్ కాస్త కోపంగా.

"కాదురా... మనమొచ్చిన తర్వాత సమీరకు తనకీ వాగ్యుద్ధం జరిగిందట. సమీరకు సమంత పలు ప్రశ్నలు సంధించింది. అన్ని మతాలు జరిపే వివాహంలో రెండు దేహాలు కలుపుతున్నారు గానీ రెండు మనసులను కాదని తేల్చి చెప్పిందట. అంతేకాదు, పడే మూడుముళ్ళ నుండే స్త్రీ పురుషుల్లో అభద్రతా భావానికి బీజం పడుతుందట. వివాహ వ్యవస్థను తన కోణంలో తాను విశ్లేషించింది. సమంత మనమనుకునేంత అమాయకురాలు కాదు" చెప్పాడు రమణ.

తాప్సీ మాటలు తూటాలట!

ఇదేదో సినిమాలో డైలాగ్ కాదు. సినిమాకి రాస్తున్న డైలాగులు. 'తడ్కా' సినిమాలో నటించడమే కాకుండా తన పాత్రకి తానే డైలాగులు రాసుకుంటోందట తాప్సీ! ఈ సినిమాలో తన మాటలు తూటాల్లా పేలుతాయంటూ చెబుతోంది తాప్సీ.. ఇప్పటి వరకూ హీరోయిన్లు ఎక్కువగా సింగర్లుగా, డైరెక్టర్లుగా, ప్రొడ్యూసర్లుగా మారారు. తొలిసారి తాప్సీ డైలాగ్ రైటర్‌గా మారి కలం సత్తా చూపించనుంది. ఈ సినిమాకు వచ్చిన రెస్పాన్స్‌ను బట్టి తరువాతి సినిమా గురించి ఆలోచిస్తానంటోంది. నటిగా సక్సెస్ కాలేకపోయినా రైటర్‌గా అన్నా సక్సెస్ కావాలని సినీ జనాలు మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు.

"నీక్కూడా కాస్త మతి పోయినట్టుందిరా" అన్నాడు శ్రీకర్.

"మొదట అలాగే అన్పించింది. సమంత మాట్లాడేది ఏదీ అర్థం కాలేదు. సమాజంలో అంతా డొల్ల ఉందని అన్పిస్తుంది. మీరిద్దరూ పరిపూర్ణ ఆయుష్షు అనుభవించి జీవిత చరమాంకం వరకూ నువ్వు ఇదే ప్రేమను చూపగలిగితే... సమంత అనేక ప్రశ్నలకు నువ్వు జవాబు ఇచ్చినట్లే.."

"ఆమె చెబుతున్న అగ్రిమెంట్‌లో ఆ అవకాశం ఏది? తనకు ఏ విషయంలో కోపం వచ్చినా... తను నన్ను విడిచి వెళుతుంది. చట్టపరమైన ఆంక్షలు ఉండవు. తన మాటే ఫైనల్ కదా" అన్నాడు బాధగా.

"అందులో నీకూ సౌలభ్యం చూపిస్తోంది కదా? నీకూ కోపం వచ్చినా, మోజు తీరిపోయినా వెళ్ళిపోవచ్చు అంటోంది కదా. చట్టపరమైన ఆంక్షలు లేవంటుంది కదా? మగాడిగా ఇది నీకు చాలా సౌలభ్యం కదా?" లాజిక్ అందించాడు రమణ. శ్రీకర్ తల పట్టుకున్నాడు.

"నిజానికి ఈ అగ్రిమెంట్ మగాడిగా నీకే అడ్వాంటేజ్ నిస్తుంది. తను బోర కొడితే భరణం, ఆస్తి పంపిణీ వంటి గొడవలు లేకుండా హాయిగా విడిపోవచ్చు" సగం నవ్వుతూ అన్నాడు రమణ.

"లేదు. నాకు సమంత జీవిత కాలం కావాలి" చాలా స్థిరంగా అన్నాడు శ్రీకర్.

"ఓకే అయితే ఆమెని గాజుబొమ్మలా జాగ్రత్తగా చూసుకో. ఆమె పెట్టిన అగ్నిపరీక్షలో విజయం సాధించు" మరింత స్థిరంగా అన్నాడు రమణ.

"ఎస్, డన్! సమంత అగ్రిమెంట్‌కి ఒప్పు కుంటున్నాను" చెప్పాడు శ్రీకర్.

"కంగ్రాచ్యులేషన్స్" రమణ స్నేహితుణ్ణి గట్టిగా కౌగిలించుకున్నాడు.

మరు నిమిషంలోనే రమణ సెల్‌నుండి సమీరకు కాల్ వెళ్ళింది. మంచి రోజు చూసుకొని శ్రీకర్ ఫ్లాట్‌కి షిఫ్ట్ అయ్యింది సమంత.

అదే రోజు సమీర ఫ్లాట్‌కి షిఫ్ట్ అయ్యాడు రమణ.

రమణ, సమీర ఆర్య సమాజంలో పెళ్ళి చేసుకున్నారు.

●●●

"అమ్మా....నన్ను క్షమించు. మీకెవరికీ చెప్పకుండా పెళ్ళి చేసుకున్నాను" చెప్పింది సమంత. కూతురు చెప్పింది విని ఒక్క నిమిషం అవాక్కయింది సునంద.

"నిజంగానా రా..." అడిగింది సంభ్రమాశ్చర్యాలతో.

"అవునమ్మా... ఆకాశమంత పందిరి, బాజా భజంత్రీలు ఏవీ లేకుండా సింపుల్‌గా మ్యారేజ్ చేసుకున్నాం. ఆయనక్కూడా ఆర్భాటం ఇష్టం లేదు" చెప్పింది సమంత.

"నువ్వెలా చేసుకున్నా సంతోషమేరా! నువ్వొక ఇంటిదానివి కావాలనేగా మేమంతా కోరుకుంది" సంతోషంగా అంది సునంద.

తల్లి గొంతులో సంతోషం పసికట్టింది సమంత.

"నిజానికి నీ సంతోషం కోసమేనమ్మా... శ్రీకర్‌ని పెళ్ళాడాను" చెప్పింది సమంత.

"ఏది ఏమైనా దేవుడు నా మొర ఆలకించాడు. అది చాలమ్మా. అల్లుడిని తీసుకుని ఒకసారి ఊరికి రామ్మా" కూతుర్ని ఆహ్వానించింది సునంద. సమంత సంతోషానికి అవధుల్లేవు.

ఆఫీసునుండి వచ్చిన శ్రీకర్‌ని గట్టిగా కావలించుకొని చెప్పింది.

"థాంక్యూ శ్రీ... నీ వల్ల మా అమ్మను సంతోష పెట్టగలిగాను" చెప్పింది.

"రియలీ" అన్నాడు శ్రీకర్ తనుకూడా సంతోష పడుతూ.

"అవును" చెప్పింది సమంత.

"మన అగ్రిమెంటు గురించి కూడా చెప్పావా?" అల్లరిగా అడిగాడు.

"ఆ విషయం చెబితే చంపి పోగులేస్తుంది. అసలే ఆమెకు చాదస్తం ఎక్కువ" అంది.

"అయితే ఆ విషయం నేను మీ అమ్మకు చెప్పకుండా ఉండాలంటే నాకు మరో వంద ముద్దులు ఇవ్వాలి" అన్నాడు గారంగా.

"వంద కాదు. వెయ్యి తీసుకో" అంది పెదాలను దగ్గరగా పెడుతూ.

శ్రీకర్ క్షణం కూడా ఆగలేదు. సమంత పెదవులను తమకంగా అందుకున్నాడు.

సమంత ఇష్టంగా అతని కౌగిట్లో ఒదిగిపోయింది.

సమంత శ్రీకర్‌ల అగ్రిమెంట్ సహజీవనం మొదలై అప్పటికి అది ఐదోరోజు.

సరిగ్గా అదే సమయంలో తమ్ముడు రాజారావు కోసం ఎదురు చూస్తోంది సునంద.

రాజారావు తన చిన్న కూతుర్ని నర్సింగ్‌లో చేర్పించేందుకు విజయవాడ వెళ్ళి అప్పటికి రెండు రోజులు. వస్తూనే అక్క దగ్గరికి వెళ్ళాడు. విజయవాడ కనకదుర్గ కుంకుమ తీసుకెళ్ళి అక్కకు ఇవ్వాలని వెళ్ళాడు. తమ్ముడిని వాకిట్లో చూస్తూనే "తమ్ముడూ, మన సమూ పెళ్ళి చేసుకుందిరా" చెప్పింది.

రాజారావు నవ్వుతూ "తెలుసక్కా" చెప్పాడు.

"ఎలా రా" అడిగింది ఆశ్చర్యంగా.

"శ్రీకర్ తమ్ముడు దినకర్ చెప్పాడు"

మరింత విస్తుపోయింది సునంద.

"ఈ ఘట్టంలో ముఖ్య పాత్రలు వాళ్ళేనక్కా" చెప్పాడు రాజారావు.

సునందకు ఏమీ అర్థం కాలేదు.

"నీకు సుస్తీగా ఉందని పరీక్షల కోసం విజయవాడకు తీసుకువెళ్ళింది దినకర్ పనిచేస్తున్న హాస్పిటల్‌కే. అంతకుముందు దినకర్ నన్ను గుంటూరులో కలిశాడు. తన అన్న శ్రీకర్ మన సమంతపైన పెంచుకున్న ప్రేమ గురించి, మన సమంత కాదన్న తర్వాత అతడు మంచాన పడడం గురించి చెప్పాడు. నేను కూడా చాలా బాధపడ్డాను. మా చర్చల్లో ఆ రోజు విశాఖ నుండి వచ్చిన అతడు చేసుకోబోయే అమ్మాయి డాక్టర్ అరుణ కూడా కూర్చుంది. తను సైకియాట్రిస్ట్. మాటలమధ్యలో సమంతకు నీపై ఉన్న ప్రేమ గురించి చెప్పాను. తన తల్లిగా నీ మీద పెంచుకున్న ప్రేమ ఆప్యాయతనే అస్త్రంగా మార్చుకొని నీకు లేని కేన్సర్‌ని సృష్టించాం. హైదరాబాద్‌లో బసవతారకం కేన్సర్ ఇనిస్టిట్యూట్‌లో కేన్సర్ విభాగంలో పిఆర్‌వోగా ఉన్న వంశీకృష్ణ సహకారంతోనే నీకు ఉత్తుత్తి రేడియోథెరపీ చికిత్స చేశాం. నువ్వు నిజంగానే కుమిలిపోయి నువ్వు చేసిన మానసిక ఒత్తిడితోనే సమంత శ్రీకర్‌తో జత కట్టింది. నిజానికి శ్రీకర్‌ని తను వివాహం చేసుకోలేదు. అగ్రిమెంట్‌తో కూడిన సహజీవనం చేస్తోంది. అసలే పెళ్ళి వద్దని హఠం వేసుకొని ఉన్నదాన్ని అక్కడ వరకూ తేవడమే విశేషం" చెప్పడం ఆపాడు రాజారావు.

సునందకంతా అయోమయంగానూ, మరోవైపు ఆనందంగానూ ఉంది. "మరి వారి బంధం నిలుస్తుందా?" ఆందోళనపడింది సునంద.

"మన సమంత ఒంటరిగా బ్రతకడం కంటే ఇది కొంత బెటర్ కదా అక్కా. శ్రీకర్ నెమ్మదస్థుడు. ప్రేమ గల వ్యక్తి. ఒకరిద్దరు పిల్లలు పుడితే అంతా అదే కుదురుకుంటుంది" ధీమాగా చెప్పాడు రాజారావు.

"ఏమోరా... అంతా సవ్యంగా సాగి దాని కడుపున ఒక నలుసు పడితే వెంకటేశ్వరస్వామికి తలనీలాలు ఇస్తాను" మొక్కుకుంది సునంద.

"లేదక్కా... అంతా మంచే జరుగుతుంది" అన్నాడు రాజారావు.

"మరి నాకు కేన్సర్ లేదని చెప్పరా, సంతోషిస్తుంది."

"ఇప్పుడు వద్దక్కా. వాళ్ళిద్దరికీ ఒక నలుసు పుట్టాక చెబుదాం" చెప్పాడు రాజారావు.

(ఇంకావుంది)

అందాన్ని దెబ్బతీసే సెల్ఫీలు!

తరచూ సెల్ఫీలు తీసుకునే వారికి ఇది చేదు వార్తే! సెల్ఫీలు తీసుకునే సమయంలో ఫోన్ల నుంచి వెలువడే నీలిరంగు కాంతి, ధార్మిక శక్తి ముఖచర్మానికి హాని కలిగిస్తాయి అంటున్నారు లండన్ పరిశోధకులు. సెల్‌ఫోన్ నుంచి వెలువడే కాంతి, ధార్మికశక్తి ముఖం మీద ముడతలను కలిగించి అకాల వృద్ధాప్యానికి కారణం అవుతాయని వారు హెచ్చరిస్తున్నారు. ఓ పక్కగా ముఖం పెట్టి సెల్ఫీ తీసుకునేవారికి ఈ ప్రమాదం ఎక్కువ అని వారు చెబుతున్నారు. డిఎన్ఎ కణాల మీద కూడా వీటి ప్రభావం ఉంటుందంటున్నారు. సెల్ఫీలు తీసుకునే సమయంలో సన్‌స్క్రీన్ లోషన్ ఉపయోగించినా ఫలితం ఉండదని వారు స్పష్టం చేస్తున్నారు. చర్మ సౌందర్యాన్నీ, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే సెల్ఫీలకు సాధ్యమైనంత వరకూ దూరంగా ఉండడమే మంచిదని వారు అంటున్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

వంద అడుగులతో వందేళ్ళ జీవితం

భోజనం చేసిన వెంటనే కొద్ది దూరం నడవడం వలన ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు. భోజనానంతరం నడవడం అనేది ఇప్పుడు కొత్తగా వచ్చినది ఏమీ కాదు. ఇది మన పూర్వీకుల నుంచే ఉన్న అలవాటు. రాత్రి భోజనం చేసిన తరువాత కనీసం వంద అడుగులు నడిచినట్టయితే వంద సంవత్సరాల జీవితాన్ని సొంతం చేసుకోవచ్చని అంటున్నారు పరిశోధకులు. బయటకెళ్ళి నడవలేకపోయినా, ఇంటి ఆవరణలోనూ, ఇంటి చుట్టుపక్కలా నెమ్మదిగా నడవడం వలన గుండెకు సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశాలు చాలావరకూ తగ్గుతాయన్న విషయం వీరి పరిశోధనలో వెల్లడైంది. గుండెకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్న కొందరి మీద వీరు పరిశోధనలు నిర్వహించి ఈ విషయాన్ని నిర్ధారించారు. ఈ సమస్యలున్న వారిని ఎంపిక చేసి ప్రతిరోజూ రాత్రి సమయంలో వంద అడుగులు నడిపించారు. కొన్ని రోజుల అనంతరం వీరి గుండె పనితీరును పరిశీలించగా అంతకు ముందుకన్నా గుండె మరింత మెరుగ్గా పనిచేయడాన్ని గుర్తించారు. ఈ విషయం మీద వీరు ఇంకా పరిశోధనలు నిర్వహిస్తున్నారు.

ఊబకాయంతో ముందు తరాలకు ముప్పు

తల్లుల ఊబకాయం రాబోయే మూడు తరాల మీద ప్రభావం చూపుతుంది అంటున్నారు వాషింగ్టన్ పరిశోధకులు. ఊబకాయులైన తల్లులకు పుట్టే పిల్లలకు కూడా ఊబకాయం వచ్చే ప్రమాదం ఉందని చెబుతున్నారు. కొన్ని ఎలుకల మీద వీరు పరిశోధనలు నిర్వహించారు. ఆ ఎలుకలకు ఎక్కువ మొత్తంలో కొవ్వు, క్యాలరీలు ఉన్న ఆహారం ఇచ్చారు. అనంతరం వాటికి పుట్టిన పిల్లల బరువును పరిశీలించారు. ఎలుకలకు పుట్టిన పిల్లల పిల్లలు కూడా అధిక బరువు కలిగి ఉండడాన్ని గమనించారు. తల్లి బరువు పిల్లల ఆరోగ్యం మీదా వారి బరువు మీదా ప్రభావాన్ని చూపుతుందన్న సంగతి తెలిసిందే అయినా, మరో రెండు తరాలను కూడా ఈ సమస్య వేధిస్తుందన్న విషయం వీరి పరిశోధనలో తాజాగా వెల్లడైంది. జన్యువులే దీనికి కారణం అంటున్నారు. మొదటి నుంచి అధిక బరువు కలిగిన వారి సంతానానికే ఈ సమస్య సంక్రమిస్తుందా? లేక మధ్యలో బరువు పెరిగినా ఈ సమస్య రాబోయే తరాలకూ కొనసాగుతుందా? అన్న విషయమ్మీద వీరు పరిశోధనలు నిర్వహిస్తున్నారు.

కాళ్ళ తిమ్మిరికి సబ్బు వైద్యం?

ఉన్నట్టుండి కాళ్ళు తిమ్మిర్లెక్కడం, పట్టేయడం చాలా మందికి అనుభవైకవేద్యమే! పైకి చాలా చిన్న సమస్య అనిపించినా తరచూ తలెత్తే దీన్ని భరించడం కష్టంగానే అనిపిస్తుంది. అలా బాధపడేవారికి ఓ చిన్న చిట్కా చెబుతున్నారు నిపుణులు. రాత్రి పడుకునే సమయంలో పాదాల దుప్పటి కింద లావెండర్ సోపు పెట్టుకుని పడుకుంటే ఈ సమస్య నుంచి చాలా వరకూ ఉపశమనం పొందవచ్చు. కొందరు వైద్యులు ఆన్‌లైన్ ద్వారా ఇలాంటి చిట్కా వైద్యాన్ని ప్రయోగించారు. కాళ్ళ తిమ్మిరితో బాధపడే కొంత మందికి ఈ విధంగా పాటించమని సూచించారు. కొన్ని రోజుల అనంతరం వారి అభిప్రాయాలను ఆన్‌లైన్ ద్వారా సేకరించారు. వారిలో చాలామందికి సబ్బు చిట్కా వైద్యం ద్వారా కాళ్ళ తిమ్మిరి వంటి సమస్యల నుంచి కొంత వరకూ ఉపశమనం లభించినట్లు తెలియజేశారు. అయితే ఈ చిట్కావైద్యానికి ఏ విధమైన శాస్త్రీయత లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పాదాల కింద సబ్బును పెట్టుకుని పడుకోవడం వలన ఉపశమనం లభిస్తుందే తప్ప శాశ్వత పరిష్కారం లభించదంటున్నారు. ఒక్క కాళ్ళ తిమ్మిరే కాకుండా కొన్ని శారీరక నొప్పుల నుంచి కూడా ఉపశమనం పొందవచ్చని, అయితే మామూలు సబ్బులు ఈ చిట్కాకు పనిచేయవని కూడా నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

-అవినాష్

చినుకు చింతలకు చిట్కాల ఛత్రం

హమ్మయ్య వేసవికాలం వెళ్లిపోయింది. ఆహ్లాదం కలిగించడానికి మేమున్నామంటూ వచ్చేశాయి వర్షాలు. ఎండవేడిమి నుంచి ఉపశమనం కలిగింది సరేగానీ ఈ కాలం వానాకాలం మాత్రమే కాదు అనేక వ్యాధులు దరిచేరడానికి అవకాశం ఉన్న కాలం కూడా!

వర్షాకాలంలో మురికి, జబ్బుల భయం ఎక్కువ. ఈగలు, దోమల కాలం. అంటువ్యాధులు ప్రబలడానికి ఆస్కారం చాలా ఉంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులే అనారోగ్యంపాలయ్యే అవకాశాలు ఎక్కువ. సరైన జాగ్రత్తలు పాటించకపోతే మాత్రం ఆహ్లాదాన్నిచ్చే వర్షాలు కాస్తా అనారోగ్య హేతువులవుతాయి. అందుకే వర్షంలో తడవకుండా రక్షణ పాటిస్తే సరిపోదు. ఆరోగ్య సంరక్షణకూ జాగ్రత్తలు పాటించాల్సిందే. అందుకే వానాకాలంలో వ్యాపించే వ్యాధులు-తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ముందుగానే తెలుసుకుందాం మరి!

ప్యూరిఫైడ్ వాటర్

వర్షాకాలంలో నీరు కలుషితమయ్యే ప్రమాదం ఎక్కువ. వైద్యుల హెచ్చరికా ఇదే. ఈ కాలంలో మంచినీటి పైప్‌లైన్లు లీకైతే వర్షపునీరు, మురుగు నీరు అందులో చేరుతుంది. నీరు కలుషితమవుతుంది. అందుకని ప్యూరీఫైడ్ వాటర్ తాగడం తప్పనిసరి. నీటిని బాగా కాచి, వడబోసి తాగితే కాలుష్య ఇబ్బందుల నుంచి తప్పించుకోవచ్చు. లేకపోతే కడుపునొప్పి, గొంతునొప్పి సమస్యలు ఎదురవుతాయి. ముఖ్యంగా చిన్నపిల్లల్లో వాంతులు, విరోచనాలు, అతిసార, కామెర్లు మొదలైన అనారోగ్యాలు దరిజేరతాయి.

పరిశుభ్రత తప్పనిసరి!

ఈ కాలంలో వీధుల్లో, ఇంట్లో వర్షపు నీరు చేరిపోయే ప్రమాదం ఉంది. నీరు నిల్వ ఉండేచోట చెత్తా చెదారం పేరుకుపోతే ఈగలు, దోమలు, పురుగులు వ్యాపిస్తాయి. దోమల వల్ల ఎన్నో వ్యాధులు వ్యాపిస్తాయి. అలాగే వర్షాకాలం గాలిలో తేమ, వాతావరణ మార్పుల వల్ల ఆస్తమా, ఎలర్జీ, చర్మరోగాలు వస్తాయి. అందుకనే పరిశుభ్రత పాటించడం చాలా ముఖ్యం. వంటగది, హాలు, బాత్‌రూములను రెండురోజులకు ఒకసారైనా డెటాల్ లాంటి వాటితో నీట్‌గా ఉంచుకుంటే మంచిది.

మలేరియా

వర్షాకాలం ఎక్కువగా బాధించేది మలేరియా. ఈ వైరల్ ఫీవర్ వచ్చేది ప్రధానంగా దోమల వల్లే. మన దేశంలో యేటా మలేరియా మృతుల సంఖ్య పెరుగుతోందని ఆరోగ్య శాఖ హెచ్చరిస్తోంది. మలేరియా సోకినప్పుడు చలిజ్వరం, ఒళ్లు నొప్పులు, కండరాల నొప్పి, నీరసం మొదలైన లక్షణాలు కనిపిస్తాయి. కాబట్టి ఇంటి చుట్టుపక్కల పరిసరాల్లో దోమలు వ్యాప్తిచెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంట్లో కూడా దోమల నివారణకు తగిన చిట్కాలు పాటించాలి. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. మురుగు కాల్వలలో డీడీటీ చల్లాలి.

కలరా

వర్షాకాలం కలుషిత నీరు, కలుషిత ఆహార పదార్థాల కారణంగా కలరా వ్యాధి కూడా రావచ్చు. ప్రధానంగా పరిసరాలు శుభ్రంగా లేకుంటే విరేచనాలు, వాంతులు, డయేరియా లక్షణాలు

ఇవీ జాగ్రత్తలు

- వర్షాకాలంలో దోమల కారణంగానే ఎక్కువ వ్యాధులు సంక్రమిస్తాయి. కాబట్టి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు దోమలు రాకుండా క్రీమ్‌లు, కాయిల్స్ ఉపయోగించాలి. వేపాకు కాల్చి పొగ వేస్తే దోమలు పోతాయి.
- వర్షంలో ఎక్కువ సేపు తడవడం మంచిది కాదు. ఒకవేళ తడిస్తే వెంటనే దుస్తులు మార్చుకుని వేడి పానీయం సేవించాలి.
- ఆహారం తీసుకునే ముందు, టాయ్‌లెట్‌కి వెళ్లి వచ్చిన తర్వాత ఇన్‌ఫెక్షన్ సోకకుండా చేతులు, కాళ్లు శుభ్రంగా కడుక్కోవాలి
- ఆహారంలో అల్లం, నిమ్మ, మిరియాలు, పసుపు వాడకం పెంచాలి. నిల్వ పదార్థాలు, రోడ్‌సైడ్‌ఫుడ్ వీలైనంత వరకు తినకుండా ఉంటే మంచిది
- ఈకాలంలో పిల్లలు ఎక్కువగా వర్షంలో తడుస్తూ ఆడుకోవడానికి ఇష్టపడుతుంటారు. స్కూల్‌కి వెళుతున్నప్పుడు కావాలనే తడుస్తుంటారు కూడా. అలాంటప్పుడు చిన్నారుల ఆరోగ్యం, అలవాట్లపై చాలా జాగ్రత్తగా ఉండాలి. ఒకవైపు వారికి ఎంజాయ్‌మెంట్ కలిగిస్తూనే హెల్త్‌పైనా శ్రద్ధ తీసుకోవాలి.

కనిపిస్తాయి. అలాంటి సందర్భాల్లో వెంటనే వైద్యుల్ని సంప్రదించాలి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి కలరా వచ్చే అవకాశాలు ఎక్కువ. చిన్నపిల్లల్లో, వృద్ధుల్లో ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. ముందు జాగ్రత్తగా చిన్న పిల్లలకు నిర్ణీత కాల వ్యవధుల్లో టీకాలు వేయించాలి. నిల్వ పదార్థాలు తినకూడదు. కాచి వడ బోసిన నీటినే తాగాలి. ఆహార పదార్థాలపై ఎప్పటిప్పుడు మూత పెట్టి ఉంచడం మరిచి పోకూడదు. పాల ఉత్పత్తులు తగ్గించాలి.

టైఫాయిడ్

వర్షాకాలంలో టైఫాయిడ్ జ్వరం కూడా ఎక్కువగానే ఉంటుంది. కలుషిత ఆహారం, నీటి ప్రభావంవల్ల ఇన్‌ఫెక్షన్ సోకి జ్వరం వస్తుంది. తగ్గకుండా చాలా రోజులు బాధిస్తుంది. దాంతో పాటు కడుపునొప్పి, డయేరియా, తలనొప్పి వంటి ఇతర లక్షణాలు కనిపిస్తాయి. జ్వరం ఎక్కువ రోజులు తగ్గకపోయినా టైఫాయిడ్ అని అనుమానం వచ్చినా, వీలైనంత తొందరగా డాక్టర్‌ను సంప్రదించడం మేలు.

టైఫాయిడ్ వచ్చిన వారి ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ముందు జాగ్రత్తగా పిల్లలకు చిన్నతనంలోనే టీకా వేయించాలి. టైఫాయిడ్ వచ్చిన వారు అప్పటికప్పుడు వండిన ఆహారపదార్థాలు మాత్రమే తినాలి. బయటి ఆహారం తినకూడదు. అలాగే ఈకాలంలో ఆకుకూరలు మానేస్తే మంచిది. దంతధావనం, స్నాన సమయాల్లో నీటిని మింగేయకూడదు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.

హెపటైటిస్

ఈగలు ముసిరినప్పుడు ఇన్‌ఫెక్షన్ కారణంగా హెపటైటిస్ వ్యాధి వస్తుంది. ఫ్లూ జ్వరం లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులతో పాటు ఆకలి మందగిస్తుంది. వాంతులు రావచ్చు. కాబట్టి ఈ వ్యాధి ముదరకముందే వైద్యుల్ని సంప్రదించాలి. హెపటైటిస్ (ఏ) సోకుండా ముందు జాగ్రత్తగా దీనికి సంబంధించిన వైరల్ వ్యాక్సినేషన్ చాలా అవసరం. వాతావరణ మార్పు సమయంలో రోగ నిరోధక శక్తి తగ్గకుండా చూసుకోవాలి. అందుకోసం నీరు ఎక్కువగా తాగడం, పళ్లు, కూరగాయలు సమృద్ధిగా ఆహారంలో భాగం చేసుకోవడం అవసరం

సైనస్, చలి

వర్షాకాలంలో ఎక్కువగా బాధించేవి చలి, జలుబు. వర్షంలో ఒక్కసారి తడిస్తే చాలు, చాలా మందికి జలుబు పట్టేస్తుంది. వయసులో ఉన్న పెద్దవారికి తొందరగా సోకుతుంది. ముక్కు అదే పనిగా కారుతుంది. గొంతు నొప్పి, దగ్గు, జ్వరం ఎక్కువగా ఉంటాయి. సైనస్ వస్తే ఇక తట్టుకోవడం కష్టం. విపరీతమైన తలనొప్పి, ఒళ్లు నొప్పులు ఉంటాయి. కాబట్టి ఈ కాలంలో వర్షంలో తడవకుండా జాగ్రత్తపడాలి. ఒకవేళ తడిస్తే వెంటనే తల, ఒళ్లు తుడుచుకుని పొడి దుస్తులు మార్చుకోవాలి. ఐస్‌క్రీమ్‌లు, శీతలపానీయాల జోలికి వెళ్లకూడదు. వేడిపాలల్లో పసుపు వేసుకుని తాగడం, నువ్వులు, బెల్లంలాంటివి ఆహారంలో భాగం చేసుకోవడం, వేడినీటిలో ఉప్పు వేసి పుక్కిలించడం, ముఖానికి నీటి ఆవిరి పట్టడం వల్ల ఉపశమనం ఉంటుంది. అలాగే ఈ సీజన్‌లో మొటిమలు, కురుపులు, ఇతర చర్మ వ్యాధులు సోకే ప్రమాదం ఎక్కువ. పాదాలు పగిలి నడవడం కష్టమవుతుంది. అలాంటప్పుడు వేడినీటిలో ఉప్పువేసి కాసేపు పాదాలను అందులో పెట్టి పొడిపొడిగా తుడుచుకుంటే కాస్త నొప్పి తగ్గి, పగుళ్లు కూడా తగ్గుముఖం పడతాయి.. తేమ కారణంగా ఎన్నో సమస్యలు వస్తాయి. టాయ్‌లెట్‌ను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి. ఈ సీజన్‌లో మహిళలు యూరినరీ ఇన్‌ఫెక్షన్‌కి గురయ్యే ప్రమాదం ఉంది కాబట్టి నీరు ఎక్కువ తాగాలి.

అందం, ఆరోగ్యం కూడా!

వానాకాలంలో ఆరోగ్యంతో పాటు అందం కూడా కాపాడుకోవడం ముఖ్యమే. దుమ్ము, ధూళి, తేమతో వాతావరణం మిళితమైన కారణంగా చర్మం కాంతి విహీనమవుతుంది. ఇలాంటి చర్మ సంబంధిత సమస్యల నుంచి గట్టెక్కేందుకు వర్షాకాలంలో ముఖానికి మితిమీరిన మేకప్ చేసుకోవడం తగ్గించాలి. ఒకవేళ మేకప్ వేసుకున్నా సులువుగా, నీటితో కడిగితే పోయేలా జాగ్రత్తపడాలి. ముఖచర్మం మంచి నిగారింపుతో, మృదువుగా ఉండాలంటే ఉదయం, సాయంత్రం వీలైనన్ని ఎక్కువసార్లు చన్నీటితో శుభ్రం చేసుకోవాలి. దీనివల్ల ముఖంపై జిడ్డుదనం పోతుంది. నాణ్యమైన లోషన్లు, మాయిశ్చరైజర్లను వాడితే ముఖచర్మం మృదుత్వాన్ని సంతరించుకుంటుంది. అయితే, వైద్య నిపుణుల సలహా మేరకు మాత్రమే ఈ క్రీమ్‌లు, లోషన్లు వాడితే మంచిది. నూనెలతో రూపొందించిన మాయిశ్చరైజర్ల కన్నా వాటర్ బేస్డ్ లోషన్లు వాడితే బెటర్. బ్లీచింగ్, ఫేషియల్స్‌కు వానాకాలం అనుకూలం కాదు.

కళ్లకు ఇన్‌ఫెక్షన్లు

ఎండాకాలంలో వాడే సన్‌గ్లాసెస్ ఎండతో పాటు ఇన్‌ఫెక్షన్ల నుంచి కూడా కళ్లకు రక్షణ కల్పిస్తాయి. అయితే వానాకాలంలో ఈ కాస్త రక్షణ కొరవడటం, వాతావరణంలో పెరిగే తేమ వల్ల కండ్ల కలక, స్టై, కళ్లు పొడిబారటం, కార్నియో అల్సర్లు బాధిస్తాయి. అందుకని మురికి చేతివేళ్లతో కళ్లు తాకకూడదు. కండ్ల కలక లక్షణాలు కనిపించిన వెంటనే కళ్లను శుభ్రమైన నీటితో కడిగి వేడి కాపడం పెట్టాలి. వీలైనంత త్వరగా వైద్యుల్ని కలవాలి. వానాకాలంలో బ్యాక్టీరియా కారణంగా కంటికింది కనురెప్ప లోపల పుండు ఏర్పడుతుంది. దీన్నే స్టై అంటారు. దీనికి వేడి కాపడం పెట్టడంతో పాటు తక్షణ చికిత్స చేసుకోవాలి.

\- నివేదిత

ప్రణయ మంజరి

-శ్రీకాంతి

పూలబాలల నడుమను అరవిరిసిన అరవిందము వోలె పరిమళించు ఆమె పేరుకు తగినట్టే పూలతీగ వంటి తనువు, యవ్వన సౌందర్యంతో అలరారుతున్నది. పగడముల బోలు అధరములు, కలువరేకుల వంటి నేత్రములు చూపరుల మానసములను ఇట్టే ఆకర్షించుచున్నవి. మల్లియలు, జాజులు, మందారములు, రోజా సుమములు, చామంతి పూవులు.. వాటితో కలిసిపోయిన దవనపు, మరువపు పత్రములు... ఆమె కరములలో అందమైన మాలికలుగా రూపొంది, ఆ దేవాలయమందు కొలువైన వేణుగోపాలస్వామి గళమున అలరారుచున్నవి.



ఆమె పేరు మంజరి. రాజధాని దాపులనే పుణ్యక్షేత్రంగా పేరొందిన గ్రామమది. అక్కడకేతెంచు భక్తుల సంఖ్య అధికము కావున ఆమె వృత్తి ఏ ఒడిదుడుకులు లేక సాగిపోవుచున్నది. నా అన్నవారు లేని ఆమెకు దూరపు బంధువుల సహాయమే పెన్నిధి కాగా, అదే ఆమెకు ఈ వ్యాపకమునూ నేర్పించినది.

తన అంగడి ముందు నిలుచున్న స్ఫురద్రూపిని చూడగానే తీయని కలవరపాటుకు గురి అయినది మంజరి. నవ్వుచున్న నయనములతో ఆమెను పరికించి చూచుచు 'ఈ సుమమాలలన్నియు వలయును...' అని పలికినాడు.

'అవశ్యము... తీసుకొనుడు..' అన్నింటినీ పెద్ద అరిటాకులో చుట్టబోయినది.

"ఇదిగో, ఈ అర్ధమును గ్రహించుము..' ఆమె చేతుల్లో కాసుల మూట ఉంచినాడు.

"ఆర్యా, వీటికి ఇంత ధనము అవసరం లేదు.." వినమ్రంగా సమాధానం చెప్పినది మంజరి.

"నీవు నాకు నచ్చితివి కుసుమాంగనా! నీకు తుచ్ఛమగు ధనము మీద ఆశ లేశమైనా

లేదు. సంధ్యా సమయమున నదీతీరమున నన్ను కలుసుకోగలవా? సూర్యాస్తమయమైన ఘడియ తదుపరి ఆటకు రావలె..' తగ్గుస్వరంతో చెప్పాడు.

తీవ్రమైన అభ్యంతరమును తెలుపబోయిన ఆమెకు అతని కనులలో ఏమి గోచరించినదో ఏమో కానీ, మంత్రముగ్ధలా తలూపినది అంగీకార సూచకంగా.

•••

'నా అభ్యర్థన మన్నించి వచ్చినందుకు ధన్యుడను..' మంజరికి అభివాదం చేసి నిలుచున్నాడతడు.

మంజరి దేహమంతయూ చివురుటాకు వలె వణికినది. పద్దెనిమిది వసంతాల ప్రాయమున వయసు వచ్చిన తరువాత, ఆమెకింతవరకూ ఏ పురుషునితోనూ పరిచయం కలుగలేదు.

"రా. ఇలా ఆసీనవు కమ్ము దేవీ..' చేయి పట్టుకుని ఇసుక తిన్నెమీద తన పక్కనే కూర్చుండబెట్టాడు. నది మెల్లగా ప్రవహిస్తుంటే, మలయానిలము సేదదీర్చుతున్నట్టుగా వీచసాగినది. చిరు చీకట్లు ముసురుకొనుచుండగా, వాటిని చెదరగొడుతున్నట్టుగా తూర్పుదిశ నుంచి నిండు చంద్రుడు ఉదయించుచున్నాడు.

అతని చేయి తాకినంతనే తనలోకి విద్యుత్తు ప్రవహించినట్లు మంజరికి తోచినది. అపురూపమైన ఆ భావనను, తనలో కలుగుచున్న సంచలనమును నియంత్రించుకొనుచూ కూర్చున్నది. దరహాసముతో ఆమె ముఖమును పరికించుచూ ఉండిపోయినాడు.

'ఈతని పేరు కూడా తెలియదని తలపోయుచున్నావు కదూ! నా నామధేయం - చంద్రుడు అంటారు. అదిగో... ఆ గగనంలో ఉన్నవానికి ప్రతిరూపమును నేనే. రాజాస్థానమున సైనికుడిగా పనిచేయుచుంటిని. ఈరోజు మీ గ్రామానికి అసంకల్పితమున విచ్చేయుట, దేవాలయ ప్రాంగణాన నిను కనుట విధి విలాసము. నా మనసు వశము తప్పినది మంజరీ. నేను నీకు దాసుడనై పోతిని. మల్లెల సౌకుమార్యము వంటి నీ మేని సొగసు, క్షీరము వంటి నీ మానసము నన్నెంత

గానో ఆకట్టుకున్నవి" మంద్రస్వరాన అతడు చెప్పుకుపోవు చుండగా ఆమెకు చక్కని సంగీత ఝరి ఆలకించినట్టుగా తోచినది.

నిజముగానే, చందమామ వంటి ముఖవర్చస్సు, సన్నని మీసకట్టు, తుమ్మెద రెక్కల వంటి కేశములు.. వాటిని బంధించి తలపాగా చుట్టినాడు. రాజోద్యోగులు, సైనికులు ధరించే వస్త్రములు ధరించియున్నాడు. చూసినంతనే గౌరవమూ, మన్ననా కలిగించేవిధముగా ఉన్నాడు.

"మంజరీ, నీ స్థితిగతులను విచారించితిని. నిన్ను కనినంతనే నా మనసు నీ వశమైనది. అయితే అది కేవలం శారీరకవాంఛకు సంబంధించిన మోహము కాదు సుమీ. నిన్ను పరిణయమాడి నాదాన్నిగా చేసుకోవాలని తలచితిని. ఆ విషయమును తెలియజేయుటకే నిను ఇచ్చటకు రమ్మని పిలిచితిని.."

"కానీ.. ఆర్యా, తమరు ఉన్నతోద్యోగులు, అనుక్షణమూ మహారాజుల సేవ చేసుకుంటూ, దేశసేవలో తరించే బాధ్యతగల కొలువునందుయున్నవారు. తమవంటివారికి నావంటి నిరుపేద కన్య... అందునా పుష్పలావిక.. తగనిది కదా.." తడబడుతూ అన్నది మంజరి.

"ఎవరంటిరి అటుల? నిరంతరమూ ఆ భగవంతుని సేవలో, పూవుల్లో పూవునై తరించే నీకు సాటి మరెవ్వరు దేవీ? నా మనసును అడుగుము, నీవే నా దానివని... నాలో మ్రోగే ప్రణయనాదానివని.. ఘంటాపథమున చెప్పగలదు. ఇదిగో ఈ పంచభూతాల సాక్షిగా నీవూ, నేనూ ఒక్కటే.. మరి నీకు సమ్మతమేనా?" ఆమె కనులలోకి ఆర్తిగా చూసినాడు.

మంజరి చూపులు క్రిందికి వాలిపోయినవి. చంద్రుడి కనులలోనికి చూసినంతనే, ఆమె మనసు సైతము వశము తప్పినది. ఇంతవరకూ ఇది అని తెలియని స్పందన ఆమె మనసును ఊపేసినది. ప్రథమ వీక్షణమందే ప్రణయ భావ నయనగా ఇదివరలో ఆమెకు పరిహాసముగా అనిపించెడిది, వినిపించెడిది... కానీ తనదాకా వచ్చువరకు...

"సిగ్గుల మొగ్గవై నీ అంగీకారాన్ని చెప్పకనే చెబితివి సఖీ. ఈ ప్రకృతి సాక్షిగా... నేను నిన్ను పరిణయమాడుచుంటిని మంజూ..." ఆమె కుడి చేతిని తన చేతిలోకి తీసుకుని, తన అంగుళికి అలంకరించి ఉన్న మణిమయమైన అంగుళీయకాన్ని ఆమె వేలికి తొడిగాడు.

ఆమె అతని సమీపమునకు జరిగి, అతని భుజముపైన తల వాల్చినది. తన గురించిన వివరములు చెప్పింది. ఎవరూలేని అనాథ అయిన తనను వరించినందుకు ఎంతో సంతోషమును వ్యక్తము చేసినది. ఆమె భుజము చుట్టూ చేయి వేసి తన సమీపమునకు లాగినాడు చంద్రుడు. అతని చేతివేళ్ళ స్పర్శ ఆమెకు గిలిగింతలు రేపినది. మేనిలత విద్యుల్లతల మయమైనది. అతడి కరము మంజరి నడుమును చుట్టివేసినది. ఇసుకమీద వెనక్కి వాలుచూ ఆమెను తనపైకి లాగినాడు. చంద్రబింబం వంటి ఆమె ముఖాన్ని తన దోసిట ఇముడ్చుకొని చెక్కిళ్ళ మీద వెన్నెల చుంబనాలు అద్దాడు. లేతపెదవుల మీద తీపి ముద్రలు వేశాడు. ఆమె చెవిలో సరాగాలు పలుకుతూ, ఆమె మేనివీణను తన చేతివేళ్ళతో సవరించ సాగినాడు.

మంజరి సుకుమార యవ్వనసంపద ఒక్కసారిగా విప్పారినది. ఆమె తనువులోని అణువు అణువూ అతని స్పర్శతో వివశమైనది. తొలిసారిగా పురుషుని స్పర్శ. అందునా తనను వలచి వలపించిన తన మగని స్పర్శ... పతియే ప్రత్యక్ష దైవమని పెద్దలు చెప్పినారు. ఆ దైవానికి నివే



దించుటకు తన యవ్వనం తప్ప ఏమున్నది? మనసెప్పుడో అతనికి అంకితమై పోయినదాయె.

జడలో తురిమిన మల్లెలు నలిగిపోవుచూ మత్తిల్లజేయు తమ సుగంధముతో వారి ప్రణయ సౌరభాలను రెచ్చగొట్ట సాగినవి. మన్మథుని వాడి శరములు లేడి వేగమున వచ్చి వారి మనసులను తాకినవి. మోహావేశము ముప్పిరిగొనగా ఎచ్చటనో, సూర్యుడు సైతం చూడని ఆమె శరీర భాగాలలో అతడి కరములు కదలాడుచుండగా తుఫాను తాకిడికి ఊగెడి నడిసంద్రమందలి నావ వలె ఆమె ఒడలు అల్లాడిపోసాగినది. గాఢ కౌగిలింతలో బందీలుగా మారినారు ఒకరికొకరు. అతడి చర్యలకు వివశయైన ఆమె ఆరాటమున అతడిని తనమీదకు లాక్కున్నది. సుతిమెత్తని ఆమె దేహమంతయూ అతడి నఖక్షతాల నెలవంకలు నిండిపోయినవి. సైకత పాన్పు పూవుల శయ్యగా మారిపోయినది. ఆపలేని తమకమున ఆమెను లతలా పెనవేసుకున్నాడు చంద్రుడు. ఇరుతనువులూ ఒక్కటిగా మారిపోయి, తిరిగి రెండుగా విడిపోవుచూ, మరల ఏకమగుచూ... ఆ రసకేళియందు రెండుఘడియల పాటు ఆ యుగళానికి కాలమే తెలియరాలేదు.

తన ఒడిలో సోలిపోయిన ఆమెను తట్టిలేపుచూ, "మంజరీ, మంజరీ... నడిరేయి దాటినది... మనమిక ఈ స్థలమును వీడవలెను" అని పలికినాడు చంద్రుడు.

"స్వామీ... ఎచటకు వెళ్ళవలెను? నన్ను సైతము మీతో కొని పొండు, ఇక ఒంటరిగా నే మనలేను.." అతని మెడచుట్టూ చేతులువేసి, పెదవులపై చుంబించి చెప్పింది.

'సమయమాసన్నము అయినప్పుడు నిను అవశ్యం తీసుకు వెళ్ళెదను దేవీ... ఇది నా ఆన... అప్పటిదనుక నీవు ఇచటనే వేచి యుండవలెను. అంగీకారమే కదూ, నను విశ్వసించు..." ఆమె శిరముపైన చేయివేసి ప్రమాణము చేసినాడు చంద్రుడు. చిన్నగా ఈలవేసి ఆ దరిదాపులనే ఉన్న తన తురగము కల్యాణిని పిలిచినాడు.

ఇరువురూ చెల్లాచెదరుగా పడి ఉన్న చేలములను ధరించినారు. తన అశ్వం మీద ఆమెను కూర్చుండజేసి, అధిరోహించాడు చంద్రుడు. ఆమెను గృహము కడ దించివేసి, తాను తూర్పు ముఖముగా పయనించాడు.



•••

వృత్తిపరమున పూలు అల్లుకొని అమ్ము పుష్పలావిక యైనను మంజరి సంస్కృతాంధ్రములను బాగుగా అభ్యసించినది. కనులు మూసినా తెరచినా తన పతి రూపమే కనిపిస్తూ ఉంటే తమ ప్రణయానికి పద్య రూపము కల్పించినది ఇలా..

ఆటవెలది:

ప్రణయమనగ నేమి, పతికరములలోన
సొలసి పోవుటేగ సొమ్మసిల్లి:
చుంబనముల మహిమ సుందరమ్ము తెలియ
కౌగిలింత లోని కామనలను!

రోజులు గడుచుచున్నవి. మాసములో రెండు మార్లు వచ్చివెళ్ళినాడు చంద్రుడు. నడిరేయి సమీపించు సమయమున అశ్వము మీద నిశ్శబ్దముగావచ్చి తెలతెలవారే వరకూ ఉండి, రసరాజ్యంలో ఆమెతో చరించి, ఆమెను తరింపజేసి, మరీ నిష్క్రమించేవాడు. అతనికొరకు వేచియున్న నిరీక్షణ పూర్తిగా ఫలించకుండానే తిరిగి నిరీక్షణలో పడిపోవుట ఆమెవంతు అయ్యేది. వచ్చిన ప్రతీసారీ ఆమెకు ఎన్నెన్నో ప్రమాణములు చేసినాడు. ప్రస్తుతము తన పరిస్థితి ఏదీ సరిగా లేదనీ, అన్నీ చక్కబడినంతనే తనతో తీసుకు వెళ్ళ గలవాడిననీ చెప్పి, ఆమెను అనురాగ జలధిలో ఓలలాడించినాడు.

మూడు మాసములు గడచినవి. చంద్రుడి జాడలేదు. మంజరికి ఏమీ పాలు పోవటము లేదు. మనసంతా అతడే నిండిపోయినాడు. అంతేకాక, అతని ప్రతిరూపము కూడా ఆమె కడుపులో మొలకయింది. తాను గర్భవతినని గ్రహించిన మరుక్షణమే అంతులేని ఆనంద డోలల్లో ఊగిపోయినది మంజరి. ఈ శుభవార్త భర్తకు తెలియజేయాలని తపించి పోయినది. వస్తాడని తలచిన తన స్వామి రాకపోవుటచే ఆమె మనసు అవ్యక్తమైన బాధతో విలవిలలాడ సాగినది.

ఇరుగుపొరుగుల వారు గుసగుసలు ఆరంభించినారు. ఆమెతో సన్నిహితంగా మసలిన దగ్గరి వారే ప్రశ్నలతో నిలదీయసాగినారు. 'కాలమే తన పరిస్థితిని చక్కబరచగలదనీ, అప్పుడు తన పతిని తానే ఎల్లరకూ చూపెదనని' వారికి చెప్పినది మంజరి. పూవులు మాలలుగా అల్లుచూ, ఆ దండలను భక్తులకు అమ్ముచూ రోజులు గడిపి వేయసాగినది మంజరి.

•••

"ఏమి జరిగినది మిత్రమా, నీ ధోరణి మామూలుగా ఉండుటలేదు. చిన్ననాటి నుండీ స్నేహితుడను, ఇప్పుడు ఆంతరంగికుడను, నాకు చెప్పకూడని విషయమా?" అడిగి నాడు అనంతుడు.

"నీతో చెప్పవలసినవి చాలా ఉన్నాయి మిత్రమా! చూచితివి కదా రాజ్యంలోని పరిస్థితులను... గతకొద్ది మాసములుగా మా తండ్రిగారు అస్వస్థులై ఉన్నారు. మన రాజ్యమును కబళించవలెనని సైన్యాధిపతితో సహా దుష్టశక్తులు కొన్ని కొలువైనవి. నన్ను రాజ్యమునకు ఏలికగా పట్టాభిషిక్తుడను చేయగానే, వాటినన్నింటినీ నిర్మూలించి, దేశ ద్రోహులను ఏరిపార వేసితిని. నీ వంటి నమ్మకమైనవారిని నా ఆంతరంగిక పదవులలో నియమించితిని. ఎంతో దేశభక్తి కలిగియున్న నిన్ను మంత్రిస్థానంలో యుంచితిని. అటువంటి నీ వద్ద నా రహస్యమును ఇకపై దాచి పెట్టలేకున్నాను.." ఇంచుక ఆగినాడు చంద్రహాసుడు.

సాయంకాలము దాటి రేయిలోకి దినం ప్రవేశించే సంధ్యా సమయమిది. వారిరువురూ ఉద్యానంలో విహరించుచున్నారు. చలువరాతి మంటపంలో సోపానముల మీద కూర్చుంటూ, ఉదయిస్తున్న చంద్రుణ్ణి చూపి అన్నాడు చంద్రహాసుడు.... "ఈ ఉదయించే చందమామను చూచినంతనే నా తలపులలో ఆమెయే కదలాడుచున్నది అనంతా.." అతని గళమందు దుఃఖపు జీర.

"ఆమె? ఎవరు చంద్రా?"

"ఆమె నా ఆరవ ప్రాణమైన అర్ధాంగి మిత్రమా! నీకు తెలియును కదా, మా తల్లిగారూ, తండ్రిగారూ నాకు వధువును తీసుకువచ్చి పరిణయము జరిపించవలెనని యత్నించుచుంటిరి. అనుదినము ఎన్నో చిత్రపటములను చూపించెదరు. నా మనోమందిరమున ఒక దేవత కొలువైయున్నదని వారికి తెలియదు కదా! మంజరిని నేను అష్టదిక్పాలకుల సాక్షిగా, ప్రకృతిమాత సమక్షంలో గాంధర్వవివాహం చేసుకొనియుంటిని. రాజ్యమందలి పరిస్థితుల కారణమున నా వివాహమును ఒక రహస్యముగా దాచి పెట్టవలసిన అగత్యము వచ్చినది. ఇక సమయము ఆసన్నమైనది. రేపేవారికి విషయమంతయు వివరించెదను గాక.." అన్నాడు చంద్రహాసుడు.

"నీవు చెప్పునది సత్యమా చంద్రా? ఇప్పటికే ఆలస్యము జరిగినదని అనిపించుచున్నది. నీ రాచకార్యములలో ఆమెను అలసత్వం చేసితివని నా భావన. ఈ ప్రపంచమున ఒంటరి ఆడది. అందునా యవ్వనవతియైన అతివ యొక్క పరిస్థితి ఏమిటో మనమూహింపగలము. ఒకసారి విచారించి రావటమే మంచిది.." సాలోచనగా

ఇప్పుడప్పుడే చేయను!

తెలుగులో రాజ్ తరుణ్‌తో సినిమా చేస్తోందన్న వార్తలను ఖండిస్తోంది సాయేషా సైగల్. అఖిల్ సినిమా తరువాత తెలుగులో ఇంత వరకూ ఏ సినిమాకూ ఓకే చెప్పలేదనీ, బాలీవుడ్‌లో మాత్రం రెండు సినిమాలు చేస్తున్నానని సాయేషా క్లారిటీ ఇచ్చింది. టాలీవుడ్‌లో అవకాశాలు బాగానే వస్తున్నప్పటికీ ఇప్పుడప్పుడే తెలుగులో చేయడం కుదరదు అని కూడా అంటోంది. తెలుగులో అడుగుతున్న డేట్లు అడ్జస్ట్ చేసే పరిస్థితి ఇప్పుడులేదని తేల్చి చెప్పేసింది. తెలుగులో సినిమా చేయడానికి మరికొంత కాలం ఆగాల్సిందే అంటోంది.

పలికినాడు అనంతుడు. తలపంకించినాడు చంద్రహాసుడు.

●●●

"అయ్యో, నన్ను వదిలిపెట్టండి.. నేనే దోషమూ ఎరుగను. దయచేసి నన్ను వదలండి.." వేడుకోసాగింది మంజరి.

"వివాహమే జరుగకుండ ఎవరితోనో తిరిగి గర్భవతివైన పాపిష్టి స్త్రీవి నీవు. ఈ క్షణమే నీ భర్తను చూపకపోతే నిన్ను ప్రభువులవారి కడకు తీసుకుపోయెదము. నీ దోషానికి కొరడాదెబ్బలే శిక్ష..." వికటంగా నవ్వినాడు కుటిలుడైన రక్షక భటాధికారి.

"నేను గర్భవతిని... నా బిడ్డకు ఏమియు జరుగరాదు. అన్నా నన్ను రక్షింపుము..." అతని పాదములకు మొక్కినది మంజరి.

"వాచాలి! అన్నా అనకుము. ఒక్క ఘడియ కనులు మూసుకొని నాకు లొంగిపొమ్ము. నేను నిన్ను వదిలిపెట్టెదగాక.." ఎరుపెక్కిన కనులతో ఆమె మీదకు వాలబోయినాడతడు. మెరుపువలె వెనుకకు జరిగిపోయినది మంజరి.

"నా తనువు, హృదయము నా నాథునికే అంకితము. నా చంద్రుడే నన్నేలుకునే స్వామి। ఇంకెవరికినీ అట్టియధికారము లేదు. ఆ వేణుగోపాలస్వామి తన సేవికను రక్షించియే తీరెదడు. నీ ధర్మం నీవు నెరవేర్చుము.." గంభీరంగా పలికినది మంజరి.

●●●

తన ఎదురుగా దోషిగా నిలబెట్టబడిన స్త్రీని చూసి అవాక్కై నిలిచినాడు చంద్రహాసుడు.

పురుషులెవ్వరూ అసహాయులైన స్త్రీలను మోసం చేయరాదని... ఈ శాసనాన్ని తన తండ్రే చేసినాడన్న విషయం అప్పుడు స్ఫురించినదతనికి. వివాహం కాకుండా గర్భం ధరించిన స్త్రీ అందుకు కారకుడైన తన ప్రియునియొక్క వివరములను తెలియజేసి తీరవలెను. అయితే చిత్రముగా ఇప్పుడు ఈ పరిస్థితులలో చిక్కుకున్నది తన మంజరియే. తన యొక్క వివరములేవియు తానామెకు తెలియజేయలేదు. గోప్యముగా ఉంచినాడు. పరిస్థితిని గమనించుచున్న అనంతుడికి, చంద్రహాసుని వదనము చూసినంతనే విషయం అవగతమైనది.

సింహాసనమందు చంద్రహాసుడిని చూసిన మంజరి పరిస్థితియు అటులనేయున్నది. ఇతడా తన భర్త? ఈ రాజ్యమునకు మహారాజు! మారువేషంలో తన దగ్గరికి వచ్చెనా, తనను వరించెనా? తానే తన పతిగా అంగీకరిస్తాడా? లేక తన బిడ్డతో సహా తాను మరణాన్ని పొందవలసినదేనా? ఆమెకి ఏమీ పాలుపోలేదు. నిస్సహాయంగా నీరు నిండిన కనులతో అతనివైపే చూస్తూ నిలిచి ఉండిపోయింది. ఆమె మీద నేరం ఆరోపించబడినది. "అమ్మా, నీ భర్త యొక్క నామధేయము, వివరములు చెప్పుము. నీవు నిర్దోషిగా విడిచి పెట్టబడెదవు.." జాలిగా అన్నాడు అనంతుడు.

చెప్పలేనట్టు తలయూపి, ముఖము అవనతము గావించినది మంజరి, ఆమె కన్నీరు జారి ఎదపై వర్షించు చుండగా...

ఆమెకు ఇరవై కొరడా దెబ్బల శిక్ష విధించినారు. రక్షక భటుడు కొరడా ఎత్తినంతనే ఆమె భయంతో కనులు మూసుకున్నది. గాలిలోకి కొరడా లేచినది. క్షణమందు వెయ్యోవంతున ఆమెమీద వేటు పడవలసినదే... కానీ పడలేదు. ఆమెకి అడ్డంగా తన శరీరాన్ని నిలిపిన చంద్రహాసుడి పైననేపడినది. రక్షకభటుడి చేతిలోంచి కొరడా జారిపోయినది.

"మహారాజా, నన్ను మన్నించవలయును. మీరు...మీరు..' అంటూ భయముతో పాదాలమీద వాలిపోయాడతడు.

"ఫర్వాలేదు. నీ పని కానిమ్ము. శాసనాన్ని అమలుపరచటమే నీవు చేయవలసిన పని. నిజమునకు ఈ శిక్ష ఆమెకుకాదు, నాకే పడవలెను. ఎందుకనగా ఆమె స్వామిని నేనే! ఆమె గర్భమున ఆ కడుపులో పెరుగుచున్న పసి ప్రాణానికి జనకుడను నేనే.." గంభీరంగా పలికినాడు చంద్రహాసుడు.

"చంద్రా..." వారింపుగా పిలిచినాడు అతని తండ్రి ఆదిత్యవర్మ.

"తండ్రి గారూ, నన్ను క్షమింపుడు. మీకు భయపడి, పరిస్థితుల ప్రభావం వలన నేను విషయం చెప్పలేకపోతిని. మనకి గాంధర్వ వివాహము సమ్మతమగుటచే ఆమెను నేను వివాహం చేసుకోకుండా ఉండలేకపోతిని. ఇప్పుడు నేను చేసిన దోషమునకు ఆమె దోషిగా నిలబడుట నేను భరించలేక పోవుచుంటిని. మీరు నాకు ఏ శిక్ష విధించినా సమ్మతమే. ఆ సింహాసనంమీద ఉండుటకు, రాజ్యపాలన నెరపుటకు నాకు అర్హత లేదందురా, అంగీకారమే! ఈ క్షణమున వాటిని త్యజించి, నేను నా ధర్మపత్నితో ఎచటికైనను వెళ్ళి జీవించుటకు సెలవీయండి. నిర్ణయం మీదే..." మంజరి భుజము చుట్టూ చేయివేసి, తన దగ్గరగా తీసుకొనినాడు చంద్రహాసుడు. అతని భుజమ్మీద తలవాల్చి విలపించుచూ ఉండిపోయినది మంజరి.

కొన్ని నిమిషముల తదుపరి గంభీరముగా వినిపించినది ఆదిత్యవర్మ కంఠస్వరము... 'కోడలిని అంతఃపురమునకు ఆహ్వానించుటకై మహారాణీవారు వేంచేయుచున్నారు. చెలికత్తెలు ఆమెను లోపలకు తీసుకువెళ్ళెదరుగాక.. నాయనా చంద్రా, నీవు సింహాసనం మీదకు రావలయును. ఇది మా ఆజ్ఞ..."

సభ్యులందరి హర్షధ్వానముల నడుమ రాణివాసములోని సైరంధ్రులు వచ్చి మంజరిని అంతఃపురమునకు తీసుకు వెళ్ళినారు.

నవ్య

ఆహ్లాదాన్నిచ్చే ప్రకృతి నడక

నాగరికత వైపు పరుగులు పెడుతున్న మనిషి రోజురోజుకూ ప్రకృతికి దూరంగా జరుగుతున్నాడనడం అతిశయోక్తి కాదు. స్వచ్ఛమైన గాలి, స్వచ్ఛమైన నీరు, ఆహ్లాదకరమైన వాతావరణం లోపించిన ఈ నాగరిక ప్రపంచంలో మనిషి ప్రశాంతత కోసం వెతుక్కోవలసిన పరిస్థితి దాపురించింది. దానికితోడు అనేక రకాల మానసిక, అనారోగ్య సమస్యలు మనిషిని నిర్వీర్యం చేస్తున్నాయి.

ఇటీవల అమెరికాలో నిర్వహించిన పరిశోధన ప్రకారం దాదాపు 87 శాతం మంది ఇంటి నాలుగ్గోడల మధ్యే గడిపేస్తున్నారట. ఇలా నాలుగ్గోడల మధ్య నలిగిపోతున్నవారి కోసం, ప్రకృతికి దూరం అవుతున్నామన్న ఆలోచన ఉన్నవారి కోసం, మానసిక, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారి కోసం ఇప్పుడు ఓ కొత్త తరహా విధానం ప్రచారంలోకి వస్తోంది. అదే "షిన్‌రిన్-యోకు". మరి అదేంటో, దానివల్ల లాభాలేంటో తెలుసుకుందామా!

"షిన్‌రిన్-యోకు" అంటే అటవీ స్నానం (ఫారెస్ట్ బాతింగ్) అని అర్థం. ఇది జపనీస్ పదం. ఈ నయా పద్ధతి జపాన్‌లో ఎనభయ్యోదశకంలోనే ప్రారంభమైంది. అప్పట్లో ఈ ఫారెస్ట్ బాతింగ్ అంత ఆదరణ పొందలేదు. కానీ ప్రస్తుత ఉరుకులపరుగుల జీవితంలో ఫారెస్ట్ బాతింగ్ ఎంతయినా అవసరమంటున్నారు.

ఎలా చేయాలి?

అటవీ స్నానం అనగానే అడవిలోకి వెళ్ళిపోయి అక్కడ కేవలం ఏ జలపాతంలోనో, నీటి కొలనులోనో చక్కగా ఈదులాడటమే కదా అనుకునేరు సుమా! కానే కాదు! ఈ 'అటవీ స్నానం' లోని అసలు పరమార్థమే వేరు! ఫారెస్ట్ బాతింగ్ ప్రయత్నిద్దామనుకునేవారు కేవలం మూడు నుంచి నాలుగు గంటల సమయం తమది కాదనుకోవాలి. ఇలా అటవీ స్నానం చేయాలనుకునేవారిని, అందులో నిష్ణాతులైనవారు అడవుల్లోకి తీసుకెళతారు. మెల్లగా ముందుకు సాగుతూ, చెట్టూ చేమలు గమనిస్తూ, ప్రకృతిలో లీనమవ్వాలి. పంచేంద్రియాలను కేంద్రీకరించి మనం చూస్తున్న పరిసరాలమీద, వినే శబ్దాల మీద దృష్టిపెడితే చాలు, ఓ కొత్త ప్రపంచం మన కళ్ళముందు ఆవిష్కృతమవుతుంది. ఎటు చూసినా ప్రశాంతతే! పక్షుల కిలకిలారావాలు, చెట్ల నుంచి వచ్చే సుగంధభరిత పరిమళం మన మనస్సుకి ఓ కొత్త ఉత్తేజాన్ని కలిగిస్తాయి. అవసరమైతే మనకు నచ్చిన ప్రదేశంలో కాసేపు ప్రశాంతంగా కూర్చుని ధ్యానం చేయటం, లేదంటే ఇష్టమైన పుస్తకం చదువుకోవడం చేయవచ్చు. ఇలా ప్రయాణం సాగిస్తున్నప్పుడు ఈ అనంతమైన ప్రకృతిలో మనంకూడా మమేకమైపోయినట్టనిపిస్తుంది. ప్రకృతిలో ఉన్న జీవమే మనలో తొణికిసలాడుతున్నట్లు తోస్తుంది.

ఎన్నెన్నో లాభాలు

షిన్‌రిన్-యోకు వల్ల ఒత్తిడి మాయమవుతుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దీనికి తోడు మెదడు చురుగ్గా పనిచేయడం మొదలుపెడుతుందని పరిశోధనల్లో తేలింది. సాధారణంగా ఒత్తిడి వల్ల మనలో కార్టిసాల్, అడ్రినలిన్ వంటి హార్మోన్లు ఉత్పత్తవుతూ ఉంటాయి. కానీ ఈ పద్ధతిలో అటవీ వాతావరణంలో మమేకం కావడంవల్ల వాటి ఉత్పత్తి తగ్గిపోవడాన్ని పరిశోధకులు గమనించారు. అంతేకాదండోయ్, రోగనిరోధకశక్తి కూడా పెరుగుతుందట!

ఇలా నెమ్మదిగా, గలగలపారే సెలయేటి శబ్దాలు వింటూ ఓ పదిహేను నిమిషాలు అడవిలో గడిపితే చాలు బ్లడ్‌ప్రెజర్ కంట్రోల్‌లో ఉంటుందట.

రాత్రుళ్ళు నిద్రపట్టడం లేదని బాధపడేవారు ఒక్కసారి అలా ఫారెస్ట్‌బాత్‌కు వెళ్ళొస్తే సరి! ఇక నిద్రలేమి మనదరికి చేరదు. పిల్లల్లో కూడా ఉత్సాహం ఉరకలేస్తుంది. ఏకాగ్రతా పెరుగుతుంది. ముఖ్యంగా మానసిక ప్రశాంతత లభిస్తుంది.

సామాజికంగా

షిన్‌రిన్-యోకు పద్ధతి కేవలం ఆరోగ్యపరమైనదే అనుకుంటే పొరబాటే! సామాజికంగా దీనివల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి. బృందాలుగా కలిసి వెళ్ళడంవల్ల స్నేహబంధం బలపడుతుంది. సరదాగా నవ్వుతూ కాలక్షేపంచేస్తూ, చుట్టూ కనిపించే చెట్లపై పరిశోధన చేస్తూ నడవడం వల్ల మీ ఎనర్జీ లెవల్స్ కూడా పెరుగు

అలెగ్జాండర్ టెక్నిక్

మనం నడిచే తీరులోనూ, నిల్చొనే భంగిమ లోనూ తేడాలుంటాయి. ఈ తేడాలవల్లే అనేక రకాల సమస్యలు వస్తాయి. అలాంటి చిన్న చిన్న తేడా లను సవరించుకుని మరింత ఆరోగ్యంగా, ప్రశాంతంగా ఉండాలంటే ప్రయత్నం చేయాలిగా మరి. అలాంటి ప్రయత్నాల్లో ఒకటి అలెగ్జాండర్ టెక్నిక్!

అలెగ్జాండర్ మాథియస్ ఈ టెక్నిక్ రూప కర్త! ఇతడొక నటుడు. ఒకసారి డైలాగ్స్ పలికీ పలికీ అతని గొంతు మూగబోయిందట. సమస్య ఏమిటా అని తీవ్రంగా ఆలోచించి, చివ రికి తన గొంతు మీద లేని ఒత్తిడిని కలగచేయడం వల్లనే ఈ సమస్య వచ్చిందని తెలుసుకున్నాడు. తన గొంతు కండ రాల మీద అనవసరమైన ఒత్తిడి కలగ చేయకుండా ప్రాక్టీసు చేయడం మొదలు పెట్టాడు. అంతే అతని గొంతు మళ్ళీ పలికింది.

అలెగ్జాండర్ పరిశీలన ప్రకారం మన నడక, పరుగు, మాట, తలని నిల పడం, బరువులు మోయడం ఇలా కండ రాల సాయంతో చేసే చాలా చర్యలు లోపభూయిష్టంగా ఉంటాయి. కొన్ని రకాల అభ్యాసాల ద్వారా ఈ భంగిమలను కనుక మెరుగుపరచుకుంటే చాలా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నది అలెగ్జాండర్ మాట! ఇదే అలెగ్జాండర్ టెక్నిక్‌గా విస్తృత ప్రచారంలోకి వచ్చింది.

తాయి. మనసంతా ప్రశాంతంగా ఉండి, ఒత్తిడి నుంచి రిలీఫ్ వస్తుంది. అంతేకాదండోయ్ రకరకాల ఆలోచనల వల్ల మన మనసు లోతుల్లోకి తరచి చూడటం వల్ల మనలోని లోపాలేంటో తెలుసుకోవచ్చు. వాటిని సరిదిద్దుకుని భవిష్యత్తుని బంగారు మయం చేసుకోవచ్చు.

అందుకే ఇప్పుడు కొరియా మొదలుకొని ఆస్ట్రేలియావరకూ దేశదేశాలన్నింటి లోనూ షిన్‌రిన్-యోకు శిబిరాలు వెలుస్తున్నాయి. అయితే ఇలా ఫారెస్ట్ బాత్‌కి వెళ్ళలేనివారు ఇంకో పద్ధతి కూడా అనుసరిం చవచ్చు. పార్కుల్లో ఉద యాలు, సాయంత్రాలు వాకింగ్ చేస్తుంటారు. అలా చేసేటప్పుడు వీటిని దృష్టిలో పెట్టు కుంటే అటవీ స్నానం చేసినట్టే అని చెబుతున్నారు పరిశోధకులు.

సముద్రం ఒడ్డున కాసేపు...

మనలో చాలామందికి సముద్రం అంటే భలే ఇష్టం. కొంతమందిలో ఆ ఇష్టం ఏ స్థాయిలో ఉంటుందంటే, రిటైర్ అయ్యాక సముద్రపు ఒడ్డునే ఇల్లు కట్టుకోవాలని కలలు కంటూ ఉంటారు. సముద్రపు నీలిరంగు, అలల శబ్దాలు, అలల మీదుగా తేలియా డుతూ వచ్చే సముద్రగాలి, స్వచ్ఛమైన ఆ గాలి వాసన మనిషికి ప్రకృతి ఒడిలో ఉన్న అనుభూతి కలిగిస్తుంది. అంతేకాదు ఇంద్రి యాలన్నీ ఉత్తేజం పొందుతాయి. మిచిగాన్ యూనివర్సిటీ పరిశోధకులు తేల్చి చెప్పిన అంశాలే ఇవన్నీ. మిగతా ప్రాంతాల ప్రజలతో పోలిస్తే సముద్రం ఒడ్డున గడిపే ప్రజలు చాలా సంతోషంగా ఉన్నట్లు గమనించారు. ఆదాయం, ఆస్తులు, వయసు వీటన్నింటికీ అతీతంగా అక్కడి ప్రజలు ప్రశాంతంగా ఉన్నట్లు తేలింది. అక్కడి ప్రజల్లో మానసిక మైన సమస్యలు కూడా తక్కువగా ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

చెప్పుల్లేకుండా నడవండి

పచ్చటి నేల మీద నడిచేటప్పుడు భూమితో ఒక అనుబంధం ఉన్న భావన కలుగుతుంది. మనం ప్రకృతి ఒడిలో ఉన్నంత తృప్తిగా ఉంటుంది. ఇలాంటి అనుభూతివల్ల మనసు చాలా ప్రశాంతత పొందుతుందనీ, ఇలా ప్రకృతిలో మమేకం కావడంవల్ల రోజువారీ జీవితంతో ఏర్పడే ఒత్తిడి, భయాందోళనలన్నీ దూరమవు తాయనీ అంటున్నారు నిపుణులు.

పచ్చగడ్డి మీద నడిచేటప్పుడు మన పాదంలో కంటినాడి మీద ప్రభావం చూపే స్థానాల మీద ఒత్తిడి కలుగుతుంది. దానివల్ల కంటిచూపు మెరుగుపడుతుంది. నిరంతరం కంప్యూటర్‌ముందో, స్మార్ట్‌ఫోన్‌తోనో, పుస్తకం ముందో కూర్చునేవారు అప్పుడప్పుడూ కాస్త దూరంగా, పచ్చగా ఉండే వస్తువులు చూస్తూ ఉండాలని వైద్యశాస్త్ర నిపుణులు చెబుతున్నారు.

నిరంతరం బూట్లు లేదా చెప్పులు ధరించి ఉండేవారికి అరికాళ్ళలో రక్తప్రసారం తగ్గిపోయి పాదాలు మొద్దుబారిపోయి ఉంటాయి. ఇలాంటి వాళ్ళు రోజులో కాసేపన్నా చెప్పులు లేకుండా నడిస్తే ఆ స్పర్శలో ఉన్న హాయి తెలు స్తుంది. అంతేకాకుండా అడవిలో ఇలా చెప్పులు లేకుండా నడవడం అంటే అది ఒకరకంగా పాదాలకు మసాజ్‌లాంటిదే.

ఉదయాన్నే కాసేపు అలా పచ్చగడ్డి మీద నడిస్తే ఆ తాజాగాలి, పచ్చగడ్డి మీద నుంచి వచ్చే వాసనా, మెత్తటి గడ్డి అందించే స్పర్శా... ఇవన్నీ మానసిక ప్రశాంతతను అందిస్తాయి. ఇక ఆ సమయంలో పై నుంచి వచ్చే సూర్యరశ్మి కూడా మనకు రోజువారీ అవసరమయ్యే విటమిన్ డిని అందిస్తుంది. నేటి జీవనశైలి కారణంగా వస్తున్న కీళ్ళనొప్పులు, డయాబెటిస్‌లకు డి విటమిన్ లోపం కూడా ఓ కారణం అని ఇప్పటికే తేలింది. నిరంతరం నాలుగ్గోడల మధ్యే ఎక్కువకాలం వెళ్ళదీస్తున్న జనానికి సహజమైన ఈ విటమిన్ అందడం లేదని వెల్లడైంది. దీనికి మార్నింగ్ వాక్ ఒక్కటే పరి ష్కారమని చెబుతున్నారు. ఇకనేం! రోజూ పొద్దున్నే పచ్చగడ్డి మీద చెప్పుల్లేకుండా నడవండి మరి. ఆరోగ్యాన్ని, ప్రశాంతతని మీ సొంతం చేసు కోండి. వీలయితే అటవీ స్నానానికి వెళ్ళి సేద దీరండి. అసలు మనదేశంలో మనకు ఇలాంటి చికిత్స ఒకటి ఉందని తెలియకుండానే దాన్ని పాటించే స్తున్నాం. నిజానికి ప్రకృతే మనకి ఒక చికిత్స కదా! ఏ తిరుపతికో, మేడారానికో, శ్రీశైలా నికో వెళ్తే షిన్‌రిన్-యోకు శిబిరంలో పాల్గొన్నట్టే కదా! అక్కడ ఉండే అడ వులూ, జలపాతాలూ, కొండకోనలూ అన్నీ మనలోని ప్రకృతిని తట్టి లేపే వేనయ్యే! కాకపోతే ఈసారి కాస్త మనసు పెట్టి వాటిలో లీనమైతే సరి...మనం కూడా అటవీ స్నానం ఆచరించినట్టే!

-లక్ష్మీ నర్మద

నిండు నూరేళ్ళు

13

-సింహప్రసాద్
సెల్: 98490 61668

పోలీస్‌స్టేషన్ హడావిడిగా ఉంది.

ఎవర్ని అప్రోచ్ అవ్వాలో తెలీలేదు. కాసేపు అంతా పరిశీలించి తటపటాయిస్తూనే ఓ పోలీసు అధికారి దగ్గరికెళ్ళాను.

విష్ చేసేసరికి తలెత్తి ఏమిటన్నట్టు చూశాడు.

"సెల్‌పోయింది. అది ఒకరి దగ్గర ఉంది. అతడి గురించి తెలుసుకోవాలి.."

"సెల్‌పోయిందా? అదిగో అక్కడ రైటర్ ఉంటాడు, కంప్లయింట్ రాసియ్యి".

"అహా... అదికాదు.."

"నన్ను విసిగించక వెళ్ళవమ్మా..." నా మీద విసుక్కుని, "ఈ చదువుకున్నవాళ్ళతో వచ్చిన చిక్కే ఇది. వాళ్ళ మాట వినమంటారు తప్ప మన మాట వినరు" గొణిగాడు.

ముఖాన గంటు పెట్టుకుని రైటర్ దగ్గరికి వెళ్ళాను.

"డైరెక్టుగా గర్భగుడిలోకే వెళ్ళిపోయావ్, బాగా అరిచారా?" నవ్వాడతడు.

"నాకీ ఊరు కొత్త. ఎప్పుడూ పోలీస్‌స్టేషన్ కెళ్ళలేదు".

"ఇప్పుడొచ్చావుగా, ఇక అనుభవం వచ్చేస్తుంది. రేపట్నుంచి నువ్వే పాఠాలు చెప్పేస్తావు. ఇంతకీ నీ ప్రాబ్లమేంటో రెండుముక్కల్లో చెప్పెయ్" బోర విరుచుకుని కుర్చీలో చేరబడి అన్నాడు రైటరు.

"ఇక్కడున్నవారిలో మీరే మంచివారిలా ఉన్నారు. నా సమస్య అర్థం చేసుకుని నాకు హెల్ప్ చేయాలి.."

"అందుకేగా మేమున్నదీ, సంగతేంటో చెప్పు."

సెల్‌లోని మెసేజ్ చూపించాను. "నా ఫ్రెండ్ ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ ఈ మెసేజ్ ఇచ్చాడు.." అంటూ జరిగిందంతా టూకీగా వివరించాను.

"నా చెవిలో పువ్వులేమైనా కన్పిస్తున్నాయా?"

"లేవు"

"లేవు కదా? ఎవడో ఆకతాయి నిన్ను ఆట పట్టించడానికో, ఏడిపించడానికో ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు గుంజటానికో అర్థ రూపాయి ఖర్చుతో ఓ మెసేజ్ ఇచ్చేస్తే దాన్ని పట్టుకుని పూనే నుంచి పరిగెత్తుకొచ్చావా? భలేదానివేనే. చదువుకున్నదానివి! ఇంత అమాయకంగా నమ్మేశావేంటి? నా సర్వీసులో బోల్డన్ని సూసైడ్లు చూశాను. ఎవడూ ముందుగానే 'చస్తానోచ్' అని ఎవడూ చాటింపు వేసుకోడు. చావాలనుకున్నోడు గుట్టు చప్పుడు కాకుండా చస్తాడు. నలుగురికీ చెబితే చావనిస్తారా నీ పిచ్చిగానీ! వెళ్ళెళ్ళవమ్మా!"

"వేళాకోళంకాదు నిజమే. అతడికి భరించరాని దెబ్బలు తగిలాయి. డిప్రెస్ అయ్యాడు.." నచ్చచెప్పడానికి ప్రయత్నించాను.

"అయితే శవం దొరకాలిగా. అదెక్కడుంది?"

"దాని ఆచూకీ కోసమే తిరుగుతున్నా.."

వ్యంగ్యంగా నవ్వాడు. "నువ్వు ఊపుకుంటూ తిరగటం ఎందుకు? ఇవాళ గాకపోతే రేపు కంపు కొడుతుంది. ఎక్కడుందో తెలుస్తుందిలే".

నిర్ఘాంతపోయాను. నిస్సహాయంగా చూశాను. అతడికి అర్థమయ్యేలా ఇంకెలా చెప్పాలో బోధపడకుండా ఉంది.

"ఆ... నా మిత్రుడి సెల్ ఈ ఊరివాడి దగ్గరుంది. అతగాడి పేరు సుబ్బారెడ్డి. అతన్ని పట్టుకుంటే చిక్కుముడి విడిపోతుంది."

"సెల్‌దొంగలు బోల్డుమందున్నారు. సుబ్బారెడ్లు బొచ్చెడు మందున్నారు. పట్టుకోవడం అయ్యే పనికాదు గాని సెల్ పోయిందని కంప్లయింటు రాసిచ్చి వెళ్ళిపో. దొరికితే ఇన్ఫార్మ్ చేస్తాం" నిర్లక్ష్యంగా అన్నాడు.

> ### జరిగిన కథ
>
> *ప్రేమించిన ప్రియుడు విహాన్ జైలుపాలు కావడంతో తండ్రి చెప్పినవాణ్ణే పెళ్ళాడుతుంది విజిత. అతన్ని మరిచిపోలేకపోతుంది. ఇంతలోనే ఆత్మహత్య చేసుకోబోతున్నట్టు ఆమెకు మెసేజ్ ఇస్తాడు విహాన్. అతన్ని రక్షించేందుకు పూనే నుండి హైదరాబాద్ వెళుతుంది. ఆర్నెల్ల ఆజ్ఞాతవాసంలో విహాన్ తలదాచుకుని వదిలి వెళ్ళిపోయిన గదికివెళ్ళి అతడి డైరీ స్వాధీనం చేసుకుంటుంది. విహాన్ కెరీర్‌ను నాశనం చేసింది తన తండ్రేనని ఆ డైరీ చదివి తెలుసుకుంటుంది విజిత. తను చేసిన పాపానికి నిష్కృతి లేదని ఆవేదన చెందుతుంది.*
>
> *-ఆ తర్వాత....*

ఒక నిమిషం తటపటాయించాను. ఎందుకైనా మంచిదనిపించి కాగితం అడిగి తీసుకుని కంప్లయింటు రాసిచ్చాను.

స్టేషన్ బయటికొచ్చి తర్వాత ఏం చేయటమా అని ఆలోచిస్తూ నిలబడ్డాను.

"కేసేవిటి? చోరీయా?" ఒక కానిస్టేబులొచ్చి అడిగాడు.

"సుబ్బారెడ్డి అనే సెల్ దొంగ మీకు తెలుసా?"

"అతడే దొంగిలించాడని మీకెవరు చెప్పారు?"

"సెల్ అతడు వాడుతున్నాడు.."

"దొంగ అలా వాడడు. సిమ్‌తీసి పారేసి సెల్ అమ్మేస్తాడు."

"మరైతే..." అయోమయంగా చూశాను.

"అతడికి దొరికి ఉండొచ్చు. ఇంకెలాగో వచ్చి ఉండొచ్చు. అతడు వాడుతున్నాడు గనుక ట్రై చెయ్యండి ఎప్పుడో అప్పుడు దొరుకుతాడు".

నిట్టూర్చి, థాంక్స్ చెప్పి కారెక్కాను.

అదే నెంబర్‌కి ఫోన్‌చేశాను. రింగవుతోంది గాని లిఫ్ట్ చేయట్లేదు.

"ఎక్కడికెళ్ళాలి?" డ్రైవర్ అడిగాడు.

"ప్రభుత్వాసుపత్రికి పోనియ్"

రిసెప్షన్‌లో కెళ్ళి "నిన్నగాని మొన్నగాని సూసైడ్ కేసులేమన్నా వచ్చాయేమో కొంచెం చెబుతారా?" మర్యాదగా అడిగాను.

పెదవి విరిచాడు. "అలా చెప్పలేం."

"పోనీ విహాన్ అనే అతను అడ్మిట్ అయ్యాడేమో రిజిస్టర్ చూసి చెప్పగలరా?"

అతడు రిజిస్టర్ తిరగేసి "లేదు" అన్నాడు.

పెదవి కొరుక్కున్నాను.

మార్చురీలో కనుక్కుంటే?

ఐడియా నచ్చలేదు. అక్కడినుంచి వచ్చెయ్యబోతూనే ఆగాను. మార్చురీ ఏ పక్కనుందో కనుక్కుని వెళ్ళాను.

ఆ ప్రాంతమంతా దట్టంగా ముగ్గుచల్లి ఉంది. అదోరకమైన వికారపు వాసన ముక్కుపుటాల్ని అదరగొడుతోంది.

అక్కడెవరూ కనిపించలేదు. దిక్కులు చూస్తోంటే ఒకతనొచ్చాడు.

"నిన్న లేక మొన్న శవాలొచ్చాయా?" నా గొంతు నాకే వింతగా ఉంది.

"వస్తానే ఉంటాయ్".

"బాగా గుర్తు చేసుకుని చెప్పు, వాటిల్లో పాతిక ముప్ఫై ఏళ్ళ యువకుడెవరైనా ఉన్నారా?"

దీర్ఘంగా ఆలోచించి "నిన్న కాదు దాని ముందు రోజు ఓ గెడ్డపు మనిషిది వచ్చింది" అన్నాడు.

నా గుండె అరంగుళం కిందకు జారింది. కళ్ళల్లో కన్నీటి కుండ పగిలింది.

"నాకోసారి చూపిస్తావా?"

నా వంక చూసి తల తిప్పేసుకున్నాడు. జవాబివ్వలేదు. కదల్లేదు. కదిలే ప్రయత్నమూ చెయ్యట్లేదు.

మళ్ళీ అడిగాను. "మధ్యాహ్నం రా. పో.."

"చాలా దూరాన్నుంచి వచ్చాను. ప్లీజ్.."

అతడు నిర్వికారంగా చూశాడు. ఆ వికారం దేనికో అర్థమైంది.

పర్సులోంచి వంద నోటు తీసిచ్చాను.

లేచి లోపలికెళ్తూ రమ్మని సైగ చేశాడు.

ముక్కుకి కర్చీఫ్ అదిమి పట్టుకుని అడుగులో అడుగు వేస్తూ అనుసరించాను.

చల్లని గదిలోకి తీసుకెళ్ళాడు. గడ్డకట్టుకు పోతానేమోనని భయమేసింది.

పొడుగాటి సొరుగులు లాగిచూసి, తిరిగి లోపలికి తోసేస్తూ, కడకోదాన్ని తెరచి ఉంచి నాకు సైగ చేశాడు.

భయంతో కంపిస్తూ సమీపించాను.

శవం ఉబ్బి ఉంది. వాసన భరించరానిదిగా ఉంది. కన్నీళ్ళు అడ్డొస్తున్నాయి. అయినా విహాన్ ఆనవాళ్ళ కోసం వెదికాను. గెడ్డం మాసి ఉంది. బక్కగా ఉంది. ముమ్మాటికీ అది విహాన్ కాదు!

రిలీఫ్‌గా ఫీలవుతూ తల అడ్డంగా ఊపాను. పరుగులాంటి నడకతో బయటికొచ్చి భళ్ళున వాంతి చేసుకున్నాను.

"అందుకే ఆడోళ్ళు ఇక్కడికి రాకూడదు..." వ్యాఖ్యానించాడతడు.

పుక్కిలించడానికి నీళ్ళబాటిల్ అందించాడు. అందుకోలేదు.

రెండంగల్లో దగ్గర్లో షాపుకెళ్ళి మినరల్ వాటర్ బాటిల్ కొని పుక్కిలించాను. ముఖం కడుక్కున్నాను.

అయినా ఒంటికేదో మకిలి అంటినట్లు ఒళ్ళంతా ఒకటే జలదరింపు!

హోటల్‌కెళ్ళి తలస్నానం చేసి వేరే దుస్తులు ధరించేవరకూ ఆ ఫీలింగు వెంటాడుతూనే ఉంది.

ఎలాగైనా సుబ్బారెడ్డిని పట్టుకోవాలి. మరో దారి లేదు.

నా దృష్టి హోటల్ రూంలో ఫోన్ మీద పడింది. లోకల్ నెంబర్.

ఆ ఫోన్ నుంచి విహాన్ సెల్ నెంబరుకి ఫోన్ చేశాను. రింగు వెళ్తోంటే ఉగ్గబట్టాను. హమ్మయ్య.. అతడు రిసీవ్ చేసుకున్నాడు.

"సుబ్బారెడ్డీ..." పూర్వ పరిచయం ఉన్నట్టుగా పిలిచాను.

"ఆ ఎవరూ?"

"నీతో పనుంది. వెంటనే కలవాలి. బాగా ముట్టజెబుతాను".

"నా గురించెవరు చెప్పారు? మావా?"

"ఊc.. నీ మావ రెడ్డి చెప్పాడు.." చీకట్లో వేసిన బాణం గుచ్చుకుంది.

"ఎక్కడుంటారు?"

"ప్రస్తుతం హోటల్లో ఉన్నాను. నువ్విక్కడికి వచ్చినా సరే, నన్ను రమ్మన్నా సరే".

హోటల్ పేరూ, రూమ్ నెంబరూ అడిగాడు. "నే వస్తాన్లే. అక్కడికొచ్చాక ఈ ఫోన్‌కి రింగిస్తాను. నా సెల్‌లో బ్యాలన్సు లేదు".

అతడికోసం ఎదురు చూస్తోంటే రాణి వదిన ఫోన్ చేసింది.

"తమ్ముడంతా చెప్పాడు. పాపం విహాన్ అలా అయిపోతాడనుకోలేదు" బాధగా చెప్పింది.

"తనంతట తాను అలా అవ్వలేదు. అయ్యేట్లు చేశారు. వెంటాడారు. వేటాడారు!"

"విధిరాతని ఎవరూ తప్పించుకోలేరు. ఎక్కడున్నావ్? ఇవాళైనా ఇంటికొస్తావా?"

"ఇంకా వచ్చిన పనవ్వలేదు.."

"ఆంటీ చాలా బాధపడుతున్నారు. అంకుల్ నీమీద కారాలూ మిరియాలూ నూరుతున్నారు.

అంత కోపం నేనెప్పుడూ చూడలేదు."

"ఇప్పుడు కోపం రావటం కాదు పశ్చాత్తాపం కావాలని చెప్పు. బై వదినా".

వదిన మాటల్లో ఏదో తేడా కన్పిస్తోంది. నాన్నకి విహాన్ సంబంధం నచ్చలేదనీ, అతన్ని నా నుంచి దూరం చెయ్యడానికి కుట్ర పన్నారనీ ఇంట్లోవాళ్ళకి తెలుసా?

అప్పట్లో జరిగిన ఘటనలన్నింటినీ నెమరు వేసుకో జూశాను గాని ఇంతలో ఇంటర్‌కమ్ మోగింది. సుబ్బారెడ్డి వచ్చాడని రిసెప్షన్ వాళ్ళు చెప్పారు.

అతన్ని ఎలా డీల్ చెయ్యాలా అని ఆలోచిస్తూ లాంజ్‌లోకెళ్ళాను.

సుబ్బారెడ్డి కుర్రాడే. పాతికేళ్ళలోపు ఉంటాయి. ఒక్కడే వచ్చాడు. అతడి చేతిలో ఉన్నది విహాన్ సెల్లే. ఎలాంటి సందేహం లేదు.

లాంజ్‌లోనే ఓ పక్కకెళ్ళి కూర్చున్నాం.

వెయ్యినోటు బయటికి తీసి చూపిస్తూ "నాకో చిన్న ఇన్ఫర్మేషన్ ఇస్తే ఇది నీదవుతుంది" అన్నాను.

నోటు వంక ఆశగా చూశాడు. "తెలిస్తే చెబుతాను".

"నీ చేతుల్లో ఉన్న సెల్ నా ఫ్రెండ్‌ది. అతడి ఆచూకీ తెలీక మూడ్రోజుల్నుంచి వెదుకుతున్నాం. సెల్ పోయిందని గానీ, నీ దగ్గరుందని గానీ పోలీస్ కంప్లయింట్ ఇవ్వను. ఇది నా ప్రామిస్. అది నీకెలా వచ్చిందో చెబితేచాలు.."

చటుక్కున సెల్‌ని ఫ్యాంటులో దాచేసుకున్నాడు. సంశయంలో ఊగుతూ కూర్చున్నాడు.

"నువ్వేం భయపడాల్సిన పనిలేదు. నాక్కావాల్సింది నా మిత్రుడి ఆచూకీయే"

"మావ ఇచ్చాడు".

"అతడెక్కడుంటాడు?"

"గవర్నమెంటు ఆసుపత్రిలో!"

కంపించిపోయాను. "ఆసుపత్రిలో మార్చురీలో కాదు కదా?"

"ఎమర్జెన్సీ వార్డులో పని చేస్తాడు."

"థాంక్‌గాడ్. అయితే విహాన్ క్షేమంగానే ఉన్నాడు. పద వెళ్దాం".

"నేనెందుకు?" కీచు గొంతుతో అన్నాడు.

"నీ మావని చూపించి వెళ్ళిపోదువుగాని. అతన్ని సెల్ గురించేం అడగను. విహాన్ ఏ బెడ్ మీదున్నాడో చూపిస్తే చాలు.." వెయ్యి నోటు అతడి చొక్కాజేబులో కుక్కాను.

●●●

ఇద్దరం ఆసుపత్రికెళ్ళాం.

మధ్యాహ్నం నేనొచ్చి ఎంక్వైరీ చేసింది ఇక్కడే. విహాన్ అన్న పేరుగల పేషంటే లేడన్నారు.

ఒక వార్డు వరండాలో టీ తాగుతున్న ఒక తన్ని చూపించి జారుకున్నాడు సుబ్బారెడ్డి.

గుండె అతివేగంగా కొట్టుకుంటుంటే అతన్ని సమీపించాను.

టీ చప్పరిస్తూనే ఎందుకన్నట్టు కించిత్తు నిర్లక్ష్యంగా చూశాడు.

"సుబ్బారెడ్డి చెప్పాడు. అతడికి నువ్వు సెల్ ఇచ్చావుగా. అది నీకెక్కడ దొరికింది?"

నా వంక సూటిగా చూశాడు. పెదాలు సన్నగా కంపిస్తున్నాయి.

"సెల్ గోల నాకనవసరం. అది నా ఫ్రెండుది. అతడికోసం వెదుకుతున్నాం. అతడెక్కడున్నాడో చెప్పు చాలు.."

సగం తాగిన టీ గ్లాసుని పిట్టగోడ మీద పెట్టి 'రా' అని సైగ చేశాడు.

అతడు మెల్లగా అడుగులేస్తోంటే ఉద్వేగంతో అనుసరించాను.

"అతడు ప్రాణాలతోనే ఉన్నాడు కదా?"

"మూడ్రోజులైంది. అతీగతీ పట్టించుకోడానికి ఒక్కడూ రాలేదు."

బెడ్‌కీ బెడ్‌కీ మధ్యగల ఖాళీ ప్రదేశంలో నేల మీద నిర్జీవంగా పడి ఉన్న ఒకతన్ని చూపించాడు.

ఏదోతెలీని ఉద్వేగం గుండెల్ని ఊపేస్తోంటే, కళ్ళల్లోంచి దుఃఖపు నదులు ఉరకడానికి సిద్ధపడుతోంటే, కాళ్ళు తడబడుతోంటే, గొంతు తడారిపోతోంటే, నిలువునా కంపిస్తూ దగ్గరికెళ్ళాను.

నా నిరీక్షణ.. నా తపన.. నా అన్వేషణ.. నా ఆశ ఫలించాయి!

అతడు విహాన్! బ్రతికే ఉన్నాడు! ప్రాణాలతో ఉన్నాడు! దేవుళ్ళంతా నా మొర విన్నారు!

వెర్రి సంతోషం ఉప్పెనైంది.

ఓహ్! ఎంతటి అపూర్వానుభూతి! మాటలకందని పరమానందం! విహాన్ బ్రతికే ఉన్నాడు! ఇది నిజం! నిజం!

ఆనందోద్విగ్నురాలినై ఊగిపోయాను. కళ్ళనుండి ఆనందబాష్పాలు జలజలరాలిపోయాయి. క్షణకాలం నోట మాట రాలేదు. అతడి పక్కన మోకాళ్ళ మీద కూలబడ్డాను.

"విహాన్! విహాన్!" అతన్ని కుదుపుతూ పిలిచాను.

పిలవగా పిలవగా అతికష్టం మీద కనురెప్పలు కొంచెంగా విప్పి చూశాడు. అపనమ్మకంగా చూశాడు. క్షణకాలమే.

పోలీస్ స్టేషన్‌లో విజితకు చేదు అనుభవం ఎదురైంది. పోలీసులు ఆమెను హేళన చేశారు. అయినా బాధపడకుండా ప్రయత్నం చేసింది. మార్చురీకి వెళ్ళి శవాలను పరిశీలించింది. విహాన్ ఆచూకీ దొరకలేదు. అతడి సెల్‌ఫోన్ వేరెవరి చేతికో చిక్కిందంటే అతడు ఆత్మహత్య చేసుకున్నట్టేగా? ఆమెలో కొత్త భయం ప్రవేశించింది. ఆ వ్యక్తిని ఎలాగైనా కలుసుకునేందుకు ప్లాన్ వేసింది. ఇంతకీ ఆమె ప్లాన్ ఫలించిందా? లేదా?

అతడి కళ్ళు వెలిగాయి. ముఖంలోకి ఆనంద భావన తొసుకొచ్చింది.

తృప్తిగా కళ్ళు మూసుకున్నాడు.

"విహాన్! నేనొచ్చేశాను. నీకేం కాదు. కానివ్వను.." అతడి చేతులు పట్టుకుని పిచ్చిదానిలా అరిచాను.

నర్సు పరిగెత్తుకొచ్చింది. డాక్టరూ వచ్చాడు. నాడి చూశాడు.

"ఇది ఆసుపత్రా, వల్లకాడా? పేషంటుని నేల మీద పడేశారేంటి? మనిషి స్పృహ లేకుండా పడున్నాడు, సెలైన్ కూడా ఎక్కించటం లేదేంటి?" కళ్ళు మూసుకుని కయ్‌మన్నాను.

"బెడ్స్ ఖాళీ లేవు, ఏం చెయ్యం?" తమదేం తప్పులేదన్నట్టుగా అంది నర్సు.

"ఇతడి కండిషన్ సీరియస్‌గా ఉంది. ఇక్కడ అత్యవసర ఫెసిలిటీస్ లేవు. ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్ళగలిగితే మంచిది.." డాక్టరన్నాడు లోగొంతుకతో.

వెంటనే అంబులెన్సులో కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకెళ్ళి చేర్పించాను.

"డాక్టర్ డాక్టర్! ఇతడు బతకాలి. ఎలాగైనే సరే బ్రతికించండి. ఎంత డబ్బు ఖర్చైనా పరవాలేదు. అతడు బతకాలి. బ్ర..త..కా...లి...!" హిస్టీరిక్‌గా అరిచాను. ఏడుస్తూ అర్థించాను.

"ఆల్‌రైట్. అతడు బతుకుతాడు. మా మీద నమ్మకం ఉంచండి. టెన్షన్‌పడొద్దు. కూల్‌డౌన్.." నా భుజం తట్టి భరోసా ఇచ్చాడు డాక్టర్.

విహాన్‌ని ఐసియులోకి తీసుకెళ్ళారు.

ఆ టెస్టులు ఈ టెస్టులు ఆ మందులు ఈ మందులు..

డెబిట్‌కార్డు గీస్తూనే ఉన్నాను. వాళ్ళు నా కళ్ళ ముందు హడావిడిగా తిరుగుతూనే ఉన్నారు.

ఠాగూర్ సినిమాలోని ఆసుపత్రి సీన్ గుర్తొచ్చింది.

వీళ్ళు ట్రీట్‌మెంట్ ఇస్తున్నది విహాన్‌కా లేక అతడి పార్థివ శరీరానికా?

టెన్షన్ ఊపేస్తోంది. కళ్ళు తిరుగుతున్నట్టుగా ఉంది.

ఇన్ని నీళ్ళు తాగి ముఖం మీద చల్లుకున్నాను. వేడివేడి కాఫీ తాగాను. నెమ్మదించినట్టుగా అన్పించింది గాని ఆ వెంటనే వాంతి చేసుకున్నాను.

డాక్టర్ని కలవమని రాజేశ్వర్ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.

విహాన్ దొరికాడు. ఈ రాత్రికి స్పృహ వచ్చేస్తుంది. ఇక ఫర్లేదు గనుక రేపు తప్పకుండా చూపించుకోవాలి.

నా పెదాల మీద మందహాసం అల్లనల్లన కదలాడింది.



ఇంకంతా హ్యాపీయే!

అంతకంతకూ నాలో ఆనందం, సంతృప్తి అధిక మవుతోంటే ఊహల పందిట్లో సేద తీరుతూ తిండీ తిప్పలూ మరచి కూర్చుండిపోయాను.

రాత్రి తొమ్మిదింటికి 'అతడికి స్పృహ వచ్చింది. చూడొచ్చు గాని మాట్లాడించొద్దు ప్లీజ్' చెప్పాడు డాక్టర్.

ఐసియూలో కెళ్ళాను. కళ్ళు మూసుకుని నిస్త్రాణగా పడుకుని ఉన్నాడు. అతడి చేయి పట్టుకున్నాను. నావి సంజీవని చేతులైనట్టుగా నా స్పర్శకి కళ్ళు తెరిచాడు.

కళ్ళలోంచి ఆనందం ప్రవహిస్తోంటే చేతులు జోడించబోతే వారించాను.

"నేన్నీ ఫ్రెండుని.."

కనురెప్పలు ఆర్పి తెరచి సన్నగా నవ్వాడు. "నాకంటూ ఎవరూ లేనప్పుడు నాదంటూ ఏమీ మిగలనప్పుడు నా పక్కన అండగా నిలిచిన స్నేహితురాలివి.."

"గుడ్! బాగానే గుర్తుంది. రెస్ట్ తీసుకో. మీ మదర్ చాలా ఆందోళనగా ఉన్నారు. ఏదో చెప్పేస్తాన్లే. రేపు ఉదయం కలుస్తాను. ఈలోగా అవసరమైతే డాక్టర్నీ నర్సునీ అడుగు. ఇక భూమ్మీద ఏ దుష్టశక్తీ నిన్నాపలేదు. నువ్వు మృత్యుంజయుడివి. ఎంత ధైర్యంగా ఉంటే అంత త్వరగా కోలుకుంటావు. గడచినదాని గురించీ, కోల్పోయినదాని గురించీ పదేపదే తలచుకుని మథనపడకు. కొత్తదారులు తెరచుకున్నాయి. నువ్వేంటో లోకానికి చాటుకునే సమయం వచ్చింది ఫ్రెండ్. బై..."

చిత్తశుద్ధితో కర్తవ్యనిర్వహణ చేసిన జవానులా, ఆత్మవిశ్వాసపు బావుటాలా ఆసుపత్రి నుంచి బయటపడుతూనే శాంతమ్మకి ఫోన్ చేశాను.

"ఆంటీ నేను... విహాన్ హ్యాపీగా ఉన్నాడు. ఇంతక్రితమే కలిశాను. ఒక ప్రాజెక్టుతో బిజీగా ఉన్నాడు. రేప్పొద్దుటే ఫోన్ చేస్తానని చెప్పమన్నాడు.."

"ఎంత చల్లని కబురు చెప్పావమ్మా. నా ఆయుష్షు కూడా పోసుకుని నిండు నూరేళ్ళు వర్ధిల్లు!"

ఆవిడ ఆశీస్సులు విహాన్‌కి మనస్సులోనే బదిలీ చేశాను.

"ఈ ముసిల్దాన్ని మాయ చెయ్యట్లేదుగా? నువ్వు చెప్పింది నిజమేనని నా మీద ఒట్టేసి చెప్పు..."

"నా మీద ఒట్టేసుకుని చెబుతున్నాను. విహాన్ క్షేమంగా ఉన్నాడు".

"చాలు చాలు... ఈ జన్మకీ మాట చాలు.."

"రేపు దగ్గరుండి మీతో మాట్లాడించే బాధ్యత నాది." ఇంకెలాంటి దిగులూ మనోవ్యధా పెట్టుకోకుండా హాయిగా నిద్రపోండి. ఇక మీకన్నీ మంచి రోజులే. గుర్తుంచుకోండి. రేపటి విజేత విహాన్!"

గుండెల్నిండా గాలి పీల్చుకున్నానో లేదో రాజేశ్వర్ కాల్ చేశాడు.

"ప్రాజెక్ట్ రిలీజ్‌తో బిజీగా ఉన్నాను. డాక్టర్ ఏమన్నాడు?"

"సారీ రాజేశ్వర్, వెరీ సారీ! రేపు చూపించుకుంటా. నీకో గుడ్‌న్యూస్. విహాన్ దొరికాడు. హాస్పిటల్లో ఉన్నాడు. రికవరవుతున్నాడు".

"కంగ్రాట్స్. నీ ఎఫర్ట్స్ ఫలించాయి. నీ మిషన్ సక్సెసయింది. అయామ్ హ్యాపీ"

"అది మాత్రం నిజం. నేను సమయానికి రాకపోయి ఉంటే ఏం జరిగేదో ఊహించలేను".



"ఇక టెన్షన్స్ లేవు గనుక నీ హెల్త్ పట్టించుకో విజ్జీ. ఐ లవ్యూ సోమచ్"

"ఐ టూ"

నిద్రపట్టక దొర్లుతున్నాను.

విహాన్ బ్రతికి ఉన్నందుకు ఒక పక్క సంతోషం. అలాంటి విషాదకరస్థితిలోకి నెట్టబడి నందుకు మరో పక్క దుఃఖం ఏకకాలంలో అనుభ వించసాగాను.

ఆత్మహత్య నిర్ణయానికీ, ప్రస్తుత దారుణ స్థితికీ మధ్య ఏం జరిగిందోనన్న ఉత్కంఠ నన్ను వెంటాడుతూనే ఉంది!

●●●

ఇడ్లీ పార్సిల్ తీసుకుని ఎనిమిదింటికే ఆసు పత్రి కెళ్ళాను.

అంతక్రితమే ఐసియులోంచి రూమ్‌లోకి మార్చినట్టు చెప్పారు. అన్ని అవయవాలూ సక్ర మంగా పనిచేస్తున్నాయన్నారు. ఫుడ్ పాయిజ నింగ్ లాంటిది అయినందున స్టమక్‌లోనూ ఇంటె స్టైన్‌లోనూ విష పదార్థాలున్నాయనీ, ఇప్పుడంతా క్లీన్ చేశామనీ వివరించారు.

డాక్టర్‌కి కృతజ్ఞతలు తెలియజేసి రూమ్‌లోకెళ్ళాను.



నా అడుగుల చప్పుడు అతడికి తెలిసి పోయింది. కళ్ళు తెరచి ఆనంద హాసం చేశాడు.

"నాకు పునర్జన్మనిచ్చావు. నీకు ఎలా థాంక్స్ చెప్పాలో తెలీటం లేదు".

"చెప్పొద్దు. నన్ను గాఢంగా తలచుకున్నావు. చూడాలని బలంగా అనుకున్నావు. అవే నన్ను నీ దగ్గరికి లాక్కొచ్చాయి".

"నాకు తెలిసిన గాయత్రీమంత్రం విజిత.. విజిత.. విజిత..!"

అబ్బురంగా చూశాను. అతడి కళ్ళనిండా తర గని ఆరాధన!

"నాకు పెళ్ళయింది..."

"అదీ నా కోరికే! చాలా సంతోషంగా ఉంది విజితా.."

"ఊహించనివి జరగటమే జీవితం. లభించిన దానితో తృప్తిపడి ముందుకు సాగిపోవడం తప్పనిసరి".

"ప్రయత్నిస్తాను. నీ మాటలు నాలో కొత్త స్ఫూర్తి నింపుతున్నాయి".

"త్వరగా కోలుకో. నీ కోసం బండిల్ ఆఫ్ జాయ్ రెడీగా ఉంది" చిన్నగా నవ్వాను.

ఫోన్ డయల్ చేసిస్తూ "మీ మదర్.. మాట్లాడు" అన్నాను.

"అమ్మా!" అన్నాడు విహాన్.

"ఆవిడ "బాబూ!" అంది.

ఆ తర్వాత ఇద్దరి మధ్య కన్నీరు వారధి కట్టింది. దాని మీదుగా తల్లీబిడ్డల అనుబంధం ప్రవ హించింది.

ఇడ్లీ పొట్లం అందించాను. దానిలో చెట్నీ బదులు పంచదార ఉండటం చూసి, "నీ కన్సర్న్ గ్రేట్.. నీ హజ్బెండ్ యమలక్కీ" అన్నాడు.

"మా ఇంటికి గెస్ట్‌గా వచ్చి ఆయనతో చెబుదువు గాన్లే. నీకు ఏ పార్టులోనైనా నొప్పిగాని బాధగాని ఉంటే చెప్పు స్పెషలిస్టుకి చూపించమంటాను".

"నాకే మందులూ అవసరం లేదు. నీ నవ్వే అమృతం!"

"నేనిప్పుడు నవ్వే స్థితిలో లేను.."

"ఒకవేళ నేను చచ్చిపోయి ఉంటే ఏం జరిగేదో చెప్పనా?"

నుదురు ముడివేసి ఆసక్తిగా చూశాను.

"నీ బిడ్డగా పుట్టేవాణ్ణి!" చిన్నగా నవ్వాడు.

కల గుర్తొచ్చింది. గలగలా నవ్వాను.

"నీ నవ్వు సర్వరోగ నివారిణి. గొప్ప స్ఫూర్తి టానిక్!" మెరుస్తోన్న కళ్ళతో అన్నాడు.

"నువ్వింత త్వరగా కోలుకోవడం 'ఏ మిరాకిల్' అన్నాడు డాక్టర్. ఏమైతేనేం నీలోని అంతర్గతశక్తి, బతకాలన్న బలమైనకోరిక త్వరగా స్వస్థత చేకూర్చి ఉంటాయి. ఏమైతేనేం నాకు చాలాచాలా హ్యాపీగా ఉంది విహాన్. సృష్టిలోని ఆనందమంతా నా సొంతమైనట్టుగా ఉంది!

నా వంకే చూస్తుండిపోయాడు విహాన్.

ఆ చూపులో అభిమానం ఉంది. ఆరాధన ఉంది. కృతజ్ఞతా ఉంది.

●●●

లేడీ డాక్టర్ని కలిశాను. ఏవో టెస్టులు చేసింది. సాయంత్రానికి రిపోర్టులొస్తాయని చెప్పింది.

ఆ సంగతి రాజేశ్వర్‌కి చెప్పి ఆసుపత్రి కెళ్ళాను.

కిటికీలోంచి బయటికి చూస్తున్నాడు విహాన్. అతడు చూస్తోన్నవైపు చూశాను.

ఆకులన్నీ రాలిపోగా మోడుబారినచెట్టు చిగు రిస్తోంది!

"చూశావా, ఆశల ఆకులన్నీ రాలిపోయినా రాబోయే పచ్చని జీవితం మీద ఆశతో బతికింది. మళ్ళీ చిగురులు వేసింది. ఇంకొద్దిరోజుల్లో పచ్చగా కళకళలాడుతుంది. పుష్పిస్తుంది. ఫలభరితమవు తుంది. ఎన్నో పక్షులకు ఆశ్రయమిస్తుంది. చితికినా చిగురు తొడగటం ప్రకృతిలోనే ఉంది. ఎండిన దర్భల మీద నాలుగు నీటి చుక్కలు చల్లితే చాలు మళ్ళీ జీవంతో పచ్చబడతాయి".

అవునన్నట్టుగా తలపంకించి వచ్చి బెడ్‌మీద కూర్చున్నాడు. దీర్ఘంగా ఆలోచిస్తుండిపోయాడు.

బహుశా జరిగింది ఎలా చెప్పటమా అని తర్కించుకుంటూ ఉండాలి. అది త్వరగా బయట కొచ్చేస్తేనే గుండెలు తేలికబడతాయి.

"జరిగింది చెప్పాలి..." గొంతు పెగల్చు కున్నాడు.

"తర్వాత చెబుదువు గాన్లే".

"కాదిప్పుడే చెప్పాలి. అది ఎలాంటిదైనా సరే నువ్వు అసహ్యించుకోవని నాకు తెలుసు..."

వినడానికుద్యుక్తురాలినయ్యాను.

"జైలులోని నరకయాతన నన్నేమీ బాధించ లేదు. జెమినీనాయుడి మీద చెయ్యి చేసుకున్నం దుకే పశ్చాత్తాప పడేవాణ్ణి. పరిస్థితులెంతగా ఎదురు తిరిగినా, అతడి మాటలూ, చెప్పిన విషయాలూ ఎంతగా ప్రొవోక్ చేసినా సంయమనం పాటించాల్సింది. ఆగ్రహం నన్ను రాక్షసుణ్ణి చేసింది. ముఖ్యంగా నన్నభిమానిస్తున్నట్టు నటిస్తున్న ఒక పెద్దమనిషి కపటి అని తెలిసింది. తేనెపూసిన కత్తిలా మారి వెన్నుపోటు పొడిచాడని గ్రహించి మరి తట్టుకో లేక పోయాను. నన్ను నేను మరచిపోయాను.."

"ఎవరా వ్యక్తి?" తెలిసినా తెలియనట్టు అడి గాను. నా గొంతు జీరబోయింది.

"ఎవరైతేనేం, అంతా నా ప్రారబ్ధం. అతడి గురించే, అతడి కష్టగురించే పదేపదే ఆలోచించే వాణ్ణి. పిచ్చుకమీద బ్రహ్మాస్త్రం వేశారని కుమిలిపోయే వాణ్ణి. ఆ సంగతి బయటపెట్టలేను. అలా అని మింగి గరళకంఠుణ్ణి కాలేను. నిజానిజాలు తెలీని జనం నా గురించి నానా మాటలూ అనుకుంటుంటే వినలేను. బంధుమిత్రులెవరికీ ముఖం చూపించ లేను. అందుకే విరక్తి భావనలు వేళ్ళూనుతోంటే అజ్ఞాతంలో కెళ్ళిపోయాను.."

సానుభూతిగా చూశాను. తనని నిలువునా నాశనం చేయాలని పగబట్టింది మా నాన్నేనని నాకు చెప్పదలచుకోలేదు. నేను హర్ట్ అవుతానని దాస్తు న్నాడు. అతడి నోట్‌బుక్‌ద్వారా నాకన్నీ తెలిశాయని అతడికి తెలీదు. నేనూ బయటపడ దలచుకోలేదు. నాకేమీ తెలీదన్న భ్రమలోనే అతన్ని ఉంచడం మంచిదన్పించింది.

"నా మనస్సు దుర్భరం అవుతున్నకొద్దీ అనేకా నేక నెగెటివ్ ఆలోచనలు చుట్టుముట్టసాగాయి. ప్రతీ కారేచ్ఛతో రగిలిపోయాను. నన్ను నేను కంట్రోలు చేసుకోవాలి. ఆత్మప్రక్షాళన చేసుకోవాలి. అందుకు నన్ను నేను హింసించుకోవడమే మార్గం అను కున్నాను. అందరికీ దూరమయ్యాను. అర్ధాకలితో మాడాను. దేనిమీదా ఎలాంటి అభిమానంగాని ద్వేషంగాని లేకుండా నిర్వికారంగా బతికాను. కాని అదెక్కువ కాలం సాగలేదు".

అతడి వాక్ప్రవాహానికి అడ్డు రాదలచుకోలేదు. మౌనంగా వింటూ ఉండిపోయాను.

(ముగింపు వచ్చే వారం)

వెన్ను నొప్పి

ఈ వెన్నునొప్పికికారణమైన వెన్నుముక మనశరీరంలో చాలావిశిష్టంగా, సంక్లిష్టంగా ఉంటుంది. వెన్ను భాగం లో లింగ మెంట్లు, కండరాలు, ఫేసెట్‌జాయింట్‌లు అనుసంధానమై శరీరానికి స్థిరరానిస్తూ మన దైనందిక జీవితంలో శారీరకంగా ఎదురయ్యే ఎన్నో ఒత్తిడిలను తట్టుకొని నరాలమీద ఏవిధమైన ఒత్తిడి పడకుండా కాపాడుకోవడం ఈ వెన్నుముక ప్రధాన లక్షణం. పైన పేర్కొన్న వీటిలో ఏదో ఒకదాని మీద ఒత్తిడిపెరగడం, దెబ్బలుతగలడం, అతిగాబరువులు ఎత్తడం, దించడం, ఊభకాయం, ఇన్‌ఫెక్షన్లు, క్యాల్షియం విటమిన్ బి12, డి3లోపాలు ఎముకలు సాంద్రతతగ్గడం వెన్నునొప్పికి గలకారణాలు. మన దైనందిక జీవితంలో ప్రతీక్షణం మెడ, నడుము ఏపనిచేయాలన్నా వీటీఅవసరమే. అందుకే ప్రతి 10 మందిలో 6 నుండి 8 మంది ఈ సమస్యతో బాధ పడుతుంటారు. ఈ వెన్నునొప్పి ద్వారా తమ వృత్తి సంబంధ ఉద్యోగాలను మార్చుకొనుట, సర్జరి కి, మందులకు, ఫిజియో థెరపికి 70 నుంచి 100 మిలియన్ డాలర్లవరకు ఖర్చుపెడుతున్నారని అంచనా. వెన్నుముకలో 33 ఎముకలు ఉంటాయి. అందులో 7 ఎముకలు మెడభాగంలో, 12 ఎముకలుపైన వీపుభాగం లో, 5ఎముకలు క్రింది వీపు భాగంలో మిగిలిన 9 ఎముకలు క్రింద భాగంలో ఉంటాయి. మెడభాగం లో వచ్చే సమస్యను సర్వైకల్ స్పాండిలైటిస్ అంటారు.

సర్వైకల్ స్పాండిలోసిస్: ఇది మెడలోని సి1, సి2, సి3, సి4, సి5, సి6, సి7 వెన్నుపూసల అనుసంధా నమైన సర్వైకల్ ప్రాంతం అంటారు. ఈ మెడ ప్రాంతం లోని వెన్నుపూస కీళ్ళలో మధ్యలోని ఖాళీభాగంతగ్గిపోవడం డిస్క్‌బల్జ్‌కావడం, వెన్నుపూస మధ్యలో రాపిడి ఎక్కువ వడం, ఆస్టియోఫైట్స్‌చేరడం వలన మెడభాగం నుండి నొప్పి చేతికిమరియు చేతి వేళ్ళవరకు నొప్పితో పాటు తిమ్మిర్లు, చేయి మొద్దు బారడం, మెడ పట్టివేయడం, తల తిరగడం, ఒక్కోసారి వాంతివచ్చినట్లు ఉండడం చూస్తువుంటాము. ఈ సర్వైకల్‌స్పాండిలోసిస్ ఈ ఆధునికయుగంలో నగరజీవితం గడిపేవారిలో ప్రతి 10మందిలో 5మంది వరకు బాధపడుతూ ఉంటారు. హోమియోపతి చికిత్సావిధానం వీరికి ఓవరం లాంటిది. ముఖ్యంగా ఆసిడ్‌ఫాస్ అనేమందు ఏరకమైన సర్వైకల్ స్పాండిలోసిస్‌కైనా పనిచేస్తుంది. కొనియం అనే మందు తలవెనుకభాగంలో డల్‌పేన్‌తో మెడజగుతుతో, తల తిరగడం, తలభారంగాఉండడం కొనియంలోని ప్రధాన లక్షణం.కాల్మియాలాటిఫోలియా అనే మందు మెడభాగం నుండి భుజం, చేయి, చేతి వేళ్ళ వరకు నొప్పి ప్రాకుతు ంటుంది. విపరీతంగా ఉండే తిమ్మిర్లువస్తుంవుంటాయి. కల్కేరియాఫాస్ అనే మందు క్యాల్షియంతక్కువకావడం, విటమిన్ డి3, బి12సమస్యలు మరియు ఆస్టియోఫైట్స్ ఉండి మెడ భారంగా ఉంటుంది. వయసుతో పాటు వచ్చే వెన్నుపూస మార్పులకు అద్భుతంగా పనిచేస్తుంది. ఇంకా బ్రయోనియా, స్పైజిలియా, రస్టాక్స్,జెల్సినియం మందులు డాక్టర్‌పర్యవేక్షణలోవాడాలి.

జాగ్రత్తలు: ఈ మెడ, నడుమునొప్పిసమస్యలు తమ ఉద్యోగ విధులకు ఆటంకం కలిగిస్తుంటాయి. ఈ వెన్నునొప్పితో పని చేసే ఉద్యోగస్తులు 40%వరకు విరామం తీసుకుం టారు. ఒక సర్వే ప్రకారం పూర్తిగా విశ్రాంతి తీసు కున్నా ఈ కండరాలు బిగుసు కొని పోయి ఇంకా నొప్పితీవ్రత పెరిగే ఆస్కారం ఉన్నాయి. బెడ్ రెస్ట్ తీసుకునే ముందు డాక్టర్‌సలహా పాటించి తీసుకోవాలి. ఈ నొప్పినివారణ మాత్రలు ఎక్కువ వాడటం వలన కడుపులో మంట, ఆకలి మందగించడం, వికారంతో పాటు కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. హోమియోపతి మందులు ఏ విధమైన సైడ్‌ఎఫెక్ట్స్ లేకుండా వ్యాధి మూలకారణాన్ని తొలగి స్తాయి. ప్రతీరోజు నడుము, మెడ సంబంధమైన వ్యాయామాలు, డాక్టర్, ఫిజియో థెరపిస్ట్ సలహాతో చేయడం, చాలాసేపు నిల్చోవటం, కూర్చోవటం మానటం, శరీర ఎత్తుకు తగ్గబరువును మెయింటెన్ చేయడం, చాలాజాగ్రత్తగా అత్యవసర మైతేనే బరువు లను ఎత్తడం, దించడం. సరైనభంగిమలో కూర్చోవడం ద్వారా వెన్నునొప్పి బారిన పడకుండా కాపాడు కోవచ్చు.

డా. మురళి అంకిరెడ్డి
M. D (Homeo)
స్టార్ హోమియోపతి

హోమియోచికిత్స: జీవితాంతం వేధించే ఈ నొప్పులు ఎన్నాళ్ళు, ఎన్నేళ్ళు అని నిరాశచెందేవారికీ హోమియోపతి లో అద్భుతమైన చికిత్స ఉంది. ఈ వెన్నునొప్పికి కారణ మైన డిస్క్‌బల్జ్, డిస్క్ కంప్రెషన్, నరాల మీద ఒత్తిడి గురివేసి తీవ్రమైన నొప్పి వస్తువుంటుంది. ఈ సమయం లో హోమియోపతి మందులు వ్యాధి మూల కారణమైన డిస్క్‌బల్జ్ నరాల ఒత్తిడిలను తగ్గించడానికీ చాలా రకాలైన మందులు న్నాయి. హోమియోపతిలో వెన్నునొప్పికి సింఫైటమ్, అస్కులస్ హిప్, రస్టాక్స్, హైపరికం, ఆర్నిక, బెల్లిస్, బ్రయోనియాఆల్బ్, కాల్కేరియాఫోర్, సిమిసిప్యూగ మొదలగు మందులున్నాయి.ఇది అనుభవజ్ఞులైన డాక్టర్ పర్యవేక్షణలో వాడాలి.

www.starhomeo.com

సికింద్రాబాద్ । కొత్తపేట । కూకట్‌పల్లి । వరంగల్ । గచ్చిబౌలి
విజయవాడ । తిరుపతి । వైజాగ్ । రాజమండ్రి । కర్నాటక

✆ 90300 64224

ఆస్తమాకు అద్భుత చికిత్స

ఈ దుమ్ము ధూళి, రసాయనాలు ప్రభావం వల్ల దీర్ఘకాల సమస్యలు వస్తాయి. అందులో ఆస్తమా ఒకటి. ప్రస్తుతం ప్రపంచంలో చాలామందిని వేధిస్తున్న సమస్య. ఆధునిక జీవనశైలి, కాలుష్యం కారణంగా ఎంతోమంది ఈ వ్యాధి బారినపడుతున్నారు. ఈ ఆస్తమాకు ఆయుర్వేదవైద్యమే సరైనపరిష్కారం అని చెబుతున్నారు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్‌మనోహర్. బ్రతకడానికి కావలసిన ప్రాణ వాయువును శ్వాస ప్రక్రియ ద్వారా ఊపిరితిత్తులు అందిస్తాయి. ప్రతిరోజు మన శ్వాస కోశాలు వివిధ రకమైన వాతావరణపరిస్థితులకు, ఎలర్జెన్స్‌కు, రసాయనా లకు, పొగ, దుమ్ము, ధూళీ మొదలైన వాటికి లోనవు తుంటాయి. వీటివలన వివిధరకాల ధీర్ఘకాలిక వ్యాధులు వస్తాయి. వాటిలో ఆస్తమాఒకటి. ముక్కులోకి, ఊపిరి తిత్తులలోకి లేదా శరీరంలోకి పలిపడని సూక్ష్మ పదార్థాలు గాలి ద్వారా లేదా ఆహారంద్వారా ప్రవేశించి నప్పుడు వాటికి ప్రతిచర్యగా మన శరీరం స్పందించి వివిధ రకాల రసాయనాలను విడుదల చేస్తుంది. వీటి ప్రభావం వలన శ్వాసనాళాలు కుచించుకు పోతాయి. ఊపిరి తీసుకోవడం కష్టమవుతుంది. ఆస్తమా ఉన్నవారిలో తరుచుగా ఆయాసం రావడం, పిల్లకూతలు, దగ్గు, చాతి బరువుగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వీటితో పాటు కొంత మందిలో తరుచుగా తుమ్ములు రావడం, ముక్కు నుంచి నీరు కారడం, తరుచుగా, జలుబు చేయడం వంటి లక్షణాలు కూడా ఉంటాయి. ఆస్తమా రావడానికి గల కారణాలు చాలా ఉన్నప్పటికీ ప్రధానమైనవి జన్యు సంబంధిత కారణాలు. వాతావరణ పరిస్థితులు, ఇంటి లోపల, బయటా గల వివిధ కాలుష్య కారకాల వలన ఆస్తమా రావచ్చు లేదా పెరగవచ్చు. మనిషి జీవించడానికి కావలసిన శ్వాస ప్రక్రియ శ్వాసకోశాల ద్వారా జరుగు తుంది. ఆక్సిజన్‌ను పీల్చుకోవడం, ఇదోక నిరంతర ప్రక్రియ. ఒక విధంగా ఈ శ్వాసప్రక్రియ మనిషి జీవితాన్ని శాసిస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రస్తుత జీవన విధానంలో వాతావరణ కాలుష్యం ఎక్కువగా ఉంది. దానికి ముఖ్య కారణం నగరాలు విస్తరించడం. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం 2001నాటికే భారతదేశంలోసుమారు 2.5 కోట్లమంది ఉబ్బసం వ్యాధి తోనూ, 1.5 కోట్ల మంది వివిధరకాల శ్వాసవ్యాధులతో బాధపడుతున్నారని ఒక అంచనా. ఈ దుమ్ము ధూళి, రసాయనాల ప్రభావం వల్ల దీర్ఘకాల సమస్యలు వస్తాయి. అందులో ఆస్తమా ఒకటి. ఈ పదార్థాలు ముక్కుద్వారా, శ్వాస నాళాలు, ఊపిరితిత్తులోకి వెళ్లినప్పుడు,ఒక ప్రతి చర్య జరిగి కొన్ని రసాయనాలు ఉత్పత్తి అవుతాయి. ఆ ప్రభావంవల్ల, శ్వాసనాళాల్లో సున్నితమైన పొరవాపు వస్తుంది. ఎర్రగా అయి శ్లేష్మం ఉత్పన్నం చెంది. కుచించు కుపోతుంది. తర్వాత పిల్లికూతలు, దగ్గు, శ్లేష్మం, ఆయాసం వస్తుంది. దీన్నే శ్వాసవ్యాధిగా పరిగణిస్తాం.

కారణాలు: 1.జన్యు పరమైనవి. 2.వాతావరణ కాలుష్యం, ఇంటిలో, బయట వాతావరణంలో కాలుష్యం. 3.ముఖ్యంగాఇంటిలోడస్ట్‌మైట్స్. ఇవిఎక్కువగా పరుపులు, దిండ్లు, బీరువాలపై ఉంటాయి. 4.పెంపుడు జంతువులు, కుక్కలు, పిల్లులు, పక్షులు మొదలైన వాటి వెంట్రుకలు. 5.ఎలుకలు, బొద్దింకలు విసర్జించే రసాయనాలు. 6. జిరాక్స్, ధూమపానం, లెడ్ వంటి కంపెనీలలో పనిచేసే వారికి ఆస్తమా వస్తుంది.

ఆయుర్వేదచికిత్సా పద్ధతులు: వాత, కఫ దోషాల ప్రకోపం వలన ఈ శ్వాససంబంధ వ్యాధులు సంభవిస్తాయి. ఆయుర్వేదంలో చికిత్సా పద్ధతులను అవలం భించేప్పుడు వైద్యులు, రోగ బలంను పరిగణనలోకి తీసుకుని చికిత్సా పద్ధతులను అవలంబిస్తుంటారు. ముఖ్యంగా నిధాన పరి వర్జనము, శమన, శోధనచికిత్సాపద్ధతుల ద్వారా చికిత్స అందిస్తారు. ఈ శ్వాస సంబంధ వ్యాధులలో రోగ నిరోధక శక్తి పెంపు కోవలసిన అవసరం ఉంది అందుకు ఆయుర్వేదంలో ఉత్తమ రసాయ నాలను ఆచార్యులు వివరించారు. వీటితో పాటు శస్య కర్మ, విరేచనకర్మ లాభాదాయకంగా ఉంటుంది. ఈ సమస్య తో బాధపడే రోగులు తేలికపాటి ఆహారం, తేలిక పాటి వ్యాయామం, యోగా, ప్రాణయామం చేయుటం ద్వారా ఫలితాలు పొందవచ్చు

డా. లక్ష్మీ M. D (Ayurveda)
స్టార్ ఆయుర్వేద

ADVT

✆90300 85456

సికింద్రాబాద్ । కొత్తపేట । కూకట్‌పల్లి । వరంగల్ । గచ్చిబౌలి
విజయవాడ । తిరుపతి । వైజాగ్ । రాజమండ్రి । కర్నాటక

www.starayurveda.com

తెర వెనుక భాగోతం

'పల్లవి పదేళ్ల పాప. స్కూలు నుంచి ఇంటికి వస్తూ దారిలో సూపర్‌మార్కెట్ వద్ద ఆగింది. అక్కడ ఆమె ఓ నడివయసు వ్యక్తితో మాట్లాడటం చూశారు కొందరు. సాయంత్రం పాప ఇంటికి రాకపోవటంతో తల్లిదండ్రులు పోలీసు రిపోర్టిచ్చారు. ఎంత వెతికినా పాప జాడ తెలియ లేదు. పాపతో మాట్లాడిన ఆ వ్యక్తి ఎవరో తెలియలేదు. దాంతో ఆధారాలు లేక పరిశోధన ఆగిపోయింది. నాలుగు నెలల తరువాత నగరం అవల అడవి చెట్ల గుబురుల్లో అస్థి పంజరం దొరికింది.

ఎముకలకు అక్కడక్కడా ఇంకా మాంసం అంటుకుని ఉంది. అది పల్లవి అస్థిపంజరమే అని పోలీసులు నిర్ధారించారు. మెడపై కత్తిపోట్ల వల్ల మరణించింది. ఎవరో పాపను చంపి అక్కడ పారేశారు. మాకు ఎలాంటి ఆధారాలు దొరకలేదు అందుకే ప్రత్యేకంగా ఈ కేసు నువ్వు టేకప్ చెయ్యాలి' డిటెక్టివ్ శరత్‌తో అన్నాడు ఇన్‌స్పెక్టర్ విజయ్.

'సరే ఓసారి తల్లిదండ్రులను ప్రశ్నిద్దాం' అన్నాడు శరత్.

●●●

'మీకు శత్రువులున్నారా? మిమ్మల్ని ఎవరైనా డబ్బులు డిమాండ్ చేశారా?'

'మాకు ఆస్తులూ లేవు, ఎవరితోనూ వైరం లేదు. ఈ పని ఎవరు ఎందుకుచేశారో తెలియటం లేదు' అన్నాడు తండ్రి కన్నీళ్లతో.

'అదృశ్యం కావడానికి ముందు అమ్మాయి ప్రవర్తనలో ఏమైనా మార్పులు గమనించారా?' పాప తల్లిని అడిగాడు శరత్.

'అంత తీరిక మాకు ఎక్కడ ఉంది? అమ్మాయిని స్కూలు బస్సు ఎక్కించి నా భర్తా, నేనూ ఆఫీసులకు వెళ్లిపోతాం. నాలుగింటికి పాప మళ్లీ స్కూలు బస్సులోనే ఇంటికి వస్తుంది. మేం రాత్రి ఏడు గంటలకు వస్తాం. అప్పటివరకూ అమ్మాయి ఒక్కర్తే ఉంటుంది. మళ్లీ తెల్లారి లేస్తే ఉరుకులు, పరుగులు అంది అర్చన. దాని సెలవుల్లో కూడా మాకు ఆఫీసులుంటాయి. ఒక్కర్తినే ఇంట్లో తాళం వేసి వెళ్లేవాళ్లం. ఇంట్లో చదువుతూనో, టీవీ చూస్తూనో, వీడియోగేమ్స్ ఆడుతూనో ఉండేది' చెప్పాడు తండ్రి. చివరి మాటలు వింటూనే నిటారుగా అయ్యాడు శరత్. 'ఇంట్లో అమ్మాయికి సెల్‌ఫోన్ ఇచ్చేవారా?' అడిగాడు.

'ఒంటరిగా వదిలినప్పుడు నా ఫోన్ ఇచ్చేదాన్ని' చెప్పింది అర్చన.

'మీ ఫోన్ ఇలా ఇవ్వండి?'

అని అడిగి తీసుకున్నాడు. ఫేస్ బుక్, వాట్సప్ సౌకర్యాలున్న ఫోన్.

'మీ ఇంట్లో వైఫై ఉందా?'

'ఉంది'.

'వైఫైకి పాస్‌వర్డ్ లేదు' అన్నాడు.

'అమ్మాయి కంప్యూటర్ గేమ్స్ ఆడేదా?'

'ఆడేది ఇంట్లో. ల్యాప్‌టాప్ ఉంచాం' చెప్పాడు తండ్రి.

ల్యాప్‌ట్యాప్ తీసుకున్నాడు శరత్.

●●●

'పోలీసుల రిపోర్టులో సెల్‌ఫోన్, ల్యాప్‌ట్యాప్ సంగతి లేదే' అడిగాడు శరత్.

'లేదు. చిన్నపిల్ల ల్యాప్‌ట్యాప్, సెల్‌ఫోన్లు వాడుతుందని ఊహించలేదు అందుకే ఆ యాంగిల్‌లోకి వెళ్ళలేదు'.

'సర్లే', అంటూ ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లను కత్తి ఉమేశ్‌కు అందించాడు.

'వీటిల్లో మనకు కావాల్సిన సమాచారం దొరుకుతుందేమో చూడు' అన్నాడు.

'యెస్ బాస్' అన్నాడు ఉమేశ్‌కుమార్.

'విజయ్, ఓసారి వెళ్ళి శవం దొరికిన స్థలం చూద్దాం' అన్నాడు శరత్.

●●●

అస్థిపంజరం దొరికిన ప్రాంతంలో నేలను జాగ్రత్తగా పరిశీలించాడు శరత్. మట్టి శాంపిల్స్ తీసుకున్నాడు. అలా పరిశీలిస్తూండగా, దూరంగా ఓ దృశ్యం కనిపించింది.

రెండు మూడు కుక్కలు దేన్నో లాగుతూ పోరాడుతున్నాయి. వాటిని అదిలించి దగ్గరకు వెళ్ళి ఆ వస్తువును చూశాడు.

కిటికీలకు వేసే కర్టెన్ గుడ్డ! మట్టి కొట్టుకుపోయింది. గ్లవ్స్ తొడిగిన చేత్తో దాన్ని తీశాడు శరత్.

●●●

'నీ అంచనా కరెక్టే శరత్. శవాన్ని కర్టెన్ గుడ్డలో చుట్టి పారేశారు. బహుశా కుక్కలు కర్టెన్‌ని లాగి ఉంటాయి. ఇతర జంతువులు, పురుగులు మాంసాన్ని పీకేసి ఉంటాయి. అందుకే శవం ఓ చోట దొరికింది. శవాన్ని చుట్టిన కర్టెన్ దూరంలో లభించింది. ఈ కర్టెన్ ఫైబర్లపై శవాన్ని చుట్టిన ఆనవాళ్లున్నాయి' చెప్పాయి ఫోరెన్సిక్ నిపుణుడు.

'దీన్ని చూస్తుంటే మామూలు కర్టెన్‌లా అనిపించటం లేదు' అన్నాడు శరత్.

'అవును. ఇది మన దగ్గర దొరికే కర్టెన్ మెటీరియల్ కాదు' చెప్పాడు.

●●●

'శరత్. సెల్‌ఫోన్లలో డేటా దాచటానికి సాలిడ్ స్టేట్ ఫ్లాష్ మెమెరీ' వాడతారు. అందువల్ల సెల్ ఫోన్ స్విచాఫ్ చేసినా దాన్లో విషయాలు భద్రంగా ఉంటాయి. నేను ముందు 'లాజికల్ ఎక్స్‌ట్రాక్షన్' పద్ధతిలో డేటా బయటకు లాగాను. దీన్లో ప్రస్తుతం వాడుతున్న డేటా వస్తుంది. అందుకని 'ఫిజికల్ ఎక్స్‌ట్రాక్షన్' పద్ధతిని ఉపయోగించి ప్రస్తుతం ఉపయోగంలో ఉన్న డేటాను, చాలాకాలం నుంచీ ఉపయోగించకుండా మెమరీలో పడి ఉన్న డేటా కూడా తీశాను. ఇదిగో...' అందించాడు ఉమేశ్.

ఆత్రంగా డేటా అందుకుని పరిశీలించటం ప్రారంభించాడు శరత్. అతడి భృకుటి ముడిపడింది.

రెండు రకాల వాడకం కనిపిస్తోంది. పల్లవి వాళ్లమ్మ వాట్సప్ గ్రూపులు కుటుంబానికి, ఆఫీసుకు సంబంధించినవి. మరో 'సిమ్'లో వాటితోపాటు 'టీన్‌ఫ్రెండ్స్ ఫరెవర్' అన్న గ్రూపు కనిపిస్తోంది. కానీ అది వాడి నాలుగయిదు నెలలవుతోంది. అంటే, పల్లవి అదృశ్యమయినప్పటి నుంచీ ఆ గ్రూపుకి మెసేజీలు రావటం లేదు, వెళ్లటం లేదు. ఆ గ్రూపులో సమాచారం కోసం చూశాడు శరత్. దాన్లో ఇద్దరే ఉన్నారు. ఒకరు పల్లవి. ఇంకొక నెంబరు ఉంది. కానీ పేరులేదు. 'మీ కాల్‌లిస్టులో లేని వారు ఈ గ్రూపులో మిమ్మల్ని చేర్చారు' అన్న మెసేజీ కనిపిస్తోంది. దాని క్రింద ఆ పేరులేని నెంబరుకు పల్లవికి జరిగిన డిలీటైన చాటింగ్ కనిపిస్తోంది.

ఆ చాటింగ్ చూస్తూ తన అసిస్టెంట్ రాముకు ఫోను చేశాడు శరత్.

●●●

'బాస్' మీరిచ్చిన నెంబరు అడ్రసు తెలుసుకున్నాను' చెప్పాడు రాము. వెంటనే విజయ్‌తో కలిసి ఆ అడ్రసుకు వెళ్లాడు శరత్.

'సారీ సర్. నెలల క్రితమే అతను ఇల్లు మారేడు. ఫార్వార్డింగ్ అడ్రసు లేదు' చెప్పాడు ఓనరు.

'అతని వివరాలు చెప్తారా' అడిగాడు శరత్.

'అతని పేరు జస్వంత్. పెద్ద వ్యాపారి అన్నాడు. ఈ ఇల్లు అతని విశ్రాంతి కోసమే అన్నాడు. ఇక్కడ ప్రశాంతంగా లేదని వెళ్లిపోయాడు. ఇక్కడున్నది రెండు నెలలే' చెప్పాడు ఓనరు.

'అతడిని వర్ణిస్తారా?' అడిగాడు శరత్.

పదేళ్లపాప. స్కూలుకెళ్ళి ఇంటికి తిరిగొస్తూ మిస్ అయింది. నాలుగు నెలల తర్వాత అడవుల్లో అస్థిపంజరం దొరికింది. అది పాప అస్థిపంజరమే అని నిర్ధారించారు. కానీ అక్కడ పోలీసులకు ఎలాంటి సాక్ష్యాలు లభించలేదు. పాప చివరిగా సూపర్‌మార్కెట్ దగ్గర కలిసి మాట్లాడిన మనిషి జాడ కూడా తెలియలేదు. ఇలాంటి పరిస్థితుల్లో సాక్ష్యాలు సంపాదించేందుకు డిటెక్టివ్ శరత్ ఎలాంటి వ్యూహం పన్నాడు?

అతడు చెప్పినదంతా రాసుకున్నాడు.

●●●

ఓనరు చెప్పినదాని ఆధారంగా ఆర్టిస్టు వేసిన బొమ్మను శరత్‌కు అందించాడు. బొమ్మ పరిశీలించి తన ఫైలులో ఉన్న సెక్సువల్ అఫెండర్లు, పసిపిల్లలపై అత్యాచారం చేసే వాళ్ల బొమ్మలతో పోల్చాడు విజయ్. 'సారీ.. నో మ్యాచ్' అన్నాడు.

'మీడియాలో ప్రచారం ఇస్తే ఎలా ఉంటుంది?' అడిగాడు విజయ్.

'తల అడ్డంగా ఊపాడు శరత్' అనవసరంగా నేరస్తుణ్ణి అప్రమత్తం చేసినట్టవుతుంది.

నేరం బయటపడదని భరోసాగా ఉన్నవాడిని హెచ్చరించినట్టవుతుంది. 'మరేం చేద్దాం?' అడిగాడు విజయ్.

సమాధానం ఇచ్చేలోగా శరత్‌కు ఫోను వచ్చింది. 'బాస్.. మనకు దొరికిన కర్టెన్ లాంటివి చాలా అరుదు. మన నగరంలో ఒకే ఒక డిస్ట్రిబ్యూటర్ అలాంటి కర్టెన్స్ విక్రయించినట్టు చెప్పాడు. ప్రస్తుతం స్టాక్ లేదట. టర్కీ నుంచి రావాలట' చెప్పాడు రాము. 'ఆ డిస్ట్రిబ్యూటర్ అడ్రస్ చెప్పు అన్నాడు శరత్'

●●●

'వీటి ధర చాలా ఎక్కువ. ధనవంతులే కొంటారు' శరత్‌కి చెప్పాడు డిస్ట్రిబ్యూటర్.

'మాకు ఇలాంటి కర్టెన్ కావాలి. మన నగరంలో ఇలాంటివి ఎవరికైనా అమ్మేరా?' కాజువల్ అడిగాడు శరత్.

'లేదు సార్. కానీ వీటికిప్పుడే ఒక ఆర్డర్ వచ్చింది. అదికూడా నాగపూర్ నుంచి. రెండేళ్ళ క్రితం వాళ్ళు చాలా కర్టెన్లు కొన్నారు'

'ఎవరు వాళ్ళు?'

'జస్వంత్ అగర్వాల్ ట్రేడర్స్. అతనే ప్రొప్రైటర్ కూడా'

'అతని అడ్రసు చెప్తారా?' అని అడిగి అడ్రస్ తీసుకున్నాడు. 'అతనిలా ఉంటాడా?' అని ఫోటో చూపించాడు.

●●●

'నేనే జస్వంత్ అగర్వాల్. ఏం కావాలి?' అడిగాడు జస్వంత్.

ఆ గదిలో అడుగుపెడుతూండగానే శరత్ దృష్టి అక్కడ వేలాడుతున్న కర్టెన్స్‌మీద పడింది.

'కర్టెన్లు చాలా బాగున్నాయి. ఎక్కడ కొన్నారు?' అడిగాడు. అంతలోనే శరత్ దృష్టి దూరంగా తలుపులు తెరచిఉన్న అతని ప్రైవేట్ క్యాబిన్‌పై పడింది. అందులో ఒక కిటీకీకి కర్టెన్ లేదు.

'ఆ కర్టెన్లు మార్చేస్తున్నాంగానీ, ఇంతకీ మీరెవరు? ఏం కావాలి?' అడిగాడు అగర్వాల్. శరత్ పరిసరాలు గమనించడం చూసి క్యాబిన్ తలుపు మూసేశాడు.

'మీకు పల్లవి తెలుసా?' అడిగాడు.

అతడి మొహం పాలిపోయింది.

'ఏ పల్లవి. ఎవరామె?' గంభీరంగా అన్నాడు.

'పదేళ్ళ అమ్మాయి. కొన్ని నెలల క్రితం అదృశ్యమైంది'

'నాకు తెలియదు'

'పల్లవితో మీరు చాటింగ్ చేసిన వివరాలివిగో'

'హైదరాబాద్‌లో ఉన్నప్పుడు మీరు వాడిన సిమ్‌లోంచి మేం సేకరించిన వివరాలివి. ఇప్పుడు చెప్పండి పల్లవి మీకు తెలుసా? తెలియదా?'

అయినా 'నాకు తెలియదు' అన్నాడు మొండిగా.

'పల్లవిని చంపి కర్టెన్ గుడ్డలో చుట్టి పారేశారు. ఆ కర్టెన్ మీ గదిలో కర్టెన్‌ను పోలి ఉంది'

'కర్టెన్ క్లాత్‌ను బట్టి దోషినెలా నిర్ణయిస్తారు?' అని జస్వంత్ అంటూండగానే అతని అసిస్టెంట్ లోపలికి వచ్చాడు. 'సార్, కర్టెన్స్ అన్నీ మార్చెయ్యమన్నారు కదా, కానీ, ఒక కర్టెన్ కోసం అన్నీ మారిస్తే మళ్ళీ చాలా ఖర్చవుతుందంటున్నారు ఫైనాన్స్‌వాళ్ళు' అన్నాడు. జస్వంత్ ముఖంలో కత్తి గాటుకు నెత్తురు చుక్కలేదు. వెళ్ళిపొమ్మని అతనికి సైగ చేశాడు.

నవ్వాడు శరత్. శవాన్ని చుట్టిన కర్టెన్‌ను పరిశీలించినప్పుడు దానిమీద వేలిముద్రలు దొరికాయి. ఫైబర్లలో డిఎన్ఏ ఉంది. వాటితో పోల్చి చూడటానికి ఇప్పుడు నిందితుడు దొరికాడు' అన్నాడు శరత్.

నిస్సత్తువగా కుర్చీలో కూలబడిపోయాడు జస్వంత్.

నేను నేరస్తుణ్ణి కాను. కావాలని చేయలేదు. హైదరాబాద్‌లో ఒంటరిగా ఉండేవాణ్ణి. పొరపాటున రాంగ్ నంబర్‌కి డయల్ చేశాను. 'ఒంటరిగా ఉన్నా, బోర్ కొడుతోంది' అని మాట్లాడింది పల్లవి. నేనూ కుతూహలంగా మాటలు పెంచాను. ఆమె పదేళ్ళ పాపలా మాట్లాడలేదు. ప్రేమ గురించి, సెక్స్ గురించి మాట్లాడేది. తీరా కలిస్తే పదేళ్ళ పాప. ఆశ్చర్యపోయాను. అప్పటికే నేను చాలా ఊహలు పెంచుకుని ఉన్మాదస్థితిలోకెళ్ళాను. ఆమెను నాగపూర్ తీసుకెళ్ళాను. నా కోరికలన్నీ తీరిపోయాక తప్పు తెలిసింది. నాగపూర్‌లో ఎవరికైనా తెలిస్తే కష్టమని చంపి కర్టెన్‌లో చుట్టి హైదరాబాద్ తీసుకొచ్చి పారేశా' చెప్పి భోరుమన్నాడు జస్వంత్.

-కస్తూరి మురళీకృష్ణ
సెల్: 98496 17392

నోబెల్ కథలు

లిజ్జీ

-థామస్ మాన్

పాల్ థామస్‌మాన్ 6 జూన్ 1875న జర్మనీలో జన్మించారు. 1929లో సాహిత్యంలో నోబెల్ బహుమతి అందుకున్నారు. 80 ఏళ్ళ వయసులో 12 ఆగస్టు 1955న మరణించారు.

పెళ్ళిళ్ళు స్వర్గంలో జరుగుతాయంటారు. పెళ్ళి చేసుకున్న అన్ని జంటలూ చూడ ముచ్చటగా ఉండాలని లేదు. సినిమాల్లో హాస్య సన్నివేశాన్ని పండించటానికి ఒక మొరటు మనిషి, అందమైన నాజూకు యువతి పెళ్ళి చేసుకున్నట్లు చూపిస్తారు. ఆ జంటను అందరూ ఆమోదిస్తారు. వారిని చూసి కాసేపు నవ్వుకుంటారు. ఊహాలోకంలో అలాంటి వివాహాలను ఆమోదించగలిగినప్పుడు నిజజీవితంలో కూడా ఆమోదించ గలగాలి.

జాకోబీ ప్రముఖ న్యాయవాది. అతని భార్య అమ్రా అపురూప సౌందర్యరాశి. ఆమె వయస్సు దాదాపు ముప్పయ్యేళ్ళు. కొన్నాళ్ళక్రితం వరకు ఆమెకు అన్నా, మార్గరెట్, రోసా, అమలీ అని రక రకాల పేర్లుండేవి. అయితే ప్రస్తుతం ఆమె ఆ నాలుగు పేర్లలోని మొదటి అక్షరాలను కలిపేసి 'అమ్రా'గా పేరు మార్చుకుంది. నల్లటి ఒత్తయిన జుట్టు, చక్కటి శరీరఛాయతో ఉండే ఆమెను ఒక్కసారి చూస్తే మర్చిపోవడం కష్టం. ఆమె విషయానికి వచ్చేసరికి ఎవరికైనా బుద్ధిమీద హృదయానిదే పైచేయి అన్నట్టు అనిపించేది. దానికి కావలసిందల్లా ఆమె మిమ్మల్ని ఒక్కసారి చూడడం! ఆమె తలను ఒక పక్కకు వంచి ఓర చూపు చూసిందంటే చాలు ఆ విషయాన్ని ఎవరైనా సరే, ఒప్పుకోవలసిందే. పైకి నిరాడంబరంగా, మృదుస్వభావిగా కనిపిస్తుంది. ఆమె లోలోన మనిషి వేరు. తన మనసులోని ఆలోచనలు బైట పడకుండా ఉండటానికి బాగా తక్కువగా మాట్లాడుతుంది అమ్రా. అందంగా ఉండి, తక్కువగా మాట్లాడే స్త్రీ గురించి ఎవరికైనా వ్యతిరేకంగా మాట్లాడడానికి ఏముంటుంది? ఆమె కళ్ళు భావ రహితంగా ఉండడమే కాదు. వాటిల్లో ఒకలాంటి కపటం కనిపించేది. ఆమె నోరు మాత్రం చాలా చక్కగా ముద్దొస్తూ ఉంటుంది.

ఇలాంటి వింతైన లక్షణాలన్నీ కలగలసిన అమ్రా భర్త జాకోబీని మొదటిసారి చూసినవాళ్ళు ఎవరైనా ఆశ్చర్యపోవలసిందే. అతనికి దాదాపు నలభై ఏళ్ళుంటాయి. చాలా లావుగా ఉంటాడు. అయితే లావు అనే ఒక పదంతో చెబితే సరిపోదు. చిన్నసైజు పర్వతంలా ఉంటాడని చెప్పుకోవచ్చు. అతడు ఎప్పుడూ వేసుకునే నల్లటి పంట్లాంలోంచి అతనికాళ్ళు ఏనుగుకాళ్ళను తలపిస్తుంటాయి. అతడి గుండ్రటి వీపు ఎలుగుబంటిని గుర్తుకు తెస్తుంటుంది. కోటుకి పెట్టుకున్న గుండీల్లోంచి బానంత పొట్ట తొంగిచూస్తూ ఉంటుంది. ఇంత పెద్ద శరీరానికి చిన్నతల అతికించినట్టుగా ఉంటుంది. చిన్నకళ్ళు, బండముక్కు, ఉబ్బిపోయిన బుగ్గలమధ్య కప్పబడిపోయిన నోరు - ఇదీ జాకోబీ అవతారం. అతడి శరీరం చూడడానికి ఉబ్బిపోయిన బెలూన్‌లా ఉంటుంది.

న్యాయవాదిగా జాకోబీ ఆదాయం కూడా అంతంత మాత్రమే. అయితే జాకోబీకి తరగని ఆస్తిపాస్తులున్నాయి. భార్య తరఫు నుంచి కూడా కొంత వచ్చింది. పిల్లలు లేరన్న లోటు తప్ప ఏ రకమైన సమస్యలూ లేవు. విలాసవంతమైన అపార్ట్‌మెంట్‌లో ఉంటారు. ఇంటిని తీర్చిదిద్దుకోవడం, ఇంటి అలంకరణ.. అంతా అమ్రాదే. జాకోబీకి అలాంటి ఆసక్తి ఉంటుందని ఎవరూ అనుకోరు. ఇంటి అలంకరణకు సంబంధించిన అన్ని విషయాల్లో అతనిది ఒక విషాదకరమైన ప్రేక్షక పాత్ర మాత్రమే. ఈ లావుపాటి మనిషి ప్రవర్తన కూడా విచిత్రంగానే ఉంటుంది. ప్రపంచంలో అతనికన్నా ఎక్కువ మర్యాదస్థుడిని చూడలేం. అతడు ఏ విషయంలోనైనా సర్దుకుపోగల మనిషి. పరోపకారి. అయితే అతని ఈ మంచి లక్షణాలన్నిటికీ కొంతవరకు అభద్రత, పిరికితనం కారణమని చెప్పుకోవచ్చు.

తనను తాను తక్కువ చేసుకుని, కించపరచుకునే మనిషిని ఎక్కడా చూసి ఉండరు. దానికి పిరికితనం కూడా తోడయితే ఇంక చెప్పక్కర లేదు. ఇవన్నీ కలగలిస్తే అతనే, జాకోబీ. దానితో అతని వ్యక్తిత్వం కూడా చిన్నబోయినట్టు అనిపించేది. అతనితోపాటు డైనింగ్ టేబిల్ వద్దకు వెళతున్న అమ్మాయితో "నేను చాలా చీదర పుట్టించే మనిషిని. అయినప్పటికీ నీతో కలిసి భోజనం చేసే గౌరవం ఇవ్వగలవా?" అని అడిగేవాడు. ఆ మాటలకి నవ్వు రాకపోగా, అసందర్భంగా ఉండేది.

అలాంటి సంఘటనే ఇంకొకటి జరిగింది. ఒక రోజు జాకోబీ రోడ్డు మీద నడుస్తున్నప్పుడు చేతుల్తో లాక్కెళ్ళే బండిచక్రం అతని కాలిమీద నుంచీ వెళ్ళింది. బండినిలాగే పోర్టరు అది గమనించి వెనక్కి తిరగ్గానే, జాకోబీ పాలిపోయిన మొహంతో, వణికిపోతూ, టోపీ తీసి చేత్తో పట్టుకుని "నన్ను క్షమించండి" అని నత్తినత్తిగా అన్నాడు. అలాంటప్పుడు అతన్నిచూస్తే ఎవరికైనా కోపం వచ్చేది. ఆ చిన్న నగరంలోని వీధుల్లో తన అందమైన భార్యతో కలిసి నడుస్తున్నప్పుడు జాకోబీ ప్రవర్తన మరింత విచిత్రంగా ఉండేది. మెరుపుతీగలా అందంగా చలాకీగా తన పక్కన నడుస్తున్న అమ్రాను అపురూపంగా చూస్తూ అంత అందగత్తెను భార్యగా పొందినందుకు నగరంలోని ప్రముఖులు తనను క్షమించాలన్నట్టుగా వాళ్ళకు అభివాదం చేసేవాడు. వాళ్ళ చూపుల్లోని తిరస్కారాన్ని భరించడానికి సిద్ధంగా ఉన్నట్టు ఉండేవాడు.

అమ్రా, జాకోబీని ఎందుకు వివాహం చేసుకుందో ఎవరికీ అంతుపట్టని విషయం. కానీ జాకోబీకి అమ్రా అంటే పిచ్చిప్రేమ. పెద్దపెద్ద కిటికీలతో, వేలాడే పూలగుత్తులతో అందంగా ఉండే పడకగదిలోకి అతను ఎప్పుడైనా రాత్రుళ్ళు చప్పుడు చేయకుండా వస్తుండేవాడు. అమ్రా మంచం మీద పడుకుని ఉండేది. అతను ఆమె ముందు మోకాళ్ళపై వంగి జాగ్రత్తగా ఆమె చేయి పట్టుకునేవాడు. ఆమె తనకు అలవాటైన రీతిలో ఓరగా కళ్ళెత్తి అతనివంక చూసేది. ఆమె కళ్ళలో ఒకలాంటి ద్వేషం కనపడేది. వణికిపోతున్న గుండ్రటి చేతులతో ఆమె చేయి పట్టుకుని తన లావాటి మొహాన్ని ఆమె మోచేతికి ఆనించేవాడు. తర్వాత వణుకుతున్న గొంతుతో ఇలా అనేవాడు.

"అమ్రా, నేను నిన్ను విసిగిస్తున్నానా? నువ్వింకా నిద్రపోలేదుకదా? నేను రోజంతా నీ అందం గురించి, నీమీద నాకున్న ప్రేమ గురించి ఆలోచిస్తుంటాను. ఒక్కసారి నేను చెప్పేది విను. నీకోసం నా హృదయం ఎంతలా పరితపిస్తుందో నీకు తెలుసా? నిన్ను నా ప్రాణపదంగా ప్రేమిస్తున్నాను. అది ఎంత చెప్పినా నీకు అర్థం కాదు.

నీమీద నాకున్న ప్రేమని నువ్వు గుర్తిస్తే చాలు. నేను నిన్ను బ్రతిమాలుకుంటున్నాను. నువ్వు నన్ను ప్రేమించకపోయినా ఫరవాలేదు. నన్ను ఎప్పుడూ మోసం మాత్రం చేయొద్దు. నాకు నీమీద ఉన్న ప్రేమకు కృతజ్ఞతగా కనీసం అంత మాత్రం చేయి. ఇది అభ్యర్థించేందుకే నేను ఇక్కడికి వచ్చాను... ఇక ఇక్కడివరకూ వచ్చేటప్పటికి మన లాయరుగారి ఉపన్యాసం చివరికి వెక్కిళ్ళలోకి, ఏడుపులోకి దిగిపోయేది.

అమ్రా కదిలిపోయినట్టు చూసేది. జాకోబీ వెంట్రుకలను సవరిస్తూ మెత్తటి గొంతుకతో కాలిని నాకడానికి వచ్చిన పెంపుడుకుక్కని బుజ్జగిస్తున్నట్టు "సరే జాకీ, సరే!" అనేది. నిజానికి ఆమె నడవడిక మంచిదేమీ కాదు. ఆమె ఇప్పటికే భర్తను మోసగిస్తూ ఉంది. ఆల్‌ఫ్రెడ్ లాట్నెర్ అనే సంగీత కళాకారుడిని ఆమె ప్రేమిస్తోంది. ఇరవై ఏడళ్ళ లాట్నెర్‌కి కళాకారుడిగా ఇప్పుడిప్పుడే కొంచెం పేరు వస్తోంది. అతను సన్నగా తీర్చిదిద్దినట్లున్న ముఖకవళికలతో అందంగా ఉంటాడు. అందంగా నవ్వుతున్నట్లుండే తన కళ్ళు ఎవరినైనా ఇట్టే పడేయగలవని అతనికి తెలుసు. చిన్న చిన్న కళాకారులు సరదాగా, జాలీగా గడపడం కోసం వాళ్ళకున్న ప్రతిభకు అందాన్ని జోడించి అందర్నీ ఆకర్షించడానికి చూస్తుంటారు. దానికోసం వాళ్ళు ఎన్ని పిల్లచేష్టలైనా చేయగలరు. ఎంత అనైతికంగా అన్నా ఉండగలరు. వాళ్ళుచేసే తప్పుడు పనుల్నించీ కూడా వాళ్ళు ఆనందం పొందగలరు. లాట్నెర్ పాటలు రాయడం, వాటికి సంగీత బాణీలు కట్టడం కూడా చేస్తుంటాడు. అయితే అవి కూడా అంత గొప్పగా ఏం ఉండేవి కావు. సాహిత్యం, సంగీతం రెండింటిలో కూడా ఇతరుల్ని అనుకరించే ప్రయత్నం చేస్తుంటాడు.

అమ్రాకు లాట్నెర్ అంటే పిచ్చిప్రేమ. లాట్నెర్ విషయానికి వస్తే అతనికి అమ్రా ప్రేమను కాదనటానికి కారణాలు ఏమీలేవు. కొన్ని సంవత్సరాలుగా వాళ్లిద్దరి మధ్య ఈ అనైతిక ప్రేమ వ్యవహారం నడుస్తోంది. వాళ్ళు అక్కడా ఇక్కడా కలుస్తుంటారు. ఆ విషయం నగరంలోని ప్రతి ఒక్కరికీ తెలుసు. అందరూ జాకోబీ వెనుక అతన్ని చూసి నవ్వుకుంటుంటారు. జాకోబీ ఏం చేయగలడు? అమ్రాకు భర్తను మోసగిస్తున్నానన్న అపరాధభావం ఏమీలేదు. ఆమెలో ఆ అపరాధ చిహ్నాలు కూడా ఏమీ కనిపించవు. జాకోబీకి అమ్రా ప్రవర్తనపై కచ్చితమైన అనుమానం ఏదీ లేదు.

అందర్లో సంతోషాన్ని నింపుతూ వసంత కాలం ప్రవేశించింది. అమ్రాకు ఒక అద్భుతమైన ఆలోచన వచ్చింది.

"క్రిష్టియన్, మనం అందరికీ విందు ఇద్దాం. కొత్త బీరుకి స్వాగతం చెబుతూ మంచి బీరు పార్టీ ఇద్దాం" అమ్రా అంది. జాకోబీ అసలు పేరు క్రిష్టియన్.

"తప్పకుండా ఇద్దాం. అయితే కొంతకాలం ఆగి ఇద్దామా" అన్నాడతను. అమ్రా సమాధానం చెప్పకుండా పార్టీ గురించి చెప్పసాగింది.

"పార్టీకి చాలామంది వస్తారు కాబట్టి ఇక్కడ ఇంట్లో సాధ్యం కాదు. ఏదన్నా మంచిహోటల్

తీసుకుందాం. లెర్చెన్‌బర్గ్‌లో ఉన్న వెండెలిన్స్ అయితే సరిపోతుంది. పార్టీలో వినోద కార్యక్రమాలు, సంగీత కచేరీ కూడా ఏర్పాటుచేద్దాం. దానికోసం ఒక చిన్నవేదిక కూడా ఉండాలి. అప్పుడు దానికి మంచి పార్టీ రూపం వస్తుంది" అమ్రా చెప్పింది.

అమ్రా చెబుతున్నది వింటున్న జాకోబీ మొహం తెల్లగా పాలిపోయింది.

"అమ్రా నువ్వు చెబుతున్నది చాలా బాగుంది. పార్టీ ఏర్పాట్లన్నిటినీ నీకే వదిలేస్తున్నాను. నువ్వు తెలివైనదానివి. నీకు కావాల్సిన ఏర్పాట్లన్నీ నువ్వే దగ్గరుండి చూడు" జాకోబీ విధిలేక అన్నాడు.

అమ్రా ఏర్పాట్లు మొదలుపెట్టింది. దానికి స్నేహితుల సలహా తీసుకుంది. రెస్టారెంట్‌కు వెళ్ళి మాట్లాడి వచ్చింది. వినోద కార్యక్రమాల కోసం స్నేహితులతో ఒక కమిటీ ఏర్పాటుచేసింది. వాళ్ళలో ఒకరుతప్ప మిగిలిన వాళ్ళందరూ మగ వాళ్ళే. వాళ్ళలో నటులు, కళాకారులు, పెయింటర్లు ఉన్నారు. ఆల్‌ఫ్రెడ్ లాట్నెర్ కూడా కమిటీలో ఒక సభ్యుడు.

ఒక వారం తర్వాత ఈ కమిటీ అంతా అమ్రా ఇంట్లో సమావేశమయింది. అమ్రా ఒక సోఫాలో కాలిమీద కాలు వేసుకుని కూర్చుంది. నులివెచ్చని వేసవి రాత్రిలాంటి అందంతో వెలిగిపోతోంది ఆమె. మొదట వినోద కార్యక్రమంలో భాగంగా పాడాల్సిన పాటల గురించి చర్చ జరిగింది. హిల్టేబ్రాంట్ అనే నటుడి భార్య కొన్ని పాటలు పాడడానికి ముందుకు వచ్చింది. కమిటీలోని విట్‌నగెల్ మాట్లాడడం మొదలు పెట్టాడు.

"అంతా బాగానే ఉంది కానీ ఎక్కడో ఏదో లోపం ఉన్నట్లు అనిపిస్తోంది. కళ్ళు తిరిగిపోయేలా ఒక మంచి ముగింపు కార్యక్రమం కూడా ఉంటే బాగుంటుంది. అది ఏమిటో నేను స్పష్టంగా చెప్పలేను. దాన్ని మీకే వదిలేస్తున్నాను"అన్నాడు విట్‌నగెల్.

"అవును, విట్‌నగెల్ అన్నట్టు మంచి క్లైమాక్స్ ఉంటే బ్రహ్మాండంగా ఉంటుంది" లాట్నెర్ వంత పాడాడు. హిల్టేబ్రాంట్ కూడా దాన్ని ఒప్పుకున్నాడు. చివరికి జాకోబీ కూడా "అవునవును... సరదాగా ఏదన్నా ఒకటి" అన్నాడు. అప్పుడు ఒక సంఘటన జరిగింది. అమ్రా సోఫాలో కూచున్నదల్లా ఆలోచిస్తున్నట్టు అటూఇటూ కదిలింది. ఆమె మొహం ఒక్కసారిగా మారిపోయింది. ఆమె పెదాలపై ఒక వంకర నవ్వు మెదిలింది. మెరుస్తున్న ఆమె కళ్ళు క్షణంలో సగంసేపు లాట్నెర్ కళ్ళతో కలిశాయి. ఆమె అకస్మాత్తుగా జాకోబీ వైపు తిరిగి తనకు అలవాటైన మంద్రస్థాయిలో "క్రిష్టియన్! నువ్వు అకస్మాత్తుగా ఎర్రటి గౌనుతో స్టేజీ మీదకు వచ్చి డ్యాన్స్‌చేస్తే ఎలా ఉంటుంది?" అని అడిగింది.

ఆ మాటలతో హాలులో కలకలం రేగింది. లాట్నెర్ నర్మగర్భంగా నవ్వాడు. కాసేపు ఎవరూ మాట్లాడలేదు. విట్‌నగెల్ శాండ్‌విచ్‌కోసం అన్నట్టు అక్కడినుంచీ వెళ్ళిపోయాడు. జాకోబీ బెదిరిపోతున్నట్టు అందరివంక చూస్తూ చిన్నగా నవ్వాడు.

మాటలు రానట్టు నత్తినత్తిగా "కానీ అమ్రా, నేను ఆ పని.. నాకు ఆ పనిచేయడం... నన్ను క్షమించు" అన్నాడు.

లాట్నెర్ అమ్రా ముఖంకేసి చూశాడు. అతనిలో కొంచెం ఆశాభంగం కనిపించింది. అమ్రా పట్టు

మనం ప్రేమించేవాళ్ళెప్పుడు మనల్ని ప్రేమించకపోవచ్చు. వాళ్ళ ప్రాధాన్యం వేరుగా ఉండొచ్చు. మన ప్రేమను చులకనగా చూడొచ్చు. కానీ ఏ భర్తైనా భార్యమీద ఒట్టి ప్రేమ కురిపించినంతమాత్రాన సరిపోతుందా? మరి ఈ కథలో అలాంటి గొప్ప భర్తను ఆ భార్య ఎలా రిసీవ్ చేసుకుంది? అసలామెకు కావాల్సిందేమిటి? భార్యకోసం ఆ భర్త ఎలాంటి త్యాగం చేశాడు?

విడవకుండా అదే నచ్చచెబుతున్న ధోరణిలో "అంతేకాదు డ్యాన్సుతో పాటు నువ్వు పాట కూడా పాడాలి క్రిష్టియన్. ఆ పాటని లాట్నెర్ రాసి బాణీలు కడతాడు. పియానో మీద అతను కూడా నీతో కలిసి పాడతాడు. ఇంతకన్నా మంచి క్లైమాక్స్ ఉంటుందనుకోను" అని తెగేసి చెప్పింది.

కాసేపు ఇబ్బందికరమైన మౌనం రాజ్యమేలింది. లాట్నెర్ ఉద్వేగం నిండిన గొంతుతో "జాకోబీ! నిజంగా అది అద్భుతమైన ఆలోచన. మీకోసం పాట రాసి, బాణీలు కట్టడానికి నేను సిద్ధంగా ఉన్నాను. మీరు డ్యాన్స్ చేస్తూ పాట పాడితీరాలి. నేను ఇంతవరకూ ఎప్పుడూ రాయనంత అద్భుతమైన పాట మీకోసం రాస్తాను. ఎర్రటి శాటిన్ బేబీ ఫ్రాకు వేసుకుని మీరు డ్యాన్స్ చేస్తుంటే...ఓహ్! మీ భార్య నిజంగా మంచి ఆర్టిస్టు. ఎందుకంటే ఆర్టిస్టులే ఇంతచక్కటి ఊహ చేయగలరు. దయచేసి దీనికి అంగీకరించండి" అన్నాడు.

మర్యాదకోసం కొంతా, కొంత కపటంతోనూ అందరూ జాకోబీని ఒప్పించడానికి ఒత్తిడిచేయడం మొదలుపెట్టారు.

"నేను అలా చేయలేను. అట్లా నవ్వించగల శక్తి నాకు లేదు. దానికి తోడు.. లేదు.. అది అసాధ్యం" జాకోబీ ప్రాధేయపడుతున్నట్టు అందరివంకా చూశాడు.

అతను మొండిగా అదే మాటపై ఉండిపోయాడు. అమ్రా కూడా ఏమీ తోచనట్టు చూస్తుండిపోయింది. లాట్నెర్ కూడా మౌనంగా ఉండిపోయాడు. చివరికి క్లైమాక్స్ గురించి ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే సమావేశం ముగిసింది.

ఆ రోజు సాయంత్రం అమ్రా మంచం మీద

గ్లామర్‌గా కనబడకపోతే ఎలా?

టాలీవుడ్‌లో కొందరు హీరోయిన్లు గ్లామర్ అంటే ఆమడ దూరం అంటూంటే మరికొందరు ఎంత గ్లామర్‌గా కనిపించడానికైనా వెనకాడడం లేదు. అంతే కాదు గ్లామర్ విషయంలో తమకెలాంటి అభ్యంతరాలు లేవన్న సంగతి చేతలలో చూపడానికి కూడా మొహమాటపడడం లేదు. సరిగ్గా వీరి కోవకే వస్తోంది హీరోయిన్ సురభి. హీరోయిన్లకు నటన ఒక్కటే సరిపోదనీ, అందంగా, గ్లామర్‌గా కనిపించడం కూడా ముఖ్యమేనని అంటూ గ్లామర్‌గా కనిపించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదంటూ సూటిగా చెప్పేసింది. అయితే ఎక్స్‌పోజింగ్‌కి మాత్రం దూరంగా ఉంటానని స్పష్టం చేస్తోంది.

పడుకుని ఉంది. ఆమె కళ్ళు తెరిచే ఉన్నాయి. జాకోబీ భయపడుతున్నట్టు మెల్లగా గదిలోకి వచ్చాడు. మంచం పక్కకి కుర్చీ లాక్కుని కూర్చుంటూ,

"అమ్రా నిజం చెప్పాలంటే నేను చాలా గందర గోళంలో ఉన్నాను. నేను కావాలని దాన్ని తిరస్క రించలేదు. నువ్వేమన్నా అనుకున్నావా?" అన్నాడు.

అమ్రా ఒక్క నిమిషం మౌనంగా ఊరుకుని కళ్ళెత్తి జాకోబీ వంక చూస్తూ "నీకెలా చెప్పాలో తెలీడం లేదు. నువ్వు ఇలా చేస్తావని అనుకోలేదు. అందరూ ఒప్పుకున్నదాన్ని కాదని నువ్వు నాకు ఆశాభంగం కల్పించావు. నీ మూలంగా మొత్తం వాతావరణం పాడైంది. ఆతిథ్యం ఇచ్చేవాడిగా నువ్వు చేయాల్సిన పని ఇదేనా?" అంది.

"నన్ను నమ్ము అమ్రా! నా ఉద్దేశం అదికాదు. ఎవర్నీ నొప్పించాలని కాదు. నేను చిన్నపిల్లలా ఎర్రటి గౌను వేసుకుని ఈ శరీరంతో డ్యాన్సు చేయడం అంటే... సర్లే, వినోదం కోసమేగా. నా గురించి మొత్తం పార్టీ అంతా నాశనం కావడం నాకు ఇష్టం లేదు" జాకోబీ బరువుగా నిట్టూర్చి



అన్నాడు.

ఆ మరుసటి రోజు అమ్రా హోటల్లో ఏర్పాట్ల వంకతో లాట్నెర్ దగ్గరికి వెళ్ళింది. అతని గదిలో సేదతీరుతూ లాట్నెర్ తలని గుండెలకు అదుముకుని చెవిలో గుసగుస లాడింది.

"పాట బాగా వచ్చేట్టు రాయి. అతను పాట పాడుతూ డ్యాన్స్ చేస్తుంటే నేను కూడా నీతో పాటు పాట పాడతాను. నా డ్రెస్ నేనే తయారు చేసుకుంటాను" అంది. ఇద్దరూ ఒకళ్లని చూసి ఒకళ్ళు పగలబడి ఆపుకోలేనంతగా నవ్వుకున్నారు.

పార్టీకోసం వెండెలిన్స్ రెస్టారెంట్ సిద్ధమ యింది. రంగురంగుల దీపాల కాంతిలో, పూల తోరణాలతో రెస్టారెంట్ మెరిసిపోతోంది. హాలులో గుండ్రంగా అమర్చిన బల్లల చుట్టూ అతిథులు కూర్చుని ఉన్నారు. బల్లల మీద చక్కటి ఆహార పదార్థాలు, మందుసీసాలు అమర్చి ఉన్నాయి. దాదాపు నూటయాభైమంది వరకూ ఉన్న అతి థుల్లో అధికారులు, లాయర్లు, వ్యాపారవేత్తలు, కళాకారులు ఉన్నారు. ఉన్నతాధికారులు భార్యా పిల్లలతో వచ్చారు. పార్టీ వాతావరణం అంతా ఆడంబరంగా ధగధగా మెరిసిపోతోంది. హాలంతా సందడి సందడిగా ఉంది. మాటలు, పలక రింపులు, నవ్వులతో ప్రతిధ్వనిస్తోంది.

వేదికపైకి ఒక్కొక్కరు వచ్చి మాట్లాడడం మొదలుపెట్టారు. హిల్డెబ్రాంట్, విట్‌నగెల్ యథా ప్రకారం హాస్యోక్తులతో ప్రసంగించారు. అమ్రా, జాకోబీ వంక చూసింది. జాకోబీ లేచి మాటల కోసం తడుముకుంటూ అతిథులకు కృతజ్ఞతలు తెలిపాడు. అప్పటికి అందరిపై మద్యం ప్రభావం కనిపించసాగింది. అందరూ గట్టిగట్టిగా మాట్లా డడం మొదలుపెట్టారు. డ్యాన్సు చూడడానికి వీలుగా హాల్లోని టేబుళ్ళను మారుస్తున్నారు. సమయం పదకొండు గంటలు దాటింది. అంద రిలో ఉత్సాహం తారస్థాయికి చేరింది. కొందరు చల్లటిగాలి కోసం తోటలోకి వెళ్ళగా మిగిలిన వాళ్ళు గుంపులు గుంపులుగా చేరి మాట్లాడు కుంటున్నారు.

సంగీత వాద్యకారుల బృందం స్టేజీమీదకు వచ్చింది. తర్వాత వినోద కార్యక్రమాలు మొద లయ్యాయి. కొంతమంది నీగ్రో కళాకారులు పాట పాడుతూ నృత్యం చేశారు. హిల్డెబ్రాంట్ భార్య వేదిక మీదకు వచ్చి కొన్ని పాటలు పాడింది. పార్టీ పతాకస్థాయికి చేరింది. "ఇక చిట్టచివరి కార్య క్రమం 'లిటిల్ లిజ్జీ' నృత్యగానం. సంగీతం ఆల్‌ఫ్రెడ్ లాట్నెర్ వేదిక మీద నుంచి ప్రకటన వినబడింది.

కొన్ని నిమిషాలు గడిచాయి. ఆల్‌ఫ్రెడ్ లాట్నెర్ వచ్చి పియానో వాయిస్తున్న అమ్రా పక్కన కూర్చున్నాడు. లాట్నెర్ మొహం ఉద్వే గంతో ఎర్రబడి ఉంది. అమ్రా మౌనంగా అతిథుల వంకే చూస్తోంది. అంతలో గంట మోగింది. పియానో నుంచి ధ్వనితరంగాలు వెలువడ్డాయి. తెర తొలగింది. వేదికపై లిటిల్ లిజ్జీ ప్రత్యక్షమైంది.

హాలులోని ప్రేక్షకులంతా ఆశ్చర్యంతో బిగుసుకు పోయి, ఆ విషాద దృశ్యాన్ని అలా చూస్తుండి పోయారు. ఎలుగుబంటిలాంటి గుండ్రటి ఆకా రంతో వదులుగా వేలాడే పొడవాటి ఎర్రటి గౌనుతో మొహం నిండా అద్దిన పౌడరుతో చేతు లకు పసుపురంగు తొడుగులతో జాకోబీ విచిత్రంగా కనిపిస్తున్నాడు. అతని మొహం నిరాశ నిండిన విషాదంతో ఉంది. ఒత్తిడితో నిండిన అతని కళ్ళు ఎవరివంకా చూడకుండా సిగ్గుతో బరువుగా వాలి పోతున్నాయి. తన లావుపాటి కాళ్లతో జాకోబీ అతి కష్టంమీద ఒకటి రెండు అడుగులు నడిచి చేయెత్తి అందరికీ అభివాదం చేశాడు. తర్వాత ఊపిరి అందనట్టు రొప్పుతున్న గొంతుతో అతను పాట మొదలుపెట్టాడు.

ఆ ఆకారాన్ని, అతను పడుతున్న అవస్థని చూసి హాల్లోని ప్రేక్షకులంతా స్థంభించిపోయారు. వాళ్ళందరి కళ్ళలో ఒకలాంటి భీతి కనపడింది. అందరి కళ్ళు పియానో వాయిస్తున్న జంటనీ జాకోబీని మార్చిమార్చి చూస్తున్నాయి. దాదాపు ఐదు నిమిషాల పాటు ఆ హింస కొనసాగింది.

తర్వాత హాల్లోని ప్రేక్షకులంతా జీవితంలో మర్చిపోలేని ఒక సంఘటన జరిగింది. జాకోబీ నృత్యం ఆగింది. అతను వేదిక మీద ఉన్నచోటనే అతుక్కుపోయినట్టు నిలబడ్డాడు. అతని గొంతులో 'లిజ్జీ' అనే మాట బైటకు రాలేక కొట్టు కుంటోంది. అతను ఒక్కక్షణం మూగవాడిలా అయిపోయాడు. అకస్మాత్తుగా అతని కళ్ళు ఎదు రుగా ఉన్న దానిని చూస్తూ గడ్డకట్టినట్టు అయి పోయాయి. తర్వాత అతని కళ్ళు నిప్పులు కక్కుతూ పియానో వద్దనున్న జంటవైపు చూశాయి. అంతవరకూ గాల్లో షికార్లు చేసిన ఒక వదంతి అతని కళ్ళముందు నిలువెత్తు నగ్నంగా నిలబడి ఉంది. హాల్లోని అందరికళ్ళూ ఆ జంటనే చూస్తున్నట్టు అతని కళ్ళు గ్రహించాయి. అతని కళ్ళు నిదానంగా ఆ జంటవైపు, ప్రేక్షకుల వైపు మార్చిమార్చి ప్రయాణం చేస్తున్నాయి. అతని కళ్ళు చూస్తుండగానే మరింత విశాలం అయ్యాయి. అతని మొహం అకస్మాత్తుగా ఎరుపె క్కింది. అతడు వేసుకున్న ఎర్రగౌనుతో సమా నంగా అతని మొహం ఎర్రగా అయిపోయింది. ఉన్నట్టుండి ఆ లావుపాటి ఆకారం ఒక్కసారిగా కుప్పకూలి కింద పడిపోయింది.

ఒక్కక్షణం పాటు అక్కడ నిశ్శబ్దం రాజ్యమే లింది. తర్వాత ఒక్కసారిగా కలకలం చెలరేగింది. ఇద్దరు ముగ్గురు మనుషులు వేదిక మీదకు పరి గెత్తుకుంటూ వెళ్ళారు. వాళ్ళల్లో ఒక డాక్టరు కూడా ఉన్నారు. తెరలు కిందకు లాగారు.

అమ్రా, లాట్నెర్‌లు ఇంకా పియానో వద్దే కూర్చుని ఉన్నారు. ఇద్దరూ ఒకరికొకరు కొంచెం దూరంగా జరిగి తను బాణీకట్టిన పాట గురించి లాట్నెర్, పరిస్థితి అర్థంకాక ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో అమ్రా ఆలోచిస్తున్నట్టు కూర్చుండిపోయారు.

డాక్టరు వెనక్కు తిరిగి వచ్చారు. కొందరు అతిథులు అతనిచుట్టూ మూగి ఏమైందని ప్రశ్నిం చడం మొదలు పెట్టారు. అతను భుజాలు ఎగుర వేసి అందరివంకా చూస్తూ 'అంతా అయి పోయింది' అన్నాడు.

అనువాదం: జి.లక్ష్మి e-mail: guttalakshmi62@gmail.com

ముసలితనం శరీరానికేగానీ మనసుకు కాదంటారు. ఎనభైయేళ్ళ వయసులో శరీరం దేనికీ సహకరించదు. ఓపిక ఉండదు. నోరు పెగలక కుక్కి మంచంలో పడి అచేతనంగా చూస్తూ మిగిలిపోయే వృద్ధాప్యం నరకమే. కానీ నిండునూరేళ్ళూ ఆరోగ్యంగా జీవించడమే మహాగొప్ప అనుకునే ఈ కాలంలో పడుచు వయసువారు కూడా చేయలేని సాహస కృత్యాలు కొందరు బామ్మలు చేసి చూపిస్తూ అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తున్నారు.

గడుగ్గాయి బామ్మలు

నూటొక్కేళ్ళ వయసులో ఓ బామ్మ అతి పెద్ద టవర్ అధిరోహించి రికార్డు సృష్టిస్తే మరో బామ్మ రైఫిల్ షూటింగ్‌లో తనకెవరూ సాటిరారంటోంది. వీరిని తలదన్నేలా మరో వృద్ధురాలు యువకులకు దీటుగా బాడీబిల్డింగ్ చేస్తూ అందరి చేతా ఔరా! అనిపిస్తోంది. బాల్యం నుండీ పర్వతారోహణే హాబీగా 100 పర్వతాలెక్కి ఇప్పటికీ రికార్డులు సృష్టిస్తోంది మరో సెలబ్రిటీ బామ్మ! శరీరం సహకరించని వయసులో సాహసాలు చేస్తున్న ఇలాంటి గడసరి బామ్మలు, గడుగ్గాయి బామ్మల గురించి తెలుసుకుందామా!

ఎత్తైన టవర్ ఎక్కి...!

ఎత్తయిన టవర్లు ఎక్కి కూచోడమంటే ఆ బామ్మకు మహా సరదా!. ఇటీవలే నూరేళ్ళు నిండి నూటొక్క వయసులోకి అడుగుపెట్టిన ఆ గడసరి బామ్మ తన సాహసంతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించింది. భయానికే చెమటలు పట్టించగల తెగువ ఆమె సొంతం. ఇంతకీ ఆ సూపర్ బామ్మ పేరేంటో చెప్పనేలేదు కదూ..ఆమె పేరు డోరిన్ లాంగ్. ప్రపంచంలోనే వయోధిక అబ్సీలర్‌గా వార్తల్లో నిలిచింది. ఇంగ్లాండ్‌లోని హాంప్‌షైర్ నగరంలోని అతిపెద్ద స్పినాకర్ టవర్‌ను అవలీలగా అధిరోహించి అందరినీ ఆశ్చర్యపరిచింది డోరిస్. సరికొత్త రికార్డు సాధించింది. అభిమానులు ఆమెను ముద్దుగా 'డేరింగ్ డోరిస్' అని పిలుచుకుంటారు. ఇలా చేసిందంటే చిన్నప్పటి నుంచీ ఆమెకు సాహసాలంటే అలవాటనుకునేరు. గడచిన పదిహేనేళ్ళుగా మాత్రమే డోరిస్ ఇలాంటి సాహసాలు చేస్తోందట. రొవైన్స్ హాస్పైస్ అనే స్వచ్ఛంద సంస్థ కోసం నిధులు సమీకరించేందుకే ఈ సాహసం చేసింది. ఒక మంచి పనికోసం రిస్క్ చేయడం తనకెంతో ఆనందం కలిగిస్తోందని చెబుతోంది.

సమాజం కోసం

ప్రపంచంలో ఇప్పటివరకు నూటొక్కళ్ళ వయసులో ఇలా టవర్ ఎక్కి రికార్డు సాధించిన వారెవరూ లేకపోవడంతో డోరిస్ తన రికార్డును తనే బద్దలు కొట్టి వార్తల్లో నిలిచింది. ఆ టవర్ ఎక్కుతున్నప్పుడు విపరీతమైన గాలి ప్రకంపనలు, వాతావరణ మార్పులు సంభవించినా మనోధైర్యం సడలిపోకుండా లక్ష్యం చేరుకుని సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ గిన్నిస్ రికార్డు ద్వారా డోరిస్‌కు 11000 పౌండ్లు బహుమతి లభించింది. వాటిని కూడా ఆమె ఆ స్వచ్ఛంద సంస్థకే అందజేసింది. ఏడుగురు మనవళ్ళు, ఇద్దరు మునిమనవళ్లతో ఇంగ్లాండులో హాయిగా కాలం గడుపుతున్న ఈ బామ్మ వచ్చే ఏడాది మరో ఎత్తయిన టవర్ ఎక్కి రికార్డు సృష్టిస్తానంటోంది! ఈ బామ్మ సాహసాల వీడియోలు ఇప్పుడు అక్కడ హల్‌చల్ చేస్తున్నాయి.

కిలిమంజారో ఎక్కిన సెలబ్రిటీ బామ్మ

ఆఫ్రికాలోనే ఎత్తైన పర్వత శిఖరం కిలిమంజారో. రోబో సినిమాలో కిలిమంజారో పాటతో ఈ పర్వతం బాగా ఫేమస్ అయింది. అంతే కాదు ప్రపంచంలోనే అతి ఎత్తైన పర్వత శిఖరాల్లో నాలుగోది కిలిమంజారో. పర్వతారోహకులు చాలామంది దీన్ని అధిరోహించాలని లక్ష్యంగా పెట్టుకుంటారు. 85 ఏళ్ల వయసులో ఆ బామ్మ కూడా అదే లక్ష్యం నిర్దేశించుకుంది. ఆమె పేరు అన్నే లారిమోర్. 85 యేళ్ళ వయసులో కిలిమంజారోను అధిరోహించిన తొలి పర్వతారోహకురాలిగా వార్తల్లోకెక్కింది లారిమోర్. బాల్యం నుండీ పర్వతారోహణ ఆమెకు హాబీయేనట. లారిమోర్ 2004లో 'ఛాలెంజ్ యూత్ ఫండ్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించింది. అనాథ పిల్లల సహాయార్థం దాతలను ఆకట్టుకునేందుకు ఇలాంటి సాహసాలకు ఆమె శ్రీకారం చుట్టారు. అందుకోసం ఇప్పటి వరకు 100 దేశాల్లో వివిధ పర్వతాలు అధిరోహించి వారిచ్చే డబ్బులతో ఆ సేవాసంస్థను నడుపు

తోంది. తన సంస్థలోని పిల్లలకు పియానో ల్యాబ్ నిర్మాణానికి నిధుల కోసమే ఆమె కిలిమంజారో పర్వతం అధిరోహించింది. ఎన్నో ప్రముఖ పర్వతాలు ఎక్కినప్పటికీ, కిలిమంజారో అధిరోహించడానికి మాత్రం ఆమె ప్రత్యేక శిక్షణ తీసుకుంది. పర్వతారోహకురాలిగానే కాదు చదువులోనూ మేటి. నర్సింగ్‌తోపాటు జర్నలిజంలో కూడా డిగ్రీ చేసిన లారిమోర్, హెల్త్ ఎడ్యుకేషన్, కౌన్సెలింగ్ అంశాల్లో మాస్టర్స్ డిగ్రీ, మాస్ కమ్యూనికేషన్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. అమెరికా అరిజోనా ప్రాంతంలో సెలబ్రిటీ హోదా కైవసం చేసుకున్న లారిమోర్ తన సాహసయాత్రల విశేషాలతో ఓ వెబ్‌సైట్‌నే నడుపుతున్నారు.

కిలిమంజారో స్ఫూర్తితో భవిష్యత్తులో స్కైడైవింగ్, గ్రాండ్ కెన్యాన్‌లలో ప్రయాణిస్తానని, రెండోసారి కూడా కిలిమంజారో అధిరోహించి తన రికార్డును తనే బ్రేక్ చేస్తానంటోంది ఈ సూపర్‌బామ్మ. ఆ విధంగా సేకరించిన డబ్బులతో సంస్థలోని పిల్లలకు మెరుగైన భవిష్యత్తును అందిస్తానని చెప్తోంది.

రైఫిల్ షూటింగ్‌లో రికార్డు

తల్చుకుంటే చాలు, ఏ పని చేయడానికైనా వయసు అడ్డురాదని ప్రపంచానికి తెలియజెప్పిన ప్రతిభాశాలి ఆమె. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 82 సంవత్సరాల చంద్రోతోమర్ రైఫిల్ పిస్టల్ షూటింగ్‌లో అందరికీ ఆదర్శంగా ప్రతిభ కనబరుస్తోంది. వృద్ధాప్యంలో తొలి ప్రొఫెషనల్ షూటర్‌గా రికార్డు సృష్టించింది. ఉత్తరప్రదేశ్‌లోని జోహడీ గ్రామానికి చెందిన చంద్రోతోమర్‌కు ఆరుగురు పిల్లలు. 15 మంది మనవళ్లు, మనవరాళ్లు. కుటుంబం తప్ప వేరే విషయాలేమీ ఆమెకు తెలియదు. అలాంటి గృహిణి రైఫిల్ షూటింగ్‌లోకి అడుగుపెట్టడం వెనుక ఆసక్తికరమైన కథే ఉంది. 2002లో ఓ రైఫిల్ క్లబ్‌వారు నిర్వహిస్తున్న ట్రైనింగ్‌లో ఒకసారి చంద్రో మనవరాలు పేరు నమోదు చేసుకోవడానికి తన బామ్మను తోడు తీసుకెళ్లింది. అప్పటికే అక్కడ చాలామంది క్యూ కట్టి ఉన్నారు.

దాంతో ఏమీ తోచక కాసేపలా బయటకు వెళ్లివద్దాం అనుకుని అక్కడ నుంచి బయటకి వస్తుండగా తోమర్‌కి రైఫిల్స్ కనిపించాయి. వాటిలో నుంచి ఒకదాన్ని తీసుకుని సరదాగా అక్కడున్న ఓ లక్ష్యానికి గురిచూసి పేల్చింది. అక్కడి శిక్షకుడుతో సహా అందరూ నిర్ఘాంతపోయారట. ఎలాంటి శిక్షణ లేకుండా ఆమె రైఫిల్ పట్టుకునే పద్ధతి చూసి శిక్షకుడికి నోట మాట రాలేదు. తోమర్‌లో ఉన్న సహజప్రతిభకు సానపెడితే ఆమెతో అద్భుతమైన సాహసాలను చేయించవచ్చునని శిక్షకుడు వెంటనే గుర్తించాడు. మొత్తానికి తోమర్‌ను ఒప్పించి శిక్షణ ఇవ్వడం ప్రారంభించాడు. అలా 68 ఏళ్ల వయసులో తోమర్ రైఫిల్ షూటింగ్ కెరీర్ మొదలైంది.

25 పతకాలు, రికార్డులు

ఇంటా బయటా ఎంతమంది ఎన్నిరకాలుగా విమర్శించినా లెక్కచేయకుండా షూటర్‌గా పేరుతెచ్చుకున్న చంద్రోతోమర్ ఇప్పటి వరకు వివిధ జాతీయ స్థాయి పోటీలలో సుమారు 25 బంగారు పతకాలు సాధించింది. అంతేకాదు షూటర్‌దాదీ అనే పేరు తెచ్చుకుంది. ఈ వయసులో రైఫిల్, పిస్టల్‌ను గురితప్పకుండా షూట్ చేసే వృద్ధురాలిగా ప్రపంచ రికార్డు సృష్టించింది. కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ మంత్రిత్వశాఖ ప్రకటించిన 100 మంది ప్రభావశీలురైన మహిళల జాబితాలో స్థానం సంపాదించి, రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో రాష్ట్రపతి ప్రశంసలు అందుకుంది. ఇంకా తన గ్రామంలోని యువతకు, వృద్ధులకు రైఫిల్ షూటింగ్ శిక్షణను ఒక తపస్సులా కొనసాగిస్తోంది తోమర్. ఆమె దగ్గర రైఫిల్, పిస్టల్ షూటింగ్ నేర్చుకున్న కొంతమంది విద్యార్థులు జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నారు కూడా!

బాడీబిల్డర్ బామ్మ

మంచి ఫిట్‌నెస్, కండల శరీరం కావాలని కోరుకోనివారెవరు! అలాంటి ఫిట్‌నెస్‌బాడీతో యువతను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది ఎనభై ఏళ్ల బాడీబిల్డర్ బామ్మ. ఆమెని బామ్మ అని వయసును బట్టి పిలవాలేమో కానీ శరీరం చూస్తే మాత్రం అలా అనలేం. అమెరికాలోని బాల్టిమోర్‌కు చెందిన ఎర్నెస్టీన్ షెపర్డ్ 80 యేళ్ళ వయసులో కూడా బాడీ బిల్డింగ్ చేస్తూ శభాష్ అనిపించుకుంటోంది. అంతేకాదు ప్రపంచంలోనే అత్యధిక వయసుగల మహిళా బాడీ బిల్డర్‌గా గుర్తింపు సాధించింది. మేరీల్యాండ్‌లోని బాల్టిమోర్‌లో 1936 జూన్ 16న జన్మించిన ఎర్నెస్టీన్‌కు చిన్నప్పటి నుంచీ బాడీబిల్డింగ్ చేసే అలవాటు ఉందిగనుకనే ఈ వయసులో కూడా ఫిట్‌గా ఉందనుకునేరు. కానే కాదు ఆమె 56 ఏళ్ల వయసులో వ్యాయామం చేయడం ప్రారంభించారు. అలా క్రమక్రమంగా బాడీబిల్డింగ్‌పై ఇష్టం పెరిగింది. బాడీ బిల్డింగ్‌లో రెండు మెడల్స్ సాధించారు. 2011లోనే ఎర్నెస్టీన్ అత్యధిక వయసు ఉన్న మహిళా బాడీ బిల్డర్‌గా గిన్నిస్ బుక్‌లో చోటు దక్కించుకున్నారు. అంకితభావం, కష్టపడి పనిచేయడమే ఆమె ఇంత ఫిట్‌గా ఉండడానికి కారణమట. ఎర్నెస్టీన్ ప్రతీరోజు

తెల్లవారుజామున 3 గంటలకే నిద్రలేస్తుందట. వారానికి దాదాపు 130 కిలోమీటర్లు పరిగెడుతుంది. ఉడికించిన గుడ్డు తెల్లసొన, చికెన్, కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం, ఎక్కువ నీరు తాగడం ఆమె అలవాట్లు. అంతేకాదు ఏదైనా సరే చేస్తున్న పని మధ్యలో వదిలేయకుండా పట్టుదలతో పూర్తి చేయడం ఆమె హాబీ. పట్టుదల ఉంటే వయసుతో సంబంధం లేకుండా ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తోంది బామ్మ.

-సంతోషలక్ష్మి దహగాం

3

హావేలీ

-ఎస్. ఘటికాచలరావు సెల్:90031 41474

కాసేపటికి అంతా ప్రశాంతంగా అనిపించింది. సరిగ్గా అరగంటకల్లా మళ్ళీ ఏవో శబ్దాలు! ఠక్కున లేచి కిటికీ దగ్గరికెళ్ళాడు. మళ్ళీ ఏదో వాహనం వెళ్తున్నట్టు శబ్దం! ఏదో ఆలోచన వచ్చినవాడిలా కిటికీ తలుపు కొద్దిగా తెరిచి తన వద్దనున్న బైనాక్యులర్‌తో చూశాడు. అతని టార్గెట్ దూరంగా కనిపించే హావేలీ.

అయితే అంతలోనే శబ్దం మాయమైంది. హావేలీ పరిసరాల్లోనూ, హావేలీకి దగ్గరగానూ ఏమీ కనిపించలేదు. వెండి వెన్నెల నడుమనున్న చిమ్మచీకటిలో హావేలీ పరిసరాలు ఎప్పటిలాగే నిర్మానుష్యంగా కనబడ్డాయి.

"ఏదో మిస్టరీ ఉందిక్కడ. గోపాలరావు చెప్పిన 'సంఘటనలు' ఏమిటన్నది తెలిస్తే మిగతా విషయాలు వాటంతటవే తెలుస్తాయి. కాబట్టి ఎలాగైనా ఆ 'సంఘటనలు' అడిగి తెలుసుకోవాలి. చెప్తే అతను, లేకుంటే ఆ అమ్మాయి... రాధ ద్వారా తెలుసుకోవాలి' అని ఒక స్థిరమైన నిర్ణయానికి వచ్చి కిటికీ మూసేసి బైనాక్యులర్ పక్కనే పెట్టుకుని, ఇక ఎటువంటి శబ్దం వచ్చినా లేవగూడదనుకుని పడుకున్నాడు.

సంకల్పబలం ఉంటే కానిపనంటూ ఏదీ లేదు. అలా అనుకుని పడుకున్న విష్ణుకు వెంటనే నిద్ర పట్టేసింది. తెల్లవారి లేవగానే ఫ్రెష్‌గా అనిపించింది. రాత్రి జరిగిన సంఘటనలు లీలగా మళ్ళీ కళ్ళముందు కదలాడాయి. చెవుల్లో అవే ధ్వనులు మళ్ళీ వినిపిస్తున్నట్టుగా అనిపించింది.

తల విదిలించి లేచాడు. దంతధావనాది కార్యక్రమాలు ముగించుకుని హాల్లోకి వచ్చేసరికి రాధ కాఫీ, స్నాక్స్ తీసుకుని వచ్చింది.

అతను వచ్చి కూర్చోగానే గోపాలరావు సూటిగా అడిగాడు "వద్దని చెప్పినా రాత్రి కిటికీ తలుపు లెందుకు తెరిచావు?"

అతనికెలా తెలిసిందో అర్థం కాలేదు. లేదని వాదించడం మూర్ఖత్వం అనుకుని మిన్నకున్నాడు. అతని మాటలకు జవాబు చెప్పలేదు.

"చెప్పినట్టు మసలుకోవడం నేర్చుకో. నువ్వు చిన్నవాడివి కాబట్టి నిన్ను శాసించే హక్కు నాకుందని భావిస్తున్నాను" అన్నాడు. విష్ణు మారు మాట్లాడలేక పోయాడు.

యథాప్రకారం తొమ్మిది గంటలకల్లా గోపాలరావు డ్యూటీకి వెళ్ళిపోయాడు. వెళ్ళేముందు విష్ణు వైపు ఓమారు అదోలా చూసి బయలుదేరాడు. ఆ చూపు దేనికి సంకేతమో అర్థం కాలేదు. అతను వెళ్ళిపోయాక రాధ కూడా అతన్నలాగే చూసింది. అర్థం కాక జుట్టు పీక్కున్నంత పని చేసి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

సుమారు పది గంటల ప్రాంతానికి విష్ణు మెల్లగా బయటికి వచ్చి రాధ ఎక్కడుందో చూశాడు. వంటింట్లో ఉన్నట్టుంది.

మెల్లగా వెళ్ళి "ఏమండీ" అంటూ పిలిచాడు.

హఠాత్తుగా పిలుపు వినబడ్డంతో క్షణంపాటు ఉలిక్కిపడి తనకు తానై సర్దుకుని "ఏమిటండీ" అన్నది.

"మీతో కొన్ని విషయాలు మాట్లాడాలి".

"హావేలీ విషయమా? అద్దైతే మాట్లాడకపోవడమే మంచిది. అయినా మీరు చదువుకోడానికొచ్చారా? లేక డిటెక్టివ్ పనులు చెయ్యడానికొచ్చారా?"

"చిన్నప్పట్నుంచీ నాకో చెడ్డ అలవాటుంది. ఏదైనా విషయం తెలుసుకోవాలని మనసులో అనుకుంటే అది తెలుసుకునే వరకూ మనశ్శాంతి ఉండదు. ఆకలి దప్పికలు అసలే ఉండవు. నిద్ర పట్టదు. అందువల్ల ప్లీజ్, నేనడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పి నాకు మనశ్శాంతి ప్రసాదించండి" అన్నాడు ప్రాధేయపడుతున్నట్టుగా.

"నాన్నగారు వద్దన్న పనులు మీరెందుకు చెయ్యాలనుకుంటున్నారు?"

"మీరు చెప్పకపోయినా ఏదో విధంగా నేను తెలుసుకోగలను. తెలుసుకోకుండా నేనీ గ్రామం వదిలి వెళ్ళను. నా పరీక్షలయ్యాకైనా ఆ విషయాలన్నీ తెలుసుకునే ఇక్కణ్ణుంచి వెళతాను. లేదా మళ్ళీ ఇక్కడికి వచ్చి తెలుసుకుంటాను".

ఆమె కళ్ళల్లో ఏదో భయం తొంగిచూసింది.

హావేలీ గురించి ఇతనెందుకింత పట్టుదలగా ఉన్నాడో ఆమె కర్థం కాలేదు. నాన్న ఇంట్లో లేనప్పుడు తన మాట ఖాతరు చెయ్యకుండా అతను హావేలీ వైపు వెళ్ళిపోతే ఏం



జరిగిన కథ

అరకులోయ మార్గంలో ఉన్న కుగ్రామానికి వెళ్ళే తోవలోనే ఉంది పాడుబడిన హావేలీ. ప్రశాంత వాతావరణంలో చదువుకుని ఐపీఎస్ పరీక్షకు సిద్ధమయ్యేందుకు ఆ ఊరికి వస్తాడు విష్ణు. హావేలీ పేరెత్తగానే ఎస్సై గోపాలరావులో ఉలికిపాటు, అక్కడి మనుషుల ప్రవర్తనలో మార్పు, వారి ఆంక్షలు విష్ణుకి ఆశ్చర్యం కలిగిస్తాయి. వద్దన్నా వినకుండా రాత్రి కిటికీ తెరిచి పడుకుంటాడు విష్ణు. ఏవో శబ్దాలు, మాటలు వినబడటంతో ఆకస్మికంగా అతడికి మెలకువ వస్తుంది. ఆ తర్వాత.....

చెయ్యగలదు? ఎలా ఆపగలదు?

"అక్కడి విషయాలు చెప్పడం వల్ల మీకేదైనా ప్రమాదం ఉంటుందని ఎవరైనా అన్నారా? ఎవ రైనా బెదిరించారా? ఈ వివరాలు తెలిస్తే అందుకు తగినట్టుగా మనం నడుచుకోవచ్చు".

"మీరు నాన్నగారు చెప్పినట్టు నడుచుకుంటే అంతకన్నా చేయగలిగిన సహాయం ఏదీ లేదు. నన్ను ఇబ్బంది పెట్టకండి".

"నేను కాబోయే ఐపీఎస్. ఆ విషయం మర్చి పోవద్దు. మీరు దేనికీ అనవసరంగా భయపడ వద్దు. నిన్న రాత్రి నాకు విచిత్రమైన శబ్దాలు విని పించాయి. ఒకసారి కాదు. చాలాసార్లు. దానివల్ల అసలు సరిగ్గా నిద్ర పట్టలేదు. అందుకే కిటికీ తెరిచి చూశాను. మన చుట్టూ అసలేం జరుగు తోందో తెలుసుకోకుండా మీరిలా భయపడుతూ కూర్చోవడంలో అర్థం లేదు. మీకు చేతకాకపోతే ఇంట్లో కూర్చోండి. నేను వెళ్తున్నాను" అంటూ ఆమె అనుమతి కోసం ఎదురు చూడకుండా తలుపు తీసుకుని బయటికి వెళ్ళిపోయాడు విష్ణు.

అతను వెళ్ళినవైపే చూస్తూ ఆమె అచేత నంగా నిలబడిపోయింది.

బయటికి వచ్చిన విష్ణు వెనక్కి తిరిగి చూడ కుండా వీధి చివరికి వెళ్ళాడు. అక్కడున్న టీ కొట్టులో టీ తాగి నేరుగా టూరిస్ట్ బస్ స్టాప్ దగ్గ రికి చేరుకున్నాడు.

వెనక్కితిరిగి చూస్తే ఆ టీకొట్టు వ్యక్తి ఇతన్నే చూస్తూ ఉన్నాడు.

అతన్ని లెక్కచెయ్యక హవేలీ వైపు అడుగులు

అతని దృష్టి చదువుమీద లేదు. ఆలోచనలన్నీ హవేలీ ప్యాలెస్ మిస్టరీపైనే. ఆ మహల్‌లో ఏముందో తెలుసుకోవాలని నిర్ణయించుకున్నాడు. మహల్ జోలికి పోవద్దనీ వచ్చిన పని చూసుకోమనీ ఎస్సై, అతడి కూతురు ఎంత చెప్పినా వినకుండా హవేలీ వైపు బయలుదేరాడు. సగం దూరం వెళ్ళేసరికి వెనుక ఎవరో అనుసరించి వస్తున్నట్టనిపించింది. వెనక్కిచూసి ఆశ్చర్యపోయాడు! ఇంతకీ అతన్ని అనుసరిస్తున్నదెవరు?

వేశాడు. కొద్దిదూరం ముందుకు వెళ్ళగానే వెనక ఎవరో వస్తున్న అలికిడి వినిపించింది.

చప్పున వెనక్కి తిరిగి చూశాడు విష్ణు. తన



కళ్ళను తానే నమ్మలేక పోయాడు.

రాధ తనను అనుసరిస్తూ వస్తోంది. ఆమెను చూసి టక్కున ఆగిపోయాడు.

ఆమె వాలకం చూస్తే ఏదో చెప్పేందుకు వస్తున్నట్టనిపించింది.

అతన్ని సమీపించి "ఇంటికి పదండి. మీకో ముఖ్య విషయం చెప్పాలి" అన్నది.

"ఇక్కడే చెప్పొచ్చుగా".

"వీలుపడదు. దయచేసి నా మాట వినండి."

ఆమె వైపు తదేకంగా కాసేపు చూసి పదండి అన్నట్టు తలూపుతూ వెనక్కు తిరిగాడు. ఇల్లు చేరుకోగానే తలుపు మూసేసి లోపలి వైపు నుండి లాక్ చేసేసీ తాళం గుత్తి బొడ్లో దోపుకుంది. ఆ తరువాత అతనివైపు ఇప్పుడేం చెయ్యగలవు అన్నట్టు చూసింది.

"ఇందుకన్న మాట పిలిచింది".

"కాదు. హవేలీ విషయాలు చెప్పాలనే పిలిచాను. ఆ వివరాలన్నీ పూర్తిగా తెలుసుకుని తరువాత అక్కడికి వెళ్ళొచ్చునో కూడదో మీరే నిర్ణయించుకోండి".

"తలుపెందుకు లాక్ చెయ్యడం?"

"దానికీ కారణముంది. ముందుగా చెప్పేది వినండి. ఆ తరువాతనే ఏదైనా మాట".

విష్ణు మౌనం వహించాడు. ఆమె చెప్పడం వింటూంటే జరిగిందంతా ప్రత్యక్షంగా చూస్తున్న అనుభూతి కలగ సాగిందతనికి.

●●●

సుమారు పాతికేళ్ళ క్రితం ప్రారంభమైన కథ ఇది. రత్నగిరి సంస్థానానికి మొదటిపేరు విజయపురి సంస్థానం. కేవలం ఒక చిన్న గ్రామం. చుట్టుపక్కల ఉన్న సుమారు వెయ్యిన్నర ఎకరాల భూములకు అధిపతి రాజా విజయేంద్రవర్మ. సుమారు నలభై ఐదేళ్ళ వయసుగల వ్యక్తి.

అక్కడి పొలాల్లో ఎక్కువగా పండేది వరి, గోధుమలు, జొన్నలు. ఇదికాక కొండ ప్రాంతంలో తేయాకు ఎస్టేట్లు సుమారు వందఎకరాల పైనే ఉండేవి. మొత్తంగా సుమారు వెయ్యిఎకరాలకు పైగానే పొలాలుండేవి. అక్కడ పొలాల్లో పనిచేసే వాళ్ళందరికీ ఇళ్ళు కట్టించి ఇచ్చి దాన్ని ఒక గ్రామంగా తీర్చిదిద్దాడాయన.

కూలీలు, రైతులు అందరూ కలిపి సుమారు రెండు మూడు వందలమంది అక్కడి పొలాల్లో పనిచేసేవాళ్ళు. ఆ రకంగా అక్కడ సుమారు యాభైకి పైగా కుటుంబాలుండేవి. గోపాలరావు లాంటి వాళ్ళందరూ ఉద్యోగరీత్యా ఈ మధ్యకాలంలో వచ్చి స్థిరపడ్డవాళ్ళే. ప్రజలెన్నుకున్న ఎమ్మెల్యేలూ, ఎంపీలూ ఎన్నికల సమయంలో తప్ప తరువాత ఏనాడు ఇటువైపున వచ్చిన పాపాన పోలేదు.

అవకాశం మిస్ చేసుకుంది

గోవా బ్యూటీ ఇలియానా చేతిలో ప్రస్తుతం ఒక్కటంటే ఒక్క సినిమా కూడా లేదు. అలాగని అవకాశాలు ఇచ్చేవారు లేరు. ఫుల్ ఖాళీ. ఇలాంటి సమయంలో ఇలియానా చెంతకి బంగారంలాంటి సినిమా వచ్చింది. అదీ మహేష్‌బాబు పక్కన హీరోయిన్‌గా. మారు మాట్లాడకుండా ఎంత ఇస్తే అంత పుచ్చేసుకుని సినిమా ఒప్పేసుకుంటే దక్షిణాదిన రీ ఎంట్రీకి మార్గం దొరికేది. అలా కాకుండా రెండు కోట్లు అడిగిందట! ఫామ్‌లో లేని హీరోయిన్‌కి రెండు కోట్లు ఎందుకంటూ ఆ సినిమా దర్శకనిర్మాతలు మరో బాలీవుడ్ భామను వెదుక్కున్నారట! బంగారం లాంటి అవకాశాన్ని మిస్ చేసుకున్నానంటూ ఇలియానా ఇప్పుడు తీరిగ్గా బాధపడుతోందట!

అయినా ఆ విషయాన్ని గ్రామస్థులు ఏనాడూ పట్టించుకోలేదు. కారణం అక్కడ అందరి కష్టసుఖాలను చూసేందుకు విజయేంద్రవర్మ ఉన్నాడన్న ధైర్యం. వంశ పారంపర్యంగా సంక్రమించిన ఆస్తి కేవలం తన కోసమే కాక ప్రజలందరి కోసం ఉపయోగించిన మహాత్ముడు. ప్రతి ఏడూ తన పుట్టిన రోజున గ్రామం మొత్తానికి మృష్టాన్న భోజనం పెట్టి వాళ్ళందరూ భోంచేశాకే తను భోజనం చేసేవాడు.

ఇంతటి దయాగుణ సంపన్నుడైన విజయేంద్ర వర్మకు ఉన్న ఒకే ఒక మనోవ్యధ సంతానలేమి. పెళ్ళై పదేళ్ళైనా సంతానం లేదు. సంతానం కోరి అతను దర్శించని పుణ్యక్షేత్రం లేదు. చేయని పుణ్య కార్యం లేదు. కొలవని ఆధ్యాత్మిక గురువు లేడు. తీసుకోని మూలికా ఔషధాలు లేవు. ఇక ఏం చేస్తే సంతానం కలుగుతుందో తెలియలేదు.

అలాగని వేరే పెళ్ళి చేసుకోవడానికి అతను ఏ మాత్రం సుముఖంగా లేడు. చివరికి తాను కొలిచిన అందరు భగవంతుల ఆశీస్సులతో ఆ రాజప్రాసాదంలో పసివాడి గొంతు పలికింది. విజయేంద్రవర్మ సంతోషానికి అవధులు లేకుండా పోయాయి.

ఆ సంతోషంలో అతను గ్రామంలోని ప్రతి కుటుంబానికీ తనకున్న పొలాల్లో నుంచి తలా రెండెకరాల పొలం రాసిచ్చేశాడు. అలా రాసిచ్చిన తరువాత కూడా దాదాపుగా వెయ్యెకరాల పొలం ఉంది.

లేకలేక కలిగిన సంతానానికి రవీంద్రవర్మ అని నామకరణం చేశారు. బిడ్డను ఎంతో అపురూపంగా చూసుకుంటూ మురిసిపోయాడు విజయేంద్రవర్మ. ఒక వయసు వరకూ చిన్నతనంలో పిల్లలు చేసే అన్నిరకాల చేష్టలూ ఆనందపరిచేవిగానే ఉంటాయి. ఆ లెక్కన పిల్లవాడు కాస్త అనుచితంగా ప్రవర్తించినా పసిమనసు అని సర్దుకునే వాళ్ళు ఆ గ్రామ ప్రజలు. కానీ అది పెంకితనంగా మారుతుందని గుర్తించలేకపోయారు.

చిన్నతనం నుంచీ అక్కడ పొలాల్లోని కూలీలు తన తండ్రికి వంగి వంగి సలాములు చేయడం గమనించిన రవీంద్రవర్మ అలా అందరితో సలాములు చేయించుకోవడమే తమకు, తమ వంశ గౌరవానికి ప్రతీక అనీ, తమకు సలాముకొట్టడం ఆ కూలీల ధర్మమనీ, తలరాతనీ అనుకొని ముక్కుపచ్చలారని ఆరేళ్ళ వయసులోనే దర్పంగా, అనేక సందర్భాల్లో దురుసుగా కూడా వ్యవహరించేవాడు.

లేకలేక కలిగిన సంతానం కావడం వల్ల విజయేంద్రవర్మ తన కుమారుణ్ణి ఏమీ అనలేక పోయేవాడు. దానికి తోడు విజయేంద్రవర్మ భార్య కొడుకు చేసే ప్రతి పనిలోనూ ఆనందాన్ని, సంతోషాన్ని మాత్రమే వెదుక్కునేది. అతను చేసే తప్పులను ఏనాడూ ఖండించలేదు. ఖండించాలన్న దిశగా ఆలోచించనూ లేదు.

విజయేంద్రవర్మ గొప్ప విద్యావంతుడు. కొడుకు రవీంద్రవర్మకు ఏ మాత్రం

చదువు అబ్బలేదు. హవేలీలో తన వయసు పిల్లలు కొంతమంది ఉన్నా అందరూ పనివాళ్ళ పిల్లలు కావడం వల్ల, తాను రాజవంశానికి చెందినవాడన్న అహంభావంతో ఎవరినీ దగ్గరికి చేరనివ్వలేదు. ఆ కారణంగా స్నేహితులెవరూ ఉండేవారు కాదతనికి. దాదాపు పది పన్నెండేళ్ళ వయసు వచ్చినా బడి ఛాయలకు వెళ్ళలేదు. రాజప్రాసాదంలోని తోటమాలులు, పరిచారికల పిల్లలతో ఆడుకున్నా అక్కడ తన ఆధిపత్యమే కనిపించేది తప్ప నిజాయితీతో కూడిన ఆట మాత్రం కాదు. కొన్ని సందర్భాల్లో తండ్రితో బాటు ఎప్పుడైనా బయట ఊర్లకు వెళ్ళినప్పుడు అక్కడ ఎవరైనా ఇతన్ని పలకరిస్తే బాగా ఇబ్బంది పడేవాడు. విజయేంద్రవర్మను సాధారణంగా అందరూ ఇంగ్లీషులో పలకరిస్తారు.

అదే ఉద్దేశంతో ఇతన్ని కూడా పలకరించడం ఇబ్బందిగా ఉండేది. తానేదైనా మాట్లాడితే భాష తెలియని తన మాటలకు అక్కడున్న వాళ్ళందరూ గేలి చేస్తారేమోనన్న భావన అతని మనసులో బలంగా నాటుకుంది. అందువల్ల స్వేచ్ఛగా మాట్లాడడానికి మొహమాట పడేవాడు.

ఆ సమయంలోనే ఇక చదువు తప్పదన్న నిర్బంధం కలిగింది మనసులో. కొంతైనా చదువుకోవాలన్న అగత్యం కనిపించింది. అయితే పన్నెండేళ్ళు వచ్చాక ఇంకా తనలో సగం వయసు పిల్లలతో సమానంగా చిన్న తరగతుల్లో కూర్చోవడం రుచించలేదు. వేరే మార్గం లేక ఒక గురువును రాజమహలుకే రప్పించి చదువు నేర్పించే ఏర్పాటు చేశాడు విజయేంద్రవర్మ. ఆ విధంగా కూడా నేర్చుకోవడంలో ఇబ్బందులు పడ్డాడు.

రవీంద్రవర్మకు ఇరవైఒక్క ఏళ్ళు నిండాయి. అప్పటికి ఎలాగో కష్టపడి తొమ్మిదో తరగతి వరకూ చదివాడు. కానీ ఏ తరగతిలోనూ పరీక్ష రాయలేదు. ముందు సంవత్సరం పదో తరగతికి రాష్ట్రస్థాయిలో పరీక్ష. ఏదో చదివాననిపించాడే తప్ప అతను పరీక్ష రాయలేదు. కాబట్టి పాసవ్వలేదు. ఒకవేళ పరీక్ష రాసి పాసవ్వలేదంటే అది తనకు అతిపెద్ద అవమానమన్న కారణం చేతనే రాయలేదు.

పెరిగి పెద్దవాడైన రవీంద్రవర్మ తమ హవేలీలోనూ, పొలాల్లోనూ పనిచేసేవాళ్ళ గులామీకి కారణం రాజా విజయేంద్రవర్మ పట్ల ఉండే అభిమానమన్న విషయం తెలుసుకున్నాడు. అయినా కూడా 'ఎవరి కోసం చేస్తారు? బతకాలనుకుంటే చేస్తారు, లేకుంటే వెళ్ళిపోతారు' అన్నట్టుగా వ్యవహరించేవాడు. మొక్కై వంగనిది మానై వంగునా అన్న సామెతకు నిలువెత్తు ఉదాహరణగా నిలిచాడు రవీంద్రవర్మ.

కొడుకును గారాబం చేయడమే తాను చేసిన చాలా పెద్ద పొరపాటన్న సత్యాన్ని విజయేంద్రవర్మ చాలా ఆలస్యంగా తెలుసుకున్నాడు. అతనికి ఇరవై ఏళ్ళు వచ్చేసరికి విజయేంద్రవర్మకు డెబ్భై ఏళ్ళు దాటాయి. అయినా దేహదారుఢ్యం కారణంగా తన సంస్థానాన్ని సజావుగా నడుపుతూ ఉండేవాడు.

వయసుతోబాటుగా వచ్చే కొన్ని చిన్నచిన్న వ్యాధులు అప్పుడప్పుడూ అతన్ని సతాయించేవి. ఆ సమయాల్లో రవీంద్రవర్మ అధికారం చలాయించేవాడు.

పొలాల్లోనూ, హవేలీలోనూ పనిచేసేవాళ్ళ పట్ల ఏమాత్రం సానుభూతి లేకుండా నడుచుకునే వాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ తన మాటకు ఎదురు చెప్పే సాహసం ఎవరూ చేయకుండా చూసుకున్నాడు. ఒకవేళ అలా ఎవరైనా ఎదురుతిరిగితే తన అంగరక్షకుల చేతిలో కొరడాలతో విచక్షణా రహితంగా కొట్టించేందుకు కూడా వెనుకాడేవాడు కాదు.

అతని నిరంకుశత్వం అక్కడి ప్రజలకు మింగుడుపడనిదిగా ఉండేది. అలాగని విజయేంద్రవర్మ దగ్గర చెప్పుకునే అవకాశం కూడా లభించేది కాదు. ఒకవేళ తాము చెప్పినా లేక లేక కలిగిన సంతానం వైపే మొగ్గు చూపుతాడన్న అనుమానంతో అందరూ మౌనం వహించేవాళ్ళు.

ఆ క్రమంలో కొన్ని సందర్భాల్లో తండ్రికి బదులుగా బయటకార్యకలాపాలు నిర్వర్తించాల్సి వచ్చినప్పుడు అతను బయటి ప్రపంచంతో మెలగవలసి వచ్చింది.

ముఖ్యంగా ప్రభుత్వానికి సంబంధించిన పనులు చక్కబెట్టాల్సి వచ్చిన తరుణంలో రాజకీయ సంబంధాలు అవసరమయ్యాయి. అవి ఎంతటి మహత్తరమైనవో అర్థం చేసుకున్నాడు. ప్రపంచ



మంటే కేవలం హవేలీ పరిసర ప్రాంతం మాత్రమే కాదనీ, ఇంకా ఎంతో ఉందనీ ప్రత్యక్షంగా చూశాడు. అక్కడ కూడా నాయకులకు, శ్రీమంతులకు సగటు ప్రజలు సలాములు చేస్తూండడం చూసి రాజకీయ నాయకులు, శ్రీమంతులు కూడా తమలాగే గౌరవప్రదమైన వాళ్ళని భావించాడు. దాంతో వాళ్ళ పరిచయాలు ఇబ్బడిముబ్బడిగా పెంచుకున్నాడు. తన రాజకీయ సంబంధాలు బలపర్చుకున్నాడు.

విజయేంద్రవర్మకు నమ్మినబంటు హవేలీ తోటమాలి వీరయ్య. విజయేంద్రవర్మకు సమవయస్కుడు. అతన్ని చూస్తే యాభై ఏళ్లుంటాయేమో అనుకుంటారు. పల్లె పొలాల్లోని కూలీల కష్టసుఖాలన్నీ అతనే పర్యవేక్షించేవాడు. వాళ్ళకు కావలసిన సదుపాయాలన్నీ వీరయ్య పర్యవేక్షణలోనే జరుగుతూండేవి. అక్కడి ప్రజల అవసరాలు అడిగి మరీ తెలుసుకుని విజయేంద్రవర్మకు చేరవేసి సమస్యలు తీర్చేవాడు వీరయ్య. ఆ విధంగా వీరయ్యంటే గ్రామ ప్రజలకు ఎనలేని గౌరవం, ఒక నమ్మకం, అభిమానం.

అతని మనవరాలి పేరు కల్పన. పదహారేళ్ళ పిల్ల. చక్కని అందగత్తె. చక్కగా చదువుకున్నది, తెలివైనది, సకల సద్గుణ సంపన్నురాలు. కొన్ని సందర్భాల్లో వీరయ్య గైర్హాజరీలో కల్పన వీరయ్య బాధ్యతలు కూడా నిర్వహించేది. అందువల్ల కల్పనంటే కూడా ఆ పల్లెప్రజలకు ప్రత్యేక అభిమానం.

ఈ పరిస్థితుల్లో హఠాత్తుగా ఒకరోజు అనుకోని సంఘటన జరిగింది. సంఘటన జరిగింది అనేదానికన్నా గుట్టు బయటపడింది అనొచ్చు.

అదేమిటంటే తండ్రికి తెలియకుండా రవీంద్రవర్మ సాగించే అసాంఘిక, అనైతిక కార్యకలాపాలు! జరిగే సంగతులన్నీ చాలా రోజులుగా గమనిస్తున్నా చెప్పాలా వద్దా అన్న మీమాంసలో వీరయ్య కొద్దిగా ఆలస్యం చేశాడనే చెప్పాలి. కారణం అతని క్కూడా కన్న కొడుకు మీద వచ్చే నిందలు ఎంత వరకూ రాజా నమ్ముతారన్న సంశయం.

విషయమేమిటంటే మాదకద్రవ్యాల మారకం వల్ల డబ్బు అధికంగా లభిస్తుందని తెలుసుకున్నాడు రవీంద్రవర్మ. పట్నంలో ఉన్న తన స్నేహితుల సలహా మేరకు హవేలీలోనే ఒక గదిలో ఎవరికీ తెలియకుండా పెద్ద మొత్తంలో మాదకద్రవ్యాల నిల్వ ఉంచి వాటిని స్నేహితుల కోరిక మేరకు వాళ్ళు చెప్పిన సమయానికి, చేర్చవలసిన వ్యక్తులకు, చేర్చవలసిన చోటికి చేరుస్తూ డబ్బులు పోగుచేస్తున్నాడన్న వార్త విజయేంద్రవర్మ చెవుల బడింది.

అతను చేసే ఈ పనులకు అండగా అతనికి పరిచయస్థులనబడే కొందరు నేతలు, ఆ నేతల బిడ్డలైన యువనేతలు, శ్రీమంతులు ఉన్నారు. ఆ విషయం రాజావారికి చేరవేసింది కూడా అతని కార్యకలాపాలన్నీ ప్రత్యక్షంగా చూసి ఇక ఆలస్యం చేయకూడదని భావించిన వీరయ్యే!

అందరూ కలిసి తమ మహలులోనే ఇటువంటి నీచమైన కార్యక్రమాలు సాగించడం విజయేంద్రవర్మకు మింగుడు పడలేదు.

విజయేంద్రవర్మ చింతించాడు, బాధపడ్డాడు. మనసులోనే మథనపడ్డాడు. కానీ ప్రస్తుతం బాధపడడం వల్ల ఏమీ ప్రయోజనం లేదన్న సంగతి తేలిపోయింది. మొక్కదశలోనే తుంచి వేయాల్సిన దాన్ని వటవృక్షంలా పెంచి పెద్దచేసిన తన పెద్దరికాన్ని తనే నిందించుకున్నాడు. దానివల్ల కూడా లాభం లేదు. కింకర్తవ్యం?

"అయ్యా, ఇప్పటికీ మించిపోయింది లేదు. అసలు చేయకపోవడం కన్నా ఆలస్యం మేలంటారు. కనీసం ఇప్పుడైనా అతన్ని పిలిచి మందలిస్తే మంచిది. బాబు ఒక గాడిలో పడడం ముఖ్యం" అన్నాడు వీరయ్య.

వీరయ్య సలహా విజయేంద్రవర్మకు నచ్చింది.

వెంటనే కుమారుణ్ణి పిలిపించాడు. యుక్తవయసు కారణంగా అస్తమానం స్నేహితులతోనే గడుపుతూ ఈ మధ్యకాలంలో తండ్రితో అంతగా ఎక్కువ సమయం గడపడం మానుకున్న రవీంద్రవర్మకు తండ్రి పిలుపులో ఏదో అపశ్రుతి పలికింది. అయినా పిలిచినందుకు వెళ్ళకతప్పదని భావించి వెళ్ళాడు.

"నేను విన్నదంతా నిజమేనా? ఏమిటి నువ్వు చేస్తున్న పనులు? మనకు డబ్బుకేం కొదవని ఈ పనులు చేస్తున్నావు? మన పొలాల మీద వచ్చే ఆదాయం ఎంతో తెలుసా? అంతకన్నా ఇంకేం కావాలి? మనకు వచ్చేదాన్ని కాపాడుకోగలిగితే అదే పదివేలు. నువ్వు చేసే పనుల వల్ల సమాజం బాగుపడకపోగా మనం కూడా పతనమైపోతాం. దీనివల్ల మనకూ మనవంశానికీ ఎంత అప్రతిష్ఠో ఆలోచించావా?" అంటూ నిలదీశాడు.

పక్కనే వీరయ్య నిలబడి ఉన్నాడు. ఇది అతని పనేనన్న విషయం రవీంద్రవర్మకు చూచాయగా అర్థమైంది.

క్రోధంతో అతను చూసిన చూపులు వీరయ్యను దాదాపుగా దహించి వేశాయి. అయినా ప్రస్తుతానికి తండ్రి ముందు ఏమీ అనలేక మౌనం వహించాడు.

"నా తదనంతరం ఈ ఆస్తంతా నీదే కదా. ప్రజలను కన్న బిడ్డల్లా చూసుకుంటే వాళ్ళ అండదండలతో ఈ ఆస్తి ఇంతకు వంద రెట్లు వృద్ధి చెందుతుంది. మనకూ మన వంశ గౌరవ ప్రతిష్ఠలకూ భంగం రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత నీదే. ఒక్కసారి ప్రజల దృష్టిలో చులకనైతే ఇక ఈ జన్మకు మళ్ళీ పోయిన గౌరవాన్ని సంపాదించలేం".

మౌనంగా తల దించుకుని తండ్రి మాటలు వింటున్నాడు రవీంద్రవర్మ. అతను చెప్పే మాటలన్నీ శ్రద్ధగా వింటున్నాడనుకున్న విజయేంద్రవర్మ అది కేవలం తన భ్రమేనని తెలుసుకోలేక పోయాడు. తన మాటలు అతనికి ఏ మాత్రం రుచించడం లేదన్న విషయాన్ని అర్థం చేసుకోలేక పోయాడు.

తండ్రి మనసులోని ఆరాటం, తపన రవీంద్రవర్మను ఏ మాత్రం కదిలించలేకపోయాయి. సహజంగానే ఆ వయసులో సలహాలు, నీతివాక్యాలు చెవికెక్కవు. మంచి గుణాలు పుట్టుకతోనే రావాలి. అలా రానప్పుడు కాలక్రమాన సమాజంతో తిరగడం వల్ల అలవడాలి. అది కూడా లేదంటే స్వీయ అనుభవంతో తెలుసుకోవాలి. ఇవేమీ లేకుంటే ఇక ఎన్నటికీ మంచి గుణాలు అలవడవు.

తన తండ్రి ఒక పనివాడి ముందు తననలా నిందించడం, నీతి వాక్యాలు చెప్పడం ఘోరమైన అవమానంగా భావించాడు రవీంద్రవర్మ. మనసులోనే నిలువునా కుతకుత ఉడికిపోయాడు. తండ్రి మాటలు ఏ మాత్రం చెవికెక్కక పోగా ఈ పరిస్థితికి కారణం వీరయ్యే అని స్పష్టంగా తేలిపోవడంతో అతని మీద కక్ష గట్టాడు.

అణుమాత్రం కూడా తన పద్ధతి మార్చుకోలేదు. పైగా ఎలాగూ విషయం బహిర్గతమైంది కదా అని బాహాటంగానే మరింత విచ్చలవిడిగా తన కార్యకలాపాలు సాగించాడు. అదిచూసిన విజయేంద్రవర్మ మరింత కుంగి కృశించిపోయాడు. వీరయ్య ముందు చెప్పుకుని మథన పడ్డాడు.

"వాణ్ణి మందలించి తప్పు చేశానేమో. మందలించకుండా ఉంటే బాగుండేదేమో వీరయ్యా" అన్నాడు ఒక సందర్భంలో.

"లేదు బాబూ. మీరు చేసిన పని మంచిదే. తండ్రిగా మీరు మీ బాధ్యత నిర్వర్తించారు. భవిష్యత్తులో మీరు అతన్ని సక్రమ మార్గంలో పెట్టేందుకు ప్రయత్నించలేదని అతను మీమీద నిందమోపే అవకాశం ఉండదు. ఏం జరిగినా మన మంచికే అనుకోండి" అంటూ సర్ది చెప్పాడు వీరయ్య.

ఇది జరిగిన కొన్నాళ్ళ తరువాత హఠాత్తుగా ఒకరోజు తెల్లవారగానే "రాజా విజయేంద్రవర్మ గారు కాలం చేశారు" అన్న కబురు ఆ గ్రామంలోనే కాక ఆ లోయ పరిసర ప్రాంతాల్లో కూడా ప్రతిధ్వనించింది.

(ఇంకా వుంది)



పుస్తక సమీక్ష

నాన్నతో నేను

విశ్వం
ధర: 100 రూపాయలు
పేజీలు: 280
ప్రతులకు: విజయా పబ్లికేషన్స్, వడపళని, చెన్నై-26
ఫోన్ 044-23652007

ఎలా బతికామన్నది కాదు, ఎంత బాగా బతికాం, ఎంతమందికి మార్గదర్శకంగా బతికాం, సమాజానికి మనం అందించినదేమిటీ అనేదే ముఖ్యం. ఈ కొలతలన్నింటిలో ఇమడగలిగే వారు చందమామ విరజిమ్మే వెన్నెలలా అంద రికీ చేరువై స్ఫూర్తినిస్తారు. అలాంటి వ్యక్తి త్వంతో వెలిగిపోయి టాలీవుడ్ అభ్యున్నతికి, కీర్తి ప్రతిష్ఠలకు బాటలు పరిచినవారిలో ఒకరుగా నిలిచారు బొమ్మిరెడ్డి నాగిరెడ్డి. జీవిత చరి త్రలు ఎన్నో ఉంటాయి. ఒకరిది ఉద్యమ చరిత్ర అయితే, మరొకరిది అధ్యాత్మిక చరిత్ర. నాగిరెడ్డి గారిది చిత్రపరిశ్రమకు అంకితమైన చరిత్ర. సత్య నిరతి, శ్రమ, నిజాయితీ, స్పష్టమైన జీవన సంస్కృతి వంటి గుణాలతో సాధారణ స్థితి నుంచి విజేతగామారి ఉన్నత శిఖరాలధి రోహించారు నాగిరెడ్డి. మీదుమిక్కిలి విజయా హాస్పిటల్ నిర్వహణలో మానవతా వాదిగా వాసికెక్కారు. కన్నబిడ్డగా ఆ తండ్రి గుణగణాలను, వ్యక్తిత్వ విశిష్టతలను ఆకళించు కున్న విశ్వంగారు, తన తండ్రి నిత్య జీవనంలోని ఉదాత్త, ఉన్నత గుణవిలువల్ని, నాటి సజీవ సంఘటనల్ని సోదాహరణంగా వివరిస్తూ రాసిన పుస్తకం 'నాన్నతో నేను'. నాగిరెడ్డి కృషి, చిత్రపరిశ్రమతో ఆయనకున్న అనుభవాలు, అనుభూతులు, అను బంధాలను మానవీయ కోణంలో ఆవిష్క రించి పతితకు స్ఫూర్తి కలిగించారు విశ్వం. కొత్త తరం యువకులు సరికొత్త విలువలతో పాటు గతకాలపు మానవానుబంధాలు, ఉన్నత విలువలను సజీవంగా తమవెంట మోసుకెళ్ళి మరో తరానికి అందించమని చెప్పకనే చెబుతుందీ పుస్తకం. నైతికత కొడిగడుతున్న ఈ కాలానికి అవసరమైన పుస్తకమిది.

అవే పదాలు

యానాద్రి
ధర: 100 రూపాయలు
పేజీలు: 236
ప్రతులకు: అన్ని ప్రధాన పుస్తక కేంద్రాలు

అన్నమయ్య, వేమనలిద్దరూ కారణ జన్ములే. వారి జీవన కాలాల మధ్య 200 సంవత్సరాలు తేడా ఉన్నప్పటికీ, వేమన తన పద్యాలలో సందర్భో చితంగా అన్నమయ్య పదాలను ఎలా పొందుపరిచాడో వివరించే పరిశోధ నాత్మక వ్యాసం ఈ పుస్తకం. వారి జీవిత చారిత్రక విశేషాలనూ ఇందులో విశ్లేషించారు.



కృష్ణం వందే జగద్గురుం

డా.ధారా రామనాథ శాస్త్రి
ధర: 100 రూపాయలు
పేజీలు: 118
ప్రతులకు: ఎ వి కె పబ్లికేషన్స్, 2వ అంతస్తు, ఇకె బుక్‌హౌస్, కాచిగూడ క్రాస్‌రోడ్, హైదరాబాద్-27.
సెల్ 9247673318

ఆ శ్రీకృష్ణుని లీలామృతాన్ని తెలియజేసే కమ్మటి కథల సంకలనమిది. ఇందులోని పది కథలూ ఆ అవతారమూర్తి విశేషాలను సరళభాషలో కళ్ళకు కట్టి, వయోభేదానికి అతీతంగా అలరిస్తాయి.

స్వీకారాలు

దోసిలిలో నది (కవిత్వం)
దాట్ల దేవదానం రాజు
ధర: 60 రూపాయలు, పేజీలు: 86
ప్రతులకు: రచయిత, 8-1-048, ఉదయిని, జక్రియనగర్, యానాం-533464 సెల్ 9440105987

అంతర గాంధారం (వచన కవితా సంపుటి)
ఎలనాగ
ధర: 70 రూపాయలు, పేజీలు: 70
ప్రతులకు: ప్రముఖ పుస్తక దుకాణాలు

అండమాన్ డైరీ
దాసరి అమరేంద్ర
ధర: 100 రూపాయలు, పేజీలు: 90
ప్రతులకు: విశాలాంధ్ర, నవచేతన, నవో దయ, ప్రజాశక్తి బుక్‌హౌస్‌లు, నవోదయ పబ్లిషర్స్

-లలితాత్రిపురసుందరి

నేనెక్కిన రెక్కల గుర్రం
వియస్‌పి తెన్నేటి

రచయితగా నలభై పై చిలుకు సంవత్సరాల సుదీర్ఘప్రయాణం, స్రవంతి, హారిక పత్రికల సంపాదకులుగా పాఠకులకు చిరపరిచితులు. పాఠకుల ఊహలు అంతమయ్యే చోట ఉత్కంఠత క్రైం, సస్పెన్స్, కథలు, నవలలు, నాటికలు, నాటకాలు, వ్యాసాలు,సంపాదకీయాలు, భక్తి పాటలు టి.వి. ఎపిసోడ్స్ సీరియల్స్ సినిమాలకు సంభాషణలు, అన్ని అంశాలనూ తాకిన ఘనత ఆయనకే సొంతం.

బహుముఖ ప్రజ్ఞాశాలికి
నిర్వాణ పబ్లికేషన్స్
శుభాభి వందనములు

వియస్‌పి తెన్నేటి
vsptenneti@gmail.com
www.arkavidya.com

ప్రతులకు :
09000544243
09347524243
08885591236
వెన్నెల జెండా
ramaniprasad1959@gmail.com



ఆసరా

మొలుగు కమలాకాంత్

"కౌసల్యా సుప్రజారామా..." సుప్రభాతం వింటూనే విసుగ్గా లేచాడు నిరీక్షణ్. "అమ్మా! హాయిగా పడుకోనీకుండా పొద్దున్నే, రోజూ ఏమిటే ఈ గోల?" "ఆ... యమ్మెస్ సుబ్బలక్ష్మిగారి సుప్రభాతం నీకు గోలగా ఉందేమిట్రా? లెంపలేసుకో. కళ్ళు పోతాయి. అయినా ఏడైంది.. లే ఇంక" కసిరి పారేసింది తల్లి వసుంధర.

విసుక్కుంటూ లేచినా గబగబ తయారై అర్జంటు పనున్నవాడిలా హడావిడిగా వెళ్ళిపోతున్న కొడుకుని చూస్తూ "వాడలా వెళ్తుంటే బెల్లం కొట్టిన రాయిలా అలా చూస్తారేమిటండీ? ఎక్కడికో, ఎందుకో కనుక్కోరే?" అడిగింది భర్తని.

"తమ పుత్రులు సంఘసేవాతత్పరులు... మళ్ళీవారినేమైనా పల్లెత్తు మాటంటే, ఒక్కగానొక్క కొడుకు... ఎందుకండీ, అస్తమానం వాణ్ణలా తిడతారు?" అంటూ నువ్వే వెనకేసుకొస్తావ్. అన్నీ నీ మాటలే" అంటూ తనూ ఆఫీసుకెళ్ళిపోయాడు మూర్తి.

అసలు నిరీక్షణ్ అంత హడావిడిగా బయల్దేరటానికి కారణం లేకపోలేదు. అంతకుముందు రోజు రాత్రి వాళ్ళ స్నేహితుడు రమేష్ బండిమీద వెళ్తుంటే, వెనుకనుంచి లారీ గుద్దటంతో, కాలు ఫ్రాక్చర్ అయి విజయ హాస్పిటల్‌లో ఉన్నాడు. రమేష్ ఐ.సి.యులో ఉండటంతో, కేవలం ఒక్కరిని మాత్రమే అటెండెంట్‌గా అనుమతించడంతో రాత్రి ఇంటికొచ్చి పడుకున్నాడు నిరీక్షణ్.

పొద్దున్నే నిరీక్షణ్ హాస్పిటల్‌కి వెళ్ళేసరికి రమేష్ తల్లిదండ్రులు, నాయనమ్మ ఉన్నారక్కడ. "బాబూ... మీరు ఫ్రెండ్స్ అంతా దగ్గరుండి సమయానికి ఈ హాస్పిటల్‌లో చేర్చకపోయి ఉంటే మా బిడ్డ దక్కేవాడు కాదు. థాంక్యూ నిరీక్షణ్ అన్నాడు రమేష్ తండ్రి రాఘవ..." అదేంటంకుల్ అలా అంటారు? మాకు థాంక్స్ ఎందుకు?" మర్యాదగా అన్నాడు నిరీక్షణ్.

"ఏదిఏమైనా ఆ దేవుడు మనయందుండబట్టి అంత యాక్సిడెంటైనా ఓ చిన్న ఫ్రాక్చర్‌తో పోయింది. వాడు డిశ్చార్జ్ అయ్యాక ఆ తిరుపతి వెంకన్నకి గుండు ఇస్తాడని మొక్కుకున్నారా రాఘవా" కొడుకుతో అంటోంది లక్ష్మీదేవమ్మ.

దాంతో అప్పటిదాకా ఉన్న సహనమంతా

ఎగిరిపోయింది నిరీక్షణ్‌కి. "ఊరుకోండి... శుభ్రంగా తిరుగుతూ, ఎప్పుడూ ఏదో ఒక మొక్కు ఉందంటూ నిరంతరం గుండుతో ఉండే మీ మనవడికి అసలు యాక్సిడెంట్ ఎందుకవ్వాలి చెప్పండి. నిత్యం పూజలూ, పునస్కారాలూ చేస్తాడాయే ఇంత చిన్న వయసులో కూడా!" అన్నాడు.

"నువ్వు భలేవాడివిలా ఉన్నావు నాయనా! అసలివన్నీ చెయ్యబట్టే, అంత పెద్ద యాక్సిడెంట్ అయినా కూడా గండం గట్టెక్కి, ప్రాణాపాయం లేకుండా, ఏదో చిన్న ఫ్రాక్చర్‌తో బిడ్డ మనకి దక్కాడు. అంతా ఆ వెంకటేశ్వరుడి దయ" పైకి చేతులెత్తి చూపిస్తూ అని చెంపలేసుకుంది రమేష్ తల్లి జానకి.

"ఇంకెప్పుడూ దైవదూషణ చెయ్యకు నాయనా! ఏదో ఆ వెంకటేశ్వరస్వామి కృపవల్ల, లేచిన వేళ బాగుండి... ఇలా బయటపడ్డాడు" అంటున్న లక్ష్మీ దేవమ్మని కొరకొర చూశాడు నిరీక్షణ్.

"అంటే సమయానికి మేమంతా హాస్పిటల్‌కి తీసుకురావడం వల్ల రమేష్ సేవ్ అవలేదంటారా?" నిష్ఠూరంగా అడిగాడు.

"అసలు సరిగ్గా ఆ సమయానికి మీరు అటు వైపు వెళ్లడం, సమయం వృథా కాకుండా అరగంటలో హాస్పిటల్‌లో చేర్చడం... ఇదంతా ఆ భగవంతుడే మీ చేత చేయించి ఉంటాడు నిరీక్షణ్! ఎనీహౌ.... థాంక్యూ వెరీమచ్" చేతులు పట్టుకుని అంటున్న రాఘవకి "ఇట్స్ ఓకే అంకుల్" అని చెప్పి పరపరా పళ్లు కొరుకుతూ బయటికొచ్చాడు నిరీక్షణ్.

•••

అక్కడ నుంచి వచ్చేదారిలో తమ లెక్చరర్ కరుణాకర్‌కి హార్ట్‌ప్రాబ్లమ్ వచ్చి సెంటినీ హాస్పిటల్‌లో ఉన్నాడని తెలిసి అక్కడ ఆగాడు.

కరుణాకర్ తమకి ఇంటర్మీడియట్‌లో సివిక్స్ లెక్చరర్. ఓ 45-60 ఏళ్ల మధ్య వయసు ఉంటుందేమో... పాఠం అద్భుతంగా చెప్పేవాడు. ఎప్పుడూ హుషారుగా, యాక్టివ్‌గా, సరదాగా నవ్వుతూ, నవ్విస్తూ ఉండేవాడు. అసలాయనకి హార్ట్ ప్రాబ్లమేంటబ్బా? ఎంత ఆలోచించినా అర్థం కావట్లేదు. సన్నగా, పొడుగ్గా ఉండే కరుణాకర్‌కి ఏ అలవాట్లూ లేవు. అలా ఆలోచిస్తూ రిసెప్షనిస్టుని అడిగాడు.

"కరుణాకర్? ఓ సివిక్ లెక్చరర్ కరుణాకరా! ఆయనకి ఏంజియోప్లాస్టీ చేశారు. స్టంట్స్ వేశారు. రూమ్ నెంబర్ 302లో ఉన్నారు.. థర్డ్‌ఫ్లోర్" చెప్పింది.

పేషెంట్లకి తప్ప లిఫ్ట్ విజిటర్స్‌కి ఉండదు. దాంతో మెట్లెక్కి వెళ్ళి రూమ్ బయట నిలబడి బెల్ కొట్టాడు. 5 నిమిషాలకి గానీ తలుపు తెరుచుకోలేదు. ఓపిగ్గా నిరీక్షించాడు నిరీక్షణ్...

"ఆ రావయ్యా నిరీక్షణ్... ఎలా ఉన్నావ్?"

"ముందు మీరెలా ఉన్నారో చెప్పండి మాస్టారూ?" బాధగా అడిగాడు.

"ఆ జీసస్ దయవల్ల ఆయన బ్రతికి బయట పడ్డారు బాబు... ఓ మూడు రోజులు ఆయన్ని ఎక్కువగా మాట్లాడొద్దన్నారు డాక్టర్ గారు" చెప్పింది కరుణాకర్ భార్య మేరి.

"ఇందాక నువ్వు బెల్ కొట్టినప్పుడు ప్రేయర్ చేస్తున్నాం. అందుకే డోర్ తీయడం ఆలస్యమైంది" చెప్పింది వాళ్ల కూతురు కేథరిన్. ఇంటర్లో తన క్లాస్‌మేట్.

గురువుగారి చెయ్యి ఆప్యాయంగా వత్తి "టేక్ కేర్ మాస్టారూ... యూ విల్ బి ఆల్ రైట్" అని చెప్పి రూమ్ నుంచి బయటికి వచ్చాడు నిరీక్షణ్. మేరీ కూడా వచ్చింది బయటికి...

"అదేమిటి మేడమ్! గురువుగారెప్పుడూ నవ్వుతూ, హాయిగా ఉంటారు.... యోగా చేస్తారు. ఆయనకేమిటిలా? అసలు సన్నగా ఉండే ఆయనకి కొలెస్ట్రాల్ ఏమిటి? నాన్ వెజిటేరియన్ మానేసి ఇరవై ఏళ్లైందని చెప్పారామధ్య.." ప్రశ్నలు, అనుమానాలు వరుసగా సంధించాడు.

"జనరల్ చెకప్‌కి వెళ్తే ఇ.సి.జి... ఎకోల్లో తేడా ఉందని ఏంజియోగ్రామ్ చేయించారు. ఏంజియోలో తేడా ఉందని తెలిసి లక్కీగా సైమల్టేనియస్‌గా రెండు స్టంట్స్ వేసేశారు చాలా తేలిగ్గా...

ప్రతి సంఘటన వెనుక, ప్రతి అనుబంధం వెనుక నమ్మకం బలంగా వేళ్ళూనుకుని ఉంటుంది. నమ్మకమే లేకపోతే మనిషి బతుకు దుర్భరంగా మారుతుంది. ఇలాంటి నమ్మకానికి నాటికీ నేటికీ మతమే ఒక పెద్ద ఆసరాగా నిలిచింది. చాలామంది బహుశా ఇలాంటి విషయాలు చెబితే అర్థం చేసుకోలేకపోవచ్చు. వాళ్ళు అనుభవపూర్వకంగా తెలుసుకోవాల్సిందే. సరిగ్గా అతడి జీవితంలోనూ జరిగిందదే!

అంతా ఆ జీసస్ కృప" చెప్పింది మేరీ.

"అదేమిటి మేడమ్... అసలా జీసస్ కృపే గనుక నిజంగా ఉంటే మాస్టారిలాంటి మంచి వ్యక్తికి ఈ సమస్యే వచ్చి ఉండకూడదు గదా! నాకు తెలిసి గత పాతికేళ్లుగా క్రైస్ట్‌కి ట్రూ ఫాలోయర్‌గా ఉన్నారు మాస్టారు. అటువంటి వ్యక్తికి ఆ జీసస్ చెయ్యాల్సింది ఇదేనా?" సూటిగా అడిగాడు.

"దేవుడెప్పుడూ నువ్వు కోరుకున్నది ఇవ్వడు. నీకు ఏదైతే అవసరముందో అది మాత్రమే ఇస్తాడన్నది మా బైబిల్ చెప్పిన సత్యం. ఇలా ఇంకెప్పుడూ దేవుణ్ణి తక్కువ చేసి మాట్లాడకు బాబూ" కొంచెం కఠినంగా పలికింది మేరీ స్వరం.

"ఇంక వెళ్ళుబాబూ" అని చెప్పినట్లనిపించింది నిరీక్షణ్‌కి. ఏమీ చెప్పలేక, అనలేక 'షిట్' అనుకుంటూ వెనుదిరిగాడు.

"ఎక్కడ చూసినా, ఏ మతం వాళ్ళైనా... వాళ్లకి ఎంత నష్టం జరిగినా, కష్టం వచ్చినా, అందులోనే - 'భగవంతుని దయ'ని వెతుక్కుని తృప్తిపడిపోతున్నారు. ఛ... ఈ మనుషులు ఎప్పటికి మారతారో.." విసుక్కుంటూ నడుస్తున్నాడు నిరీక్షణ్.

"అసలెవరీ దేవుడు? ఈ మానవులు సృష్టించిన వాడేగా! అలాంటివాడు ఇంతమంది జీవితాలని అంతలా ఎలా ప్రభావితం చెయ్యగలుగుతున్నాడు? మనమెంత రేషనల్‌గా చెబుదామని ప్రయత్నించినా వినటం లేదే ఈ జనాలు? ఎలా బాగుచెయ్యాలీ సమాజాన్ని" ఆలోచిస్తూ ఇంటి ముఖం పట్టాడు.

"ఏంటి భాయ్.... నడుస్తున్నావ్? బండేది? " బైక్ తెచ్చి పక్కన ఆపాడు ఆలీభాయ్, తన బాల్యం నుంచి మంచి స్నేహితుడు. 'నడిచే వచ్చాను భాయ్... పద' అంటూ బండెక్కి కూర్చున్నాడు నిరీక్షణ్.

వాళ్లలా కబుర్లు చెప్పుకుంటూ నిరీక్షణ్ ఇంటి మలుపు తిరిగారో లేదో, ఓ ఆటోవాలా కంట్రోల్ తప్పి వీళ్లబండిని ముద్దాడాడు. గబుక్కున పక్కకి దూకేశాడు నిరీక్షణ్. కానీ పాపం ఆలీభాయ్‌కి మాత్రం రోడ్డు దెబ్బలు తగిలి మోకాళ్ళు, మోచేతులు చెక్కుకుపోయాయి.

అంతా హడావిడిగా వచ్చి ఫస్ట్ ఎయిడ్ చేశారు. 'ఎలా ఉంది ఆలీభాయ్? బాధతో అడుగుతున్న నిరీక్షణ్‌తో "అంతా అల్లాదయ! పెద్ద దెబ్బలేమీ తగల్లేదులే. ముఖ్యంగా నీకేమీ కాలేదు. ఆ దెబ్బలేవో చిన్నవైనా నాకే తగిలాయ్. అల్లాహో అక్బర్" అంటూ రెండు చేతులూ పైకెత్తి ఆకాశంలోకి చూస్తున్న ఆలీభాయ్‌లో మూర్తీభవించిన మానవత్వం గోచరించింది నిరీక్షణ్‌కి.

మోకాళ్ళు, మోచేతులు కొట్టుకుపోయి రక్తం కారుతూ ఎంతో బాధలో ఉన్నాగానీ, స్నేహితునికి దెబ్బలు తగలనందుకు అల్లాకి కృతజ్ఞతలు చెబుతున్న ఆలీభాయ్‌ని చూస్తే కళ్ళు చెమర్చాయి నిరీక్షణ్‌కి.

ఇంతలో నిరీక్షణ్ తల్లి వసుంధర అక్కడికి పరుగున వచ్చి, "నాయనా ఆలీ.... ఇంటికి రా బాబూ.... కాస్త ఏదన్నా తిందువుగాని" అంటూ పిలిచి "ఏరా నాన్నా! ఎంతదృష్టంరా ఇవ్వాళ. లేచిన వేళ ఎంత బావుంది? గండం గడిచింది... ఎంత ప్రమాదం తప్పింది.." అనుకుంటూ ఇద్దర్నీ లోపలికి తీసుకెళ్లి ఉప్పు తిప్పేసింది.

"మీ పూజలే మన నిరీక్షణ్‌కి శ్రీరామరక్ష ఆంటీ. మా అమ్మానాన్నల నమాజే నన్ను కాపాడింది" వసుంధర ఇచ్చిన వేడివేడి కాఫీ తాగుతూ అంటున్నాడు ఆలీభాయ్.

ప్రతీదానికి ఏదో అయిపోయిందని బాధపడి కుంగిపోయేకంటే, జరిగిన దాన్ని చిన్నదిగా ఊహించుకుని, పెద్ద ప్రమాదం తప్పిందనుకోవడంలో ఎంత సంతృప్తి ఉంటుందో నిరీక్షణ్‌కి అనుభవపూర్వకంగా తెలిసిందప్పుడు.

అలాంటప్పుడు ఆసరాగా నిలిచేది అల్లా అయినా, జీసస్ అయినా, వెంకటేశ్వరుడైనా... పైన ఎవరో మనకి అండగా ఉన్నారన్న నమ్మకమే మనుష్యులని నిలబెడుతోంది.

జీవితం మీద ఆశ పెంచుతుంది.

సెల్: 94915 04966

నాగపాశాలను తుత్తునియలు చేసిన గరుత్మంతుడు

ఇంద్రజిత్తు ప్రయోగించిన నాగాస్త్రానికి రామలక్ష్మణులు స్పృహ కోల్పోయారు. నేల మీద కూలిపోయారు. కాసేపటికి రాముడు తేరుకున్నాడు. కళ్ళు విప్పి చూశాడు. తమ్ముడు లక్ష్మణుడు తీవ్రంగా గాయపడి, స్పృహ కోల్పోయి ఉండడాన్ని గమనించాడు. భోరుమన్నాడు. లక్ష్మణుడులేని రాముడు లేడన్నాడు. తమ్ముడితోనే తానూ పరలోకాలకు తరలిపోతానన్నాడు. అందుకున్న సాయాలకు పేరుపేరునా అందరికీ కృతజ్ఞతలు తెలియజేశాడు. చేసిన శపథాలు తీర్చలేనందుకు క్షమించమన్నాడు. స్పృహ కోల్పోయాడు. రాముడు మళ్ళీ అచేతనంగా పడి ఉండడాన్ని తట్టుకోలేకపోయారు వానరులు. ఒక్కపెట్టుగా రోదించసాగారు.

ఏడుస్తున్న వానరులను ఓదార్చాలి. వారిని మళ్ళీ యుద్ధానికి సన్నద్ధుల్ని చెయ్యాలి. లేకపోతే ప్రమాదం అనుకున్నాడు విభీషణుడు. ముందు తనకి దగ్గరగా ఉన్న వానరవీరులను ఓదార్చాడతను. వారికి ధైర్యం చెప్పాడు. ఎక్కడ ఉన్నవారు అక్కడే ఉండండి అన్నాడు. స్థైర్యాన్ని కలిగించాడు. తర్వాత దూరంగా రామలక్ష్మణులకు దగ్గరగా ఉన్న వానరవీరులను చూశాడు. వారితో సంభాషించేందుకు ముందుకు రాసాగాడు. వస్తున్నది విభీషణుడైనా అతనిని ఇంద్రజిత్తుగా తలచారు కొందరు. భయపడి పరుగులుపెట్టారు. పరుగుదీస్తున్న వానరుల్ని చూశాడు సుగ్రీవుడు. వారెందుకు పరుగుదీస్తున్నదీ తెలుసుకున్నాడు. వస్తున్నది విభీషణుడనీ, ఇంద్రజిత్తుకాడనీ జాంబవంతుని గట్టిగా అరవమని ఆజ్ఞాపించాడతను. అలాగే ఆ సంగతి చాటింపు వేయమన్నాడు. వేశాడు జాంబవంతుడు. దాంతో పరుగందుకున్న వానరవీరులు వెనక్కివచ్చి యథాస్థానాల్లో నిలిచారు.

రామలక్ష్మణులను సమీపించాడు విభీషణుడు. నాగపాశాల్లో చిక్కుకుని, కదలలేకపోతున్న వారిని చూసి, కన్నీళ్ళు పెట్టుకున్నాడు. సుగ్రీవునితో అన్నాడిలా.

"మాయాయుద్ధం చేసి ఈ మహావీరుల్ని నేలకూల్చాడు ఇంద్రజిత్తు. లేకపోతే రామలక్ష్మణులను గెలవడం ఎవరి తరం చెప్పు?"

అవునన్నట్టుగా దీనంగా చూశాడు సుగ్రీవుడు.

"విధి ముందు ఎంతటివారైనా తల వంచాల్సిందే! అనేక ఆశలతో ఈ మహావీరులను ఆశ్రయించాను. శరణుకోరాను. అభయం అందుకుని, నాకేమిటి అనుకున్నాను. కాబోయే లంకాధినేతనని పొంగిపోయాను. అంతలోనే ఇలా కుంగిపోవాల్సి వస్తుందని ఊహించలేదు. మృత్యుముఖంలో ఉన్న రామలక్ష్మణులను చూస్తోంటే...నాకు బతకాలనిపించడం లేదు." అన్నాడు విభీషణుడు. సుగ్రీవుని భుజంపై తలాన్చి, దుఃఖించసాగాడు.

"ఊరుకో! ఊరుకో" విభీషణుణ్ణి దగ్గరగా తీసుకున్నాడు సుగ్రీవుడు. ఓదార్పుగా అతని వీపును నిమరసాగాడు.

"న్యాయానికీ పుణ్యానికీ ఇవి రోజులు కావు మిత్రమా! అన్యాయానికీ పాపానికే రోజులన్నీ. పాపాత్ముడు రావణుడే గెలిచాడు. వాడి రెండు కోర్కెలూ నెరవేరాయి. సీత వాడి సొంతం అయింది. రామలక్ష్మణులు కడతేరిపోతున్నారు." అన్నాడు విభీషణుడు.

"జరగదు మిత్రమా! రావణుడు గెలవడుగాక గెలవడు. అలాగే రామలక్ష్మణులు కడతేరిపోయే అవకాశమేలేదు. నేను చెబుతున్నాను చూడు, నువ్వే లంకకు రాజువవుతావు" అన్నాడు సుగ్రీవుడు.

సన్నగా విషాదంగా నవ్వాడు విభీషణుడు.

"నిజం మిత్రమా! నేను చెబుతున్నది అక్షర సత్యం. మన అదృష్టం కొద్దీ రామలక్ష్మణులు స్పృహ కోల్పోయారంతే! చనిపోలేదు. తేరుకోవాలి. తేరుకొంటే... వీరి ముందు ఆ రావణుడెంత?" అన్నాడు సుగ్రీవుడు. దీర్ఘంగా ఆలోచించాడు. దూరంగా ఉన్న సుషేణుణ్ణి రారమ్మన్నాడు. వచ్చాడతను. అతనితో అన్నాడిలా.

"రామలక్ష్మణులు తేరుకోగానే నువ్వు వారిని తీసుకుని కిష్కింధకు వెళ్ళిపో! వారిని అక్కడ ఆరోగ్యవంతుల్ని చెయ్యి. నేనిక్కడ రావణుణ్ణి హతమార్చి, సీతాసాధ్విని విడిపించుకుని వస్తాను."

"ఆజ్ఞ" అన్నాడు సుషేణుడు. తర్వాత అతను వైద్యుడు కావడంతో సుగ్రీవునితో అన్నాడిలా.

"మహారాజా! పూర్వం అమృతం కోసం దేవదానవులు చేసిన యుద్ధంలో దేవతలు చాలామంది గాయపడ్డారు. కొందరు మరణించారు. అప్పుడు దేవగురువు బృహస్పతి విశల్యకరణి, సంజీవకరణి మూలికలతో వారిని రక్షించాడు. ఆ మూలికలు పాలసముద్రం సమీపంలో ద్రోణ, చంద్ర పర్వతాలపై లభిస్తాయి. వాటిని తేగలిగితే రామలక్ష్మణులను నేను స్వస్థుల్ని చేయగలను."

సుషేణుని మాటలకు ఆనందంగా విభీషణ-సుగ్రీవులు ఒకరిని ఒకరు చూసుకున్నారు.

"దయచేసి ఆ మూలికల్ని తెప్పించండి. అందుకు హనుమ ఒక్కడే సమర్థుడు." అన్నాడు సుషేణుడు.

"తప్పకుండా" అని హనుమను కేకేయబోయాడు సుగ్రీవుడు. అంతలో చెవులు చిల్లులుపడే విధంగా మహాధ్వని వినవచ్చింది. ఏమిటది? ఎక్కణ్ణుంచి ఆ ధ్వని అని సుగ్రీవాదులు అటూ ఇటూ చూడసాగారు.

మబ్బులు చెదరిపోతున్నాయి. వేళ్ళుసహా వృక్షాలు కూలిపోతున్నాయి. ఉన్నట్టుండి సముద్రం అల్లకల్లోలమైంది. కెరటాలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రచండంగా వీస్తున్నది గాలి. ఆ గాలిలో ఎగిరిపోకుండా ఒకరిని ఒకరు పట్టుకుని నిలదొక్కుకున్నారంతా. చూస్తూండగానే అక్కడికి విచ్చేశాడు గరుత్మంతుడు. మహావేగంతో ఆకాశంలోంచి కిందికి దిగాడు. నోటినిండా జ్వాలలతో అగ్నిహోత్రుని మరపిస్తూ కనిపించాడు. ఎప్పుడైతే గరుత్మంతుడు వచ్చి సమీపంగా నిలిచాడో అప్పుడు రామలక్ష్మణులను బంధించిన క్రూర సర్పాలన్నీ పరుగులంకించుకున్నాయి. ప్రాణభీతితో సముద్రంలోకి పలాయనం చిత్తగించాయి. రామలక్ష్మణులు తేరుకున్నారప్పుడు. స్పృహలోకి వచ్చారు. తేరుకున్న రామలక్ష్మణులను తన ముక్కుతో ఆప్యాయంగా నిమిరాడు గరుత్మంతుడు. దాంతో వారి గాయాలు మానిపోయాయి. పైగా శారీరక మానసిక శక్తులు పుంజుకున్నాయి. ఇద్దరినీ గట్టిగా కౌగలించుకున్నాడు గరుత్మంతుడు.

రామలక్ష్మణులు నాగపాశబంధాల నుండి విముక్తిచెందారన్న వార్త రావణుణ్ణి దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇక ముమ్మాటికీ చేటుకాలం దాపురించినట్టే అనుకున్నాడు. అది గుణపాఠంగా ధూమ్రాక్షుణ్ణి యుద్ధానికి పంపాడు. అతడు చిచ్చరపిడుగై లక్షలాదిమంది వానరుల్ని మట్టికరిపించాడు. అతన్ని ఎదిరించడం సాధ్యంకాదనుకుంటున్న వేళ ధూమ్రాక్ష సంహారానికి ఎవరు ముందుకు వచ్చారు? రామదండు అతన్ని అంతం చేయగలిగిందా?

తానూ, తమ్ముడు లక్ష్మణుడూ ఆరోగ్యాన్ని సంత రించుకోవడంతో ఆనందించాడు రాముడు. అందుకు కారణంగా నిలిచిన గరుత్మంతునితో అన్నాడిలా.

“మహాత్మా! నీ కరుణాకటాక్షంతో నాగపాశబంధ విముక్తులమైనాం. ఆరోగ్యాన్ని సాధించాం. నిన్ను చూస్తోంటే... మా తాతలూ, తండ్రులూ గుర్తుకు వస్తున్నారు. ఆనందంగా ఉంది. ఎవరయ్యా నువ్వు? ఎందుకు మమ్మల్ని కాపాడవచ్చావు?”

సమాధానం ఏం చెప్పాలో తెలియలేదు గరు త్మంతునికి. సన్నగా నవ్వుతూ నిలిచాడు.

“మహాతేజస్సుతో ఉన్నావు. దివ్యాలంకారాలతో మెరిసిపోతున్నావు. ఎవరు నువ్వు?” మళ్ళీ అడి గాడు రాముడు.

“మహానుభావా! నా పేరు గరుత్మంతుడు. నీకు ప్రాణంలాంటివాణ్ణి. నీ ప్రియసఖుణ్ణి. కద్రువసం తానం క్రూరసర్పాలను ప్రయోగించి నిన్నూ, నీ తమ్ముడు లక్ష్మణుణ్ణీ మాయాయుద్ధంలో ఇంద్ర జిత్తు బంధిస్తే, నా బాధ్యతగా విడిపించడానికి వచ్చాను. నిష్కపటం నీకు బలమైనట్టుగానే రాక్ష సులకు మాయ మహాశక్తి. దానిని గుర్తెరిగి ఇక ముందు ప్రవర్తించు.” చెప్పాడు గరుత్మంతుడు.

“అలాగే” అన్నాడు రాముడు.

“రామా! లంకలో బాల వృద్ధ స్త్రీలు మినహా రావ ణునిసహా అందరినీ నువ్వు అంతం చేస్తావు. సీతా సాధ్విని స్వీకరిస్తావు. అంతా శుభమే జరుగు తుంది” అన్నాడు గరుత్మంతుడు. విభీషణ సుగ్రీవాదులు సహా రాముడు ఆ మాటలకు ఎంతగానో ఆనందించాడు.

“ఇక నాకు సెలవు” అన్నాడు గరుత్మంతుడు. మరో సారి రామలక్ష్మణులను గట్టిగా కౌగలించుకుని విడి చాడు. తర్వాత వారి చుట్టూ ప్రదక్షిణ చేసి వెళ్ళి పోయాడక్కణ్ణుంచి.

(రాముడు, నారాయణుడు అన్నది దేవరహస్యం. రావణుని సంహరించేంత వరకూ అది రామునికి తెలియకూడదు. ఆ కారణంగానే గరుత్మంతుడు తాను, ఆయన వాహనాన్ని అని చెప్పలేదిక్కడ.)

తేరుకున్న రామలక్ష్మణులు రెట్టించిన ఉత్సా హంతో యుద్ధానికి సిద్ధమయ్యారు. వారిని చూసి వాన రులు ఆనందంతో పులకరించిపోయారు. తోకలు జాడించి, సింహనాదాలు చేశారు. శంఖాలు పూరించారు. నగారాలు మోగించారు. అడ్డుకున్న ద్వారరక్షకుల్ని ఎది రించారు. వానరుల పెడబొబ్బలు అర్ధరాత్రి వినరావ డంతో లంకలోని రాక్షసులందరూ కలవరం చెందారు.

మందిరంలో మంత్రులతో సమాలోచనలు సాగిస్తున్నాడప్పుడు రావణుడు. అతనికి కూడా వానరుల అరుపులు వినవచ్చాయి. ఏదో జరగరానిది జరిగిందని తలచాడతను. చారులను పంపించి, విషయం తెలుసుకుని రమ్మన్నాడు. ఇట్టే వెళ్ళి అట్టే వచ్చారు చారులు. రామలక్ష్మణులు నాగపాశ విముక్తులయ్యారనీ, యుద్ధానికి సిద్ధమయ్యారనీ చెప్పారు. ఆశ్చర్యపోయాడు రావణుడు. విషాదంగా తల వాల్చాడు.

“వాసుకీ, తక్షకులవంటి ఘోరవిషంతో పెనవేసిన నాగపాశాలు వ్యర్థమైనాయంటే... ముమ్మాటికీ మనకి చేటుకాలం దాపురించినట్టే.” అన్నాడు. నిస్త్రా ణంగా కూలబడ్డాడు.

మొదటిరోజు ద్వారాలన్నిటా శత్రువుల్ని ఎదుర్కొని సైన్యాన్ని బాగా నష్టపోయాడు రావణుడు. అది గుణ పాఠంగా రెండవరోజు మళ్ళీ అన్ని ద్వారాల గుండా యుద్ధం చెయ్యడం శ్రేయస్కరం కాదను కున్నాడతను. దాంతో ఒకొక్క ద్వారం గుండా, ఒక్కో వీరుని ఆధిపత్యంలో యుద్ధం చేయడం మంచి దని తలచాడు. సైన్యాధ్యక్షుడు ధూమ్రాక్షుణ్ణి ముందుగా ఆహ్వానించాడు. కోరిన సైన్యాన్ని ఇచ్చి అతన్ని పడ మటి ద్వారం గుండా యుద్ధం చెయ్యమని ఆజ్ఞా పించాడు.

సైన్యాధ్యక్షులందరిలోనూ తననే ముందుగా ఎంపిక చేసినందుకు ఎంతగానో సంతోషించాడు ధూమ్రాక్షుడు. ఏనుగుల్నీ, రథికుల్నీ ముందు నడి పించి, తర్వాత ఖడ్గాలూ, శులాలూ, గుదియలూ ధరించిన పదాతిదళంతో యుద్ధానికి బయల్దేరాడతను. ప్రయాణవేళ అపశకునాలు ఎదురయ్యాయి. అతని రథం చుట్టూ కాకులు వలయంగా తిరి గాయి. రథపతాకం మీద గెద్ద వాలింది. ముక్కుతో పతా కాన్ని చీల్చి, చించి పెట్టింది. అయినా లెక్క చెయ్య లేదు ధూమ్రాక్షుడు. వెళ్ళి రామదండుని ఢీకొన్నాడు. చెట్లూ, గుండ్రాళ్ళూ, పిడికిళ్ళతో వానరులు పైబ డితే, వారిని ఖడ్గాలూ, శూలలతో ధూమ్రాక్షుని సైన్యం ఎదిరించింది. భీకరయుద్ధం జరిగింది. ఉభయ పక్షాల్లోనూ చాలా మంది మరణించారు.

ధూమ్రాక్షుడు చిచ్చరపిడుగయ్యాడు. శత్రు సైన్యంలోకి చొచ్చుకుపోయి, లక్షలాది వానరుల్ని కూల్చాడు. ఎదిరించడం ఎవరి తరమూ కాదను కుంటున్న వేళ హనుమ అతనితో యుద్ధానికి సిద్ధ మయ్యాడు. గట్టి గుండును గురి చూసి, బలంగా ధూమ్రాక్షుని రథంపైకి విసిరాడు. వస్తోన్న గుండుని అడ్డుకోవడం కష్టమని భావించాడు ధూమ్రాక్షుడు. గద పట్టుకుని నేలకి దూకాడు. అలా దూకినందుకు అతను మినహా, రథం, రథ సారథి, దానికి పూన్చిన కంచెరగాడిదలన్నీ గుండు దెబ్బకు నేలమట్టమయ్యాయి. ఆగ్రహించాడు ధూమ్రాక్షుడు. గదను గురిచూసి హనుమ వక్షం పైకి విసిరాడు. వజ్రాయుధంలా వచ్చి పడింది గద. గాయం అయింది. అయినా తట్టుకున్నాడు హనుమ. గుండెలు మండిపోతున్నా పట్టించుకోక, మరో గుండును అందుకున్నాడు హనుమ. దానిని ధూమ్రాక్షుని మీదకు విసిరాడు. దాని దెబ్బకు పిడుగుపాటుకి కూలిన కొండశిఖరంలా నేలపా లయ్యాడు ధూమ్రాక్షుడు. నెత్తుటిముద్దగా మిగి లాడు. చూశారది వానరులు. ఆనందించారు. హను మను జయజయధ్వానాలతో శ్లాఘించారు. రెట్టిం చిన ఉత్సాహంతో రాక్షసులమీదికి ఉరికారు. నాయకుని మరణం రాక్షసుల్ని యుద్ధరంగంలో నిలువనీయలేదు. వారు పరిగెత్తి పారిపోయారు. రావణుని సమీపించారు. జరిగిందంతా చెప్పి, క్షమించమన్నట్టుగా చేతులు జోడించి, నమస్క రించారతనికి.

-అరణి

సౌభాగ్య చక్రం

జూలై 6 నుంచి
జూలై 12 వరకు

శ్రీ బిజుమళ్ళ బిందుమాధవశర్మ

మేషం (మార్చి 21 - ఏప్రిల్ 20 మధ్య పుట్టినవారు)

వేడుకలు, గృహోపకరణాలు సేకరణ, ఉన్నత విద్య, ప్రేమానుబంధాలపై ఈ వారం దృష్టి పెడతారు. బుధ, గురువారాల్లో విద్యా సంస్థల్లో ప్రవేశం లభిస్తుంది. ప్రియతములతో ఉల్లాసంగా గడుపుతారు. వేడుకలకు ఏర్పాట్లు చేస్తారు. 8,9,10 తేదీల్లో రాతకోతలు, చర్చల్లో ఇబ్బందులు ఎదురవుతాయి. బదిలీలు, మార్పులు చేర్పులకు అనుకూలం. కుటుంబ సభ్యుల ఆరోగ్యం మెరుగుపడుతుంది. 11,12 తేదీల్లో వివాహాది శుభకార్యాల్లో పాల్గొంటారు. భాగస్వామి వైఖరి ఆవేదన కలిగిస్తుంది. వాగ్వాదాలకు దూరంగా ఉండాలి.

వృషభం (ఏప్రిల్ 21 - మే 21 మధ్య పుట్టినవారు)

వృత్తిపరమైన సమావేశాలు, కుటుంబ వ్యవహారాలు, బదిలీలు, వేడుకలపై ఈ వారం దృష్టి పెడతారు. బుధ, గురువారాల్లో స్థిర చరాస్తులకు సంబంధించిన చర్చలు ఫలిస్తాయి. ఇంటి కోసం అవసరమైన వస్తువులు సమకూర్చుకుంటారు. సోదరీసోదరుల వైఖరిలో మార్పు గమనిస్తారు. 8,9,10 తేదీల్లో విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. ఒక శుభవార్త అందుకుంటారు. ప్రేమానుబంధాలు బలపడతాయి. 11,12 తేదీల్లో వృత్తి, వ్యాపారాలకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు. చర్చలు, సమావేశాల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

మిథునం (మే 22 - జూన్ 21 మధ్య పుట్టినవారు)

ఇంక్రిమెంట్లు, పెట్టుబడులు, విద్యా విషయాలు, ప్రేమానుబంధాలపై ఈ వారం దృష్టి సారిస్తారు. బుధ, గురువారాల్లో చెక్కులు అందుకుంటారు. బిల్లులు, ఫీజులు చెల్లిస్తారు. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం లభిస్తుంది. 8,9,10 తేదీల్లో ఆర్థిక విషయాల్లో కుటుంబ సభ్యుల వైఖరి ఆవేదన కలిగిస్తుంది. ఇంటి అవసరాల కోసం నిధులు సర్దుబాటవుతాయి. ఫర్నీచర్, గృహాలంకరణ వస్తువుల కొనుగోలుకు అనుకూలం. రుణాలు మంజూరవుతాయి. 11,12 తేదీల్లో పొదుపు పథకాలు లాభిస్తాయి. ప్రియతముల కోసం ఖర్చులు అధికం. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

కర్కాటకం (జూన్ 22 - జులై 22 మధ్య పుట్టినవారు)

బదిలీలు, మార్పులు, వృత్తి, వ్యాపారాలు, పెట్టుబడులకు ఈ వారం ప్రాధాన్యమిస్తారు. బుధ, గురువారాల్లో పెట్టుబడులు, అదనపు ఆదాయంపై దృష్టి సారిస్తారు. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. 8,9,10 తేదీల్లో సోదరీసోదరుల వైఖరి ఆవేదన కలిగిస్తుంది. ఏజెన్సీలు, బోధన, రవాణా రంగాల వారికి శుభప్రదం. విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. ఒక సమాచారం ఉల్లాసం కలిగిస్తుంది. 11,12 తేదీల్లో బదిలీలు, మార్పులు చేర్పులు అసౌకర్యం కలిగిస్తాయి. రియల్ ఎస్టేట్, రిటైల్ రంగాల వారికి నిరుత్సాహకరంగా ఉంటుంది.

సింహం (జులై 23 - ఆగస్టు 23 మధ్య పుట్టినవారు)

విద్య, ప్రయాణాలు, గృహారంభ, ప్రవేశాలు, ఉన్నతవిద్య, విదేశీ వ్యవహారాలపై ఈ వారం దృష్టి పెడతారు. బుధ, గురువారాల్లో రాజకీయ, సినీరంగాలవారు కొత్త పనులకు శ్రీకారం చుడతారు. పైచదువులకోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. 8,9,10 తేదీల్లో ఆర్థిక విషయాలు అశాంతి కలిగిస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులు లాభిస్తాయి. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అవసరమైన నిధులు సమకూరతాయి. 11,12 తేదీల్లో కాంట్రాక్టులు, అగ్రిమెంట్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. విద్యార్థులు పట్టుదలతో కృషి చేసి సత్ఫలితాలు సాధిస్తారు.

కన్య (ఆగస్టు 24 - సెప్టెంబర్ 22 మధ్య పుట్టినవారు)

పెట్టుబడులు, వేడుకలు, విద్యా విషయాలు, బదిలీలు, సమావేశాలపై ఈ వారం దృష్టి పెడతారు. బుధ, గురువారాల్లో సినీ, రాజకీయ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. కొత్త పరిచయాలు లాభిస్తాయి. విశ్వవిద్యాలయాల్లో చేరేందుకు నిధులు సర్దుబాటవుతాయి. 8,9,10 తేదీల్లో సమావేశాల్లో మాటపడాల్సి రావచ్చు. పెట్టుబడులకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంటారు. వేడుకల్లో ఉల్లాసంగా పాల్గొంటారు. 11,12 తేదీల్లో ఆర్థిక వ్యవహారాల్లో ఆచితూచి వ్యవహరించాలి. తొందరపాటు నిర్ణయాలవల్ల నష్టపోతారు. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు.

తుల (సెప్టెంబర్ 23 - అక్టోబర్ 23 మధ్య పుట్టినవారు)

కీలక నిర్ణయాలు, ఇంక్రిమెంట్లు, వృత్తిపరమైన సమావేశాలు, వేడుకలకు ఈ వారం అనుకూలం. బుధ, గురువారాల్లో సమావేశాల్లో ప్రముఖులను కలుసుకుంటారు. ఆర్థికవిషయాల్లో పెద్దల సహకారం అందు కుంటారు. 8,9,10 తేదీల్లో వృత్తి, వ్యాపారాల్లో ఒత్తిడికి గురవుతారు. రాజకీయ, సినీరంగాల వారు ఉన్నత పదవులు అందుకుంటారు. పెద్దల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. 11,12 తేదీల్లో వృత్తి, వ్యాపారాల్లో అంచనాలు తప్పే అవకాశం ఉంది. పెద్దలవైఖరి మనస్తాపం కలిగిస్తుంది. కొత్త ప్రాజెక్టుల గురించి ఆలోచిస్తారు.

వృశ్చికం (అక్టోబర్ 24 - నవంబర్ 22 మధ్య పుట్టినవారు)

ఉన్నత విద్య, దూరప్రయాణాలు, వృత్తి, వ్యాపారాలు, బృందకార్యక్రమాలకు ఈ వారం ప్రోత్సాహకరం. బుధ, గురువారాల్లో వృత్తి, వ్యాపారాల్లో పట్టుదలతో వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. ప్రముఖులను కలుసుకుంటారు. సంకల్పం నెరవేరుతుంది. 8,9,10 తేదీల్లో ఆర్థిక విషయాల్లో అంచనాలు తప్పే అవకాశం ఉంది. అయినా పట్టుదలతో వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సమావేశాలు ఫలిస్తాయి. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. 11,12 తేదీల్లో సమావేశాల్లో మాటపడాల్సి వస్తుంది. రాజకీయ, సినీరంగాలవారు అధికశ్రమతో లక్ష్యాలు సాధిస్తారు.

ధనుస్సు (నవంబర్ 23 - డిసెంబర్ 21 మధ్య పుట్టినవారు)

ఆర్థిక సంస్థలతో పనులు, ఆర్థిక వ్యూహాలు, బృందకార్యక్రమాలకు ఈ వారం ప్రాధాన్యం ఇస్తారు. బుధ, గురువారాల్లో ఆర్థికపరమైన సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. రుణప్రయత్నాలు ఫలిస్తాయి. 8,9,10 తేదీల్లో ఇంట్లో పెద్దల ఆరోగ్యం ఆందోళన కలిగిస్తుంది. పెద్దల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. ఆరోగ్యం మెరుగవుతుంది. 11,12 తేదీల్లో పెట్టుబడుల విషయంలో ఆచితూచి వ్యవహరించాలి. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం లభిస్తుంది. షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది.

మకరం (డిసెంబర్ 22 - జనవరి 20 మధ్య పుట్టినవారు)

వేడుకలు, శుభకార్యాలు, సినీ, రాజకీయ విషయాలు, ఆరోగ్య అంశాలకు ఈ వారం అనుకూలం. బుధ, గురువారాల్లో స్పెక్యులేషన్లు, పెట్టుబడులు లాభిస్తాయి. ప్రియతములకోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. 8,9,10 తేదీల్లో శ్రీవారు, శ్రీమతి విషయాల్లో చిక్కులు ఎదురవుతాయి. బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. ప్రదర్శనల్లో పాల్గొంటారు. సమావేశాలు లాభిస్తాయి. 11,12 తేదీల్లో వేడుకల్లో పెద్దల నుంచి మాటపడాల్సి వస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో సన్నిహితుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు.

కుంభం (జనవరి 21 - ఫిబ్రవరి 18 మధ్య పుట్టినవారు)

వృత్తి, వ్యాపారాలు, ఆరోగ్యం, స్పెక్యులేషన్లు, వేడుకలు, ప్రేమానుబంధాలపై ఈ వారం దృష్టి పెడతారు. బుధ, గురువారాల్లో భాగస్వామి సహకారంతో వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. కార్యాలయంలో కొత్త పరిచయాలు ఏర్పడతాయి. 8,9,10 తేదీల్లో ఆరోగ్యంపట్ల శ్రద్ధ చూపించాలి. మెడికల్ క్లెయిములు మంజూరవుతాయి. బీమా, పెన్షన్ వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. 11,12 తేదీల్లో వృత్తిపరమైన సమావేశాల్లో పాల్గొంటారు. లక్ష్యసాధనకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉంది. చర్చలు ఫలిస్తాయి.

మీనం (ఫిబ్రవరి 19 - మార్చి 20 మధ్య పుట్టినవారు)

వృత్తిపరమైన నిర్ణయాలు, ఆర్థిక విషయాలు, విద్య, ఆరోగ్య అంశాలపై ఈ వారం దృష్టి పెడతారు. బుధ, గురువారాల్లో సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశానికి అనుకూలం. 8,9,10 తేదీల్లో స్పెక్యులేషన్లు, పెట్టుబడుల్లో ఆచితూచి వ్యవహరించాలి. ప్రేమానుబంధాలు బలపడతాయి. భాగస్వామి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. 11,12 తేదీల్లో పొదుపు పథకాల విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. ప్రియతముల ఆరోగ్యంపట్ల శ్రద్ధ అవసరం. డిపాజిట్లపై మంచి ప్రతిఫలం అందుకుంటారు

నవ్య సినిమా

వాటిమీద మనసు పడ్డ హేమ

టాలీవుడ్‌లో ఆంటీ, అక్క, వదిన క్యారెక్టర్లకు హేమ పెట్టింది పేరు. చాలా సినిమాలకు హేమనే మంచి ఆప్షన్ కూడా! తన కెరీర్‌లో దాదాపు 400 సినిమాల్లో రకరకాల పాత్రలు పోషించిన హేమకు పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా, లేడీ డాన్‌గా చేయాలని కోరికగా ఉందట! వీటికి తన ఫిజిక్ కూడా అనువుగా ఉంటుందనీ, ఎవరైనా అవకాశం ఇస్తే సత్తా చూపిస్తానని చెబుతోంది హేమ. ఏ విషయాన్నైనా గట్టిగా, కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడగల సత్తా ఉన్న హేమ పై రెండు పాత్రలకు సరిగ్గా సరిపోతుంది అంటున్నారు టాలీవుడ్ జనాలు.

కోట్లు నష్టపోయిన షారూఖ్

బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్ అన్ని విషయాల్లో కరెక్టగా ఉంటాడు అంటారు. ముఖ్యంగా మనీ మేటర్స్‌లో చాలా చాలా జాగ్రత్తపరుడని అంటారు. అలాంటి షారూఖ్ ఏకంగా ఎనిమిది కోట్ల రూపాయలు నష్టపోయే పరిస్థితి వచ్చిందట! కొన్ని సంవత్సరాల క్రితం షారూఖ్ ఖాన్ ఓ కథ విన్నాడు ఆ కథంతా గ్రాఫిక్స్‌తో తీయాల్సి ఉంటుందట! ఆ కథ షారూఖ్‌కి బాగా నచ్చడంతో దాని నిర్మాణంలో పాలు పంచుకోవాలని అనుకున్నాడు. తన దగ్గరకు వచ్చిన సదరు వ్యక్తికి ఆ విషయం చెప్పి ఎనిమిది కోట్ల రూపాయలు అడ్వాన్స్‌గా ఇచ్చాడట! ఆ తరువాత కొన్ని రోజులకు గ్రాఫిక్ పనులు ఎలా జరుగుతున్నాయో తెలుసుకోవడానికి ఆ సినిమా నిర్మాణ కార్యాలయానికి వెడితే సదరు కార్యాలయం ఖాళీగా కనిపించింది. దాంతో ఏం జరిగిందో విచారిస్తే సినిమా తీద్దామనుకున్న నిర్మాతకి తన వ్యాపారంలో విపరీతమైన నష్టాలు రావడంతో ఆ ఆలోచన మానుకున్నాడు. ఆయన తన పనుల్లో పడి సినిమా ఆగిపోయిన విషయం షారూఖ్‌కి చెప్పలేదట! షారూఖ్ నిలదీసేసరికి ఆయన డబ్బులు తిరిగి ఇచ్చేందుకు గడువు అడిగాడు. ఈ కథంతా జరిగి కొన్నినెలలైనా మళ్ళీ ఆ వ్యక్తి కనపడకపోవడంతో తాను అన్ని కోట్లు నష్టపోవలసి వచ్చేట్టు ఉందని బాద్‌షా తెగ బాధపడుతున్నాడట!

అల్జీమర్స్ బాధితుడిగా ప్రకాష్‌రాజ్?

ప్రకాష్‌రాజ్... ఒకప్పుడు దక్షిణాదిన బిజీగా ఉండే నటుడు. ఆయన డేట్ల కోసం దర్శకనిర్మాతలు ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఇప్పుడు పరిస్థితి మారింది అడపాదడపా తప్ప సినిమాల్లో పెద్దగా కనిపించడంలేదు. అదీ తన సొంత బ్యానర్లో వచ్చే సినిమాల్లోనే ఎక్కువగా కనిపిస్తున్నాడు ప్రస్తుతం బాలీవుడ్‌లో 'తడ్కా'తో బిజీగా ఉన్న ప్రకాష్‌రాజ్ కళ్ళు ఓ కన్నడ సినిమా మీద పడ్డాయట! ఆ సినిమాను ద్విభాషా చిత్రంగా తీయాలన్నది ప్రకాష్‌రాజ్ ఆలోచన అంటున్నారు. అల్జీమర్స్ బాధితుడి చుట్టూ తిరిగే కథ ఇది. ఇందులో అల్జీమర్స్ బాధితుడిగా ప్రకాష్‌రాజ్ కనిపించనున్నాడట! తన స్వీయ దర్శకత్వంలోనే ఈ సినిమా తీయాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం!

కుక్కని భయపెట్టిన సినిమా

మనుషులను భయపెట్టే సినిమాలు చాలానే వచ్చాయి. కానీ జంతువులని భయపెట్టే సినిమాలే ఇంతవరకూ రాలేదు. ఇప్పుడు ఆ కొరత కూడా తీరిపోయింది. దెయ్యాలకు కుక్కలు, పిల్లులు వంటి జంతువులు భయపడవు అంటారు కానీ, దెయ్యం కథ ఆధారంగా తీసిన ఓ సినిమా ఓ కుక్కని బాగానే భయపెట్టింది. అసలు సంగతి ఏమిటంటే... 'కంజూరింగ్ 2' అనే హాలీవుడ్ సినిమా విడుదలయిన అన్ని చోట్లా మంచి కలెక్షన్లు రాబడుతోంది. దెయ్యం కథతో సాగే ఈ సినిమా పెద్దలను సైతం భయపెడుతోందట! ఈ సినిమాను ఓ వ్యక్తి తన ఇంట్లో వీడియోలో కూర్చుని చూడసాగాడు. అతనితో పాటు అతని పెంపుడు కుక్క కూడా సోఫాలో పక్కనే కూర్చుని చూస్తోంది! అయితే సినిమాలో దెయ్యం పాత్ర రాగానే ఆ కుక్క భయంతో సోఫా వెనుక నక్కడం ప్రారంభించింది. ఇది గమనించిన యజమాని కుక్క భయాన్ని వీడియో తీసి ట్వీట్ చేశాడు. ఈ వీడియో వ్యూయర్లను బాగా ఆకట్టుకుంటోందట! కుక్క సైతం భయపెట్టేంతగా ఆ సినిమాలో ఏం ఉంది? అన్న ఆసక్తి చాలామందిలో కలుగుతోందట!

పది లక్షల పిగ్

గతంలో 'ఈగ'తో రాజమౌళి సెన్సేషన్ సృష్టించగా ఇప్పుడు నటుడు, దర్శకుడు రవిబాబు పంది పిల్లతో సినిమా తీస్తున్న సంగతి తెలిసిందే! 'ఈగ' సినిమా ఎక్కువగా గ్రాఫిక్స్ మీద నడిస్తే రవిబాబు మాత్రం ఒరిజినల్ పందిపిల్లతోనే ఎక్కువ సీన్లు తీశాడట! ఈ పంది పిల్లను పదిలక్షలు పెట్టి ఆస్ట్రేలియా నుండి దిగుమతి చేసుకున్నారట! ఇంత ఖరీదైన పందిపిల్ల ఆహార అలవాట్లు కూడా ఖరీదుగానే ఉంటాయట. కేవలం శాకాహారం మాత్రమే తీసుకునే ఈ పిగ్ సినిమాకి ప్రధాన ఆకర్షణ అంటున్నారు. ఈగ, దోమలతో తీస్తే చూస్తారేమో కానీ, మరీ పందిపిల్లతో సినిమా ఏమిటి? అంటున్నవారూ లేకపోలేదు. సినిమా కథ ఏమిటి? అన్నది పెద్దగా బయటకు రాకపోవడంతో ఈ సినిమా ఎలా ఉండబోతోంది? అన్న ఆసక్తి అందరిలోనూ కలుగుతోంది. సినిమా మీద ఈ మాత్రం ఆసక్తి కలిగిందంటే సినిమా సక్సెస్ అయినట్టేనని యూనిట్ అంతా సంబరపడుతున్నారట!

నా దారి నాదే

-శ్రుతిహాసన్

స్పష్టిలోని అందాలన్నీ ఒక్క చోట చేరితే ఎంత అందంగా ఉంటుందో శ్రుతి హాసన్ అంత అందంగా ఉంటుంది. వెన్నెల తాగి పెరిగినట్లు.... తేనెలో స్నానం చేసినట్టు ఉండే ఆమె సోయగాల్ని చూస్తే పరవశించని హృదయం ఉండదు. తన అందాలను దాచుకునే గుణం శ్రుతికి అస్సలు లేదు. వీలు కుదిరినప్పుడల్లా అందాల ప్రదర్శన చేస్తూనే ఉంటుంది. అందగత్తెలకు పొగరు కాస్త ఎక్కువగానే ఉంటుంది అంటారు. అది శ్రుతిలో కొద్దిగా ఎక్కువగానే ఉంది. తనది పొగరు కాదనీ, ఆత్మాభిమానమని ఎవరేమనుకున్నా తన దారి తనదే అంటున్న శ్రుతిహాసన్‌తో...

'ప్రేమమ్' తరువాత తెలుగులో సినిమాలేవీ చేస్తున్నట్టు లేదు.

తెలుగులో ఓ సినిమా ఒప్పుకున్నాను. ఆ వివరాలు మాత్రం సీక్రెట్.

'ప్రేమమ్'లో డీగ్లామర్‌గా నటిస్తున్నారట కదా?

పాత్ర పరంగా అలాగే కనిపించాలి. ఇప్పటి వరకూ ఇలాంటి పాత్ర చేయలేదు. గ్లామర్ పాత్రలు చాలా చేశాను. ఈ పాత్ర చేస్తుంటే రిలీఫ్‌గా అనిపించింది. ఎప్పుడో తప్ప ఇలాంటి పాత్రలు రావు. సినిమా చాలా బాగా వస్తోంది. చూసిన తరువాత ఈ సంగతి మీకే తెలుస్తుంది.

పవన్‌కల్యాణ్ సినిమాకి నో చెప్పడానికి కారణం?

'శభాష్ నాయుడు' సినిమాకి ఫుల్ డేట్లు ఇవ్వడం జరిగింది అందుకే చేయలేనని చెప్పాను. ఆయన సినిమాకే కాదు. తెలుగులో రెండు మూడు ఆఫర్లు వచ్చినా డేట్లు అడ్జస్ట్ చేయలేనని చెప్పాను.

'శభాష్ నాయుడు' గురించి...

షూటింగ్ చాలా స్పీడ్‌గా జరుగుతోంది. నా మిగతా సినిమాల కన్నా కూడా దీని కోసం ఎక్కువగా కష్టపడుతున్నాను. మా ఫాదర్ పక్కన నటించడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదు కదా! నాలోని టాలెంట్ అంతా చూపిస్తున్నాను. ఇందులో ఓ పాట కోసం చాలా రోజులు డ్యాన్స్ ప్రాక్టీసు చేశాను కూడా! ఈ సినిమా విడుదలకోసం నాతో పాటు యూనిట్ మొత్తం ఆత్రుతగా ఎదురు చూస్తోంది.

నిర్మాతలను బాగా సతాయిస్తారన్నది ఎంత వరకూ నిజం?

నాతో పని చేసిన ఏ నిర్మాతా ఈ విషయాన్ని నేరుగా నాతో ప్రస్తావించలేదు. పుకార్లకి నేనెలా సమాధానం చెప్పగలను.

టైంకి రారన్నది నిజమేనా?

నా పాత్ర షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందో ముందు రోజే కనుక్కుని మరుసటి రోజు ఆ సమయానికి వస్తాను. ముందుగా వచ్చి నేను చేసేది ఏమీ ఉండదు కదా! షూటింగ్ తొమ్మిదింటికే మొదలైనా నాతో చేసే షూటింగ్ పన్నెండు గంటలకి ఉంటుంది. ముందువచ్చి ఆ మూడు గంటలూ నేను ఖాళీగా కూర్చోవలసిందే! దాని బదులు నా పనులు చూసుకొని టంచనుగా పన్నెండింటికి వచ్చి షూటింగ్ పూర్తిచేసుకొని వెళ్ళిపోతాను. నేను అలా టైముకి రావడమే కొందరికి ఇబ్బందిగా అనిపించి ఇలాంటి పుకార్లు పుట్టించి ఉంటారు.

కొన్ని సినిమాలు ఒప్పుకున్న తరువాత కూడా వదులుకోవడానికి కారణం?

ఓ సినిమా ఒప్పుకున్న తరువాత బయటకు వచ్చానంటే

నా కారణాలు నాకుంటాయి. వాటిని అందరికీ చెప్ప వలసిన అవసరం లేదు. ఆ సినిమా దర్శకనిర్మాత లకు వివరంగా చెప్పే బయటకు వచ్చాను.

మీ సినీ ప్రస్థానం గురించి....

చదువుకునే రోజుల్లోనే నటన అంటే ఇష్టం ఏర్ప డింది. అదే విషయం నాన్నకి చెబితే ఏది చేసినా నిజాయితీగా చెయ్యాలి, అప్పుడే సక్సెస్ సాధిస్తావు అంటూ సలహా ఇచ్చారు. నాన్న అప్పుడు ఇచ్చిన ఆ సలహానే నాకు తారకమంత్రం అయింది. అప్పటి నుంచి ఇప్పటి దాకా ఆయన మాటను పాటిస్తూనే వచ్చాను.

సినిమాల విషయంలో మీ ఫాదర్ సలహాలు తీసుకుంటారా?

నా సినిమాల విషయంలో ఆయన ఏమీ కల్పించుకోరు. నేను ఓ సినిమా పూర్తి చేసేంత వరకూ కూడా ఆయన దాని గురించి పట్టించు కోరు. సినిమా పూర్తిఅయిన తరువాత చూసి ఎలా చేశానో చెబుతారు. బాగా చేయనిచోట నేను చేసిన తప్పుల గురించి వివరిస్తారు. నటిగా నన్ను నేను తీర్చిదిద్దుకోవడానికి ఆయన సలహాలు నాకు బాగా పనికి వచ్చాయి. అసలు నాకు ఎంత రెమ్యునరేషన్ ఇస్తున్నారన్న విషయం కూడా ఆయనకు తెలియదు.

మీ మీద ఆరోపణలు చేసేవారికి మీరిచ్చే సమాధానం?

సద్విమర్శలు చేస్తే తప్పకుండా వాటి గురించి ఆలోచిస్తాను. నా తప్పులుంటే సరిదిద్దుకుంటాను. కొందరు పనికట్టుకుని విమర్శిస్తుంటారు. అలాంటి వారి గురించీ, వారి మాటల గురించి అస్సలు పట్టిం చుకోను. దాంతో నాకు తల పొగరనీ రకరకాల బిరు దులు ఇస్తుంటారు. నాది ఆత్మాభిమానం తప్ప అహంకారం కాదు. ఎవరేమనుకున్నా నా పద్ధతి నాదే! దాన్ని అస్సలు మార్చుకోను.

సంగీతం నేర్చుకున్నారు కదా? నేపథ్య గాయనిగా కాకుండా నటన వైపు రావడానికి కారణం?

గాయనిగా ఎప్పుడైనా కొనసాగవచ్చు. హీరో యిన్‌గా కొంత కాలమే కొనసాగగలం. ముందు సింగర్ అవుదామనే నిర్ణయించుకున్నా. ఆలోచన మార్చుకుని మళ్ళీ నటనవైపు దృష్టి పెట్టా. హీరోయిన్‌గా రిటైర్ అయిన తరువాత నేను చేసే పని పాడడమే! అయితే ఇప్పటికీ ఏమాత్రం తీరిక దొరికినా పాడు తూనే ఉంటాను. ఆరు సంవత్సరాల వయస్సు నుంచే సంగీతం నేర్చుకోవడం ప్రారంభించాను. ప్రస్తుతం ఓ రాక్‌బ్యాండ్‌ను ఏర్పాటు చేశాను.

మరిచిపోలేని జ్ఞాపకాలు...

తొలిసారి నాన్న సినిమాలో బాలనటిగా అతిథి పాత్రలో నటించాను. తెర మీద నన్ను నేను చూసు కున్నది అదే మొదటిసారి. అప్పుడు నాది చిన్న వయసే అయినా అప్పుడు అనుభవించిన ఆనందం ఇప్పటికీ బాగా జ్ఞాపకం. ఆ తరువాత 2009లో నా మొదటి హిందీ చిత్రంలో ద్విపాత్రాభినయం చేశాను. ఓ విధంగా ఇది సాహసమే! నా సాహసానికి మంచి గుర్తింపే లభించింది. విమర్శకులు సైతం అభినందించారు. ఈ రెండు సంఘటనలు ఎప్పుడూ గుర్తుకు వస్తూనే ఉంటాయి.

రహస్యంగా పెళ్ళి చేసుకున్నారన్న వార్తలు ఎంత వరకు నిజం?

సరదాగా చేసిన ట్వీట్ మీద ఆ వార్తలు పుట్టుకు వచ్చాయి. వాటికి వివరణ అప్పుడే ఇచ్చాను. రహ స్యంగా పెళ్ళి చేసుకోవాల్సిన అవసరం నాకు లేదు. నా పెళ్ళి విషయంలో నాకు పూర్తి స్వేచ్ఛ ఉంది. అలాం టప్పుడు రహస్యంగా ఎందుకు చేసుకుంటాను. అందరికీ చెప్పే చేసుకుంటాను.

ఖాళీ సమయాన్ని ఎలా గడుపుతారు?

నాకు ఇష్టమైన సంగీతం వింటూనో, లేకపోతే పాటలు పాడుకుంటూనో ఉంటాను. సంగీతం తరు వాత నాకు ఎక్కువ ఇష్టమైంది వంట. గతంలో వంటలో రకరకాల ప్రయోగాలు చేసేదాన్ని. ఇప్పుడు అంత తీరిక ఉండడం లేదు. మరీ తీరిక దొరికితే కిచెన్‌లో కొత్త వంటకాలు ట్రై చేస్తుంటాను.

అందంగా కనిపించడానికి తీసుకునే జాగ్రత్తలు..?

ఏరోబిక్స్ ప్రతిరోజూ చేస్తుంటాను. నోరు కట్టేసు కుని ఉండడం నాకు చేతకాదు. నచ్చినవి తింటాను. ఎలాంటి ఆహారం తీసుకున్నా అందులో పోషక విలు వలు ఉండేవిధంగా జాగ్రత్త పడతాను.

సినిమాల్లో ఎక్స్‌పోజింగ్ ఎక్కువ చేస్తారంటారు?

నేను గ్లామర్ హీరోయిన్ని. అందంగా కనిపిం చడం ముఖ్యం. నా పాత్రలో ఎంతవరకు అవసరమో అంత వరకూ ఎక్స్‌పోజింగ్ ఉంటుంది. మోడ్రన్ డ్రస్సు లంటే నాకు ఇష్టం. నా సినిమాల్లో ఎక్కువగా మోడ్రన్ డ్రస్సులే వేసుకుంటాను. వాటిని కూడా ఎక్స్ పోజింగ్ అని పిలిస్తే కష్టం.

-చిన్ని

కొండచిలువతో చిందేసిన జాక్వెలిన్

బల్లిని చూస్తేనే ఆమడ దూరం పారిపోతుంటారు కొందరు అమ్మాయిలు. అలాంటిది బాలీవుడ్ బ్యూటీ జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఏకంగా కొండచిలువతో సహా చిందేసి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. బాలీవుడ్‌లో జాక్వెలిన్ నటిస్తున్న ఓ సినిమాలో ఓ పాటను డిఫరెంట్‌గా తీయాలని దర్శకుడు భావించాడట! కొండచిలువను ఒంటికి చుట్టుకుని డ్యాన్సు చేస్తే బాగుంటుందని భావించి ఆ విషయాన్ని జాక్వెలిన్‌కి చెప్పాడట! మొదట కొద్దిగా భయపడినా ఆ తరువాత ధైర్యంగా కొండచిలువతో డ్యాన్స్ చేసేసిందట! పాట చిత్రీకరణ సందర్భంగా అన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఏ కొంచెం తేడా వచ్చినా ఆ కొండచిలువ జాక్వెలిన్‌ను పిప్పరమెంటు చప్పరించినట్టు చప్పరించే ప్రమాదం లేకపోలేదు. అయినా జాక్వెలిన్ ధైర్యం చేసిందట! ఆమె గుండె ధైర్యాన్ని యూనిట్ మొత్తం తెగ మెచ్చుకుంటున్నారు. ఆ సినిమాలో ఈ పాటే హైలైట్ అవుతుందని కూడా చెబుతున్నారు.



ఇంటర్వ్యూ

పాత నటులకు సినీఫీల్డ్ చేయూతనిస్తోంది

-పొట్టి వీరయ్య

బి.విఠలాచార్య ఆశీర్వాదంతో తెరంగేట్రం చేసి దాదాపు ఐదు దశాబ్దాలుగా 400 చిత్రాల్లో నటించి హాస్యం పండించిన బహుభాషా నటుడు పొట్టి వీరయ్య. ఎన్నో జానపద చిత్రాల్లో ఎన్.టి.ఆర్, కాంతారావు, ఎమ్జీఆర్, శివాజీగణేశన్, రజనీకాంత్, కృష్ణ వంటి హీరోలున్న చిత్రాల్లో మరుగుజ్జు పాత్రల్లో నటించి వెండితెరను అలరించారు వీరయ్య. చిత్ర పరిశ్రమ నాటికీ, నేటికీ నన్నెంతో గౌరవంగా, ఆత్మీయంగా చూస్తోందని, చేయూతనిస్తోందనీ పరవశిస్తున్న వీరయ్య ఇంటర్వ్యూ....

నల్లగొండ జిల్లా సూర్యాపేట తాలూకా తిరుమలగిరి మండలం ఫణిగిరి గ్రామం మాది. మా నాన్న గారు గట్టు సింహాద్రయ్య. అమ్మ నరసమ్మ. హెచ్.ఎస్.సి వరకు చదివాను.

నాటకరంగం

హైస్కూల్లో ఉన్నప్పుడే నాటకాల్లో హాస్య పాత్రలు వేస్తూ అందర్నీ నవ్వించేవాణ్ణి. అందరూ నా నటనను అభినందించేవారు. ముఖ్యంగా ఆంజనేయుడు పాత్ర, బాలనాగమ్మ నాటకంలో మాయల పకీరుకు అసిస్టెంటు పాత్ర నాకు మంచి పేరు తెచ్చాయి. ముంతాజ్‌ఖాన్ అనే మిత్రుడు నాకు నటనలో మెళకువలు నేర్పి, బయట నాటకాల్లో కూడా అవకాశాలు కల్పించాడు. సినిమాల్లో ప్రయత్నం చేయమని అందరూ సలహా ఇస్తూ ఉండేవారు.

హేళన చేసేవారు

